సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 170

మంగళవారం 10-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'




భారత నంబర్‌వన్‌గా సహజ

మహిళల టెన్నిస్‌లో భారత నంబర్‌వన్‌గా అవతరించిన తెలంగాణ ప్లేయర్ -14లో



సూపర్ సినెర్...

యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నెగ్గిన ఇటలీ స్టార్ -14లో



కుదరని ఆప్, కాంగ్రెస్ పొత్తు

హరియాణా ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్, ఆప్ మధ్య జరిగిన పొత్తు చర్చలు విఫలమయ్యాయి.


వివరాలు 6లో ▸



మంకీపాక్స్ కేసు నిర్ధారణ

'అనుమానిత' కేసు మంకీపాక్స్ కేసుగానే నిర్ధారణ అయినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం వెల్లడించింది.

వివరాలు 6లో ▸



జనాన్ని పట్టించుకోరా?

జూ. డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా ఆందోళన చేస్తున్న వైద్యులు నేటి సాయంత్రంలోగా విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు చెప్పింది.

వివరాలు 6లో ▸



నిప్పులు చిమ్మే డ్రాగన్ డ్రోన్

రష్యా సైన్యంతో పోరాడుతున్న ఉక్రెయిన్ అమ్ములపొదిలోకి మంటలు చిమ్ముతూ, పొగ వెదజల్లే కొత్త తరహా డ్రోన్ వచ్చి చేరింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపునకు గ్రీన్‌సిగ్నల్



ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపునకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొత్తగా 3 వేల సీట్లు అందుబాటులోకి రానున్నాయి. కన్వీనర్ కోటా కింద 2,100, మేనేజ్‌మెంట్ కోటా కింద 900 సీట్లు భర్తీ చేయాల్సి ఉంటుంది.

- వివరాలు 5లో▶

అమ్రాబాద్ గడ్డ.. పులుల అడ్డా



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో 34 పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నట్టుగా అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 'స్టేటస్ ఆఫ్ టైగర్స్ అండ్ ప్రే ఇన్ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ 2023–24' పేరిట విడుదల చేసిన నివేదికలో ఇది వెల్లడైంది.

- వివరాలు 16లో▶

పల్లెల్లో స్పెషలిస్ట్‌ల కొరత



మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ విడుదల చేసిన 'హెల్త్ డైనమిక్ ఆఫ్ ఇండియా 2022–23' వార్షిక నివేదికలో వెల్లడైంది.

- వివరాలు 16లో▶

ప్రపంచ తొలి ట్రిలియనీర్ ఎలాన్ మస్క్!



2027 నాటికి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా రికార్డ్ సృష్టించనున్నారు. మరుసటి ఏడాది (2028లో) గౌతమ్ అదానీ సైతం ట్రిలియనీర్ అవుతారని ఇన్‌ఫార్మా కనెక్ట్ అకాడమీ అంచనా వేసింది.

- వివరాలు 15లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate ₹ 68 | Ex Farm Live Bird 89 kg | Dressed with Skin 161 kg | Retail Live Bird 111 kg | Skin Less 183 kg

Issued in the interest of consumers

4 వారాలు గడువు

ఎమ్మెల్యేల అనర్హత కోరుతూ దాఖలైన పిటిషన్లను స్పీకర్ ముందుంచండి

- ఇరుపక్షాల వాదనలకు సంబంధించి విచారణ షెడ్యూల్ రూపొందించండి
- రిట్ అధికార పరిధి చాలా విస్తృతమైనది..
- సాంకేతిక కారణాలతో కొట్టివేస్తే న్యాయం జరగదు
- అసెంబ్లీ కాలపరిమితి పూర్తయ్యే వరకు స్పీకర్ వేచిచూస్తూ ఉంటే కోర్టులు చేతులు దులుపుకుంటూ ఉండలేవు
- ఇది రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం
- రిట్ పిటిషన్లలో ఉపశమనం పొందేందుకు పిటిషనర్లు అర్హులని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి కీలక తీర్పు

బీఆర్ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల స్టేటస్ ఏమిటో చెప్పండి

లేనిపక్షంలో సుమోటోగా విచారణ చేపడతాం..తగిన ఆదేశాలిస్తాం

స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్ల స్టేటస్ ఏమిటో చెప్పేందుకు నాలుగు వారాల గడువిస్తున్నాం.. ఆలోగా వివరాలు అందజేయకుంటే మేమే తగిన ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుంది..' అని స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చిచెప్పింది. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను స్పీకర్ ముందుంచాలని, విచారణ షెడ్యూల్ రూపొందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు వివరాలను హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు అందజేయాలని ఆదేశిస్తూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది. 'కైశమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్' కేసులో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణీత గడువులోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం రిట్ అధికార పరిధి చాలా విస్తృతమైనది. తొందరపాటు చర్య అని, సాంకేతిక కారణాలతో కొట్టివేస్తే న్యాయం జరగదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ నీతి, తత్వశాస్త్రానికి రాజ్యాంగ అథారిటీలు కట్టుబడి ఉండాలి. న్యాయ సమీక్ష అన్నదే కాదు.. అసలు సమస్యకు పరిష్కారం ఎప్పుడనేది తేలాలి. శాసనసభ కాలపరిమితి పూర్తయ్యే ఐదేళ్ల వరకు స్పీకర్ వేచిచూస్తూ ఉంటే కోర్టులు చేతులు దులుపుకుంటూ ఉండలేవు. ఇది రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. అనర్హత పిటిషన్లలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ నిరాకరిస్తే పిటిషనర్లకు ఎటువంటి పరిష్కారం లభించదు. కైశమ్ మేఘచంద్ర సింగ్ కేసులో

మిగతా 2వ పేజీలో ▶

స్పీకర్ స్పందించకుంటే మళ్లీ కోర్టుకే!

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో బీఆర్ఎస్ యోచన
- హైకోర్టు తాజా తీర్పుపై స్పీకర్ వైఖరిని బట్టి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం
- మహారాష్ట్ర, హిమాచల్‌లో ఫిరాయింపులు.. స్పీకర్లు, కోర్టుల స్పందనపై అధ్యయనం

3 లో

ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది

రాహుల్‌గాంధీపై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

రాజ్యాంగ పరిరక్షణ అంటూనే ప్రజాస్వామ్యం ఖూనీ కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఫిరాయింపులపై కోర్టు తీర్పు

- వివరాలు 3లో



అరికెపూడి గాంధీ



పద్మావతిరెడ్డి



శంకరయ్య

పీఏసీ చైర్మన్‌గా ఫిరాయింపు ఎమ్మెల్యే!

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పదవి

- ప్రతిపక్ష నేత సూచించిన వారికి పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చే ఆనవాయితీకి చెల్లుచీటీ!
- అంచనాల కమిటీ చైర్మన్‌గా పద్మావతిరెడ్డి.. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా కె.శంకరయ్య
- మూడు అసెంబ్లీ కమిటీలను నియమించిన స్పీకర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కీలకమైన అసెంబ్లీ 'ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ)' చైర్మన్ పదవి దక్కింది. సాధారణంగా అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సూచించిన ప్రతిపక్ష ఎమ్మెల్యేకే పీఏసీ చైర్మన్ పదవిని కట్టబెట్టడం ఆనవాయితీ. దీనికి భిన్నంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్.. సోమవారం పీఏసీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీని నియమిస్తున్నట్టు ప్రకటించారు. దీనితోపాటు మరో రెండు అసెంబ్లీ కమిటీలకు కూడా చైర్‌పర్సన్లు, సభ్యులను నియమించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేకు పదవి ఎలా?

అసెంబ్లీ వ్యవస్థలో పీఏసీ చాలా కీలకం. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసాను కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. ఆయా అంశాలపై అసెంబ్లీకి నివేదికలు ఇస్తుంది. అలాంటి కీలక పదవిని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. నిజానికి ఈ పదవి కోసం మాజీ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేరును

మిగతా 3వ పేజీలో ▶



సోమవారం ప్రజాభవన్‌లో ఆర్థిక సంఘం నిర్వహించిన సమావేశంలో అరవింద్ పనగరియా, కమిషన్ సభ్యులు

స్థానిక సంస్థల నిధులు పెంచండి

16వ ఆర్థిక సంఘానికి స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీల నేతల వినతి.. ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులతో వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో ఆర్థిక సాయం పెంచాలని స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు కేంద్ర ఆర్థిక సంఘాన్ని కోరారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సోమవారం ప్రజాభవన్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా కేంద్రం గ్రాంట్లు, రుణాలు, ఇతర మార్గాల ద్వారా రాష్ట్రానికి అందిస్తున్న నిధులు, స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం అందిస్తున్న గ్రాంట్లు తదితర అంశాలను అరవింద్ పనగరియా వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు, వాణిజ్య సంస్థలతో చర్చించారు. ముందుగా మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ చైర్మన్లతో

మిగతా 12వ పేజీలో ▶

త్యాగమనే మాటే కేసీఆర్‌కు నప్పదు

అసలైన తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ' ప్రారంభ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఉద్యమానికి నీడనిచ్చిన కొండా లక్ష్మణ్‌ను కేసీఆర్ తీవ్రంగా అవమానించాడు
- ఉద్యమం పేరిట రాజీనామాలు చేస్తూ ఎలక్షన్స్, సెలెక్షన్ చేస్తూ కలెక్షన్‌కు పాల్పడ్డారని ఆరోపణ
- చేనేత కార్మికులకు రూ.30 కోట్లు రుణమాఫీ చేస్తానని ప్రకటన



నేతన్నకు చేయూత పథకం నిధుల చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి తుమ్మల, సీఎస్ శాంతికుమారి తదితరులు

ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ పేరు

తెలంగాణ ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిన కొండాలక్ష్మణ్ బాపూజీ పేరు ఐఐహెచ్‌టీకి పెడుతున్నామని సీఎం రేవంత్ ప్రకటించారు. అనంతరం ఐఐహెచ్‌టీలో వివిధ కోర్సులు నేర్చుకుంటున్న విద్యార్థులకు నెలకు రూ.2,500 ప్రోత్సాహకాన్ని చెక్కుల రూపంలో అందించారు.

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ సాధనలో అసలైన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని.. అలాంటి వ్యక్తిని బీఆర్ఎస్ నేత కె.చంద్రశేఖర్‌రావు తీవ్రంగా అవమానించారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. త్యాగమనే పదం కొండా లక్ష్మణ్‌కే చెల్లుతుందని, కేసీఆర్ త్యాగాలు చేశానంటూ చెప్పుకోవడం ఏమాత్రం సరి కాదని వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని లలితకళా తోరణంలో జరిగిన కార్యక్రమంలో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని సీఎం రేవంత్ లాంఛనంగా

మిగతా 12వ పేజీలో ▶

కార్యవర్గానికి.. కొంత సమయం!



- పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక నేపథ్యంలో పార్టీ పదవులపై కాంగ్రెస్‌లో చర్చ
- ప్రచార కమిటీతో పాటు ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించే చాన్స్
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు కొత్త కార్యవర్గంలో చోటు
- అధికార ప్రతినిధుల్లోనూ మార్పులు
- 15న బాధ్యతలు తీసుకోనున్న మహేశ్‌కుమార్

3 లో

సాయం పెంచండి

సర్కారుకు ఖమ్మం ముంపు బాధితుల విజ్ఞప్తి

- సర్వం కోల్పోయాం.. లక్షల్లో నష్టపోయాం..
- నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ సామగ్రి దాకా ఏదీ మిగల్లేదు.. రోజూ పనికి వెళ్తేనే తప్ప పూట గడవని పరిస్థితి
- రూ.16,500 సాయంతో తాత్కాలిక ఉపశమనమేనని ఆవేదన.. తమ బతుకులు గాడినపడాలంటే సాయం పెంచాలని డిమాండ్
- పంట పరిహారం కూడా పెంచి ఇవ్వాలని విజ్ఞప్తులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మున్నేరు ముంపు నష్టం లెక్క కట్టలేని స్థాయిలో ఉందని.. కానీ ప్రభుత్వం ఇస్తామంటున్న సాయం సరిపోయేలా లేదని వరద బాధితులు వాపోతున్నారు. నిత్యావసరాలు, దుస్తుల నుంచి ఎలక్ట్రానిక్ సామగ్రిదాకా ఏదీ మిగల్లేదని.. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ పనికి వెళ్తే తప్ప పూటగడవని పరిస్థితుల్లో ఉన్న తమ బతుకులు గాడిన పడాలంటే సర్కారు ఆర్థిక సాయాన్ని మరింత పెంచాలని కోరుతున్నారు. వరద ముంపునకు గురై ఎనిమిది రోజులు దాటినా ఇంకా

మిగతా 5వ పేజీలో ▶



ఖమ్మం పద్మావతినగర్‌లో వరద తాకిడికి ధ్వంసమైన ఇళ్లు

ఇదం జగత్



మీ మీద కూడా ప్రభావం పడుతుందేమో ఆలోచించండి సార్!

వరదలపై ఉన్నతస్థాయి సమీక్షలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేస్తాం
- పూర్తిగా, పాక్షికంగా ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు
- వరద బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున ఆర్థిక సాయం
- ముంపునకు గురైన ప్రతి ఎకరానికి రూ.10 వేలు పరిహారం
- డాక్యుమెంట్లు కొట్టుకుపోతే ఫిర్యాదు చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్
- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, బాధితులందరికీ సాయం అందాలని అధికారులకు ఆదేశం

వరద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవలి వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం అందించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. వరదలతో ప్రభావితమైన ప్రతి కుటుంబానికి రూ. 16,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాలు ఇటీవలి వర్షాలకు ప్రభావితం అయ్యాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు సాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల ప్రభావంపై సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎస్ శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్విండ్ కుమార్‌లతో పాటు మున్సిపల్, వ్యవసాయం, పంచాయతీరాజ్, విద్యుత్, విద్య, రహదారులు, భవనాలు, హౌసింగ్, ఇరిగేషన్ అధికారులు ఇందులో పాల్గొన్నారు. సమీక్షలో వరద నష్టాన్ని అంచనా వేయడంతోపాటు దాన్ని పూడ్చుకునేందుకు ఎన్ని నిధులు కావాలన్న దానిపై చర్చించారు. వరదలు, నష్టంపై కేంద్రానికి

మిగతా 5వ పేజీలో ▶

కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు.. మనిషి కుక్కను కరిస్తేనే వార్త..

..: ఇది జర్నలిజంలో ఓ పాత పాఠం :..

జర్నలిస్టుల సంగతి ఎలా ఉన్నా.. ప్రభుత్వాలు మాత్రం దీన్ని సీరియస్‌గానే తీసుకున్నట్లు ఉన్నాయి. అందుకే మనిషిని కుక్క కరవడం కాదు.. చంపేస్తున్నా.. పెద్దగా పట్టనట్లే ఉంటున్నాయి.

ఫలితం..

ఓ విహాన్.. ఓ పూలమ్మ... ఓ రామలక్ష్మి.. పేరేదైతేనేం.. ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. తరచూ పదుల సంఖ్యలో ప్రజలు కుక్క కాట్ల బారిన పడుతూనే ఉన్నారు. ఏళ్లుగా ఉన్న సమస్య ఇది.. ఎవరూ సీరియస్‌గా తీసుకోని విషయమిది. మరేం చేద్దాం?

ఇప్పటికైనా పట్టించుకుందామా? పట్టనట్లే ఉందామా?

కిల్లర్ డాగ్స్!



-వివరాలు 2లో

రెచ్చిపోయిన పిచ్చి కుక్కలు

29 మందికి గాయాలు

బాధితుల్లో చిన్నపిల్లలు, వృద్ధులు


గాయపడిన వృద్ధురాలు

నందిపేట్/మాచారెడ్డి/మంగపేట: నిజామాబాద్, కామారెడ్డి, ములుగు జిల్లా మంగపేటలో సోమవారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేసి సుమారు 29 మందిని గాయపర్చాయి. బాధితులు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నందిపేట మండల కేంద్రంలోని బంగారు సాయిరెడ్డి ఫ్యాక్టరీ దగ్గర గల రామ్‌రెడ్డి వెల్డింగ్ షాప్ నుంచి మెయిన్ రోడ్డు వెంబడి లిటిల్ ఫ్లవర్ స్కూల్, చాకలి ఐలమ్మ, ఆనంది హాస్పిటల్, వ్యాన్ల అడ్డ, నట్రాజ్ టాకీస్ కాంప్లెక్స్ ప్రాంతాల వరకు ఓ పిచ్చికుక్క పదిమందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. లిటిల్ ఫ్లవర్ స్కూలు విద్యార్థి, ఆనంద్ హాస్పిటల్ ఆయమ్మ లసుంబాయిపై కూడా కుక్క దాడి చేసి తొడ, చేతి కండరాలను పీకేసింది. మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ (ఎం)లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పిచ్చి కుక్క పది మందిని గాయ పర్చింది. అక్షిత అనే బాలికపై, ఆరుబయట నిద్రిస్తున్న వృద్ధుడు పోచయ్యతో పాటు యాకూబ్, చైతన్య, హర్యన్, రంజిత్ తదితరులపై కుక్క దాడి చేసి గాయపర్చింది. ఆగ్రహించిన గ్రామస్తులు కుక్కను చంపేశారు. అలాగే ములుగు జిల్లా మంగపేటలోనూ ఓ పిచ్చి కుక్క పలువురిపై దాడిచేసింది. గంపోనిగూడెం, పొదుమూరు, మంగపేటలో సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న వృద్ధురాలిని, రోడ్డుపై నున్న ఎర్రావుల సమ్మయ్య, కొప్పుల లాలయ్య, దాదాని, ఎండి సైదా, మైతున్‌బి, ఎండి గోరెతోపాటు మరో ముగ్గురిపై పిచ్చి కుక్క దాడిచేసింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

మహిళా వర్సిటీలో చైల్డ్, ఫ్యామిలీ సైకాలజీ కోర్సుల రద్దు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): తెలంగాణ మహిళా వర్సిటీలో కొనసాగుతున్న చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ సైకాలజీ పీజీ డిప్లొమా కోర్సులను ఈ విద్యా సంవత్సరం రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జి వీసీ విజ్జులత సోమవారం తెలిపారు. కోర్సుల నిర్వహణకు వర్సిటీలో సరైన మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు లేనందున కోర్సులను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే చైల్డ్, ఫ్యామిలీ సైకాలజీ డిప్లొమా కోర్సుల్లో 50 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు టీజీసీపీఈటీ–2024 పాండురంగారెడ్డి తెలిపారు.

దిశ కేసు విచారణ 30కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: దిశ నిందితుల ఎన్‌కౌంటర్ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదికను సవాలు చేసిన కేసుల వివరాలను అందజేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. దిశ ఎన్‌కౌంటర్ కేసు విచారణను సీబీఐకి ఇవ్వాలంటూ పిల్, ఇతర పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బెంచ్ విచారించింది. దిశకు చెందిన ఇతర కేసుల వివరాలన్నీ పరిశీలించి విచారణ చేస్తామని ప్రకటించింది. విచారణను 30కి వాయిదా వేసింది.

డీఎస్సీ తుది 'కీ'లోనూ తప్పులు: అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష(డీఎస్సీ)కు సంబంధించి పాఠశాల విద్య డైరెక్టరేట్ విడుదల చేసిన తుది కీలో తప్పులున్నట్టు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు అభ్యర్థులు సోమవారం డైరెక్టరేట్ కార్యాలయానికి వచ్చి అధికారులను కలిశారు. పాఠ్యపుస్తకాల ప్రకారం సమాధానాలు ఇవ్వలేదని, కొన్ని సమాధానాలు మార్చారని వివరించారు. తప్పులున్న కీ ప్రకారం ఫలితాలు ప్రకటిస్తే తమకు అన్యాయం జరుగుతుందన్నారు. అభ్యర్థుల అభ్యంతరాలపై అధికారులు స్పందించారు. మరోసారి పరిశీలన కమిటీకి అభ్యంతరాలను పంపుతామని చెప్పారు. ఒకవేళ తప్పులుంటే సరిచేసిన తర్వాత ఫలితాలు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. డీఎస్సీ తుది కీని విద్యాశాఖ ఇటీవల విడుదల చేసింది. అందులో వచ్చిన ప్రశ్నలు టెట్‌లోనూ వచ్చాయి. వాటిల్లో సమాధానాలు ఒక రకంగా ఉంటే డీఎస్సీ ఫైనల్ కీలో మరోలా ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు.

విషజ్వరాల బారిన 100 మంది గురుకుల విద్యార్థులు


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులు

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఈ విద్యాసంస్థల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థులు ఉన్నారు. గురుకుల సిబ్బంది శ్రద్ధ తీసుకోకపోవడంతో ప్రస్తుతం 100మంది వరకు జ్వరాల బారిన పడినట్లు తెలుస్తోంది. ఆదివారం పలువురి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 23 మంది విద్యార్థులను సిర్పూర్(టి) సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో 15 మంది డిశ్చార్జి కాగా 8 మంది ఇంకా చికిత్స పొందుతున్నారు.

కిల్లర్ డాగ్స్



రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న కుక్కకాట్లు.. బలవుతున్న చిన్నారులు

వీధికుక్కల నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం

2018 నుంచి 2023 వరకు ఆరేళ్లలో రాష్ట్రంలో **13.21** లక్షల కుక్కకాట్లు

రాష్ట్రంలో 20 లక్షల వరకు కుక్కలు.. అందులో **10** లక్షల దాకా హైదరాబాద్‌లోనే!

అభద్రత, ఆహారం దొరక్కపోవడం, వాతావరణ మార్పులే కారణమంటున్న నిపుణులు

ప్రసహనంగా మారిన కుక్కల స్టెరిలైజేషన్.. నిధుల్లో సగం పక్కదారే!

➤ హైదరాబాద్‌లోని మియాపూర్ మక్తాకు చెందిన ఆరేళ్ల బాలుడు సాత్విక్‌పై రెండు నెలల క్రితం వీధికుక్కలు దాడి చేసి చంపేశాయి. నెల రోజుల క్రితం ఇబ్రహీంపట్నం రాయపోల్‌లో నాలుగేళ్ల బాలుడిపై వీధికుక్క దాడి చేసింది. నిలోఫర్‌లో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయాడు. గత పదిహేను రోజుల్లో నాలుగు కుక్కకాటు ఘటనల్లో పదుల సంఖ్యలో చిన్నారులు, పెద్దవాళ్లు గాయపడ్డారు.

➤ రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బట్టోనితాళ్లలో 20 రోజుల కింద పిట్ల రామలక్ష్మి (80) అనే వృద్ధురాలిపై వీధికుక్కలు దాడి చేసి పీక్కుతిన్నాయి.

➤ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన భరత్, వెంకటలక్ష్మి దంపతులు హైదరాబాద్ జవహర్‌నగర్ పరిధిలోని ఆదర్శనగర్‌కు మూడు నెలల క్రితం వలస వచ్చారు. వారి 18 నెలల కుమారుడు విహాన్‌ను ఇటీవల కుక్కలు దాడి చేసి చంపేశాయి.


విహాన్

➤ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్లకు చెందిన జంగం నర్సయ్య బర్ల కాపరిగా, ఆయన భార్య పూలమ్మ (50) గ్రామ పంచాయతీ నర్సరీలో కూలీ పని చేసేవారు. వారి ఏకైక కుమార్తె వివాహం కావడంతో.. భార్యాభర్త ఇద్దరే ఉండేవారు. జూలై 5న పూలమ్మ నర్సరీలో పని ముగించుకుని తిరిగొస్తుండగా కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ చనిపోయింది. దీనితో తాను ఒంటరిని అయిపోయానంటూ నర్సయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


.. ఈ ఘటనలే కాదు.. చెప్పకుంటూపోతే మరెన్నో.. వీధి వీధినా, గ్రామం, పట్టణం తేడా లేకుండా ఎన్నో వందల కుటుంబాల్లో విషాదం నింపుతున్న కుక్కల దాడి ఘటనలెన్నో. అవి మనుషులకు మంచి స్నేహితులంటూ మనం చెప్పకొనే శునకాలే.. ఇంటి ముందో, వీధిలోనో కలియదిరుగుతూ కనిపించేవే. కానీ కొన్నేళ్లుగా కుక్కల దాడి ఘటనలు పెరిగిపోతున్నాయి. చిన్నారులను, వయసు మళ్లినవారిపై దాడిచేసి పొట్టనపెట్టుకుంటూ కన్నీళ్లు నింపుతున్నాయి. సాక్షి, హైదరాబాద్

ఆహార కొరత.. విపరీతంగా సంతానోత్పత్తి

వీధికుక్కలు రెచ్చిపోవడానికి ప్రధాన కారణం ఆహార కొరత అని వెటర్నరీ వైద్యులు చెప్తున్నారు. ఖాళీ ప్రదేశాలు తగ్గిపోవడం, వాతావరణ పరిస్థితులు కూడా ప్రభావం చూపిస్తున్నాయని అంటున్నారు. కుక్కలు పెద్ద శబ్దాలు, ఎక్కువ వెలుగు ఉండే లైట్ల వల్ల ఆవేశపడతాయని.. ఇలాంటి సమయాల్లోనే అవి అతిగా దాడులు చేస్తుంటాయని వివరిస్తున్నారు. సాధారణంగా కుక్కలు మాంసాహారాన్ని ఇష్టపడతాయి. కానీ ఇప్పుడు వాటికి శాఖాహారం కూడా దొరకని పరిస్థితి రావడంతో రెచ్చిపోతున్నాయి. అందువల్ల కుక్కలకు షెల్టర్ హోమ్‌లు, ప్రత్యేకంగా పార్కులు ఏర్పాటు చేసి, వాటికి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొంత ప్రయత్నం జరిగినా ఫలితం మాత్రం శూన్యం. జీహెచ్‌ఎంసీ పరిధిలో నాలుగు లక్షలకుపైగా వీధి కుక్కలు ఉన్నాయని కార్పొరేషన్ వెటర్నరీ విభాగం చెబుతోంది. కానీ వాస్తవంగా 10 లక్షలకుపైగానే వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా. వీటిలో మూడో వంతు కుక్కలకు కూడా స్టెరిలైజేషన్, వాక్సినేషన్ జరగలేదని సమాచారం.

నామ్ కే వాస్తేగా కార్యాచరణ

కుక్కకాట్లతో ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంపై ఇటీవల హైకోర్టు తీవ్రస్థాయిలో స్పందించడంతో.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది. కానీ ఆ హడావుడి నాలుగైదు రోజుల్లోనే ముగిసిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పశు జనన నియంత్రణ కేంద్రాలు ఉండగా.. మిగతా జిల్లాల్లోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ అడుగు ముందుకు పడలేదు.



2030 నాటికి రేబిస్ నిర్మూలన సాధ్యమెట్లా?

దేశంలో 2030 నాటికి రేబిస్‌ను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. ఆ లక్ష్యం నెరవేరాలంటే శునకాల నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ టీకాలను విరివిగా అందుబాటులో ఉంచాలి. కానీ కేంద్రం సరిగా నిధులు కేటాయించడం లేదు. రాష్ట్రాలూ పట్టించుకోవడం లేదు. కుక్కకాట్లతో రేబిస్ సోకడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 59 వేల మంది చనిపోతుంటే.. అందులో 20 వేలకుపైగా (36 శాతం) మరణాలు మనదేశంలోనే నమోదవుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఒక్క జంట నుంచి ఏడేళ్లలో 4 వేల కుక్కలు

- కుక్కల జీవిత కాలం 8 నుంచి 12 ఏళ్లు
- 8 నెలల వయసు నుంచే వాటికి సంతానోత్పత్తి సామర్థ్యం ఉంటుంది
- వీటి గర్భధారణ సమయం 60–62 రోజులే ఏటా రెండు సార్లు పిల్లలను కంటాయి. ప్రతిసారి 4 నుంచి 8 పిల్లలను పెడతాయి
- ఒక శునకాల జంట, వాటి పిల్లలు, వీటన్నింటికీ పుట్టే పిల్లలు ఇలా.. ఏడాదిలోనే 40 వరకు అవుతాయి. మొత్తంగా ఒక్క జంట నుంచి ఏడేళ్లలో సుమారు 4 వేల వరకు అయ్యే అవకాశం ఉంటుంది

దేశవ్యాప్తంగా వీధికుక్కల సమస్య



కాకి లెక్కలేనా..?

జీహెచ్‌ఎంసీలో ఏటా 50, 60 వేల వీధికుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) జరుగుతున్నట్టు లెక్కలు చెప్తున్నాయి. ఈ శస్త్రచికిత్సలు, రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సినేషన్, సిబ్బంది జీతభత్యాలు, ఇతర ఖర్చుల కోసం ఏటా రూ.12 కోట్లకుపైగానే వ్యయం చేస్తున్నారు. కానీ వీధికుక్కల సంఖ్య ఏమాత్రం తగ్గకపోగా.. అంతకంతకూ పెరిగిపోతోంది. నిధులన్నీ ఎక్కడికి వెళ్తున్నాయన్న ప్రశ్న తలెత్తుతోంది. మున్సిపల్ కార్పొరేషన్లు ఒక్కో కుక్క స్టెరిలైజేషన్ కోసం రూ.1,700 చొప్పున ఖర్చు చేస్తున్నా.. చేసే ఆపరేషన్లకు, చూపే లెక్కలకు తేడా ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి.



గోవా ఎలా కంట్రోల్ చేయగలిగింది?

కుక్కకాట్ల విషయంలో గోవా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఆ రాష్ట్రంలో గత మూడేళ్లలో ఒక్క కుక్కకాటు మరణం కూడా నమోదు కాలేదు. నిర్ణీత కాలవ్యవధిలో కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. శునకాల దాడినుంచి స్వీయరక్షణ విధివిధానాలను విద్యార్థులకు, మహిళలకు తెలియజెప్పడం వంటి అంశాలు గోవాలో సత్ఫలితాలిస్తున్నాయి. బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లోనూ కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసలు పొందాయి.

ఆ రాష్ట్రాల్లో బాధితులకు పరిహారం

కుక్కకాటు ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని గత సంవత్సరం హరియాణా– పంజాబ్ హైకోర్టు తీర్పునిచ్చింది. కుక్కకాటు కేసుల్లో ఒక్కో పంటి గాటుకు 10వేల రూపాయల చొప్పున బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కుక్కకాటు ఘటనలో 0.2 సెంటీమీటర్లు, ఆపైన కోత పడితే బాధితులకు రూ.20 వేలు చెల్లించాలని.. ప్రాణనష్టం జరిగితే రూ.5 లక్షలు పరిహారంగా ఇవ్వాలని స్పష్టం చేసింది. కర్ణాటకలో కుక్కకాటు కేసులను సమీక్షించడానికి, కుక్కకాటుకు గురైన వ్యక్తులకు పరిహారం అందించడానికి అక్కడి పట్టణాభివృద్ధి శాఖ పట్టణ, స్థానిక సంస్థలతో కమిటీలను ఏర్పాటు చేసింది. ఆ కమిటీల ద్వారా 48 గంటల్లో బాధితులకు పరిహారాన్ని అందిస్తున్నారు. రాష్ట్రంలో ఎలాంటి పరిహారం లేదు.

పిల్లలు బలవుతున్నా ప్రభుత్వం స్పందించట్లేదు



మాది సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గోవిందాపూర్. ఇటీవల రెండు పిచ్చి కుక్కలు ముగ్గురు చిన్నారులపై దాడి చేశాయి. నా బిడ్డ ప్రావీణ్య కూడా తీవ్రంగా గాయపడింది. కుక్కల దాడిలో పిల్లలు బలవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. – సాగర్‌రెడ్డి, ప్రావీణ్య తండ్రి

కొత్త ప్రదేశాల్లో వదిలేయడంతో సమస్యలు

వీధికుక్కల స్టెరిలైజేషన్ విషయంలో మున్సిపల్ అధికారులు పొరపాట్లు చేస్తున్నారు. స్టెరిలైజేషన్ కోసం తీసుకువెళ్లిన కుక్కలను తిరిగి అదే ప్రాంతంలో వదలకుండా కొత్త ప్రదేశాల్లో విడిచిపెడుతున్నారు. అక్కడి కుక్కలు కొత్తవాటిని రానీయకపోవడం, మనుషులూ కొత్తవారు కావడంతో అభద్రతకు లోనవుతాయి. దీనికితోడు కుక్కలు అతి చల్లదనం, వర్షాలు, వేడిని తట్టుకోలేవు. చిత్రంగా ప్రవర్తిస్తూ దారినపోయే వారిపై దాడులకు దిగుతాయి. కుక్కలకు సకాలంలో స్టెరిలైజేషన్ చేయాలి. షెల్టర్లు ఏర్పాటు చేసి తరలించాలి. – అసోసియేట్ ప్రొఫెసర్ రాంసింగ్ లఖావత్, వెటర్నరీ యూనివర్సిటీ



రేబిస్ సోకే ప్రమాదం.. జాగ్రత్త.

కుక్కకాటుతో రేబిస్ సోకే ప్రమాదం ఉంటుంది. కుక్క కరిస్తే వెంటనే గాయాన్ని పది, పదిహేను నిమిషాల పాటు నీటితో శుభ్రం చేయాలి. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. రేబిస్ సోకితే తొలిదశలో జ్వరం, తలనొప్పి, వాంతులు వస్తాయి. తర్వాత పిచ్చిగా ప్రవర్తించడం, మనుషులను గుర్తించలేక పోవడం, నోట్లోంచి నురగ, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటివి కనిపిస్తాయి. చివరిగా కోమాలోకి వెళ్లి ప్రాణాలు పోయే ప్రమాదమూ ఉంటుంది. అందువల్ల జాగ్రత్తగా ఉండాలి. – డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ, రంగారెడ్డి



4 వారాలు గడువు

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు తీర్పు.. ఏజీ, అనధికార ప్రతివాదుల వాదనలను సమర్థించదు..' అని స్పష్టం చేసింది.

మూడు పిటిషన్లపై విచారణ

2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున గెలిచాక కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావును అనర్హులుగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే విధంగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున విజయం సాధించిన దానం నాగేందర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. అలాగే నాగేందర్ ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పీకర్ సమయం ఇవ్వ డం లేదంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఇంకో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సుదీర్ఘ విచారణ చేపట్టారు. ఇరు పక్షాలకు చెందిన సీనియర్ న్యాయవాదుల వాదనలను కూలంకషంగా విన్నారు. గత నెల 10న రిజర్వు చేసిన తీర్పును సోమవారం వెలువరించారు. దానం, కడియం తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, ప్రభు త్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యా మ సుందరం, గండ్ర మోహన్‌రావు విన్పించిన వాదనలను న్యాయమూర్తి తన తీర్పులో నమోదు చేశారు.

3 నెలల్లో నిర్ణయం తీసుకోవాల్సిందే: పిటిషనర్లు

'పదవ షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి 3 నెలల వ్యవధిలో స్పీకర్ ముందు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలి. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల జీవిత కాలం ఐదేళ్లు. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుకోకుండా సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గతంలో తేల్చిచెప్పింది. మెజారిటీ ఉన్న పార్టీ తరఫు వ్యక్తి స్పీకర్ అవుతారు కాబట్టి, అధికార పార్టీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోకుండా పదవీ కాలం ముగిసే వరకు పెండింగ్‌లో ఉంచడం సరికాదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. కైశమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్ కేసులో స్పీకర్ రాజకీయ విధేయత కారణంగా అనుసరించిన పక్షపాత వైఖరిని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొంది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకొనే అధికారాన్ని ఒక పార్టీ నుంచి ఎన్నికవుతున్న స్పీకర్ వద్ద ఉంచాలా వద్దా? అనే దానిపై పార్లమెంటు పునరాలోచించాల్సిన సమయం వచ్చిందని సుప్రీంకోర్టు సూచించింది. రాజకీయ ఒత్తిళ్ల వల్లే స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని భావిస్తున్నాం. ఇది సరికాదు. జిల్లా కోర్టులకు కూడా విచారణ ఇన్నిరోజుల్లో పూర్తి చేయాలని గడువు పెడుతున్నారు. అలాంటప్పుడు ట్రిబ్యునల్ చైర్మన్ (స్పీకర్) కింద ఆయన్ను ఆదేశించే అధికారం రాజ్యాంగ ధర్మాసనాలకు ఉంటుంది..' అని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు.

స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలివ్వలేవు: ఏజీ

'సుప్రీంకోర్టు వేర్వేరు తీర్పుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేసేందుకు వీల్లేదు. స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసే అధికార పరిధి కోర్టులకు లేదు. స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పది రోజులకే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్‌కు కనీస గడువు కూడా ఇవ్వకుండానే న్యాయ సమీక్ష కోరడం చెల్లదు. తన వద్దకు వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చింది. రిట్ పిటిషన్లు దాఖలు చేయడంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలది తొందరపాటు చర్య. టీఆర్‌ఎస్ హయాంలో వేసిన అనేక అనర్హత పిటిషన్లను అప్పటి స్పీకర్ పరిష్కరించలేదు. ఎర్రబెల్లి కేసులో పిటిషన్ చెల్లదని ఇదే కోర్టు గతంలో చెప్పింది. తాజా పిటిషన్లను కొట్టేయాలి' అని ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి కోర్టును కోరారు.

ఇదీ తీర్పు..

'బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఏప్రిల్‌లో ఒక పిటిషన్, జూలైలో ఇంకో పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఆగస్టు 10 తీర్పు రిజర్వు చేశాం. ఇప్పటివరకు అనర్హత పిటిషన్లపై ఏం నిర్ణయం తీసుకున్నారో తెలియదు. ఈ నేపథ్యంలో రిట్ పిటిషన్లలో ఉపశమనం పొందేందుకు పిటిషనర్లు అర్హులని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది. స్పీకర్ కార్యాలయానికి రాజ్యాంగ హోదా, గౌరవం ఉంది. అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ముందు ఉంచాలని స్పీకర్ కార్యదర్శిని ఆదేశిస్తున్నాం. ఇరుపక్షాల వాదనలు, డాక్యుమెంట్లు, వ్యక్తిగత వాదనలకు సంబంధించి నేటి నుంచి నాలుగు వారాల్లోగా షెడ్యూల్ నిర్ణయించాలి. నాలుగు వారాల్లో ఏం తేల్చకపోతే సుమోటోగా విచారణ చేపడతాం. తగిన ఆదేశాలను మేమే ఇస్తాం' అని న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి తీర్పు ఇచ్చారు.

అదనపు ఎస్పీ భుజంగరావుపై మరో కేసు

కూకట్‌పల్లిలో 340 ఎకరాల భూకబ్జాకు పూర్తి సహకారం

సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



సాక్షి, హైదరాబాద్: ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న అదనపు ఎస్పీ నాయిని భుజంగరావుపై మరో కేసు నమోదైంది. కూకట్‌పల్లి ఏసీపీగా పనిచేసిన రోజుల్లో అక్కడ 340 ఎకరాల భూకబ్జాకు సహకరించారన్నది ప్రధాన ఆరోపణ. ఇన్నాళ్లు భయంతో మిన్నకుండిపోయిన బాధితుడు మీర్ అబ్బాస్ అలీఖాన్ ధైర్యం చేసి సైబరాబాద్ పోలీస్‌కమిషనర్ అవినాష్ మహంతికి తాజాగా ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లిలోని సర్వే నంబరు 1007లో ఉన్న 340 ఎకరాల భూమి అబ్బాస్‌అలీఖాన్ తండ్రి నవాబ్ మీర్ హషీమ్ అలీఖాన్‌కు వారసత్వంగా వచ్చింది. దీనిపై కొందరు కుటుంబీకుల మధ్య సివిల్ సూట్ నడుస్తోంది. కోర్టు వ్యవహారాలు, చట్టపరమైన అంశాల్లో పట్టులేని హషీమ్ వీటి కోసం ఎస్ఎస్.మొయినుద్దీన్, యాసీన్ షేక్ సహకారం తీసుకున్నాడు. దీనిని వారు తమకు అనుకూలంగా మార్చుకొని, ఆ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించారు. ఇది తెలిసీ హషీమ్.. వీరిద్దరిపై కేపీహెచ్‌బీ ఠాణాలో 2014 మేలో ఫిర్యాదు చేశారు. దీంతో యాసీన్ కూకట్‌పల్లి ఏసీపీగా ఉన్న నాయిని భుజంగరావును సంప్రదించి భారీ మొత్తం ఆఫర్ చేశాడు. దీంతో కేసు విత్‌డ్రా చేసుకోవాలంటూ హషీమ్‌అలీని భుజంగరావు వేధించడంతో పాటు తప్పుడు కేసు నమోదు చేసి అరెస్టు కూడా చేయించారు. ఈ క్రమంలోనే గ్రీన్‌కో కంపెనీ నిర్వాహకులు సీహెచ్.అనిల్, శ్రీనివాసరావు.. యాసీన్, మొయినుద్దీన్‌తో కలిసి ఆ భూమి కాజేయడానికి ముందుకొచ్చారు. భుజంగరావు సలహా మేరకు వీరంతా గూండాలను పంపి హషీమ్‌ను కిడ్నాప్ చేసి నిర్బంధించి, భూమికి సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. మరోపక్క ఈ కేసులో అభియోగపత్రాలు దాఖలు చేయనివ్వకుండా భుజంగరావు దర్యాప్తు అధికారిపై ఒత్తిడి తెచ్చారు. ఈ పరిణామాలు, వేధింపులు భరించలేకపోయిన హషీమ్ తీవ్ర అనారోగ్యానికి గురై 2020 జూన్ 30న కన్నుమూశారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో భుజంగరావు అరెస్టు కావడంతో ధైర్యంచేసి బయటికొచ్చిన అబ్బాస్ అలీఖాన్ ఆయనపై ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం కేసు నమోదు చేసుకున్న ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

బాసర ట్రిపుల్‌ఐటీలో ముగిసిన ఆందోళనలు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి ప్రారంభమైన ఆందోళనలు ముగిశాయి. సోమవారం ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసోసియేట్ డీన్, చీఫ్ వార్డెన్, ఇతర అధికారులను పిలిచి విద్యార్థులతో కలిసి సంయుక్త సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో చర్చించి వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందిస్తామని అంగీకరించారు. క్యాంపస్‌లో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు సహకరించాలని క్యాంపస్ అధికారులు విద్యార్థులను కోరారు.

క్లుప్తంగా...

సీసీఐ, కాటన్ సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తాం: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: సీసీఐ, కాటన్ అసోసియేషన్ సభ్యులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభించే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటికి సంబంధించి తీసుకోవాల్సిన సన్నాహక చర్యలపై సంబంధిత అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో, దేశంలో పత్తి సాగు వివరాలు, దిగుబడి వివరాలు, గత సంవత్సరం జరిగిన విక్రయాలు, ఎదుర్కొన్న సమస్యలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా, చట్టం పరిధిలో కల్పించే అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అదేవిధంగా ఇంతకుముందున్న స్టేట్ కాటన్ వెల్ఫేర్, జిల్లా కమిటీలలో అసోసియేషన్ ప్రతినిధులను, రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాల్సిందిగా సూచించారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, సీసీఐ వారు తీసుకొచ్చిన వెయిటేజ్ పద్ధతుల (కొత్త విధానం) ఫలితంగా జిన్నింగ్ మిల్లులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సీసీఐ ఎండీ మాట్లాడుతూ వేరే ఏదైనా మంచి పద్ధతి ఉంటే అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

గతంలోనూ హైకోర్టు ఇలానే స్పందిస్తే బాగుండేది

కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను స్వాగతిస్తున్నామని, అయితే గతంలో కూడా హైకోర్టు ఇదే రీతిలో స్పందించి ఉంటే బాగుండేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ)ని విలీనం చేసుకునేంతవరకు ఆగకుండా కోర్టు అడ్డుకుని ఉంటే విలీనం పరిస్థితి వచ్చేది కాదని సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న అనైతిక నిర్ణయాలతోనే ఈ పరిస్థితి వచ్చిందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మార్పు కేసీఆర్ వైఫల్యాలతోనే జరుగుతోందని, పార్టీ ఎమ్మెల్యేలను పట్టించుకోకపోవడంతోనే వారు పార్టీలో ఉండటం లేదని దయాకర్ పేర్కొన్నారు.

హరీశ్‌రావు నీతులు చెపుతున్నారు: అడ్లూరి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పదేళ్ల పాటు ప్రజాస్వామ్యాన్ని చెరపట్టిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు నీతులు బోధిస్తున్నారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన మామా అల్లుళ్లు.. ఇప్పుడు వేమన శతకాలు వల్లె వేస్తున్నారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను సంతల్లో పశువుల్లా బేరసారాలు చేసినప్పుడు హరీశ్‌రావుకు రాజ్యాంగం గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై హరీశ్‌రావు కబుర్లు చెబుతున్నారని, అప్పట్లో కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఒక్క మాట మాట్లాడలేదని మండిపడ్డారు.

పీఏసీ చైర్మన్‌గా ఫిరాయింపు ఎమ్మెల్యే!

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ ప్రతిపాదించినట్టు సమాచారం. కానీ బీఆర్ఎస్ నుంచి గెలిచిన (3 సార్లు ఎమ్మెల్యే) గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించారు.

మరో రెండు కమిటీలు కూడా..

ఇక అంచనాల (ఎస్టిమేట్స్) కమిటీ, ప్రభుత్వరంగ సంస్థల (పబ్లిక్ అండర్ టేకింగ్స్) కమిటీలను కూడా స్పీకర్ నియమించారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంచనాల కమిటీ చైర్మన్‌గా కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా కె.శంకరయ్య నియమితులయ్యారు. మూడు కమిటీల్లోనూ పార్టీల వారీగా అసెంబ్లీ, కౌన్సిల్‌ల నుంచి సభ్యులను నియమించారు.

మూడు కమిటీలు ఇవే..

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ: అరికెపూడి గాంధీ (చైర్మన్), వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రామారావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాలా, కూనంనేని సాంబశివరావు (అసెంబ్లీ సభ్యులు).. టి.జీవన్‌రెడ్డి, టి.భానుప్రసాద్‌రావు, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్ (కౌన్సిల్ సభ్యులు).

ఎస్టిమేట్స్ కమిటీ: నలమాద పద్మావతిరెడ్డి (చైర్మన్), దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, సీహెచ్ విజయరమణారావు, కోరం కనకయ్య, మాలోతు రాందాస్, మామిడాల యశస్విని, పైడి రాకేశ్‌రెడ్డి (అసెంబ్లీ సభ్యులు).. సుంకరి రాజు, టి.రవీందర్‌రావు, వి.యాదవరెడ్డి (కౌన్సిల్ సభ్యులు)

పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ: కె.శంకరయ్య (చైర్మన్), పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, పట్లోళ్ల సంజీవరెడ్డి, తోట లక్ష్మీకాంతరావు, కౌసర్ మొహియుద్దీన్ (అసెంబ్లీ సభ్యులు).. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, తాతా మధుసూదన్, మిర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ (కౌన్సిల్ సభ్యులు).

స్పీకర్ స్పందించకుంటే మళ్లీ కోర్టుకే!

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో బీఆర్ఎస్ యోచన
- హైకోర్టు తాజా తీర్పుపై స్పీకర్ వైఖరిని బట్టి భవిష్యత్తు పోరాటంపై నిర్ణయం
- మహారాష్ట్ర, హిమాచల్‌లో ఫిరాయింపులు.. స్పీకర్లు, కోర్టుల స్పందనపై అధ్యయనం
- మహారాష్ట్రలో రెండేళ్లుగా నలుగుతున్న అనర్హత అంశం
- హిమాచల్‌ప్రదేశ్‌లో అనర్హులుగా ప్రకటించిన స్పీకర్.. స్టేకు సుప్రీం నిరాకరణతో ఉప ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో అసెంబ్లీ స్పీకర్ నుంచి సానుకూల స్పందన రాని పక్షంలో మరోమారు కోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఫిరాయింపులపై పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేసిన రిట్ పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు సోమవారం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. స్పీకర్ నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ అనుసరించే వైఖరిని బట్టి తమ భవిష్యత్తు న్యాయ పోరాటం ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్‌రావు (భద్రాచలం), కడియం శ్రీహరి (స్టేషన్ ఘనపూర్)పై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఈ ఏడాది మార్చిలో స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు చేసింది. స్పీకర్ స్పందించకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా కోర్టు తీర్పు నేపథ్యంలో.. ఇటీవలి కాలంలో ఇదే తరహాలో ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఆయా రాష్ట్రాల స్పీకర్లు అనుసరించిన వైఖరిని బీఆర్ఎస్ పరిశీలిస్తోంది. మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్‌లో చోటు చేసుకున్న ఫిరాయింపులు, ఆయా సందర్భాల్లో స్పీకర్, కోర్టులు స్పందించిన తీరును అధ్యయనం చేస్తోంది.

మహారాష్ట్ర, హిమాచల్‌లో ఏం జరిగింది?

మహారాష్ట్రలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అంశం సుమారు రెండేళ్లుగా అనేక మలుపులు తిరుగుతూ వస్తోంది. 2022 జూన్ 21న ప్రస్తుత మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కొందరు శివసేన ఎమ్మెల్యేలతో సొంత గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుని బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. తర్వాతి కాలంలో కొందరు ఎన్సీపీ ఎమ్మెల్యేలు కూడా షిండే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో చేరారు. షిండే వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ అప్పట్లో సీఎంగా ఉన్న శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే డిప్యూటీ స్పీకర్ (స్పీకర్ పదవి ఖాళీగా ఉండటంతో)కు పిటిషన్లు సమర్పించారు. మరోవైపు తమదే అసలైన శివసేన అంటూ షిండే వర్గం అనర్హత పిటిషన్లు ఇచ్చింది. అయితే కొత్త స్పీకర్ ఈ అనర్హత పిటిషన్లపై స్పందించకపోవడంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. తొలుత 2023 డిసెంబర్ 31లోగా అనర్హత పిటిషన్ల అంశాన్ని తేల్చాలని స్పీకర్‌కు గడువు విధించిన సుప్రీంకోర్టు.. ఆ తర్వాత మరో పది రోజులు పొడిగిస్తూ ఈ ఏడాది జనవరి 10వరకు గడువు విధించింది. అయితే స్పీకర్.. షిండే, ఉద్ధవ్ వర్గాలు ఇచ్చిన అనర్హత పిటిషన్లను తిరస్కరించారు. దీంతో అనర్హత వేటు అంశం మరోమారు సుప్రీంకోర్టుకు చేరింది. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలపై ఆ రాష్ట్ర స్పీకర్ ఈ ఏడాది ఫిబ్రవరి 29న అనర్హత వేటు వేశారు. అయితే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఉపఎన్నిక నిర్వహించవద్దని అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ ఈ అంశంలో స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో ఉప ఎన్నికలు జరిగాయి.

మరో ఏడుగురు ఎమ్మెల్యేలపైనా వేటు వేయాలి

హిమాచల్ తరహాలో ఉప ఎన్నికలు జరిగేలా చూడాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కాంగ్రెస్‌లో



చేరిన దానం నాగేందర్, తెల్లం వెంకట్‌రావు, కడియం శ్రీహరితో పాటు మరో ఏడుగురు ఎమ్మెల్యేలపై ఇచ్చిన అనర్హత పిటిషన్లపైనా స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతోంది. కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, గూడెం మహిపాల్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కూడా అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పిటిషన్లు సమర్పించింది. కోర్టు తీర్పులో పేర్కొన్న ముగ్గురు ఎమ్మెల్యేలతో పాటు ఈ ఏడుగురు ఎమ్మెల్యేలను కూడా అనర్హులుగా ప్రకటించని పక్షంలో కోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది

- రాహుల్‌గాంధీపై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం... రాజ్యాంగ పరిరక్షణ అంటూనే ప్రజాస్వామ్యం ఖూనీ
- కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వైఖరిని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ అంటూనే మరోవైపు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని సోమవారం 'ఎక్స్'వేదికగా మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి, ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపులపై ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణను స్పీకర్ పట్టించుకోకపోవడంతో తాము కోర్టును ఆశ్రయించామని చెప్పారు.

ఉప ఎన్నికలు ఖాయం

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరుగుతాయని, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్‌రావుల పదవులు ఊడటం ఖాయమని కేటీఆర్ అన్నారు. న్యాయస్థానాల్లో, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి శిక్ష తప్పదని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ బీ ఫామ్‌పై సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ అంటే కాంగ్రెస్ లెక్కలేనితనానికి దానం నాగేందర్ ఉదంతం ఓ నిదర్శనంగా పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపాలని గతంలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ గుర్తు చేశారు. ప్రజలను మోసగించిన తరహాలోనే, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఇచ్చిన హామీలపైనా రేవంత్ చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు.

రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా తీర్పు: హరీశ్‌రావు



ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం ఖాయమని, బీఆర్ఎస్ గెలుపు కూడా తథ్యమని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా అసెంబ్లీస్పీకర్ 4 వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామన్నారు. ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు చరిత్రాత్మకమని మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ వేర్వేరు ప్రకటనల్లో అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీకి నైతికత ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా రాహుల్ గాంధీ చర్యలు తీసుకోవాలన్నారు.

ఎందుకీ హైడ్రామాలు

- పేదల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదు: బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు 'హైడ్రా'పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. సోమవారం బీజేపీ కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను మొదట హైడ్రాకు సపోర్ట్ చేశానని, పెద్దలు అక్రమంగా కట్టుకున్న భవనాలు, విల్లాలు, ఫాంహౌస్‌లను కూలిస్తే సమర్థించానన్నారు. కానీ పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకునే షాపులు, పేదల ఇళ్లను కూలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలవాలంటే అత్యధికంగా పార్టీ సభ్యులుగా చేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసేవారికే టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రమంతా భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతుంటే కేసీఆర్ కనీసం ఎందుకు స్పందించడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. అందుకే ప్రజలంతా ఆయనకు 'నో ఎంట్రీ'బోర్డు పెట్టేశారని చెప్పారు. దేశం ఫస్ట్.. పార్టీ నెక్ట్స్.. వ్యక్తి లాస్ట్ అనే నినాదంతో పనిచేస్తున్న బీజేపీలో ప్రతిఒక్కరూ చేరాల్సిన అవసరముందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.

కార్యవర్గానికి.. కొంత సమయం!

- పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక నేపథ్యంలో పార్టీ పదవులపై కాంగ్రెస్‌లో చర్చ
- ప్రచార కమిటీతో పాటు ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించే చాన్స్
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు కొత్త కార్యవర్గంలో చోటు
- అధికార ప్రతినిధుల్లోనూ మార్పులు
- ఈనెల 15న బాధ్యతలు తీసుకోనున్న మహేశ్‌కుమార్‌గౌడ్
- రేపు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలసి కృతజ్ఞతలు తెలపనున్న టీపీసీసీ అధ్యక్షుడు

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం పూర్తి కావడంతో పార్టీ పదవులు, టీపీసీసీ కార్యవర్గంపై కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. అయితే, కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగినా కార్యవర్గం ఏర్పాటుకు కొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. పీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ అనంతరం రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో సంప్రదింపులు జరిపి, వారి సలహా మేరకు కమిటీలను కూర్చి, ఆ కమిటీలపై హైకమాండ్ ఆమోద ముద్ర వేయించుకునేందుకు కొంత సమయం పడుతుందని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షునిగా ఈనెల 15వ తేదీన మహేశ్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతకంటే ముందు బుధవారం ఆయన ఢిల్లీ వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహేశ్‌గౌడ్ ఈనెల 11న ఢిల్లీ వెళ్తారని, అధ్యక్ష పదవి అప్పగించినందుకు గాను పార్టీ పెద్దలను కలసి కృతజ్ఞతలు తెలిపేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్నారని గాంధీభవన్‌వర్గాలు చెబుతున్నాయి.

ప్రచార కమిటీని నియమిస్తారా?

టీపీసీసీకి కొత్త అధ్యక్షుడిని నియమించిన నేపథ్యంలో గతంలో ఉన్న మిగిలిన కమిటీలను కొత్తగా నియమిస్తారా లేక వాటినే కొనసాగిస్తారా అనే చర్చ ప్రారంభమైంది. టీపీసీసీకి అనుబంధంగా ఏడెనిమిది కమిటీలు పనిచేస్తుంటాయి. వీటిలో టీపీసీసీ ప్రచార కమిటీ, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ లాంటి వాటిని కొత్తగా ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. టీపీసీసీకి ప్రచార కమిటీని నియమిస్తే దానికి చైర్మన్‌గా ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న జగ్గారెడ్డికి పదోన్నతి కల్పించి ఆ పదవిలో నియమిస్తారనే చర్చ జరుగుతోంది. ఇక, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ప్రస్తుతం ఐదుగురు ఉన్నారు. అందులో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించారు. ఇక, జగ్గారెడ్డితో పాటు అంజన్‌కుమార్, అజారుద్దీన్, గీతారెడ్డిలు వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేస్తున్నారు. సామాజిక సమీకరణల మేరకు గతంలో నియమించిన ఈ వర్కింగ్ ప్రెసిడెంట్ల స్థానంలో కొత్త వారు వస్తారనే చర్చ జరుగుతోంది. ఈసారి కూడా ఐదుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తారని, వీరిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలకు అవకాశం ఉంటుందని తెలుస్తోంది. వీరితో పాటు సీనియర్ ఉపాధ్యక్షులుగా పార్టీ సీనియర్ నేతలను నియమిస్తారని, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఎంత మంది ఉండాలన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోకపోయినా, అధికార ప్రతినిధుల జాబితాలో మాత్రం మార్పులు చేస్తారని సమాచారం. అన్ని పదవుల విషయంలోనూ సామాజిక సమీకరణలకు ప్రాధాన్యం ఉంటుందని, వచ్చే నెలలో టీపీసీసీ కార్యవర్గ కూర్పు కసరత్తు జరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు వెల్లడించారు.

సికింద్రాబాద్, చర్లపల్లి వద్ద రోడ్ల విస్తరణకు సహకరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు వెళ్లే రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంకు సోమవారం లేఖ రాశారు. తెలంగాణలో మౌలికవసతుల అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి పదేళ్లుగా ఈ దిశగా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి శరవేగంగా సాగుతోందని.. కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్‌తోపాటు లైన్ల విద్యుదీకరణ పనులు, 40కిపైగా స్టేషన్ల అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా హైదరాబాద్ శివార్లలోని చర్లపల్లిలో రూ. 415 కోట్లతో కొత్త రైల్వే టర్మినల్ నిర్మాణం కూడా వేగంగా పూర్తవుతోందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభోత్సవానికి ప్రత్యక్షంగా హాజరై ప్రజలకు అంకితం చేసేందుకు ప్రధాని మోదీ అంగీకరించారని కిషన్‌రెడ్డి తెలియజేశారు.

100 అడుగుల దాకా రోడ్లు..: 'చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు చేరుకోవడానికి ఎఫ్‌సీఐ గోడౌన్ వైపు నుంచి ప్రయాణికుల రాకపోకల కోసం 100 అడుగుల రోడ్డు నిర్మాణం అవసరముంది. దీనిపై మీరు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయించేలా అధికారులను ఆదేశించాలని కోరుతున్నా'అని సీఎం రేవంత్‌ను కిషన్‌రెడ్డి కోరారు.

సికింద్రాబాద్ స్టేషన్ మార్గంలోనూ..: దక్షిణ మధ్య రైల్వే కేంద్ర స్థానమైన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను రూ. 715 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికల్లా అత్యాధునిక వసతులతో ప్రజలకు ఈ స్టేషన్‌ను అంకితం చేసేందుకు ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయని వివరించారు. అయితే రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు వచ్చి, వెళ్లే మార్గాలు చాలా ఇరుకుగా ఉన్నాయన్నారు. రేతిఫైల్ బస్ స్టేషన్, ఆల్ఫా హోటల్ మధ్యనున్న రోడ్డు ఇరుకుగా ఉండటంతో రద్దీ వేళల్లో ప్రయాణికులకు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గే వీలు ఉంటుందని.. ఈ విషయంలోనూ చొరవ తీసుకోవాలని సీఎంను కిషన్‌రెడ్డి కోరారు.

ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలి

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రతిపాదన



సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా ప్రీమియంపై అన్ని వయసుల వారికి ప్రస్తుతం 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జీఎస్టీ కౌన్సిల్‌కు సూచించారు. సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని కోరారు. వైద్యం రోజు రోజుకూ ఖరీదైపోతున్న నేపథ్యంలో ప్రజలంతా తక్కువ ఖర్చుతో ఆరోగ్య బీమా పొందేలా చేయడం ప్రభుత్వ బాధ్యతన్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీతో కలిసి భట్టి పాల్గొన్నారు. పరిశోధన గ్రాంట్లపై లేదా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలపైనా జీఎస్టీని మినహాయించాలని సూచించారు. గ్రూప్ బీమా, కుటుంబ బీమా పథకాలపై పన్ను ఎంత మేర తగ్గించాలనే దానిపై నిర్ణయం తీసుకొనేందుకు ఏర్పాటు చేసే మంత్రుల బృందంలో తాను పాలుపంచుకుంటానని చెప్పారు. కేంద్రం వసూలు చేస్తున్న జీఎస్టీకి సెస్‌ను కూడా జోడించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడేందుకే పరిహారం సెస్‌ను విధించిన విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని, అడ్‌హక్‌గా గతంలో కేటాయించిన జీఎస్టీ అదనపు మొత్తం రికవరీని పరిశీలించేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు.

కాంగ్రెస్‌వి ద్వంద్వ విధానాలు

ఎమ్మెల్యేల అనర్హతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద



కౌశిక్‌రెడ్డి



వివేకానంద

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలు అవలంబిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి వెళ్లిన వారిపై అనర్హత వేటు వేశారన్నారు. తెలంగాణలో మాత్రం ప్రోత్సాహకాలు ఇస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారన్నారు. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీ, పార్టీ ఫిరాయింపులపై కఠినంగా వ్యవహరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారన్నారు. కానీ, బీఆర్ఎస్‌కు చెందిన పది మంది ఎమ్మెల్యేలను ఒక్కొక్కరికి రూ.100 కోట్లు ఇచ్చి రేవంత్ కొనుగోలు చేశారని కౌశిక్‌రెడ్డి మండిపడ్డారు. కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో కోర్టు సుమోటోగా ఈ కేసును విచారించాలన్నారు. కోర్టు మరోమారు జోక్యం చేసుకోకముందే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు.

పీఏసీపై అక్కడో న్యాయం.. ఇక్కడో న్యాయమా?

- అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్‌పై బీఆర్ఎస్ మండిపాటు
- హరీశ్, వేముల, గంగుల పేర్లు ప్రతిపాదన
- బీఆర్ఎస్‌కు సమాచారం లేకుండానే జాబితాలో గాంధీ పేరు

సాక్షి, హైదరాబాద్: పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమిస్తూ శాసనసభ కార్యదర్శి సోమవారం విడుదల చేసిన బులెటిన్‌పై రాజకీయ వివాదం రాజుకుంటోంది. రాష్ట్ర శాసనసభ నిర్వహణ నియమావళి ప్రకారం బీఆర్ఎస్ నుంచి ముగ్గురు సభ్యులను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)కి ఎన్నుకోవాల్సి ఉండగా, కేవలం ఇద్దరికి మాత్రమే చోటు దక్కిందని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్ష నేత సూచనలను పరిగణనలోకి తీసుకొని పీఏసీ చైర్మన్‌ను నియమించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అసెంబ్లీ నియమావళిలోని రూల్ 250 ప్రకారం పీఏసీలో అధికార, విపక్ష సభ్యుల నుంచి తొమ్మిది మందిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్యాబలం పీఏసీ ఏర్పాటు చేసే నాటికి 38. ఈ లెక్కన బీఆర్ఎస్ తరఫున ముగ్గురు ఎమ్మెల్యేలకు పీఏసీలో చోటు కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆగస్టులో మొదటివారంలో ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ శాసనసభాపక్షం ముగ్గురు సభ్యుల పేర్లను పీఏసీకి ప్రతిపాదించింది. ఈ మేరకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి తమ పత్రాలను సమర్పించారు. అయితే కాంగ్రెస్ నుంచి ఎన్నుకోవాల్సిన ఆరుగురు సభ్యుల పేర్లపై ఏకాభిప్రాయం కుదరాల్సి ఉందని ఆ పార్టీ శాసనసభాపక్షం వ్యవధి కోరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తమను సంప్రదించకుండానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని తాజాగా పీఏసీ చైర్మన్‌గా నియమించిన తీరును బీఆర్ఎస్ తప్పు పడుతోంది. గాంధీని నియమించడం అసెంబ్లీ నియమావళి, పార్లమెంటరీ స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.

ఎవరి ప్రాధాన్యత ఓటుతో ఎంపిక చేశారంటూ..

ప్రాధాన్యత ఓటు ద్వారా ఒక్కో పీఏసీ సభ్యుడిని ఎన్నుకునేందుకు 13 మంది పార్టీ ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంటుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారు పది మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎవరి ప్రాధాన్యత ఓటుతో అరికెపూడి గాంధీని ఎంపిక చేశారని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. 1958–59 నుంచి ప్రతిపక్ష సభ్యుడిని చైర్మన్‌గా ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలంగాణ శాసనసభ హ్యాండ్‌బుక్ పేజీ 65లో ఉంది. పీఏసీ సభ్యుడిగా తాము ప్రతిపాదించిన హరీశ్‌రావు పేరును జాబితా నుంచి తప్పించడం, గాంధీ పేరును చేర్చడం, చైర్మన్ ఎంపికలో ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను సంప్రదించకపోవడం తదితరాలు అసెంబ్లీ నియమావళికి విరుద్ధమని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

అక్కడ ఎంపీల సంఖ్య తక్కువగా ఉన్నా...

పీఏసీ చైర్మన్ నియామకంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేయని దుశ్చర్యను తెలంగాణలో కాంగ్రెస్ చేస్తోందని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో కాంగ్రెస్‌కు లోక్‌సభలో అతితక్కువ మంది ఎంపీలు ఉన్నా కేవీ థామస్, మల్లికార్జున ఖర్గే, అధీర్ రంజన్ చౌధురి, కేసీ వేణుగోపాల్‌ను పీఏసీ చైర్మన్‌గా కేబినెట్ హోదా ఇచ్చిన విషయాన్ని బీఆర్ఎస్ ప్రస్తావిస్తోంది. రాజ్యాంగాన్ని కాపాడతామంటూ రాహుల్‌గాంధీ ప్రగల్భాలు పలుకుతుండగా, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నియమాలను తుంగలో తొక్కిందని మండిపడింది.

> **ప్రజాస్వామ్యం ఖూనీ**
>
> పీఏసీ చైర్మన్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. చేతిలో రాజ్యాంగం పట్టుకొని రాహుల్‌గాంధీ చెప్పే నీతి వాక్యాలు నీటిమూటలు. ఆయనకు రాజ్యాంగం మీద గౌరవం ఉంటే ప్రతిపక్షానికి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వాలని సీఎంను ఆదేశించాలి. అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం రాజ్యాంగాన్ని నిట్టనిలువునా పట్టపగలు ఖూనీ చేయడమే. రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న రాహుల్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే నైతికహక్కు లేదు. – హరీశ్‌రావు, మాజీ మంత్రి
>
> **ఫిరాయింపు ఎమ్మెల్యేకు పదవి సిగ్గు సిగ్గు**
>
> పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం సిగ్గుసిగ్గు. ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ హోదాను, పార్టీ మారిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడం ఎక్కడి సంస్కృతి. పార్లమెంట్లో పీఏసీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్‌కు కట్టబెట్టిన విషయం మరిచారా. దేశ అత్యున్నత చట్టసభలో ఒక న్యాయం, తెలంగాణ చట్టసభలో మాత్రం అన్యాయమా. – కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్





మరో రకంగా మార్చడానికి నిరంతరం ప్రయత్నించే ఈ ప్రపంచంలో నీకు నువ్వుగా ఉండటమే అతిగొప్ప విజయం.

- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

మంగళవారం, 10 సెప్టెంబర్ 2024

దివ్యమైన రికార్డు

పది రోజుల క్రీడా సంరంభానికి తెర పడింది. ప్యారిస్‌లో వేసవి ఒలింపిక్స్ ముగిసిన వెంటనే కొద్ది రోజులకే ఆరంభమైన పారాలింపిక్స్ ఆదివారం పూర్తయ్యేసరికి భారత బృందం కొత్త చరిత్ర సృష్టించింది. కనివిని ఎరుగని రీతిలో 29 పతకాలు (7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు) సాధించి సత్తా చాటింది. వెంట్రుక వాసిలో తప్పిపోయిన పతకాలను కూడా సాధించి ఉంటే, ఈ స్కోర్ 30 దాటిపోయేది. సాధారణ ఒలింపిక్స్‌లో ఇప్పటికీ రెండంకెల స్కోరును సాధించలేకపోయిన మన దేశం, దివ్యాంగులైన క్రీడాకారులతో సాగే పారాలింపిక్స్‌లో మాత్రం వరుసగా రెండుసార్లు ఆ ఘనత సాధించడం విశేషం. త్రుటిలో తప్పిన పతకాలతో ఈ ఏటి ప్యారిస్ సాధారణ ఒలింపిక్స్ మిశ్రమ ఫలితాలు అందిస్తే, ఈ పారాలింపిక్స్ మాత్రం మరిన్ని పతకాలతో ఉత్సాహం పెంచాయి. పైగా, ఆ ఒలింపిక్స్‌తో పోలిస్తే ఈ క్రీడా మహోత్సవంలో అయిదు రెట్లు ఎక్కువ పతకాలు సాధించడం గమనార్హం. మొత్తం 549 పతకాలకు జరిగే ఈ పోటీల్లో 23 క్రీడాంశాలకు గాను 12 అంశాల్లోనే పాల్గొన్న మన బృందం ఈసారి పతకాల పట్టికలో టాప్ 20లో నిలవడం చిరస్మరణీయం.

మూడేళ్ళ క్రితం 2021 టోక్యో పారాలింపిక్స్‌లో మనం 19 పతకాలు గెలిచి చరిత్ర సృష్టిస్తే, ఇప్పుడు అంతకన్నా మరో 10 ఎక్కువ సాధించి, సంచలనం రేపాం. నిజానికి, 1972లో మురళీకాంత్ పేట్కర్ భారత్ పక్షాన తొట్టతొలి పారాలింపిక్ పతక విజేత. 1984లో మాలతీ కృష్ణమూర్తి హొల్లా భారత్ పక్షాన తొలి మహిళా పారాలింపియన్. అయితే, 2016 వరకు మన మహిళలెవ్వరూ పతకాలు సాధించలేదు. అప్పటి నుంచి పారాలింపిక్స్‌లో భారత్ పక్షాన కేవలం ముగ్గురంటే ముగ్గురు మహిళలే (దీపా మాలిక్ - 2016లో రజతం, అవనీ లేఖరా - 2020లో స్వర్ణం - కాంస్యం, భావినా పటేల్ - 2020లో రజతం) విజేతలుగా నిలిచారు. అలాంటిది ఈసారి భారత్ పక్షాన పతకాలు సాధించినవారిలో 10 మంది మహిళలే. తాజాగా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్‌లో స్వర్ణంతో ఇప్పటికి 2 పారాలింపిక్ స్వర్ణాలు గెలిచిన అవని మినహా మిగతా తొమ్మిది మందీ సరికొత్త విజేతలే. మన మహిళా అథ్లెట్లకు పారాలింపిక్స్‌లో ఇది అసాధారణ విజయం.

ఎవరికి వారు ఎన్నో సవాళ్ళను అధిగమిస్తూ, అంచనాల ఒత్తిడిని తట్టుకొని ఈ ఘనత సాధించారు. ప్రతి ఒక్కరిదీ ఒక్కో స్ఫూర్తిగాథ. ముఖ్యంగా తెలుగు బిడ్డ దీప్తి జీవాంజి లాంటివారి కథ మనసుకు హత్తుకుంటుంది. దివ్యాంగురాలైన ఆమె ఆటల్లో పైకి వచ్చి, పతకాల కల నెరవేర్చేందుకు తల్లితండ్రులు ఎన్నో త్యాగాలు చేశారు. ఆఖరికి వరంగల్‌లోని తమ భూమి కూడా అమ్మేశారు. దీప్తి తాజా పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించడమే కాక, తనను వదిలేయకుండా ఇంత పైకి తీసుకొచ్చిన కన్నవారి కోసం అదే స్థలాన్ని తిరిగి కొని బహూకరించడం ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే మానవీయ గాథ. ఇలాంటి కథలు ఇంకా అనేకం. ఇక, పేరున్న క్రీడా తారలైన జావలిన్ త్రోయర్ సుమిత్ ఆంటిల్, హైజంపర్ మారియప్పన్ తంగవేలు లాంటి వారే కాక అంతగా ప్రసిద్ధులు కాని అథ్లెట్లు సైతం ఈసారి పతకాల విజేతలుగా నిలవడం విశేషం. పతకాలు సాధించడమే కాక, పలువురు భారతీయ అథ్లెట్లు సరికొత్త మైలురాళ్ళను చేరుకొని, చరిత్ర సృష్టించడం గమనార్హం.

క్రీడాసంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి, వాటిని అవినీతి, ఆశ్రిత పక్షపాతాలకు నెలవుగా మారిస్తే జరిగే అనర్థాలు అనేక చోట్ల చూస్తూనే ఉన్నాం. రెజ్లింగ్ సంఘం లాంటి చోట్ల గత రెండేళ్ళలో జరిగిన పరిణామాలే అందుకు నిదర్శనం. అలాంటివాటి వల్ల ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ వేదికలపై పతకాలు పోగొట్టుకున్నాం. పారాలింపిక్స్‌లో మాత్రం మెరుగైన ప్రదర్శన చూపగలిగామంటే ఆ జాడ్యాలు ఇక్కడ దాకా పాకలేదని సంతోషించాలి. కేంద్రం, కార్పొరేట్ సంస్థలు అందించిన తోడ్పాటు ఈ దివ్యాంగ క్రీడాకారులకు ఊతమైందని విశ్లేషకుల మాట. గడచిన టోక్యో గేమ్స్‌కు రూ. 26 కోట్లు, 45 మంది కోచ్‌లతో సన్నాహాలు సాగించిన ప్రభుత్వం ఈసారి రూ. 74 కోట్లు ఖర్చు చేసి, 77 మంది కోచ్‌లతో తీర్చిదిద్దడం ఫలితాలిచ్చింది. వివిధ దేశాల నుంచి దాదాపు 4400 మందికి పైగా పారా అథ్లెట్లు పాల్గొన్న ఈ క్రీడా సమరంలో మన దేశం నుంచి ఎన్నడూ లేనంతగా ఈసారి 84 మంది పాల్గొన్నారు. ఈ ప్రపంచ పోటీలకు దాదాపు 20 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడవడం, రోజూ ఈ జీవన విజేతల విన్యాసాలు చూసేందుకు స్టేడియమ్ నిండుగా జనం తరలిరావడం చెప్పుకోదగ్గ విషయం.

మరి, చెదరని పోరాటపటిమతో శారీరక, సామాజిక అవరోధాలన్నిటినీ అధిగమిస్తున్న దివ్యాంగులకు మన దేశంలో పాలకులు చేయవలసినంత చేస్తున్నారా అన్నది మాత్రం ప్రశ్నార్థకమే. 'దివ్యాంగుల హక్కుల చట్టం- 2016' లాంటివి ఉన్నా, ఇవాళ్టికీ మనదేశంలో మహానగరాల్లో సైతం పాఠశాలల్లో, ప్రయాణ సాధనాల్లో, కార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో వారికి కావాల్సిన కనీస వసతులు మృగ్యం. అయిదేళ్ళలో ఆ పని చేయాలని చట్టపరమైన సంకల్పం చెప్పుకున్నా, ఆచరణలో జరిగింది అతి తక్కువన్నది నిష్ఠురసత్యం. చివరకు చట్టం కింద చేపట్టాల్సిన పథకాలకూ కేంద్ర ప్రభుత్వం నిధుల్లో కోతలు పెట్టడం విషాదం. ఈ పరిస్థితి మారాలి. సమాజంలోనూ, సర్కార్‌పరంగానూ ఆలోచన తీరూ మారాలి. ఆ రకమైన ప్రోత్సాహంతో దివ్యాంగులు మరింత పురోగమించగలరు. తాజా విజయాల రీత్యా మనవాళ్ళకు మరింత అండగా నిలిస్తే, విశ్వవేదికపై వారు భారత ఖ్యాతిని ఇనుమడింపజేయగలరు. అలా చూసినప్పుడు ప్యారిస్ పారాలింపిక్స్ విజయాలు ఆరంభం మాత్రమే. వచ్చే 2028 నాటి లాస్ ఏంజెల్స్ గేమ్స్‌కు అంచనాలు ఆకాశాన్ని అంటుతాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, పారా అథ్లెట్స్ ప్రతిభ తోడై ఇదే దూకుడు కొనసాగిస్తే అద్భుతాలూ జరుగుతాయి.

పుతిన్ ఆకస్మిక చర్చల ప్రతిపాదన

విశ్లేషణ



టంకశాల అశోక్

ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధమనీ, అందుకు ఇండియా, చైనా, బ్రెజిల్ మధ్యవర్తిత్వం వహించాలనీ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ నెల 5న చేసిన ఆకస్మిక ప్రతిపాదన ఆసక్తిని కలిగించింది. చర్చలకు ఆయన సుముఖతను చూపటం ఇది మొదటిసారి కాదు. యుద్ధం రెండున్నరేళ్ల క్రితం మొదలు కాగా చర్చల ప్రస్తావనలు గతేడాదిగా వస్తూనే ఉన్నాయి. కొన్నిసార్లు స్వయంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ దేశాల అధినేతలు, వివిధ అంతర్జాతీయ సంస్థల బాధ్యులు ఈ మాట అంటూనే ఉన్నారు. కానీ కొన్ని కీలకమైన షరతులను పుతిన్ మొదటి నుంచీ పెడుతున్నారు. వీటిని జెలెన్‌స్కీ అంతే బలంగా తిరస్కరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చర్చలంటూ జరిగినా, అవి ఎలా ముందుకు సాగేదీ ఎవరూ చెప్పలేరు.

జెలెన్‌స్కీ గత జూన్‌లో స్విట్జర్లాండ్‌లో తొంభైకి పైగా దేశాలతో శాంతి సదస్సు నిర్వహించారు. కానీ ఆ సదస్సుకు ఆయన రష్యాను ఆహ్వానించలేదు. ఆ కారణంగా చైనా వెళ్లలేదు. అంతలోనే ఆయన, త్వరలో మరొక సదస్సు జరపగలమనీ, దానికి రష్యాను ఆహ్వానించగలమనీ ప్రకటించారు. ఆ సదస్సుకు హాజరయ్యేటట్లు రష్యాను ఒప్పించవలసిందిగా కోరేందుకు తన విదేశాంగ మంత్రి దిమిత్రి కునేబాను చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వద్దకు రాయబారం పంపారు. ఉక్రెయిన్ ప్రతిపాదనలు ఏమిటో చూసి అపుడు స్పందించగలమన్నది రష్యా జవాబు.

ఇవన్నీ జూన్, జూలై పరిణామాలు. అటువంటిది ఇపుడు పుతిన్ ఆకస్మికంగా చర్చల ప్రతిపాదన చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇది ఆకస్మికం, ఆశ్చర్యకరంగా తోచటానికి మరికొన్ని కారణాలున్నాయి. జూన్, జూలై పరిణామాల తర్వాత, కొంత వెనుకముందులుగా చర్చలు ప్రారంభం కావచ్చునని పలువురు భావిస్తుండగా, ఆ తర్వాత కొద్ది వారాలకే ఉక్రెయిన్ సైన్యం తమకూ, రష్యాకూ మధ్యగల ఉత్తర సరిహద్దు నుంచి రష్యాకు చెందిన కర్స్క్ ప్రాంతంపై వేలాది సైన్యంతో మెరుపుదాడి చేసి తగినంత భూభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంది. ఇది మరొక ఆశ్చర్యకర పరిణామం. ఎందుకంటే, యుద్ధం జరుగుతున్నది తూర్పు ప్రాంతాలలో. అక్కడ రష్యాది పూర్తి పై చేయిగా ఉండి రోజురోజుకూ ముందుకు చొచ్చుకొస్తున్నారు. ప్రస్తుతం పోక్రొవ్‌స్క్ అనే అతి కీలకమైన కూడలి పట్టణం వద్ద యుద్ధం కేంద్రీకృతమై ఉంది. ఆ పట్టణాన్ని కోల్పోతే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతమంతా ప్రమాదంలో పడుతుంది. స్వయంగా ఉక్రెయిన్ సైన్యం చెప్తున్న దానిని బట్టి ఆ కేంద్రం కొద్ది రోజులలోనే రష్యా చేజిక్కవచ్చు. అటువంటి విపత్కర స్థితిలో పోక్రొవ్‌స్క్‌కు అదనపు బలాలను పంపి రక్షించుకునేందుకు బదులు కర్స్క్‌పై దాడి ఎందుకు అన్న సందేహాలు తలెత్తాయి.

ఆ చర్చను కొద్దిసేపు వాయిదా వేసి ప్రస్తుతానికి వస్తే, చర్చల మాట రెండు వైపుల నుంచీ కొత్త కాదు. కానీ, అందుకు ఇండియా, చైనా, బ్రెజిల్ మధ్యవర్తిత్వం వహించాలనటం కొత్తమాట. ఇక్కడ ఒక స్పష్టీకరణ అవసరం. వ్లాడివాస్టోక్‌లో జరుగుతున్న ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా ఈ మాట వచ్చింది. ఒక విలేఖరి ప్రశ్నకు సమాధానంగా పుతిన్ ఈ మాట అన్నట్లు వార్తలలో కనిపించింది గానీ, అది నిజం కాదని ఆ వీడియోను చూసినపుడు అర్థమవుతుంది. పుతిన్ ఒక లిఖిత ప్రకటనను చదవటం అందులో కనిపిస్తుంది. అనగా, ముందే ఆలోచించి చెప్పిన మాట అది.

వార్తలలో వెలువడిన దానిని బట్టి రష్యా అధ్యక్షుడు అన్నది, చర్చలకు తాము సిద్ధం. అందుకు ఇండియా, చైనా, బ్రెజిల్ మధ్యవర్తిత్వం వహించాలి. వారీ పని చేయగలరు. యుద్ధంతో ముడిపడి ఉన్న అన్ని సమస్యలను వారు పరిష్కరించగలరనే విశ్వాసం ఉంది.



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

ఈ అంశంపై తాను వారితో నిరంతరం సంప్రదిస్తున్నాను. జెలెన్‌స్కీ, బైడెన్ ఇరువురితో మోదీ మాట్లాడగలరు. అంతర్జాతీయ సంబంధాలలో కీలక పాత్ర వహించేందుకు మోదీకి ఇది మంచి అవకాశం అన్నది పుతిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్య. యథాతథంగా ఈ మాటలు ముఖ్యమైనవే. పుతిన్ మరికొన్ని ముఖ్యమైన మాటలన్నారు. వీడియోలో వినిపించిన ఆ మాటలు ఎందువల్లనో వార్తలలో కనిపించలేదు. అవి, ఉక్రెయిన్‌తో చర్చలకు షరతుల వంటివి. అవి ఈ విధంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్ పాలనలో గల డొనెటెస్క్, లుహాన్స్క్, ఖేర్సాన్, జపోరిజిజియా అనే నాలుగు తూర్పు ప్రాంతాలను రష్యాకు వదలి వేస్తున్నట్లు ప్రకటించాలి. (ఇప్పటికే రష్యా అధీనంలో గల క్రిమియా గురించి ఆయన ప్రస్తావించలేదు గానీ, ఆ విషయమై రాజీకి, చర్చలకు అవకాశం లేదని గతంలోనే అన్నారు.) 'నాటో'లో చేరబోమని కూడా ఉక్రెయిన్ ప్రకటించాలి. ఆ నాలుగు ప్రాంతాల నుంచి సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించాలి. ఇవి జరిగితే 'అదే నిమిషంలో' యుద్ధాన్ని విరమించి చర్చలను ప్రకటిస్తాము.

అనగా ఇవి చర్చలకు షరతులన్నమాట. ఈ షరతులను పుతిన్ మొదటినుంచీ పెడుతున్నారు. ఆ విషయంలో రాజీ లేదంటున్నారు. వీటిని జెలెన్‌స్కీ తమ వైపు నుంచి అంతే బలంగా తిరస్కరిస్తున్నారు. పైగా, రష్యా 2014లో ఆక్రమించిన క్రిమియాను తిరిగి ఇవ్వవలసిందేనంటున్నారు. ఇదే మాట ఇటీవల కూడా పునశ్చరించారు. పైన పేర్కొన్న నాలుగు ప్రాంతాలలో గణనీయమైన భాగాన్ని ప్రస్తుత యుద్ధంలో రష్యా ఆక్రమించుకోగా, అక్కడి నుంచి ఖాళీ చేయాలంటున్నారు. నాటో సభ్యత్వం తమ హక్కని వాదిస్తున్నారు. అనగా, ఇవన్నీ చర్చలకు పుతిన్, జెలెన్‌స్కీల షరతులన్నమాట. తమ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల పరిరక్షణకు అవసరమని జెలెన్‌స్కీ చెబుతున్నారు. నాటో కూటమి విస్తరణ నుంచి ఆత్మరక్షణకూ, ఆ నాలుగు ప్రాంతాలలో మెజారిటీలో గల రష్యన్ భాషీయులపై చిరకాలంగా సాగుతున్న ఉక్రెయిన్ వేధింపులు, తరచూ ప్రాణహననం నుంచి వారిని రక్షించుకునేందుకు ఇది తప్పనిసరి అని రష్యా వాదిస్తున్నది. ఈ షరతులలోని సహేతుకతలలోకి వెళితే రెండు వైపులా న్యాయం కనిపిస్తుంది. ఉక్రెయిన్ భౌగోళిక సమగ్రతకు రక్షణ ఉండవలసిందే. అదే విధంగా, అమెరికన్ నాటో కూటమి క్రమంగా రష్యా సరిహద్దుల వైపు విస్తరిస్తూ, ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకొనజూస్తూ, రష్యా అస్తిత్వానికే ముప్పు తలపెడుతున్నపుడు, వారు ఆత్మరక్షణ కోసం ప్రయత్నించరాదని అనలేము. అట్లాగే, పై నాలుగు ప్రాంతాలలోని రష్యన్ భాషీయులపై మొదటినుంచీ తీవ్రమైన వేధింపు మాట నిజమైనందున, వారికి రక్షణ అవసరం.

ఈ విధమైన పరిస్థితులు, షరతుల మధ్య ఇండియా, చైనా, బ్రెజిల్‌లు రాజీ మార్గం కనుగొనటం ఎంత మాత్రం తేలిక కాదు. ఉభయ పక్షాలు ఈ షరతులు విధించటం, వాటిని వారు పరస్పరం తిరస్కరించటం ఇప్పటికే పలుమార్లు జరిగాయి. నాటో ద్వారా ప్రపంచాధిపత్యం అనే లక్ష్యం గల అమెరికా, ఆ కూటమిలో చేరరాదని ఒకవేళ ఉక్రెయిన్ నిర్ణయించుకున్నా అందుకు సమ్మతించే అవకాశం కనిపించదు. ఆ విధంగా మధ్యవర్తుల బాధ్యత మరింత క్లిష్టతరమవుతుంది. అదట్లుంచి భారత్, చైనా, బ్రెజిల్ ప్రముఖ దేశాలు కావటమే గాక రష్యాతో పాటు బ్రిక్స్ కూటమిలో భాగస్వాములు. తన ఆధిపత్యానికి నష్టమని భావించే అమెరికా ఆ కూటమిని భంగ పరిచేందుకు మొదటినుంచి ప్రయత్నిస్తున్నది. ఈ పరిస్థితులన్నింటి మధ్య, ఒకవేళ అసలు ఈ ముగ్గురి మధ్యవర్తిత్వమంటూ సాకారమైనా, అది ఏ విధంగా ముందుకు సాగేదీ ఎవరూ చెప్పలేరు. ఇంతకూ ఈ ప్రతిపాదనకు జెలెన్‌స్కీ స్పందన ఏమిటో తెలియదు... ఆయన ఇండియా, చైనాల పాత్రను ఇప్పటికే కోరి ఉన్నప్పటికీ.

తిరిగి యుద్ధం విషయానికి వస్తే, కర్స్క్‌పై ఉక్రెయిన్ దాడిలోని ఉద్దేశం రష్యన్ సైన్యాన్ని పోక్రొవ్‌స్క్ నుంచి అటు మళ్లించేట్లు చేయటమని సైనిక నిపుణులు ఊహాగానాలు చేశారు. కానీ రష్యన్ వ్యూహకర్తలు ఆ పని చేయక పోక్రొవ్‌స్క్‌ను, ఇతర తూర్పు ప్రాంతాలను ఆక్రమించే పని సాగిస్తున్నారు. ఆ విధంగా కర్స్క్ వ్యూహం విఫలమైందని ఇపుడు ఉక్రెయిన్ సైన్యాధికారులే అంగీకరిస్తున్నారు. ఉక్రెయిన్ కొత్త సైన్యాధిపతి జనరల్ అలెగ్జాండర్ సిరిస్కియా కొద్ది రోజుల క్రితం మాట్లాడుతూ, కర్స్క్ వైపు నుంచి కూడా తమపై దాడికి రష్యా ఆలోచించటంతో దానిని నిరోధించేందుకు తామే ముందు దాడి చేశామన్నారు గానీ అది నిజమని తోచదు. అటువైపు రష్యన్ యుద్ధ సన్నాహాలు అసలు లేనే లేవు. పుతిన్ ప్రతిపాదనకు రాగల రోజులలో జెలెన్‌స్కీ స్పందనలు వచ్చినపుడు గానీ ఈ విషయమై కొంత స్పష్టత రాదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పెద్దన్న బుద్ధి



ముస్లిం దేశాల్లోని లౌకిక పాలకులను లక్ష్యంగా చేసుకుంటూ సాగిన అమెరికా విధానాలే ఇస్లామిస్టులు ఎదగడానికి కారణమయ్యాయన్న వాస్తవం చాలాసార్లు విస్మరణకు గురవుతుంటుంది. ఉదా: నజీబుల్లా (అఫ్గానిస్తాన్), గడాఫీ (లిబియా), అస్సద్ (సిరియా), హసీనా (బంగ్లాదేశ్). దీనివల్ల జిహాదిస్టులు మితిమీరి పోయారు.

- బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

అదే తపస్సు



తపస్సు అంటే నీళ్లల్లో ఒంటికాలి మీద నిల్చోవడం కాదు. అది కలియుగంలో పనిచేయదు. తపస్సు అనే మాట సంస్కృత పదమైన తప నుంచి వచ్చింది. అంటే వేడి. మీరు రోజూ మునిగి తేలడానికి ఇష్టపడే పనులకు దూరం జరిగే పరిస్థితిలో మిమ్మల్ని ఉంచుకోండి. దాన్నుంచి పారిపోవడానికి పుట్టే ఆలోచనలకూ, మీకూ మధ్య జరిగే ఘర్షణలోంచి అంతర్గత వేడి పుడుతుంది.

- శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

లేకపోతే ఖర్చెలా?



బ్రిటన్‌లోని ఒక్క శాతం సంపన్నులు 70 శాతం జనాభా కంటే ఎక్కువ సంపదను కలిగివున్నారు. నలుగురి దగ్గర 2 కోట్ల బ్రిటనీయుల కంటే ఎక్కువ సంపద ఉంది. మిత వ్యయం అనేది ఎప్పుడూ రాజకీయ ఎంపికే!

- జారా సుల్తానా, బ్రిటన్ ఎంపీ

సమాన బాధ



తమను సమానంగా చూడటం లేదని బాధపడే చాలామంది నిజంగా సమంగా చూసినప్పుడు సంతోషపడరు. ఎందుకంటే వాళ్లను ప్రత్యేకంగా చూడాలని కోరుకుంటారు.

- కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

సంఖ్యల నిజం



ఫన్ ఫ్యాక్ట్: ఇండియాలోని మతపరమైన మైనారిటీల అసలైన సంఖ్య, అమెరికా మొత్తం జనాభాతో సమానం.

- శెఫ్లో రషీద్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

ఆ నిర్ణయం సరైంది కాదు!

మానవ జీవితం కష్ట సుఖాల సంగమం. సంతోషంలో పొంగిపోవడం, కష్టాల్లో కుంగి పోవడం సరికాదు. అన్ని స్థితులనూ సమానంగా ఆస్వాదించడమే జీవితం. జీవితాన్ని అందంగా, ఆనందంగా, గడపడానికి ప్రయత్నించాలి. కానీ చాలా సందర్భాల్లో అలా కుదరక పోవచ్చు. ఉన్నపళంగా ఏదో ఒక సమస్య వచ్చి పడుతుంది. అంతమాత్రాన కుంగిపోవడం, బెంబేలెత్తడం, జీవితాన్నే ముగించాలనుకోవడం పరిష్కారమార్గం కాదు. విజ్ఞత, వివేకాలను వినియోగించని కారణంగా అనేకమంది ఆత్మన్యూనతా భావానికి, తీవ్రమైన ఒత్తిడికి గురై ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి ఒక్కొక్కరిది ఒక్కో కారణం. మానసిక స్థితి సరిగా లేకపోవడం, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, గృహ హింస, చదువులో రాణించలేక పోవడం, ర్యాంకుల ఒత్తిడి, ప్రేమ విఫలం, ఆత్మీయుల్ని కోల్పోవడం, కుటుంబ కలహాలు, ఆనువంశికత, జన్యులోపాలు వంటి ఎన్నో కారణాలు ఉన్నాయి.

ఎక్కువ మంది క్షణికావేశంలోనే ఆత్మహత్యలు చేసుకుంటారు. ఆ సమయంలో వారిని గమనించి ఎవరైనా ఆపగలిగితే గండం గడిచిపోతుంది. ఇలాంటి ఆలోచనలు కలిగిన వారు నలుగురికీ దూరంగా, ఒంటరిగా ఉండడాన్ని ఇష్టపడతారు. విషాద గీతాలు, కవితలు హమ్ చేస్తుంటారు. చేస్తున్న వృత్తి, ఉద్యోగాల్లో ఆసక్తి తగ్గిపోతుంది. మత్తుపదార్థాలకు బానిసలవుతారు. నిరాశా వాదం ఆవహిస్తుంది. ఇవన్నీ ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారి లక్షణాలు కాకపోయినా, వీటిలో కొన్నింటినైనా ప్రదర్శించడం అలాంటి వాళ్ల సహజ లక్షణమై ఉంటుంది.

అలాంటప్పుడు ఆత్మీయులు పసిగట్టి, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోగలగాలి. మేమున్నామన్న భరోసా ఇవ్వగలగాలి. జీవితం మీద ఆశ కల్గించే స్ఫూర్తిదాయక మాటలు మాట్లాడాలి. ఆత్మహత్య ఆలోచనలు వస్తున్న వారు స్నేహితులతో షేర్ చేసుకోవాలి. మానసిక వైద్యుణ్ణి సంప్రదిస్తే ఇంకా మంచిది.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్టు

(నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినోత్సవం)

అక్కడా ఇక్కడా... ఎందెందు వెతికినా!

సందర్భం



డా॥ గోపరాజు నారాయణరావు

ఆర్క్ లైట్ల కృత్రిమ వెలుగు నుంచి బయటకొచ్చి ఒక్కసారైనా వాస్తవాలు గమనించడానికి వెండితెర వేల్పులు సిద్ధపడడం ఇదే మొదటిసారి కావచ్చు. మలయాళ చలనచిత్ర పరిశ్రమ లేదా మాలీవుడ్... ఓనమ్ పండుగకి ఏడెనిమిది సినిమాలు విడుదల చేసేది. కానీ ఈ సంవత్సరం ఆ ప్రయత్నం జరగలేదు. ఇందుకు కారణం జస్టిస్ హేమ కమిటీ నివేదిక. మాలీవుడ్ లోగుట్టు విప్పిన జస్టిస్ హేమ నివేదిక అక్కడికే పరిమితం కాకుండా భారతీయ సినిమా రంగాన్నే కుదుపుతోంది. ఇంతకూ ఏమిటీ జస్టిస్ హేమ నివేదిక?

2017 ఫిబ్రవరి 17న ప్రముఖ మలయాళీ సినీ నటి భావనా మీనన్‌ను ఆరుగురు నేరగాళ్లు అపహరించి లైంగికంగా వేధించారు. ఇది మరొక ప్రముఖ నటుడు దిలీప్ పనేనని నిర్ధారణకు వచ్చారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది. పలువురు నటీమణులు భావనకు సంఘీభావం ప్రకటించారు. సామాజిక మాధ్యమాలలో 'అవళ్ కోప్పమ్' (ఆమె వెంటే మేము) పేరుతో ఉద్యమం నిర్వహించారు. పని ప్రదేశాలలో తమకు భద్రత కల్పించాలని మూడు మాసాల తరువాత 14 మంది నటీమణులు కలసి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ బృందమే 'ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్'. మాలీవుడ్‌లో రాజ్యమేలుతున్న అసమానత, లైంగిక వేధింపుల మీద దర్యాప్తు జరిపించాలని ఈ సంస్థ కోరింది. 2006లో అమెరికాలో ఆరంభమైన 'మీ టూ' ఉద్యమం ఎనిమిదేళ్ల క్రితం భారతీయ వెండితెరను కుదిపేసింది. మాలీవుడ్‌లో తిరుగుబాటుకు మీ టూయే ప్రేరణ. ఫలితంగా కేరళ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హేమ నాయకత్వంలో, బహుభాషా నటి శారద, విశ్రాంత ఐఏఎస్ కేబీ వల్సలా కుమారిలతో కమిటీ నియామకానికి ఇదే దారి తీసింది.

2019 నాటికి 40 మంది వాంగ్మూలాలు కలిగిన 5000 పేజీల నివేదికను ముఖ్యమంత్రికి కమిటీ అందించింది. ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని అనేకమంది వేడుకున్నా ముఖ్యమంత్రి పినరయి నిరాకరించారు. కారణాలు ఏమైనా 2022 మే లో ఒకటిన్నర పేజీ నివేదికను బహిర్గతం చేశారు. అవి కమిటీ సిఫారసులు. ఎట్టకేలకు ఈ ఆగస్ట్ 19న నివేదిక బయట పడింది. సినిమా అవకాశాల కోసం వచ్చిన యువతులు, ప్రసిద్ధులైన నటీమణులు కూడా మాలీవుడ్ 'మాఫియా' పెద్దల వెకిలితనం గురించి చెప్పిందీ నివేదిక. నివేదిక ఇటీవలి సంచలనం పినరయి ప్రభుత్వం ఏడుగురు పోలీసు ఉన్నతాధికారులే సభ్యులుగా తదుపరి చర్యలకు సంఘాన్ని నియమించింది.

వందలాది మంది నటీమణులకి చేదు అనుభవాలు ఉన్నా, కొద్దిమందే కమిటీ ముందు ఆక్రోశాన్ని వెల్లడించారు. వారు బయటపెట్టినవన్నీ సినీ రంగాన్ని శాసిస్తున్న దిగ్గజాల పేర్లే. సీపీఎం ఎమ్మెల్యే, మలయాళ సినీ నటుడు ఎం. ముఖేశ్; నిర్మాత, నటుడు సిద్దిఖ్; ఇడవెళ బాబు, నిర్మాత రంజిత్, సుధీశ్, జయసూర్య, రియాజ్‌ఖాన్ పేర్లు బాహాటంగానే వెల్లడించారు బాధితులు. మలయాళ నటి మినూ మునీర్ ఫిర్యాదు మేరకే జయసూర్య, ముఖేశ్, ఇడవెళ బాబుల మీద ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎం. ముఖేశ్, జయసూర్య, మణియన్ పిల్ల రాజు, ఇడవెళ బాబుల మీద కూడా ఆమె సంచలన ఆరోపణలు చేశారు.



సిట్ ఏర్పడిన తరువాత సోనియా మల్హార్ అనే నటి ఫిర్యాదు చేశారు. 2013లో తనను సెట్స్‌లోనే లైంగికంగా వేధించారని ఆమె ఆరోపణ. రంజిత్ తనను వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖమిత్ర ఆరోపించారు. సిద్దిఖ్ తనను 2016లో లైంగికంగా వేధించాడని నటి రేవతి సంపత్ వెల్లడించారు. బహ్రెయిన్‌లో ప్రదర్శన ఇవ్వడానికి వెళ్లినప్పుడు ఒక సీనియర్ నటుడు లిఫ్ట్‌లో తనతో అసభ్యంగా ప్రవర్తించిన సంగతి ఉష అనే నటి మోహన్ లాల్‌కు, సీనియర్ నటి సుకుమారికి కూడా ఫిర్యాదు చేశారు. ఎవరి మీద చర్యలు లేవు. హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగి, టీవీ చానళ్లు కూడా నడుపుతున్న నటి రాధిక, కార్వాన్‌లో కెమేరాలు అమర్చి ఫోటోలు తీసేవారని, అందుకే తాను హోటల్ గదిలో దుస్తులు మార్చుకున్నానని వెల్లడించడమంటే ఏమిటి? షూటింగ్ ప్రదేశాలలో నటీమణులు, ముఖ్యంగా జూనియర్ ఆర్టిస్టులు ఎలాంటి నరకం అనుభవిస్తారో నివేదిక తెలియచేసింది. అర్ధరాత్రి వీరి గదుల తలుపులు కొడతారనీ, వారికి పని ప్రదేశంలో మూత్రశాలలు కూడా ఉండవనీ తెలిపింది. కేరళ రాష్ట్ర చలచిత్ర అకాడెమీ అధ్యక్ష పదవిని వెలగబెడుతున్న రంజిత్ ప్రస్తుత సంచలనం నేపథ్యంలో వైదొలిగారు. నివేదికతో అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) రద్దయింది. కార్యనిర్వాహక సంఘం రాజీనామా ఇచ్చింది.

ఈ దుష్ట సంస్కృతి మలయాళ పరిశ్రమకే పరిమితం కాదు. 2018లో తనుశ్రీదత్తా బాలీవుడ్ నటుడు నానా పటేకర్ మీద ఆరోపణ చేశారు. ఆధారాలు లేక 2019లో కేసు మూసివేశారు. సాజిద్ ఖాన్ కూడా ఇదే తరహాలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. కైలాష్‌ఖేర్ మీద ఆరోపణలు వచ్చినా క్షమాపణలు కోరి బయటపడ్డాడు. తెలుగు సినీ పరిశ్రమకూ జస్టిస్ హేమ కమిటీ అవసరం ఉందని నటి సమంత అభిప్రాయపడడం విశేషం.

రంజిత్ రాజీనామాను ఆమోదిస్తున్నట్టు కేరళ సాంస్కృతిక వ్యవహారాల మంత్రి సాజి చెరియన్ చెప్పారు. అంతకంటే ముందు మంత్రి చేసిన వ్యాఖ్య దారుణం. ఆగస్ట్ 25న రంజిత్ రాజీనామా ఇచ్చారు. అంతకు ముందు రోజే చెరియన్ అన్న మాట ఇది: 'రంజిత్ దేశంలోనే ప్రతిష్ఠ కలిగిన దర్శకుడు. ఆరోపణలు వచ్చినంత మాత్రానే కేసులు పెట్టడం సాధ్యం కాదు. అలా కేసు పెట్టినా నిలబడదు.' రంజిత్ కూడా ఆరోపణల మీద న్యాయ పోరాటం చేస్తాననీ, ఈ ఆరోపణలన్నీ వామపక్ష ప్రభుత్వం కీర్తిప్రతిష్ఠలను దిగజార్చడానికి చేస్తున్నవేననీ అన్నారు.

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్ఘటన పట్ల ఒక వర్గం మీడియా చూపిన ఆసక్తి మాలీవుడ్ మాలిన్యం మీద ఎందుకు చూపడం లేదు? సీపీఎం ఎమ్మెల్యే, మాలీవుడ్ నటుడు ముఖేశ్ మీద రేప్ కేసు నమోదైనా రాజీనామాకు తొందరేమీలేదని సీపీఎం ఎలా అనగలుగుతున్నది? అసలు సినిమా రంగమే కాకుండా, రాజకీయం సహా అని రంగాలకు కూడా జస్టిస్ హేమ కమిటీలు అవసరమేమో!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అప్పుడే దేవుని సేవ...

ఈ ప్రపంచంలో ఇద్దరు దొంగలున్నారు. వారు మనిషి ఆయుష్షును, జీవితంలో ఎదుగుదలను సంతోషాన్ని హరిస్తున్నారు. ఆహారం, నిద్ర అనే ఆ ఇద్దరు దొంగల నుంచి మనిషి తనను తాను కాపాడుకోవాలి. వీటికి పూర్తిగా వశమైపోతే, దొంగ చేతికి తాళాలిచ్చేసినట్లే! అతి నిద్ర, అతి భోజనం రెండూ అనర్థ హేతువులే. ఇవి మనిషిని బద్ధకస్తునిగా తయారుచేస్తాయి.



జ్యోతిర్మయం

మితాహారం, పరిమిత నిద్ర అనే రెండు సూత్రాలను మనిషి జీవిత పర్యంతం ఆచరించగలిగితే అతని జీవితం ఉజ్వలంగా ప్రకాశిస్తుంది. ఈ రెండు లక్షణాల వల్ల మనిషికి సాత్విక స్వభావం అలవడుతుంది. ఇవి ఆరోగ్య హేతువులు కూడా. అప్పుడు సమయం బాగా మిగులుతుంది. భగవద్ధ్యానానికి ఎంతో అవకాశం కలుగుతుంది. సత్సాంగత్యానికీ, భగవత్కథలు వినటానికీ, దేవాలయాలు దర్శించటానికీ... ఇలా ఒకటేమిటి ఆధ్యాత్మిక వికాసానికి ఎంతో సమయం దొరుకుతుంది. జన్మ సార్థకం చేసుకోవాలనుకునే వారు పరిమితాహారం, పరిమిత నిద్ర అలవాటు చేసుకోవాలి.

అతి ఆహారం, అతి నిద్ర వలన బుద్ధి మందగిస్తుంది. మెదడు సరిగ్గా పనిచేయదు. కాబట్టి, ఈ ఇద్దరు దొంగలు తమ శరీరమనే ఇంటిలో చొరబడి తమ మేధా సంపత్తిని, ఆధ్యాత్మిక సాధనను, భక్తి భావం వంటి వాటిని దోచుకోకుండా మనిషి జాగ్రత్త వహించాలి. జీవితమంతా నిరర్థకంగా తినటం లోనూ, నిద్ర లోనూ గడిపేసి, సమయం మించిపోయాక విచారించటం వల్ల ప్రయోజనం లేదు. ఇలాంటివి మొదటి నుంచి శరీరానికి అలవాటు చేయాలి. ఈ దేహం మనది. మన చెప్పు చేతల్లో ఉండాలి. మనం ఎలా చెబితే అలా వినేట్లు ఈ శరీరాన్ని, మనసును కూడా ఎప్పుడూ సిద్ధం చేస్తూనే ఉండాలి. అప్పుడు ఈ ఇద్దరు దొంగలు దరిదాపుల్లోకి రావటానికే భయపడతారు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** సప్తమి సా.5.54 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** అనూరాధ సా.4.30 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.10.15 నుండి 11.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.39 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.05.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

వాగులూ.. వంకలూ దాటి

- ఆదివాసీలకు నిత్యావసర సరుకులు అందజేసిన పోలీసులు

గూడూరు: అది దట్టమైన అడవిలోని మారుమూల గూడెం. అక్కడ ఉండేది 23 కుటుంబాలు. మొత్తం జనాభా 78 మంది. వానాకాలం వచ్చిందంటే అడవిలో వాగులు..వంకలపై వంతెనలు లేక..ఏటా రెండు, మూడు నెలలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటారు. అదే..మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టివాడ జీపీ పరిధిలోని దొరవారి తిమ్మాపురం. ఇటీవల వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పది రోజులుగా ఆ గ్రామానికి ఉండే కాలిబాట దారులు కూడా మూతపడ్డాయి. దీంతో ఆదివాసీలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. విషయం తెలుసుకున్న గూడూరు పోలీసులు జిల్లా ఎస్పీకి సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబూరావు గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాల పోలీసుల సహకారంతో ఆదివారం రెండు ట్రాక్టర్లపై, 15 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులతో కొత్తగూడ మండలం కార్లాయి మీదుగా ఆ గ్రామానికి బయలుదేరి వెళ్లారు. వర్షం కురుస్తుండగా ట్రాక్టర్లపై వాగులు, వంకలు దాటారు. రెండు చోట్ల ట్రాక్టర్లు దిగబడడంతో మూటలతో కాలిబాట బట్టి గ్రామాన్ని చేరుకున్నారు. సీఐ 23 కుటుంబాలకు బియ్యంతోపాటు నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గూడూరు, కొత్తగూడ, గంగారం ఎస్సైలు బి.గిరిధర్‌రెడ్డి, కుష కుమార్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదివాసీలకు నిత్యావసర సరుకుల బస్తా అందిస్తున్న సీఐ బాబూరావు

5 నెలల వేతనం.. వారం సెలవు

- వరద ముంపు బాధితుల సేవలో డాక్టర్ లక్ష్మణ్
- ఖమ్మంలో 2 వేల కుటుంబాలకు దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ

ఖమ్మం మయూరిసెంటర్: తాను నివాసం ఉండే ప్రాంతంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు వచ్చిన కష్టాన్ని చూసిన ఆ డాక్టర్ చలించిపోయారు. అన్న, డాక్టర్ బాబు.. అంటూ తనను ఆప్యాయంగా పిలిచే వారిని కొంతమేరకైనా ఆదుకోవాలని సంకల్పించారు డాక్టర్ లక్ష్మణ్. ఖమ్మం 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, మాజీ కార్పొరేటర్ తోట రామారావు దంపతుల పెద్ద కుమారుడు డాక్టర్ లక్ష్మణ్. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆర్థో విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన చిన్నప్పటి నుంచే స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు.

సెలవుపెట్టి వారం పాటు ముంపులోనే

గత నెల 31వ తేదీన అర్ధరాత్రి ఖమ్మంలోని 46, 47, 48 డివిజన్‌లను మున్నేరు వరద చుట్టుముట్టడంతో స్థానికులతో కలసి డాక్టర్ లక్ష్మణ్ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వరద నీటిలో చిక్కుకున్న వందల మందిని బయటకు తీసుకొచ్చి పునరావాస కేంద్రాలకు పంపించారు. వారం రోజుల పాటు విధులకు సెలవు పెట్టి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతేకాక డివిజన్ ప్రజలకు తాగునీటి సరఫరా కోసం ట్యాంకర్‌ను కొనుగోలు చేశారు.



వరద బాధితులకు నిత్యావసరాలు, బెడ్‌షీట్లు అందిస్తున్న లక్ష్మణ్

ఐదు నెలల వేతనం బాధితులకే..

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్‌కు నెల నెలా రూ.1.25 లక్షల వేతనం అందుతోంది. వరదతో సర్వం కోల్పోయిన వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఐదు నెలల వేతనాన్ని వెచ్చించాలని నిర్ణయించారు. ఈ మేరకు 2 వేల కుటుంబాలకు సరిపడా బెడ్‌షీట్లు తీసుకొచ్చి నిత్యావసరాలు, కూరగాయలతో కలిపి పంపిణీ చేశారు.

క్లుప్తంగా...

రేపు తెలంగాణకు కేంద్ర బృందం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టం అంచనా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అకాల వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ బృందాన్ని పంపనుంది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ) సలహాదారు, కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ (ఆపరేషన్స్-కమ్యూనికేషన్స్) కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం 11న తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు సహా.. వరద కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో పర్యటించనుంది. అలాగే..బాధితులు, అధికారులతో ఈ బృందం చర్చిస్తుందని.. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో కిషన్‌రెడ్డి కేంద్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న కల్నల్ కీర్తి ప్రతాప్‌సింగ్‌తో ఫోన్లో మాట్లాడి.. ఆదివారం నాటి తన ఖమ్మం పర్యటనలో తెలుసుకున్న అంశాలను, బాధితుల ఆవేదన, క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించినట్లు పేర్కొన్నారు. ఈ బృందంలో కేపీ సింగ్‌తో పాటు ఆర్థిక, వ్యవసాయ, రోడ్లు, రహదారులు, గ్రామీణాభివృద్ధి శాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు.

వరద ప్రాంతాల్లో ఇంటింటికీ హెల్త్ చెకప్‌లు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికీ హెల్త్ చెకప్‌లు నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. వరద ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. లక్షణాలున్న వాళ్లందరికీ వెంటనే మెడికల్ కిట్స్ పంపిణీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, హెల్త్ విభాగాలు సమన్వయంతో వ్యాధులను నియంత్రించాలన్నారు. డెంగీ కేసులు పెరుగుతున్నాయని, యాంటీ లార్వా ఆపరేషన్లు విస్తృతంగా చేయాలని దామోదర సూచించారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితులపై ఫోకస్ పెట్టాలన్నారు. జ్వర సర్వేను సమర్థవంతంగా చేయాలని చెప్పారు. వారం రోజుల్లో వరద ప్రాంతాల్లో జ్వర సర్వే పూర్తి కావాలన్నారు. ఆరోగ్య సర్వే ప్రోగ్రామ్‌ను మానిటరింగ్ చేయాలని ఆయా జిల్లాల ఎమ్మెల్యేలకు మంత్రి సూచించారు.

ఈడబ్ల్యూఎస్‌పై మార్గదర్శకాలు ఎందుకు రూపొందించలేదు?

- వైద్యవిద్య ప్రవేశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించిన హైకోర్టు
- తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్య అడ్మిషన్లలో అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటా మార్గదర్శకాలను ఎందుకు రూపొందించలేదో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ప్రశ్నించింది. ఈ అంశంపై వివరాలు తెలుసుకొని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ 2024-25 అడ్మిషన్లలో అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయట్లేదని... రిజర్వేషన్ల అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలని జనవరి 31న కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం లేఖ రాసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదంటూ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇది సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమన్నారు. వైద్యవిద్య ప్రవేశాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు వెంటనే మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

ఇంజనీరింగ్ సీట్ల పెంపునకు హైకోర్టు ఓకే

- కొత్తగా అందుబాటులోకి 3 వేల సీట్లు
- వీటికోసం మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలి
- తుది ఉత్తర్వుల మేరకే సీట్ల కేటాయింపు
- సీజే ధర్మాసనం స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో (పిటిషనర్లు) సీట్ల పెంపునకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొత్తగా 3 వేల సీట్లు అందుబాటులోకి రానున్నాయి. కన్వీనర్ కోటా కింద 2,100, మేనేజ్‌మెంట్ కోటా కింద 900 సీట్లు భర్తీ చేయాల్సి ఉంటుంది. దీని కోసం మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యా శాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే ఈ సీట్ల కేటాయింపు తుది ఉత్తర్వుల మేరకు ఉంటుందని స్పష్టం చేసింది. బీటెక్, బీఈలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సుల్లో సీట్ల పెంపునకు, కొన్ని కోర్సులను ఇతర కోర్సుల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు హైకోర్టులో 11 పిటిషన్లు, ఓ మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశాయి. విద్యా జ్యోతి, ఎంఎల్ఆర్, మల్లారెడ్డి, సీఎంఆర్, మార్టిన్స్, అనురాగ్, మర్రి లక్ష్మారెడ్డి కాలేజీలు ఈ పిటిషన్లు, మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశాయి. కాగా మధ్యంతర అప్లికేషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. ఇప్పటికే అడ్మిషన్ల షెడ్యూల్ పూర్తయినందున సీట్ల పెంపు, కొత్త కోర్సులపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమంటూ తీర్పు చెప్పారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.



వాద ప్రతివాదనలు సాగాయిలా..

పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, శ్రీరఘురామ్, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ అనుమతి ఇచ్చిన మేరకు కోర్సుల్లో సీట్లు పెంపునకు అనుమతి ఇవ్వాలి. జేఎన్‌టీయూహెచ్, ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తిరస్కరించడం సరికాదు. పాత కోర్సులను కొత్త కోర్సులుగా మార్చుకునేందుకే అనుమతి కోరుతున్నాం. దీంతో ఒక్క సీటు కూడా అదనంగా పెరగడం లేదు. ప్రభుత్వంపై ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం అనే సమస్యే ఉత్పన్నం కాదు. ఎలాంటి కారణం చెప్పకుండానే ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి మాకు అనుమతి నిరాకరించారు. 70 కాలేజీలకు గాను 56 కళాశాలల్లో సీట్ల పెంపునకు అనుమతి ఇచ్చి.. మా కాలేజీల్లో తిరస్కరించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం..'అని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'సీట్ల పెంపు లాంటిది ఒక్క రీయింబర్స్‌మెంట్‌కే పరిమితం కాదు. కాలేజీలు కోరిన విధంగా సీట్లు పెంచుకుంటూపోతే సమస్యలు ఉత్పన్నమవుతాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల కింద అనుమతిస్తే విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. సీట్ల పెంపు, విలీనంపై నిర్ణయం తీసుకునే చట్టపరమైన అధికారం ప్రభుత్వానికి ఉంది. సీఎస్‌ఈ లాంటి కోర్సుల్లో ఇప్పటికీ చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇంకా పెంచాలని కోరడం సరికాదు. అప్పీళ్లను కొట్టివేయాలి..' అని విజ్ఞప్తి చేశారు.

కోర్టు ఏం చెప్పిందంటే..

'ఈ నెల 5న మధ్యంతర అప్లికేషన్‌పై సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తున్నాం. అప్పీల్ దాఖలు చేసిన కాలేజీల్లో పెంచిన సీట్లకు అధికారులు మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. ఈ అంశం కోర్టులో ఉందని, తుది తీర్పు మేరకే విద్యార్థుల ప్రవేశం ఉంటుందని స్పష్టంగా కౌన్సెలింగ్‌లో తెలియజేయాలి. సింగిల్ జడ్జి వద్ద అధికారులు రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలి. రిట్ పిటిషన్లను త్వరితగతిన విచారణ చేయాలని సింగిల్ జడ్జిని కోరుతున్నాం. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున మెరిట్‌పై మేం ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదు. ప్రధాన పిటిషన్లలోని మెరిట్‌పై ఈ ఉత్తర్వుల ప్రభావం ఉండదని స్పష్టం చేస్తున్నాం..'అని ధర్మాసనం పేర్కొంది.

సాయం పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

ఎలాంటి సాయం అందలేదని వాపోతున్నారు.

సాయం కోసం ఎదురుచూస్తూనే..

మున్నేరు ముంపు ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా కొలిక్కి రాలేదు. ఇళ్లను, మిగిలిన సామగ్రిని శుభ్రం చేసుకునేందుకే బాధితులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎవరైనా వచ్చి ఏదైనా సాయం అందిస్తారా అంటూ ఎదురుచూస్తున్నారు. మున్నేరు, ఆకేరు ఇతర వాగులకు వచ్చిన వరదతో ఖమ్మం జిల్లాలో 15,201 ఇళ్లు నీట మునగగా.. 70 వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. ఎవరిని కదిలించినా.. సర్వం కోల్పోయి, మళ్లీ మొదటి నుంచి జీవితం ప్రారంభించాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇళ్లలోని ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్, టీవీ, మిక్సర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, మంచాలు, టేబుల్స్, నిత్యావసరాలు అన్నీ పాడైపోయాయని అంటున్నారు. ఏళ్లకేళ్లుగా కూడబెట్టుకుని సమకూర్చుకున్న సామగ్రి అంతా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రూ.16,500 సాయం అందిస్తే, తాత్కాలిక ఉపశమనమే ఉంటుందని.. ఇక తమ బతుకులు గాడినపడేది ఎలాగని వాపోతున్నారు.

పొలాల పరిహారమూ పెంచాలి..

వరదల వల్ల సాగుకోసం చేసిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయామని.. ఇప్పుడు మళ్లీ పెట్టుబడులు అవసరమని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తామన్న పరిహారాన్ని పెంచాలని కోరుతున్నారు. ముఖ్యంగా కొన్నిచోట్ల పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు చేరాయని.. వాటిని తొలగించాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుందని అంటున్నారు. అలాంటప్పుడు పరిహారం ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం దయ చూపితేనే..



ఖమ్మం మోతీనగర్‌కు చెందిన కస్తూరి సంతోష్–రమేశ్ కూలి పనులు వెళ్లి జీవిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. మున్నేటి వరదతో ఇంటి ప్రహరీ కూలిపోగా, తలుపులు ఊడిపోయి సామగ్రి కొట్టుకుపోయింది. ఇప్పటివరకు ఎలాంటి సాయం అందలేదని.. తమపై ప్రభుత్వం దయచూపితేనే కోలుకుంటామని వారు వాపోతున్నారు.

ఆదుకుంటేనే మనుగడ

ఖమ్మం వెంకటేశ్వర నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు తోపుడు బండిపై కూరగాయలు అమ్మడంతోపాటు చిన్న కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు. మున్నేటి వరదతో ఇంట్లో సామాన్లతోపాటు కిరాణా షాపులోని సామగ్రి అంతా కొట్టుకుపోయాయి. అధికారులు వచ్చి పేర్లు రాసుకెళ్లినా ఇంకా ప్రభుత్వ సాయం అందలేదని.. సర్వం కోల్పోయిన తాము సాధారణ స్థితికి వచ్చేలా ప్రభుత్వమే ఆదుకోవాలని వెంకటేశ్వర్లు కోరుతున్నాడు.

రూ.4 లక్షలకు పైనే నష్టం

పాలేరు వరదతో ఆరు ఎకరాల్లో వరి కొట్టుకుపోయింది. పొలం కోతకు గురై ఇసుక మేట వేసింది. కరెంటు మోటార్లు, స్తంభాలు కూడా కొట్టుకుపోయాయి. రూ.4 లక్షలకు పైనే నష్టం జరిగింది. ప్రభుత్వం ఇస్తామన్న పరిహారంతో ఇవన్నీ సరిచేసుకునేదెట్లాగో తెలియడం లేదు.

– బీరెల్లి సుధాకర్‌రెడ్డి, మల్లాయిగూడెం, ఖమ్మం జిల్లా

ఈ సాయం సరిపోదు..



ఖమ్మం ధంసలాపురానికి చెందిన నిడిగుండ నరేశ్–ఈశ్వరమ్మలకు ఇద్దరు పిల్లలు. రోజూ పనికి వెళ్తేనే కుటుంబం గడిచేది. మున్నేరు వరదతో ఇంటి పునాది కోతకు గురై గోడలు పడిపోయాయి. ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జ్, కూలర్, గ్యాస్ సిలిండర్ అన్నీ కొట్టుకుపోయాయి. ప్రభుత్వం ఇస్తామంటున్న ఆర్థిక సాయంతో కోలుకునేది ఎలాగని నరేశ్ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం

▶ మొదటి పేజీ తరువాయి

పంపాల్సిన నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలపై మంత్రి పొంగులేటి అధికారులకు పలు సూచనలు చేశారు. వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సాయం అందించాలని ఆదేశించారు. బాధితులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

మానవతా దృక్పథంతో సాయం పెంపు

సమీక్షలో అధికారులు మాట్లాడుతూ.. వరదల కారణంగా ఖమ్మం జిల్లాలో ఆరుగురు, కొత్తగూడెంలో ఐదుగురు, ములుగులో నలుగురు, కామారెడ్డి, వనపర్తిలలో ముగ్గురి చొప్పున చనిపోయారని మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో పూర్తిగా, పాక్షికంగా కూలిపోయిన ఇళ్లను గుర్తించి.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వరదలతో ప్రభావితమైన ప్రతి కుటుంబానికి రూ.16,500 చొప్పున సాయం అందించాలని.. అక్రమాలకు తావు లేకుండా నేరుగా బాధితుల ఖాతాల్లోనే జమ చేయాలని ఆదేశించారు. తొలుత రూ.10 వేల సాయం అనుకున్నప్పటికీ.. మానవతా దృక్పథంతో దాన్ని రూ.16,500కు పెంచామని చెప్పారు. వరద ముంపునకు గురైన పంట భూములకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. ఇక మైనింగ్ వ్యర్థాలను ప్రభుత్వ భూముల్లో వేయడం వల్ల వరద వెళ్లక సూర్యాపేట, పాలేరులకు భారీగా నష్టం జరిగిందని అధికారులు వివరించారు. దీంతో ఆ నష్టాన్ని మైనింగ్ ఏజెన్సీల నుంచే వసూలు చేయాలని పొంగులేటి ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సూచించారు.

శాశ్వత మరమ్మతులు చేపట్టండి

సమీక్షలో భాగంగా అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 358 గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయని, దాదాపు 2 లక్షల మంది ప్రభావితమయ్యారని వివరించారు. 158 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, 13,494 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. వర్షాలు, వరదలతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు వేల కిలోమీటర్ల పొడవునా దెబ్బతిన్నాయని అధికారులు వివరించగా.. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రోడ్లను పునరుద్ధరించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. శాశ్వత మరమ్మతులకు అవసరమైన కార్యాచరణను రెండు రోజుల్లో తయారు చేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులను కూడా వేగంగా చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీలు ఏ మేరకు దెబ్బతిన్నాయనే వివరాలను సేకరించాలని సూచించారు. వరదల కారణంగా ఇండ్లలోకి నీరు చేరి.. ఇంటి పత్రాలు, ఆస్తి పత్రాలు, కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్థుల సర్టిఫికెట్లు తడిచిపోయాయని, కొన్నిచోట్ల కొట్టుకుపోయాయని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి... డాక్యుమెంట్లు పోయిన బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, వీలైనంత త్వరగా వారికి డూప్లికేట్ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కులగణన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

నీటిపారుదల, పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులను అభినందిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కులగణన చేపట్టడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ప్రజాప్రభుత్వం వేగవంతంగా కులగణన చేపడుతుందని తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన నిరంజన్, సభ్యులు సోమవారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తమ్ కుమార్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. బీసీ కమిషన్ చైర్మన్ పదవికి నిరంజన్ హుందాతనాన్ని తీసుకొస్తారన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీ ఇప్పటికే నిర్ణయించిన విషయాన్ని ఉత్తమ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలోనే ఓబీసీలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు సత్కారం



అవార్డు అందుకున్న ఉద్యోగులతో అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ట్రాక్‌లను సకాలంలో గుర్తించడం ద్వారా పెనుప్రమాదాలను తప్పించిన ఆరుగురు ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ 'సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్'అవార్డులను అందజేశారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన భద్రతా సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు వారిని అభినందించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన 'పర్ఫార్మెన్స్ అండ్ అచీవ్‌మెంట్స్– టూ గ్లోరియస్ ఇయర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'బుక్‌లెట్ కూడా విడుదల చేశారు. రైలు కార్యకలాపాల్లో భద్రతకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తిస్తూ సంపూర్ణ అంకితభావం, అప్రమత్తత చూపిన నెక్కొండ, మహబూబాబాద్ ట్రాక్‌మెన్‌లు జి.మోహన్, బి.జగదీశ్, కె.కృష్ణ, బ్రిడ్జ్ మెన్ బి.జైల్‌సింగ్, జేఈ వి.సైదా నాయక్, ఎస్ఎస్ పి.రాజమౌళిలకు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డులను ప్రదానం చేశారు. భద్రతకు సంబంధించి క్షేత్రస్థాయి తనిఖీలను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక నిరోధక యంత్రాలు, పొగను గుర్తించే పరికరాలు, తదితర భద్రతా వస్తువుల లభ్యతపై ఆయన చర్చించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్, నీరజ్ అగర్వాల్‌తో పాటు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కూనంనేని ఒక నెల జీతం



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కె.నరసింహ తదితరులు

సాక్షి, హైదరాబాద్/అఫ్జల్‌గంజ్: వరద బాధితులకు సహాయం అందించేందుకు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక నెల జీతం విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు సోమవారం రూ.2.50 లక్షలను సీఎం సహాయనిధికి అందజేయాలని పార్టీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఈ మొత్తాన్ని ప్రభుత్వానికి అందజేస్తామని, వరద బాధితులకు సీపీఐ అన్ని రకాలుగా అండగా ఉందని కూనంనేని తెలిపారు.

సీఎం సహాయనిధికి సైజెన్ రూ.కోటి విరాళం

ముఖ్యమంత్రి సహాయ నిధికి సైజెన్ గ్రూపు రూ.కోటి విరాళం అందజేసింది. సంస్థ ప్రతినిధులు సోమవారం సీఎంను ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు. అలాగే అకాల వర్షాల వల్ల తెలంగాణలో వరదలతో సర్వస్వం కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు సోమవారం మల్లేశం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ చైర్మన్ కార్యదర్శి నరసింహ కురుమ, ప్రధాన కార్యదర్శి చిగుమళ్ల రాఘవేందర్, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు పుష్ప నాగేశ్, ట్రస్ట్ బోర్డు సభ్యుడు కెంద్యాల శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చెక్కును అందజేశారు.

వరద బాధితులను ఆదుకుంటాం

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



నిత్యావసర సరుకుల వాహనాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్, మైనంపల్లి

మల్కాజిగిరి: ఇటీవల వరదలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం ఖమ్మం వరద బాధితుల కోసం మైనంపల్లి ఆర్గనైజేషన్ ఆఫ్ సోషల్ సర్వీస్ (మాస్) ద్వారా పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన నిత్యావసర సరుకుల వాహనాన్ని వారు ప్రారంభించారు. గత ప్రభుత్వం కన్నా మిన్నగా వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటోందని, ప్రభుత్వానికి దాతలు కూడా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, జీఎన్వీ సతీశ్‌కుమార్, వెంకటేశ్‌యాదవ్, గుండా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

దోమలపెంట: జూరాల, సుంకేశుల నుంచి నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీశైలం ఆనకట్ట వద్ద ఐదు గేట్లను పైకెత్తి స్పిల్‌వే ద్వారా దిగువన సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,82,980 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 27,076, సుంకేశుల నుంచి 35,832 మొత్తం 2,45,888 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తోంది. దీంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఐదు గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,36,245 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,094 మొత్తం 68,210 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం
తెలంగాణ రాష్ట్ర విద్యా మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ : హైదరాబాద్

టెండరు ప్రకటన నం. SE/TGEWIDC/HYD/NIT/273/2024-25, తేది: 05.09.2024
"ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, నాంపల్లి, హైదరాబాద్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో స్క్రాప్ డిస్పోజ్" పని కొరకు సీల్డు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూళ్ళు కొరకు దరఖాస్తు స్వీకరణ మరియు టెండరు షెడ్యూలు సరఫరా కొరకు చివరి తేది : **06.09.2024 నుండి 23.09.2024న సా.5.00 గం.వరకు.** పూర్తి వివరాల కొరకు స్వయంగా సంప్రదించండి : సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, E-గేట్ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం. 040-29565991.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్
DIPR RO No.3939-PP/CL/Advt/1/2024-25, Dt: 09.09.2024

TELANGANA POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA : : HYDERABAD - 82.

T.No.e-15/CEG/SEG-1/KTPS-V&VI/E2A6/TGGENCO/2024-25
KTPS-V&VI - Procurement of 2000kVA, 1600kVA, 630kVA, 11kV/433 Volts, Dyn-11 Dry type Indoor Transformers of Unit-XI at Kothagudem Thermal Power Station Stages V&VI, Paloncha, Bhadradri Kothagudem Dist.-- Value of the works: ₹ 1,15,00,000/. Scheduled Open & Closing Date: 12.09.2024 at 10:00 Hrs. & 03.10.2024 at 15:00 Hrs.

T.No.e-13/CE/O&M/SE/Civil/KTPS-VII/TGGENCO/2024-25
KTPS-VII - Providing Pathways along Line No-3,4 & 5 at inhaul Side (from Karakavagu Bridge to Wagon Tippler) in Railway siding & Marshalling Yard of (1x800 MW) at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist.-Value of the works: ₹ 47,88,120/- Scheduled Open & Closing Date: 31.08.2024 at 18:00 Hrs. & 19.09.2024 at 13:00 Hrs.

T.No.e-16/CEG/SEG-III/BTPS/GT/E8A1/TGGENCO/2024-25
BTPS - Design Manufacture & Supply of Generator Transformer (320 MVA, 16.5/420KV) at Bhadradri Thermal Power Station, Manuguru, Bhadradri Kothagudem Dist. Value of the works ₹ 20,02,22,300/- Scheduled Open & Closing Date: 02.09.2024 at 18:00 Hrs. & 03.10.2024 at 11:00 Hrs.

T.No.e-110/CE(O&M),KTPS-VII/P31/TGGENCO/2024-25
KTPS-VII - Procurement of cooling water Chemicals at Kothagudem Thermal Power Station, Paloncha Stage-VII, Bhadradri Kothagudem Dist. Value of the works ₹ 28,32,000/- Scheduled Open & Closing Date: 29.08.2024 at 15:40 Hrs. & 20.09.2024 at 15:30 Hrs.


T.No.e-114/CE/O&M/KTPS-VII/DE/Pur/P41/TGGENCO/2024-25
KTPS-VII - Procurement of Spares to BD-155 & BD-355 BEML Dozers at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works ₹ 18,58,742/- Scheduled Open & Closing Date: 30.08.2024 at 17:00 Hrs. & 17.09.2024 at 15:30 Hrs.

T.No.e-06/CEG/SEG-I/E9A3/TGGENCO/2024-25
Preparation of Detailed Project Report (DPR) comprising of Technical Specification and commercial aspects for installation of pollution control equipment's for SOx, NOx, SPM and Hg in Stack Emission and reduction of Specific Water Consumption for each Unit of KTPS-V (2x250 MW) & VI Stg (1x500MW) and KTPP (1x500 MW & 1x600MW) to comply with the new norms for MoEF&CC, notification issued by Government of India on 7th Dec, 2015 and subsequent amendments thereon. Value of the works: ₹ 12,00,00,000/. Scheduled Extended upto: 20.09.2024 at 15:00 Hrs.
DIPR RO No.3941-PP/CL/Advt/1/2024-25, Dt: 09.09.2024

మంకీపాక్స్ పాజిటివ్ కేసు నిర్ధారణ

అనుమానిత కేసులో పరీక్షలు
- హరియాణా యువకుడికి వైరస్ సోకినట్లు గుర్తింపు
- ఢిల్లీ ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో కొనసాగుతున్న చికిత్స

న్యూఢిల్లీ: 'అనుమానిత' కేసు మంకీపాక్స్(ఎంపాక్స్) కేసుగానే నిర్ధారణ అయ్యింది. ఎంపాక్స్ వ్యాప్తి అధికంగా ఉన్న ఓ దేశం నుంచి వచ్చిన యువకుడిలో వైరస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన సంగతి తెలిసిందే. అతడికి పరీక్షలు నిర్వహించగా ఎంపాక్స్ పాజిటివ్‌గా తేలిందని కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం వెల్లడించింది. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నాడని, అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఇతర అనారోగ్య లక్షణాలేవీ లేవని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. సదరు యువకుడు ప్రయాణంలో ఉండగా ఎంపాక్స్ వైరస్ సోకినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. అతడిలో వెస్ట్ ఆఫ్రికన్ క్లేడ్–2 ఎంపాక్స్ వైరస్ ఉన్నట్లు గుర్తించామని వివరించింది. ఇది 2022 జూలై నుంచి మన దేశంలో నమోదైన 30 కేసుల్లాంటిదేనని తెలియజేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన క్లేడ్–1 రకం వైరస్ కాదని స్పష్టంచేసింది. క్లేడ్–2 రకం వైరస్ అంతగా ప్రమాదకారి కాదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. బాధితుడు ఐసోలేషన్‌లో ఉన్నాడు కాబట్టి అతడి నుంచి వైరస్ ఇతరులకు సోకే అవకాశం లేదని తెలిపింది.



హరియాణాలోని హిసార్ పట్టణానికి చెందిన 26 ఏళ్ల యువకుడు ఇటీవలే విదేశాల నుంచి తిరిగొచ్చాడు. అతడిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించడంతో శనివారం ఢిల్లీలోని లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అనుమానిత ఎంపాక్స్ కేసుగా కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది. పరీక్షల అనంతరం ఎంపాక్స్ పాజిటివ్‌గా తేలింది. అదే ఆసుపత్రిలో చికిత్స కొనసాగిస్తున్నారు. మరోవైపు అనుమానిత, నిర్ధారిత ఎంపాక్స్ బాధితుల కోసం ఢిల్లీలో మూడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐసోలేషన్ గదులు సిద్ధం చేశారు. ఎంపాక్స్ కేసుల చికిత్స విషయంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రి నోడల్ సెంటర్‌గా సేవలందిస్తోంది. ఇందులో 20 ఐసోలేషన్ గదులు ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలన్న కేంద్ర ఆరోగ్య శాఖ

ఎంపాక్స్ వైరస్ వ్యాప్తిపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేశారు. అనుమానిత ఎంపాక్స్ కేసుల విషయంలో స్క్రీనింగ్, టెస్టింగ్ నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఐసోలేషన్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ మేరకు సోమవా రం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. ఎంపాక్స్‌పై ప్రజల్లో అనుమానాలు తొలగించాలని పేర్కొన్నారు. వైరస్ సోకినా ప్రాణాలకు ముప్పు ఉండదన్న సంగతి తెలియజేయాలని కోరారు.

నిప్పులు చిమ్మే డ్రాగన్ డ్రోన్

ఉక్రెయిన్ అమ్ములపొదిలో కొత్త అస్త్రం



తమ భూభాగాన్ని దురాక్రమించిన రష్యా సైన్యంతో నెలల తరబడి అలుపెరగక పోరాడుతున్న ఉక్రెయిన్ బలగాల చేతికి కొత్త అస్త్రమొచ్చింది. రష్యా స్థావరాలపై భారీ స్థాయిలో మంటలు చిమ్ముతూ, పొగ వెదజల్లే కొత్త తరహా డ్రోన్‌ను ఉక్రెయిన్ యుద్ధరంగంలోకి దింపింది. అటవీప్రాంతాల్లో నక్కిన రష్యా సైనికులు, వారి యుద్ధట్యాంకులపైకి బుల్లి డ్రోన్లు ఏకధాటిగా నిప్పులు వెదజల్లుతున్న వీడియోను ఉక్రెయిన్ రక్షణ శాఖ 'ఎక్స్'లో విడుదలచేయడంతో ఈ డ్రోన్‌ల సంగతి అందరికీ తెల్సింది. రణరీతులను మార్చేస్తున్న అధునాతన డ్రాగన్ డ్రోన్ గురించి అంతటా చర్చమొదలైంది.

ఏమిటీ డ్రాగన్ డ్రోన్?

చైనాలో జానపద గాథల్లో డ్రాగన్ పేరు ప్రఖ్యాతిగాంచింది. నిమ్ములు కక్కుతూ ఆకాశంలో చక్కర్లు కొట్టే డ్రాగన్ గురించి అందరికీ తెలుసు. అచ్చం అలాగే నిప్పులను వెదజల్లుతూ ఆకాశంలో దూసుపోతుంది కాబట్టే ఈ డ్రోన్‌కు డ్రాగన్ అని పేరు పెట్టారు. సంప్రదాయక డ్రోన్లకు భిన్నంగా పనిచేస్తున్న ఈ డ్రోన్లతో రష్యా బలగాలకు నష్టం పెద్దగా ఉంటుందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

ఈ డ్రోన్ ప్రత్యేకత ఏంటి?

థర్మైట్ ఈ డ్రోన్‌లో ఉన్న ఏకైక ఆయుధం. అత్యధికంగా మండే స్వభావమున్న ఖనిజాన్ని, అల్యూమినియం, ఐరన్ ఆక్సైడ్ పొడి, ఇంకొంచెం ఇనుపరజను మిశ్రమాన్ని మందుగుండుగా వాడతారు. అయితే మిగతా డ్రోన్లలాగా ఇది పేలే బాంబును లక్ష్యంగాపైకి జారవిడవదు. తనలోని మిశ్రమాన్ని మండించి తద్వారా విడుదలయ్యే మంటను కొంచెం కొంచెంగా అలా దారి పొడవునా వెదజల్లుకుంటూ పోతుంది. ఊపిరి ఆడకుండా దట్టమైన పొగను సైతం వెదజల్లుతుంది. ద్రవరూపంలోకి వారిన ఖనిజం మండుతూ ఏకంగా 4,000 డిగ్రీ ఫారన్‌హీట్ వేడిని పుట్టిస్తుంది. ఇంతటి వేడి శత్రు స్థావరాలను కాల్చేస్తుంది. ఈ ద్రవఖనిజం మీద పడితే మిలటరీ గ్రేడ్ ఆయుధాలు ఏవైనా కరిగిపోతాయి. సముద్రతీర ప్రాంతాల్లో నీటి అడుగున నక్కిన శత్రువుల ఆయుధాలను ఇది కాల్చేస్తుంది. ఎందుకంటే ఇది నీటిలో కూడా మండగలదు. ఇది మీద పడితే సైనికుల శరీరం, ఎముకలు కాలిపోతాయి. మరణం దాదాపు తథ్యం. ఒకవేళ తృటిలో తప్పించుకున్నా మానసిక సమస్యలు ఎదుర్కొంటారు.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు

థర్మైట్ ఆయుధంతోపాటు అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యంపైకి దూసుకెళ్లడం ఈ డ్రాగన్ డ్రోన్ ప్రత్యేకత. సంప్రదాయక రక్షణ ఉత్పత్తులతో పోలిస్తే ఇది అత్యంత ప్రమాదకరమైందని బ్రిటన్‌లోని యుద్ధవ్యతిరేక దౌత్య సంస్థ 'యాక్షన్ ఆన్ ఆర్మ్‌డ్ వయలెన్స్' పేర్కొంది. దాడి చేయడంతో పాటు నిఘా పనులూ ఇవి ఒకే సమయంలో పూర్తిచేయగలవు. ఎందుకంటే వీటికి స్పష్టమైన కెమెరాలను బిగించారు. యుద్ధట్యాంక్, సైనికుడు, మరేదైనా స్థావరం .. ఇలా శత్రువుకు సంబంధించిన దేనిపై దాడి చేస్తుందో కెమెరాలో ఉక్రెయిన్ బలగాలు స్పష్టంగా చూడొచ్చు.

అంకుర సంస్థ చేతిలో..

ఈ డ్రాగన్ డ్రోన్‌ను ఉక్రెయిన్‌లోని స్టార్టప్ సంస్థ 'స్టీల్ హార్నెట్స్' తయారుచేసినట్లు తెలుస్తోంది. ఈ కంపెనీ తయారుచేసిన శక్తివంతమైన థర్మైట్ సాయంతో 4 మిల్లీమీటర్ల మందమైన లోహ ఉపరితలానికి సైతం కేవలం 10 సెకన్లలో రంధ్రం పడుతుందని తెలుస్తోంది. యుద్ధం మొదలైననాటి నుంచి ఉక్రెయిన్‌కు అన్ని రకాల ఆయుధాలు అందిస్తూ అమెరికా ఆదుకుంటోంది. అమెరికా తన అమ్ములపొదిలోని థర్మైట్ గ్రనేడ్లను ఉక్రెయిన్‌కు ఇస్తోందా లేదా అనేది తెలియాల్సి ఉంది. అమెరికా ఇస్తేగనక రష్యా సైతం ఇలాంటి ఆయుధాలనే ప్రయోగించడం ఖాయం.

- సాక్షి, నేషనల్ డెస్క్

నిరసనలు కేంద్రం కుట్ర: మమత



కోల్‌కతా: వైద్యురాలి హత్యాచారంపై నిరసనల వెనుక కేంద్ర ప్రభుత్వం కుట్ర ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. వామపక్షాలూ ఈ కుట్రలో భాగమయ్యాయన్నారు. సచివాలయం నబన్నాలో సోమవారం ఒక అధికారిక సమీక్షలో మమత ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్.జి.కర్ ఆసుపత్రిలో ఆగస్టు 9న పీజీ ట్రైనీ డాక్టర్ రేప్, హత్య ఉదంతంలో నెలరోజులుగా బెంగాల్‌లో ప్రజలు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. బాధితురాలి తల్లిదండ్రులకు తానెప్పుడూ డబ్బు ఇవ్వజూపలేదని మమత అన్నారు. ఈమేరకు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. దుర్గాపూజ సమీపిస్తున్నందున నిరసనలు వీడి.. పండుగ ఏర్పాట్లు చేపట్టాలని ప్రజలను కోరారు. 'వైద్యురాలి కుటుంబానికి నేనెప్పుడూ డబ్బు ఇవ్వజూపలేదు. అభాండాలు వేస్తున్నారు. కూతురి జ్ఞాపకార్థం ఏదైనా కార్యక్రమం చేపట్టదలిస్తే మా ప్రభుత్వం అండగా ఉంటుందని తల్లిదండ్రులకు చెప్పాను. ఎప్పుడేం మాట్లాడాలో నాకు తెలుసు. నిరసనలు ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ కుట్రే. కొన్ని వామపక్ష పార్టీలకు ఇందులో భాగస్వామ్యముంది. పొరుగుదేశంలో అస్థిరత చూసి.. ఇక్కడా అలాంటి ఆందోళనలు రేకెత్తించాలని కొందరు చూస్తున్నారు. భారత్, బంగ్లాదేశ్‌లు రెండు వేర్వేరు దేశాలని వారు మర్చిపోయారు' అని మమత ధ్వజమెత్తారు. ఆందోళన నేపథ్యంలో కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారని, దుర్గాపూజ వేళ శాంతి భద్రతలపై పట్టున్న అధికారి అవసరం ఉందని దాన్ని తిరస్కరించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా విధుల్లో చేరాలని జూనియర్ డాక్టర్లకు విజ్ఞప్తి చేశారు.

జనం ఏమైపోయినా పట్టించుకోరా?

నేడు సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరండి
- పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు కొనసాగిస్తున్న డాక్టర్లకు సుప్రీంకోర్టు ఆదేశం
- దర్యాప్తు పురోగతిపై 17లోగా నివేదిక ఇవ్వాలని సీబీఐకి గడువు



కేసు విచారిస్తున్న జడ్జీలు జస్టిస్ జేబీ పార్దివాలా, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా ఆందోళన కొనసాగిస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని తేల్చిచెప్పింది. విధులను పక్కన పెట్టి నిరసనలు కొనసాగించడం సరైంది కాదని అభిప్రాయపడింది. సాధారణ ప్రజల అవసరాలను పట్టించుకోకుండా డాక్టర్లు ఇలా విధులకు గైర్హాజరు కావడం ఏమిటని ప్రశ్నించింది. జనం ఏమైపోయినా పట్టించుకోరా? అని నిలదీసింది. విధుల్లో చేరితే ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ఉండబోవని వెల్లడించింది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు మీ భద్రత కోసం తగిన చర్యలు తీసుకుంటారు, వెంటనే వెళ్లి డ్యూటీలో చేరండి అని డాక్టర్లను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఒకవేళ విధులకు దూరంగా ఉంటూ నిరసనలు కొనసాగిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేసింది. బాధితురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించినప్పుడు సంబంధిత డాక్టర్లకు ఇచ్చిన చలాన్ కనిపించకపోవడం పట్ల న్యాయస్థానం అనుమానం వ్యక్తంచేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని సీబీఐని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. చలాన్ మాయం కావడంపై దర్యాప్తు జరపాలని సీబీఐకి సూచించింది. జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యం కేసులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. శవపరీక్ష కోసం ఉపయోగించిన చలాన్ తమ రికార్డుల్లో లేదని చెప్పారు. అయితే, అది ఎక్కడుందో తేల్చాలని ధర్మాసనం పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదులో 14 గంటలు ఆలస్యం కావడం పట్ల మరోసారి అసహనం వ్యక్తం చేసింది. బాధితురాలి ఫోటోలు, వీడియోలను అన్ని రకాల సోషల్ మీడియా వేదికల నుంచి తక్షణమే తొలగించాలని పేర్కొంది.

విరమించబోం: జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ నెలరోజులుగా విధులను బహిష్కరిస్తున్న పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు సమ్మె కొనసాగిస్తామని సోమవారం రాత్రి ప్రకటించారు. విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ తాము సమ్మె విరమించబోమని జూనియర్ డాక్టర్లు ప్రకటించారు.

సీఐఎస్ఎఫ్‌కి వసతులు కల్పించండి

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీల్డ్ కవర్‌లో సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై ఈ నెల 17వ తేదీలోగా తాజా నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. ఈ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోబోమని పేర్కొంది. ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో భద్రతా విధుల్లో చేరిన మూడు కంపెనీల సీఐఎస్ఎఫ్ సిబ్బందికి తగిన వసతి సౌకర్యాలు కల్పించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. వారికి అవసరమైన పరికరాలు ఇవ్వాలని పేర్కొంది.

ఫోరెన్సిక్ నివేదికపై అనుమానాలు

డాక్టర్ ఫోరెన్సిక్ నివేదికపై సీబీఐ అనుమానాలు వ్యక్తం చేసింది. తదుపరి పరీక్షల కోసం బాధితురాలి నమూనాలను ఢిల్లీ–ఎయిమ్స్‌కు పంపించాలని నిర్ణయించినట్లు సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలియజేశారు. డాక్టర్ కేవలం హత్యకు గురైనట్లు నివేదిక తేల్చిందని చెప్పారు. కానీ, ఆమెను లైంగికంగా చిత్రహింసలకు గురిచేసి, అత్యాచారానికి పాల్పడి, ఆపై హత్య చేసినట్లు సాక్ష్యాధారాలు ఉన్నాయని వివరించారు.

అయోధ్య ఆలయ ట్రస్ట్ చీఫ్ పరిస్థితి విషమం



లక్నో: శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్(86) తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో, ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో లక్నోలోని మేదాంత ఆస్పత్రి ఐసీయూలో చేర్పించారు. మూత్ర సంబంధ సమస్యలతో ఆయన బాధపడుతున్నారని, ఆహారం తక్కువగా తీసుకోవడంతో నీరసించి పోయారని ఆస్పత్రి విడుదల చేసిన బులెటిన్ పేర్కొంది. ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిపింది. అయోధ్యలో బృహత్ రామాలయ నిర్మాణ బాధ్యతలను మహంత్ నృత్య గోపాల్ దాస్ సారథ్యంలోని శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు చూసుకుంటున్న విషయం తెలిసిందే.

ట్రంప్, హారిస్ హోరాహోరీ

- స్వల్ప ఆధిక్యత కనబరిచిన ట్రంప్
- న్యూయార్క్ టైమ్స్, సియానా పోల్‌లో వెల్లడి





వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ మధ్య పోరు హోరాహోరీగా కొనసాగుతోందని ఆదివారం విడుదలైన న్యూయార్క్ టైమ్స్, సియానా సర్వేలో వెల్లడైంది. ఆస్తులను ఎక్కువ చేసి చూపి రుణాలు పొందడం, పార్లమెంట్‌పైకి తన మద్దతుదారులను ఉసిగొల్పిన ఘటనల్లో నిందితుడిగా ఉన్నాసరే సగం ఓటర్లు ట్రంప్‌కు మద్దతు పలుకుతున్నట్లు సర్వే పేర్కొంది. దేశవ్యాప్తంగా చూస్తే దాదాపు 48 శాతం మంది ట్రంప్‌కు మద్దతు పలికారు. కమలా హారిస్ విస్కాన్సిన్, మిషిగన్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో ఆధిక్యత చూపారు. నెవడా, జార్జియా, నార్త్ కరోలినా, అరిజోనాలో ఇద్దరికీ గట్టి పోటీ ఉంది. మిషిగన్, విస్కాన్సిన్‌లో హారిస్ ఒక శాతం ఆధిక్యం కనబరిచారని, పెన్సిల్వేనియాలో గట్టి పోటీ నెలకొందని సీబీఎస్ న్యూస్, యూగొ సర్వేలో తేలింది.

బిగ్ డిబేట్‌కు వేళాయే!

వాషింగ్టన్: డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మధ్య అధ్యక్ష చర్చ మంగళవారం జరగనుంది. పలు అంశాలపై తమ వైఖరిని తెలుపుతూ అమెరికన్లను మెప్పించడానికి అధ్యక్ష అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఏబీసీ న్యూస్ ఛానెల్‌లో ఈ బిగ్ డిబేట్ మంగళవారం రాత్రి 9 గంటలకు (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 6:30 గంటలకు) జరగనుంది. ఫిలడెల్ఫియాలోని నేషనల్ కాన్‌స్టిట్యూషన్ సెంటర్‌లో ఏబీసీ న్యూస్ యాంకర్లు డేవిడ్ ముయిర్, లిన్సే డేవిస్ దీన్ని నిర్వహిస్తారు. 90 నిమిషాల పాటు ఈ చర్చ ఉంటుంది. అధ్యక్ష చర్చ నిర్వహించే యాంకర్లు మాత్రమే ప్రశ్నలు అడుగుతారు.

తెలుగు వారిని తక్కువ చేసినట్లే

హిందీతో పోల్చి చూడకూడదు : రాహుల్



వాషింగ్టన్: తెలుగు భాష చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ టెక్సాస్ రాష్ట్రంలో పర్యటించారు. అక్కడ డల్లాస్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో ప్రవాస భారతీయులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. లోక్‌సభలో విపక్షనేతగా ఎన్నికయ్యాక భారతీయ సంతతి ప్రజలతో రాహుల్ మాట్లాడటం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా తెలుగు భాషను ఆయన ప్రస్తావించారు. భాషల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పరోక్షంగా ఆరోపించారు. భారతీయ భాషలు మాట్లాడే ప్రజల మధ్య భేదాభిప్రాయాలకు బీజేపీ కారణమవుతోందని విమర్శించారు. '' ఇప్పుడు మన భారత జాతీయగీతం వినిపిస్తోందని అనుకుందాం. నా వరకైతే గీతం విన్నంత సేపు అన్ని రాష్ట్రాలు సమానం అనే భావన మదిలో నిలిచే ఉంటుంది. ఒక రాష్ట్రం గొప్పదని, మరో రాష్ట్రం వెనుకబడిందని, తక్కువ స్థాయిది అని ఎక్కడా ఉండదు. భారత్ అనేది ఒక దేశం మాత్రమే కాదు. అన్ని రాష్ట్రాల సమాఖ్య. అమెరికాలాగే భారతదేశం కూడా రాష్ట్రాల సమాఖ్య అని గుర్తుంచుకోవాలి. భాషలు, సంప్రదాయాలు కూడా అలాంటివే. ఒక భాష గొప్ప, మరో భాష తక్కువ అనే భావన ఉండకూడదు'' అని పరోక్షంగా బీజేపీకి చురకలంటించారు. '' అమెరికా, భారత రాజ్యాంగాల్లో ఒకటి ఉంది. అదేంటంటే ఏ ఒక్క రాష్ట్రమూ గొప్పది కాదు, ఏ ఒక్క రాష్ట్రమూ తక్కువ కాదు. అన్నీ సమానం. ఏ ఒక్క భాషో, ఏ ఒక్క మతమో గొప్పది కాదు'' అని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ తెలుగు భాష ప్రస్తావన తెచ్చారు. ''ఉదాహరణకు మీరు ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు వాళ్లతో 'మీరు హిందీ వాళ్ల కంటే తక్కువ' అని అన్నారనుకోండి. మనం ఆ రాష్ట్ర ప్రజలను అవమానించినట్లే అవుతుంది. తెలుగు అనేది కేవలం భాష మాత్రమే కాదు. అది ఓ చరిత్ర. సంప్రదాయం, సంగీతం, నృత్యాలు, భిన్న ఆహార అలవాట్లను తనలో ఇముడ్చుకుంది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. హిందీతో పోల్చి తక్కువ చేసి మాట్లాడితే తెలుగు చరిత్ర, అక్కడి సంప్రదాయం, సంస్కృతి, వారి పూర్వీకులను మీరు తక్కువ చేసి మాట్లాడినట్లే'' అని రాహుల్ అన్నారు.

ఇంధన రంగంలో సహకరించుకుందాం

ప్రధాని మోదీ, యూఏఈ యువరాజు నిర్ణయం



న్యూఢిల్లీ: ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అబుదాబీ యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్–నహ్యాన్ సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. భారత్, యూఏఈ మధ్య సంబంధాలతోపాటు ఇరుదేశాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలపై విస్తృతంగా చర్చించారు. గాజాలోని తాజా పరిస్థితులతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇంధన రంగంలో సహకారానికి సంబంధించి భారత్, యూఏఈ నాలుగు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ(అండోక్)– ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్), అండోక్–ఇండియా స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్(ఐఎస్‌పీఆర్ఎల్) మధ్య దీర్ఘకాలం ఇంధన సరఫరాకు ఒప్పందాలు కుదిరాయి. అలాగే అబుదాబీలోని బరాఖా అణువిద్యుత్ కేంద్రం నిర్వహణ కోసం ఎమిరేట్స్ న్యూక్లియర్ ఎనర్జీ కంపెనీ(ఈఎన్ఈసీ)–న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) మధ్య మరో ఒప్పందం కుదిరింది. అండోక్–ఊర్జా భారత్ మధ్య ప్రొడక్షన్ కన్సెషన్ అగ్రిమెంట్ కుదిరింది. అంతే కాకుండా భారత్‌లో ఫుడ్‌పార్కుల ఏర్పాటు కోసం గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం, అబుదాబీ డెవలప్‌మెంట్ హోల్డింగ్ కంపెనీ పీజేఎస్సీ మధ్య ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకున్నాయి. అబుదాబీ యువరాజు భారత పర్యటన కోసం ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం అనంతరం రాజ్‌ఘాట్‌ను సందర్శించాయి. జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్–నహ్యాన్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. వేర్వేరు రంగాల్లో పరస్పర సహకారం ద్వారా భారత్, యూఏఈ మధ్య సంబంధాలు నానాటికీ బలోపేతం అవతుండడం పట్ల రాష్ట్రపతి ఈ సందర్భంగా హర్షం వ్యక్తంచేశారు.

కోర్టులో గొంతు పెంచి అరవొద్దు

లాయర్‌పై జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యం కేసులో సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా బిగ్గరగా అరిచినట్లుగా వాదిస్తున్న ఓ లాయర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు న్యాయమూర్తుల ఎదుట మాట్లాడే పద్ధతి ఇదేనా? అని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తున్న సమయంలో లాయర్ కౌస్తవ్ బాగ్చీ కలుగజేసుకుంటూ ఏదో చెప్పబోయారు. పదేపదే అడ్డుతగిలే ప్రయత్నం చేశారు. ఇదంతా గమనించిన జస్టిస్ చంద్రచూడ్ అతడి తీరును తప్పుపట్టారు. బయట బహిరంగ సభలో జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నారా? లేక కోర్టులో మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. ''రెండు గంటలుగా మీరు ప్రవర్తనను గమనిస్తున్నా. కోర్టులో గొంతు పెంచి అరవొద్దు. గొంతు తగ్గించండి. మీరు ముగ్గురు జడ్జీలను ఉద్దేశించి మాట్లాడుతున్నారు. కోర్టు కార్యకలాపాలను యూట్యూబ్‌లో తిలకించేవారిని ఉద్దేశించి కాదు. ఆ విషయం గుర్తుపెట్టుకోండి'' అని కౌస్తవ్ బాగ్చీని హెచ్చరించారు. దీంతో బాగ్చీ వెనక్కి తగ్గారు. తన ప్రవర్తన పట్ల జస్టిస్ చంద్రచూడ్‌ను క్షమాపణ కోరారు.

కుదరని ఆప్, కాంగ్రెస్ పొత్తు

- హరియాణాలో పది సీట్లు కావాలన్న ఆప్
- ఐదుకు మించి ఇవ్వలేమన్న కాంగ్రెస్
- 20 మందితో తొలి జాబితా విడుదల చేసిన ఆప్

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్, ఆప్ ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. దీంతో ఇరు పార్టీల మధ్య పొత్తు చర్చలు విఫలమయ్యాయి. కురుక్షేత్ర ప్రాంతంలో ఎక్కువ సీట్లు కావాలని ఆప్ పట్టుబట్టింది. మొత్తంగా 10 సీట్లు కావాలని కోరగా ఐదుకు మించి ఇచ్చేది లేదని కాంగ్రెస్ తెగేసి చెప్పింది. దీంతో చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. ఎవరికి వారే పోటీచేయడం ఖాయమైంది. దీంతో ఆప్ 20 మంది అభ్యర్థుల పేర్లతో తొలి జాబితాను సోమవారం విడుదలచేసింది. జాబితా విడుదలపై ఆప్ హరియాణా చీఫ్ సుశీల్ గుప్తా మాట్లాడారు. '' సోమవారం సాయంత్రంకల్లా మీ నిర్ణయం చెప్పాలని కాంగ్రెస్‌కు స్పష్టంచేశాం. అయినా కాంగ్రెస్ నుంచి ఎలాంటి సానుకూల సంకేతాలు రాలేదు. సెప్టెంబర్ 12కల్లా నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుంది. వాళ్ల కోసం నిరీక్షణ ముగిసింది. అందుకే ఒంటరిగా పోటీచేయాలని నిర్ణయించుకున్నాం' అని ఆయన అన్నారు. ఆప్ తొలి జాబితా ప్రకారం ఆప్ సీనియర్ నేత అనురాగ్ ఢండా కలాయత్‌లో పోటీచేస్తారు.

బెడిసికొట్టిన చర్చలు

బీజేపీకి ఉమ్మడిగా ఓడిద్దామని ఆప్, కాంగ్రెస్ భావించాయి. అందులోభాగంగానే పొత్తు కోసం చర్చలకు సిద్ధమయ్యాయి. కొన్ని చోట్ల ఉమ్మడిగా ఒక్కరినే నిలబెట్టాలని భావించాయి. కాంగ్రెస్ నుంచి కేసీ వేణుగోపాల్, దీపక్ బాబరియా, ఆప్ నుంచి రాఘవ్ చద్దా తదితరులు కొద్ది రోజుల క్రితమే చర్చలు మొదలెట్టారు. అయితే కొన్ని స్థానాల్లో మేమంటే మేము పోటీచేస్తామని ఆప్, కాంగ్రెస్ పట్టుబట్టడంతో ఏకాభిప్రాయం కష్టమైంది. హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ ఐదో తేదీన పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 8వ తేదీన ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు.



ప్రమాదంలో దగ్ధమైన ట్యాంకర్

నైజీరియాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ట్రక్కును ఢీకొట్టిన చమురు ట్యాంకర్
- 48 మంది సజీవ దహనం
- 50 మూగజీవాలు సైతం మృతి

నైగర్: నైజీరియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్యాంకర్ పైభాగంలో పశువులను తరలిస్తున్న ఒక చమురు ట్యాంకర్ ఎదురుగా వస్తున్న ప్రయాణికుల ట్రక్కును ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చమురు ట్యాంకర్ పేలి ప్రయాణికులపై, పశువులపై పడటంతో 48 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మంటల్లో 50 మూగజీవాలు సైతం కాలి చనిపోయాయి. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం సాయంత్రం నైజర్ రాష్ట్రంలోని అగాయి ప్రాంతంలో జరిగిందని అగాయి విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఘటనా స్థలం నుంచి మొత్తంగా 48 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్ అబ్దుల్లాహి బాబా తెలిపారు. మృతులను సామూహికంగా ఖననం చేసినట్లు నైజర్ గవర్నర్ మహమ్మద్ బాగో తెలిపారు. నైజీరియాలో ట్రక్కు ప్రమాదాలు నిత్యం జరుగుతుంటాయి. ఒక్క 2020 సంవత్సరంలోనే 1,531 చమురు ట్యాంకర్ల ప్రమాదాలు జరిగినట్లు నైజీరియాలోని ఫెడరల్ రోడ్ సేఫ్టీ సంస్థ తెలిపింది.

జైల్లో ఉన్న నిందితుడు మరో కేసులో ముందస్తు బెయిల్ కోరొచ్చు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: జైల్లో ఉన్న నిందితుడు వేరొక కేసులో ముందస్తు బెయిల్ కోరవచ్చని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. వేరొక కేసులో అతను అరెస్టు కానంతవరకు దాంట్లో ముందస్తు బెయిల్ కోరడానికి అర్హుడేనని వివరించింది. ఒక కేసులో నిందితుడు కస్టడీలో ఉన్నాడనేది.. రెండో కేసులో అతని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సెషన్స్ కోర్టు, హైకోర్టులు నిర్ణయం తీసుకోవడానికి అడ్డంకి కాదని స్పష్టం చేసింది. కస్టడీలో ఉన్నంతమాత్రాన మరో కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని చట్టంలో ఎక్కడా లేదని చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. 'అరెస్టు చేస్తారనే భయమున్నపుడు ముందస్తు బెయిల్‌ను కోరే హక్కును సీఆర్‌పీసీ సెక్షన్ 438 కల్పించింది. ప్రజాస్వామ్యదేశంలో వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ప్రాధాన్యతను గుర్తించడానికే ఈ సెక్షన్ ఉంది. 438 సెక్షన్‌కు ఆంక్షలను పెట్టకూడదు. అలాచేస్తే అది ఈ సెక్షన్ సారాంశానికి, చట్టం ఉద్దేశానికి వ్యతిరేకమే అవుతుంది' అని పేర్కొంది. వివిధ హైకోర్టులు ఈ అంశంలో భిన్న వైఖరులు తీసుకోవడంతో సర్వోన్నత న్యాయస్థానం సోమవారం స్పష్టతనిచ్చింది. జైల్లో ఉన్న నిందితుడు మరోకేసులో ముందస్తు బెయిల్‌ను కోరలేడని రాజస్తాన్, ఢిల్లీ, అలహాబాద్ హైకోర్టులు తీర్పులిచ్చాయి. బాంబే, ఒడిశా హైకోర్టులు ముందస్తు బెయిల్ కోరవచ్చని అభిప్రాయపడ్డాయి. 'నిందితుడికి ముందస్తు బెయిల్ కోరే చట్టబద్ధమైన హక్కుని నిరాకరించడం తగదు. మొదటి కేసులో కస్టడీ నుంచి విడుదలయ్యే దాకా మరో కేసులో ముందస్తు బెయిల్ కోరలేరనడంలో అర్థం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



భార్య కేసు పెట్టిందని...

తనపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు పోలీస్‌స్టేషన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. -8లో



స్టిచ్ ఆన్ లైన్..

స్టిచ్ ఆన్ లైన్.. ఇప్పుడు ఇదే నగరంలో నడుస్తున్న నయా ట్రెండ్. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీదీ ఆన్‌లైన్ మయమైంది. కోవిడ్ తర్వాత ఈ ట్రెండ్ మరింతగా పెరిగిపోయింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.





నెక్లెస్ రోడ్డులో నిమజ్జనోత్సాహం..







సందడి షురూ..

గణనాథుడి నిమజ్జన సందడి షురూ అయింది. మూడవ రోజు కావడంతో సోమవారం నగరవ్యాప్తంగా పలుచోట్ల వినాయకుడి ప్రతిమలను ఆయా కొలనులు, చెరువుల్లో భక్తులు నిమజ్జనం చేశారు. ముఖ్యంగా ట్యాంక్‌బండ్, సరూర్‌నగర్ చెరువుకట్ట, ఉప్పల్ నల్ల చెరువు, ఇతర ప్రాంతాల్లోని చెరువులు, జీహెచ్‌ఎంసీ కొలనుల వద్ద కోలాహలం కన్పించింది. బ్యాండ్ మేళాలు, నృత్యాలు, డీజేలతో తరలివచ్చి భక్తులు నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా నిమజ్జన సందడి కొనసాగింది. - సాక్షి, సిటీబ్యూరో

హెచ్‌ఎండీఏ అధికారుల్లో

'హైడ్రా' గుబులు!

చెరువులు, కుంటలు, పార్కు స్థలాల్లో నిర్మాణాలు

- అప్పట్లో అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులు
- తప్పుడు మ్యాపులు వినియోగించినట్లు ఆరోపణలు
- ఎలాంటి చర్యలు ఉంటాయోనని ఇప్పుడు టెన్షన్

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాలు, లే అవుట్‌లకు గతంలో అడ్డగోలుగా అనుమతులిచ్చిన కొందరు హెచ్‌ఎండీఏ అధికారులను హైడ్రా హడలెత్తిస్తోంది. చెరువులు, కుంటలు, పార్కు స్థలాలను ఆక్రమించుకొని చేపట్టిన భవనాలకు కొందరు అధికారులు నిర్మాణ సంస్థలు, బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తప్పుడు మ్యాపుల ఆధారంగా కొందరు అక్రమాలకు పాల్పడితే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇచ్చిన నిరభ్యంతర పత్రాల ఆధారంగా మరి కొందరు నిర్మాణ అనుమతులను ఇచ్చారు. ఇలా హెచ్‌ఎండీఏ పరిధిలో గత ఐదారేళ్లుగా వందల కొద్దీ అక్రమ కట్టడాలు వెలిశాయి. చివరకు పార్కు స్థలాలను సైతం వదిలిపెట్టకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చేపట్టిన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని అప్పట్లో పలు సంస్థలు, వ్యక్తులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం అలాంటి నిర్మాణాలన్నింటిపైన హైడ్రా బుల్డోజర్‌ను ఎక్కుపెట్టడంతో అధికారుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే అక్రమ నిర్మాణానికి అనుమతినిచ్చిన ఓ సహాయ ప్లానింగ్ అధికారిపైన చర్యలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇదే బాటలో మరి కొందరు అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాల నెపాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపైన నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగానికి చెందిన ఏపీఓలు, జేపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించిన తరువాత మాత్రమే ఫైళ్లు కదులుతాయి. ఈ క్రమంలో సదరు అధికారులు అన్ని అంశాలను సీరియస్‌గా పరిశీలించవలసి ఉంటుంది. ఈ పరిశీలన క్రమంలోనే అక్రమాలకు తెరలేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాత మ్యాపులతో మాయ...

'చెరువులు, కుంటలు, పార్కులు ఉన్న చోట భవనాలు కట్టే క్రమంలో అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో సదరు స్థలం బఫర్‌జోన్‌లో ఉన్నట్లు తేలితే గూగుల్‌మ్యాపులను దరఖాస్తులతో జత చేస్తున్నారు. కొన్ని చోట్ల మాస్టర్‌ప్లాన్ (2013) కంటే ముందు ఉన్న మ్యాపులను పెట్టేస్తున్నారు' అని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధి విస్మయం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ మాత్రమే ప్రామాణికమైనదని చెప్పే అధికారులు అందుకు విరుద్ధంగా పాత మ్యాపులతో అనుమతులకు లైన్‌లు క్లియర్ చేయడం గమనార్హం. మరోవైపు కొందరు ప్లానింగ్ అధికారులే బడా నిర్మాణ సంస్థలకు కన్సల్టెంట్లుగా, లైజనింగ్ అధికారులుగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. పటాన్‌చెరు, ఇస్నాపూర్, దుండిగల్, ఘట్కేసర్, శంషాబాద్, మేడ్చల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ తదితర ప్రాంతాల్లో లేక్‌వ్యూప్రాజెక్టుల పేరిట వెలిసిన పలు అపార్ట్‌మెంట్‌లకు ఇలాంటి అనుమతులు లభించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో కొన్ని నిర్మాణాలను హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులే స్వయంగా గుర్తించినప్పటికీ రకరకాల ఒత్తిళ్ల కారణంగా ఎలాంటి చర్యలను తీసుకోలేకపోయారు. కొందరు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా మౌనంగా ఉండిపోతే మరి కొందరు నిర్మాణ సంస్థల నుంచే వచ్చే ఆఫర్‌లను దృష్టిలో ఉంచుకొని మౌనం వహించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల హైడ్రా అధికారులు అమీన్‌పూర్ లేక్ చుట్టుపక్కల పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలను గుర్తించారు.ఇదే ప్రాంతంలో అప్పట్లో క్షేత్రస్థాయిలో బాధ్యతలు నిర్వహించిన ఓ ఏపీఓ స్థాయి అధికారి ఫ్లాట్‌లను బహుమతులుగా పొంది మ్యాపులను మాయ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

అప్పుడు ఇష్టారాజ్యంగా అడ్డగోలు అనుమతులు ఇచ్చిన అధికారులు, ఉద్యోగులు.. హైడ్రా చర్యలతో ఇప్పుడు బెంబేలెత్తుతున్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. అదే సమయంలో కొత్తగా వచ్చే ఫైళ్లపైన ఆచితూచి ముందుకెళ్తున్నారు. నెలల తరబడి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టేస్తున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో ఉన్నా, లేకున్నా ఎన్‌ఓసీల కోసం షార్ట్‌ఫాల్స్ పెట్టి వేధిస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'అప్పట్లో అనుమతులు ఇచ్చిన ప్రాంతంలోనే ఇప్పుడు ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ కావాలని అడుగుతున్నారు. మున్సిపాలిటీ అనుమతులపైన భవనాలను నిర్మించిన చోట అదనపు అంతస్తుల కోసం దరఖాస్తు చేసుకొంటే రెవెన్యూ, ఇరిగేషన్ అనుమతి కావాలని చెబుతున్నారు. ఇదెక్కడి న్యాయం' అని బాలాపూర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తదితర ప్రాంతాలకు చెందిన భూ యజమానులు ప్రశ్నిస్తున్నారు.



రూ. 10,500 కోట్లివ్వండి!

16వ ఆర్థిక సంఘానికి జీహెచ్‌ఎంసీ వినతి

నగరావసరాలు తెలిపిన మేయర్

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో వేగంగా ఎదుగుతున్న మెట్రో సిటీల్లో ఒకటైన హైదరాబాద్ అభివృద్ధికి తగినన్ని నిధులివ్వాల్సిందిగా జీహెచ్‌ఎంసీ 16వ ఆర్థిక సంఘాన్ని కోరింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభా అవసరాల కనుగుణంగా గడచిన పదేళ్లలో జీహెచ్‌ఎంసీ దాదాపు రూ.18 వేల కోట్లు ఖర్చు చేసిందని, రాబోయే ఐదేళ్లలో మరో రూ.18 వేల కోట్లు అవసరమవుతాయని విన్నవించింది. గత పదేళ్లలో మూలధన వ్యయంగా ఖర్చు చేసిన రూ.18 వేల కోట్లలో రూ.6 వేల కోట్లు అప్పులు చేసినట్లు వివరించింది. నగరంలో ఐటీ, ఫార్మా, ఏవియేషన్, తదితర రంగాల అభివృద్ధితో నగర జనాభా ప్రస్తుతం దాదాపు 1.40 కోట్లకు చేరిందని తెలిపింది. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రానికి హైద రాబాద్ నగరం రాజధాని కావడాన్ని కూడా ప్రస్తావిస్తూ ఇప్పటికే విద్య, వైద్యరంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపింది. రాబోయే రోజుల్లో మరింతగా ఎదగనుందని పేర్కొంది. పెరుగుతున్న జనాభా, మౌలిక సదుపాయాల డిమాండ్స్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌలభ్యం కోసం అప్పులు చేసైనా మౌలిక వసతులు కల్పించినట్లు వివరించింది. మరింతగా పెరుగుతున్న అవసరాలు, మారు తున్న కాలానికనుగుణంగా జీహెచ్‌ఎంసీ ప్రజ లకు కల్పించాల్సిన పౌరసేవలు ఎన్నో ఉన్నాయంటూ రూ.10,500 కోట్లు ఇవ్వాల్సిందిగా జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అర్వింద్ పనగారియాకు రాసిన లేఖలో కోరారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా కేవలం రెండు అంశాలకు(ఘనవ్యర్థాల నిర్వహణ, నేషనల్ క్లీన్ ఎ యిర్ ప్రోగ్రామ్) మాత్రమే నిధులివ్వడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ..దిగువ అంశాలకు నిధులివ్వాల్సిందిగా 16వ ఆర్థికసంఘాన్ని కోరారు.



- నగరంలో ప్రపంచస్థాయి ఇన్నోవేటివ్ , ట్రాన్స్‌ఫార్మాటివ్ మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అందులో భాగంగా మేజర్ రోడ్ల అభివృద్ధి, సమగ్ర రోడ్డు నిర్వహణ, వరద నీటి కాలువలు, నాలాల బలోపేతం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, వాయు కాలుష్యం తగ్గింపు, వరద ముంపు సమస్యల పరిష్కారానికి రూ.7,500 కోట్లు కావాలని కోరారు.
- డంపింగ్ యార్డుల్లో చెత్త కుప్పలకు క్యాపింగ్ బదులు బయో రెమిడియేషన్ లేదా బయోమైనింగ్ చేయాల్సిందిగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించడాన్ని ప్రస్తావిస్తూ అందుకుగాను రూ.1,500 కోట్లు కావాలని విజ్ఞప్తి చేశారు.
- ఎన్నెన్నో వారసత్వ సంపదలకు నిలయమైన హైదరాబాద్ నగరంలోని వారసత్వ కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణలకు రూ.200 కోట్లు .
- చెరువుల పరిరక్షణ, పట్టణ వరదల నిర్వహణలకు రూ.800 కోట్లు.
- జీఐఎస్ ద్వారా నగర మ్యాప్, ప్రాపర్టీ అసెస్‌మెంట్ మేనేజ్‌మెంట్, మాస్టర్‌ప్లాన్ అమలు కార్యక్రమాల కోసం రూ.250 కోట్లు.
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రాఫిక్, సిల్ట్ నిర్వహణ, విపత్తు నిర్వహణలు, ఆయా సేవల కల్పనకు ప్రాథమికంగా రూ.250 కోట్లు.
- వెరసి మొత్తం రూ.10,500 కోట్లిచ్చి ఆదుకోవాల్సిందిగా, నగరాన్ని ఆదరించాల్సిందిగా కోరారు.
- స్వతంత్రంగా లోన్లు తీసుకుంటే ప్రోత్సాహకాలిచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.
- సోమవారం ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం రాజకీయపార్టీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి ఈ అంశాలను తన ప్రసంగంలో ప్రస్తావించారు.

నిమజ్జనాల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ వద్ద మంగళవారం నుంచి గణేష్ విగ్రహాల నిమజ్జనం హడావుడి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆ చుట్టపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 16 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి అర్ధరాత్రి వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. నిమజ్జనాల నేపథ్యంలో సెయిలింగ్ క్లబ్ టీ జంక్షన్, వీవీ స్టాట్యూ, తెలుగుతల్లి జంక్షన్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ చౌరస్తా, నల్లగుట్ట ప్రాంతాల నుంచి వాహనాల మళ్లింపులు ఉండనున్నాయి. ట్రాఫిక్ స్థితిగతులు, నిమజ్జనం రద్దీ ఆధారంగా ఈ మళ్లింపులు, ఆంక్షలు అమలు చేస్తామని ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఎలాంటి సహాయసహకారాలు అవసరమైనా 9010203626 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియాకు ఏకగ్రీవ ఎన్నిక



సాక్షి, సిటీబ్యూరో: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్‌కు లీడర్‌షిప్ టీమ్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం జరిగిన పీఆర్‌ఎస్‌ఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాబోయే రెండేళ్ల కాలానికి హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా డాక్టర్ ఎస్.రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన పీఆర్‌ఎస్‌ఐకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలతో ప్రజా సంబంధాలు, కార్పొరేట్ కమ్యూనికేషన్ నిపుణులను సన్నద్ధం చేయడానికి తాము కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.యాదగిరి వరుసగా మూడోసారి సెక్రటరీగా ఎన్నికయ్యారు. తిరిగి ఎన్నికైన బృందంలో స్పీడ్ ఇన్‌ఫ్రాకు చెందిన బి.మహేష్ వైస్ చైర్మన్‌గా, కాటన్ అసోసియేషన్‌కు చెందిన వి.భుజంగరావు కోశాధికారిగా, సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకురాలు అపర్ణ రాజాన్స్ జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యులలో దక్షిణ మధ్య రైల్వే, ప్రజా సంబంధాల అధికారి రాజేష్ కళ్యాణ్, ఎన్‌ఎండీసీకి చెందిన సి.హెచ్.శ్రీనివాసరావు, పీజేటీఎస్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ వి.సుధాకర్, టి-సాట్స్‌కు చెందిన పి.లింగారెడ్డి, బ్యాంకింగ్‌కు చెందిన పీఎస్సార్ మూర్తి, డాక్టర్ సాజిదా ఖాన్ ఉన్నారు.

విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యం అవసరం



కాచిగూడ: పోటీ ప్రపంచంలో రాణించేందుకు విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. తెలంగాణ యువతి మండలి, శ్రీమతి ఎ.శ్యామలదేవి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ సిల్వర్ జూబ్లీ వేడుకల ముగింపు కార్యక్రమం యువతి మండలి అధ్యక్షురాలు ఆర్.పద్మజ అధ్యక్షతన సోమవారం బర్కత్‌పురలోని కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల సావనీర్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధికి తెలంగాణ యువతి మండలి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తు తరాలవారికి మార్గదర్శకులు కావాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా బి.నరసింహ శర్మ అన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, దిలీప్, తెలంగాణ యువతి మండలి కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధితులు, సామాన్యులతోనే

ఫ్రెండ్లీ పోలీసింగ్

ప్రస్తుతం సిటీ పోలీసు దృష్టంతా గణేష్ ఉత్సవాల పైనే



- డ్రగ్స్ నిరోధానికి ప్రణాళికలు, క్రిమినల్స్‌పై ఉక్కుపాదం
- వెల్లడించిన హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్
- టీజీ సీసీసీలో సోమవారం బాధ్యతల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: 'శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే ప్రజలు హర్షిస్తారు, సేఫ్‌గా ఫీల్ అవుతారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసింగ్ పటిష్టంగా చేస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతాం. సమాజంలో 90 నుంచి 95 శాతం ప్రజలకు పోలీసులతో ఎలాంటి సంబంధం ఉండదు. పోలీసుస్టేషన్ వచ్చే సామాన్యులు, బాధితులతో మాత్రమే ఫ్రెండ్లీగా ఉంటాం' అని హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ అన్నారు. 2021లో అదనపు డీజీ హోదాలో ఉన్న ఆయన మొదటిసారిగా సిటీ పోలీసు కమిషనర్‌గా ఆ ఏడాది డిసెంబర్ 25న బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం డీజీపీ హోదాలో ఉన్న ఆనంద్ రెండోసారి కొత్వాల్ అయ్యారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీసీసీసీ) ఉన్న నగర పోలీసు కమిషనరేట్‌లో అదనపు పోలీసు కమిషనర్ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్ నుంచి ఆనంద్ చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'రెండోసారి హైదరాబాద్ సీపీగా బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. ప్రస్తుతం గణేష్ ఉత్సవాలు జరుగుతున్నాయి. అంతా ఆ ఏర్పాట్లలోనే నిమగ్నమయ్యాం. ఇదే మాకు మొదటి ఛాలెంజ్. సీఎంని కలిసి ఆయన సూచనల మేరకు ముందుకు వెళ్తాం. ఈ నెల 17న సామూహిక నిమజ్జనం, 19న మిలాదున్ నబీ ఊరేగింపు ఉన్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈ రెండు ఒకే రోజు వచ్చాయి. అయితే మత పెద్దల సహకారంతో వాయిదా వేయగలిగాం. నగర పోలీసు పరిభాషలో మిగిలిన బందోబస్తులన్నీ సెమీ, క్వార్టర్ ఫైనల్స్ అయితే... గణేష్ బందోబస్తు అనేది ఫైనల్స్. దీనికి సంబంధించి ఇప్పటికే యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంది. అన్ని ఏర్పాట్లను సమీక్షించి, అధికారులతో చర్చించి ముందుకు వెళతాం. కొన్నాళ్లుగా నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులపై సమీక్షించాలి. ఈ అంశంలో ప్రజలకు మరింత సేవ చేయాల్సి ఉంది. మాదకద్రవ్యాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇప్పటికే టీజీ ఏఎన్‌బీ ఆ కోణంలో పని చేస్తోంది. నగరంలో ఉన్న హెచ్-న్యూ పని తీరును సమీక్షించి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది పార్ట్ ఆఫ్ పోలీసింగ్ అయినప్పటికీ నేరగాళ్లపై మాత్రం ఉక్కుపాదం మోపుతాం' అని పేర్కొన్నారు.

బోధన.. వేదన!

సర్కారు స్కూళ్లలో వెంటాడుతున్న టీచర్ల కొరత

- ఈసారి కూడా విద్యా వాలంటీర్ల నియామకం లేనట్టేనా?
- కొత్త ఉపాధ్యాయుల భర్తీ వరకు అవస్థలే..



సాక్షి, సిటీబ్యూరో: నగర పరిధిలోని సర్కారు బడుల్లో విద్యా బోధన వేదనగా తయారైంది. సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతూనే ఉంది. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి ముందుకు సాగడం లేదు. ఈసారి కూడా విద్యా వాలంటీర్ల నియామకం కేవలం ప్రకటనలకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. కొత్త ఉపాధ్యాయుల భర్తీ వరకు విద్యార్థులకు అవస్థలు తప్పేలా లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల తరబడి టీచర్ల పోస్టులు భర్తీకి నోచుకోకుండా ఉన్నాయి. తరగతి గదుల్లో పాఠాలు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 182 ఉన్నత, 509 ప్రాథమిక, ప్రాథమికోన్నత స్కూళ్లు ఉన్నాయి. మొత్తం పాఠశాలల్లో సుమారు 1,14,607 విద్యార్థులు చదువుతుండగా..వారికి బోధించేందుకు కేవలం 6,200 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోంది. విద్యాశాఖ లెక్కల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 419, ఎస్‌జీటీల్లో 128 ఖాళీలున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు సకాలంలో సిలబస్ పూర్తికాక..సబ్జెక్టులు అర్థం కాక ఆందోళన చెందుతున్నారు.

వాలంటీర్ల భర్తీ అంతేనా..

ఈ విద్యా సంవత్సరం కూడా విద్యా వాలంటీర్ల నియామకం ప్రశ్నార్థకంగా తయారైంది. కోవిడ్‌కు ముందు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 480 విద్యా వలంటీర్లు పనిచేసేవారు. అందులో 45 శాతం మంది హైస్కూళ్లలో ,55 శాతం మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. సింగిల్ టీచర్, జీరో టీచర్ స్కూళ్లలో సైతం సేవలు అందించేవారు. అయితే కరోనా నేపథ్యంలో విద్యావలంటీర్లను అర్ధంతరంగా తొలగించారు. తిరిగి నియామకం లేకుండా పోయింది. కనీసం విద్యా వలంటీర్లు ఉన్నా కొంత పరిస్థితి మెరుగుపడేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి

బోధన ప్రమాణాలు మెరుగుపడాలి

- హాజరు శాతం పెరిగేలా చూడాలి
- కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బస్తీలు, మురికివాడల పేద పిల్లలకు మంచి చదువు చెబితే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం పెంచాలని, పిల్లల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాలల్లో ఈ వారం ఎఫ్‌ఎల్‌ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతం పెంచిన 10 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన 'కాఫీ విత్ కలెక్టర్ 'కార్యక్రమంలో పాల్గొన్నారు. హాజరు శాతం పెంపొందించిన హెడ్మాస్టర్లతో కలిసి కాఫీ సేవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలతో అనుబంధం పెంచుకుని వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. నాంపల్లి సెక్షన్ కాలనీ ఎస్‌ఎస్‌ఆర్ పురం పాఠశాలలో1357 మంది విద్యార్థులకు 1347 విద్యార్థులు హాజరయ్యారని, మిగతా పాఠశాలలు కూడా దీన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈవారం హాజరు శాతం బాగా పెంచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల అమీర్‌పేట్, ఖైరతాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శాంతా రాథోడ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల లంగర్ హౌస్ తెలుగు హెచ్‌ఎం ఉమారాణి, హుమాయున్ నగర్ హెచ్‌ఎం మహమ్మద్ ముజ్జబా అలీ, నల్లకుంట హెచ్‌ఎం సుజాత, ఎల్లారెడ్డిగూడ గూడ హెచ్‌ఎం పెర్సీ, నాంపల్లి సెక్షన్ కాలనీ ఎస్‌ఆర్ ఆర్ పురం హెచ్‌ఎం గీత, రసూల్ పుర పోలీసు లైన్ హెచ్‌ఎం రంగనాథ్, తిరుమలగిరి హెచ్‌ఎం కె.విష్ణువర్ధన్ రెడ్డి, అంబర్‌పేట జినాపబాగ్ హెచ్‌ఎం వందనా శర్మ, అమీర్‌పేట ధరమ్‌కరమ్ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎండీ అంజద్ అలీ ఖాతిబ్‌ల పనితీరు చాలా బాగుందని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణి పాల్గొన్నారు.



హెచ్‌ఎంలతో కలిసి కాఫీ తాగుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

శుభాకాంక్షలు



హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్‌ను సోమవారం నగర పోలీసు అధికారుల సంఘం, సిటీ పోలీసు కో–ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్వాల్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు, సొసైటీ కార్యదర్శి నల్లా శంకర్ రెడ్డి, సభ్యులు జీఎంఎస్ విక్టర్, ఆసిఫ్ ఖాన్, నవీన్ కుమార్, రత్న కుమారి, వినీత్ తదితరులు ఉన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

చిత్రపురి కమిటీలపై ఆర్థిక కేసులు

- సైబరాబాద్ ఎకనామిక్స్ అఫెన్స్ విభాగంలో నమోదు
- 21 మందిపై మూడు ఎఫ్ఐఆర్‌లు



చిత్రపురి హౌసింగ్ సొసైటీ కాలనీ ప్రవేశ ద్వారం

మణికొండ: చిత్రపురి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులపై కేసుల పరంపర కొనసాగుతుంది. ఇప్పటికే రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో కమిటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ ఇటీవల జైలుకు వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. అయినా సొసైటీలో జరిగిన అక్రమాలపై పలువురు బాధితులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవన్నీ ఆర్థిక నేరాలకు సంబంధించినవి కావడంతో పోలీసులు వాటిని సైబరాబాద్ ఎకనామిక్స్ అఫెన్స్(ఈఓడబ్ల్యు) విభాగానికి బదిలీ చేశారు. దీంతో ఈనెల 6న మరో మూడు కేసులను నమోదు చేశారు. అందులో ప్రస్తుత కమిటీ అధ్యక్షుడితో పాటు పాలకకమిటీ మొత్తాన్ని చేర్చారు. గత కమిటీలో అక్రమాలకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న వారిని చేర్చి మొత్తం 21 మందిపై కేసులు నమోదు చేశారు. సొసైటీలో యాక్ట్ 51 ప్రకారం రూ. 116 కోట్ల స్కాం జరిగిందని నివేదికలో పేర్కొనగా, సభ్యులు మాత్రం రూ. 250 కోట్ల వరకు అక్రమాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సొసైటీ మొదట్లో 4213మందికి గృహాలు కేటాయించగా అందుకు విరుద్ధంగా వారిలో కొందరికి ఫ్లాట్లను ఇవ్వకపోగా అక్రమంగా 9162మంది సభ్యులను చేర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏకంగా హెచ్ఎండీఏ అనుమతులకు భిన్నంగా విల్లాలను నిర్మించి మున్సిపాలిటీ నుంచి నోటీసులు అందుకున్నారు.

వీరిపైనే కేసులు ...

సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌యాదవ్, కార్యదర్శి సత్యనారాయణ దొర, సభ్యులు టి. లలిత, అలహరి వీవీ ప్రసాద్, కొంగర రామకృష్ణ, దీప్తి వాజ్‌పేయి, అనిత నిమ్మగడ్డ, రఘు బత్తుల, కాదంబరి కిరణ్, మహానందరెడ్డి, మాజీ సభ్యులు వినోద్‌బాల, జెల్ల మధుసూదన్, పీఎస్ కృష్ణమోహన్‌రెడ్డి, పరుచూరి వెంకటేశ్వర్‌రావు, కె. రాజేశ్వర్‌రెడ్డి, చంద్ర మధు, దేవినేని బ్రహ్మానందరావు, కొల్లి రామకృష్ణ, కె. ఉదయభాస్కర్, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులపై కేసులు నమోదయ్యాయి.

కింది స్థాయి వారికేనా క్రమ‘శిక్ష’ణ!

- వివాదాస్పదమైన ‘మధురానగర్ ఠాణా’ వ్యవహారం
- గత నెలలో ఉన్నతాధికారి, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం
- అధికారి దూషించడంతో ఆవేదనతో తిరగబడిన పీసీ
- కేవలం కానిస్టేబుల్ పైనే చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్
- ఉన్నతాధికారిని ఎందుకు వదిలేశారని ప్రశ్నిస్తున్న సిబ్బంది
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల సంఘం
- కొత్త కొత్వాల్‌పై అధికారులు, సిబ్బంది ఆశలు





సాక్షి, సిటీబ్యూరో: ‘చట్టం ముందు అంతా సమానులే... కొందరు మాత్రం ఎక్కువ సమానులు’ ఈ మాటను తరచూ వింటూనే ఉంటాం. ప్రస్తుతం నగర కమిషనరేట్‌లో మరో మాట జోరుగా వినిపిస్తోంది. అదే ‘పోలీసు విభాగం క్రమశిక్షణ కలిగిన ఫోర్స్... ఆ క్రమశిక్షణ కింది స్థాయి వారికే పరిమితం’.

◆ పశ్చిమ మండల పరిధిలోని మధురానగర్ ఠాణాలో గత నెల 28న చోటు చేసుకున్న పరిణామం, దీనిపై అత్యున్నతాధికారి వ్యవహరించిన తీరే ఇందుకు కారణం. దీనిపై కింది స్థాయి సిబ్బంది తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉన్నతాధికారి–కానిస్టేబుల్ పరస్పరం దూషించుకుంటే కేవలం కింది స్థాయి సిబ్బంది పైనే చర్యలు తీసుకున్నా పోలీసు అధికారుల సంఘం పట్టించుకోకపోవడాన్ని తప్పు పడుతున్నారు. కొత్త కొత్వాల్ సీవీ ఆనంద్ మధురానగర్ ఠాణా కానిస్టేబుల్‌తో పాటు ఇలా అన్యాయమైన ఇతర సిబ్బంది, అధికారులకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వారి విధులూ ఆయనే నిర్వర్తిస్తూ...

వెస్ట్‌జోన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి ‘అన్ని హోదాల ఉద్యోగాలూ’ ఆయనే చేస్తున్నారనే ఆరోపణ ఉంది. ఇందులో భాగంగా మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో గత నెలలో రోల్‌కాల్ నిర్వహించారు. సాధారణంగా ఇలాంటివి ఆ ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉండే ఇన్‌స్పెక్టర్.. కీలక సందర్భాల్లో డివిజన్ ఏసీపీ నిర్వహిస్తుంటారు. దీనికి భిన్నంగా ఈ డ్యూటీ చేయడానికీ రంగంలోకి దిగిన ఉన్నతాధికారి ఆ రోజు ఉదయం 10.30 గంటలకు రోల్‌కాల్ అంటూ సిబ్బందికి ఉదయం 9.19 నిమిషాలకు సమాచారం పంపారు. నిర్దేశిత సమయానికి ఉన్నతాధికారి ఠాణాకు చేరుకున్నారు. అయితే డి.తిరుపాల్ నాయక్ అనే కానిస్టేబుల్ మాత్రం అనివార్య కారణాల వల్ల కొద్దిగా ఆలస్యంగా వచ్చారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సదరు ఉన్నతాధికారి ‘యూజ్ లెస్ ఫెలో... డ్యూటీ ఇలాగేనా చేసేది.. పోలీసు డ్యూటీ అనుకున్నావా..? గాడిదలు కాసే పని అనుకున్నావా..?’ అంటూ తనదైన పంథాలో ఊగిపోతూ దూషించారు.

పేరుకు విచారణ... వేటు కానిస్టేబుల్ పైనే...

ఈ వ్యవహారం అప్పటి అత్యున్నత అధికారి దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. అయితే ఈ విచారణ మొత్తం ఏకపక్షంగా జరిగిందని సిబ్బంది వాపోతున్నారు. తిరుపాల్‌ను మొదట ఉన్నతాధికారి దూషించారని, ఆ తర్వాతే తిరుపాల్ ఎదురు తిరిగాడని తెలిసినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. కేవలం కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారం మొత్తం తెలిసినప్పటికీ నగర పోలీసు అధికారుల సంఘం కూడా పట్టించుకోలేదు. కేవలం ఉన్నతాధికారులను అభినందించడానికి, అత్యున్నతాధికారికి బొకేలు ఇవ్వడానికే సంఘం నేతలు పరిమితం అయ్యారని విమర్శిస్తున్నారు. కనీసం కానిస్టేబుల్‌కు మద్దతుగా ఒక్క ప్రకటన కూడా చేయని సంఘం నేతల వ్యవహారశైలిని తప్పుపడుతున్నారు. ఈ వ్యవహారంపై కొత్త కమిషనర్ అయినా దృష్టి పెట్టాలని, కానిస్టేబుల్ తిరుపాల్‌తో పాటు ఇలా ఇబ్బందులు పాలైన అనేక మంది సిబ్బంది, అధికారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సంజాయిషీ ఇస్తున్నా పట్టించుకోకుండా...

అప్పటి వరకు సాధారణ దుస్తుల్లో ఉన్న సదరు కానిస్టేబుల్ సంజాయిషీ ఇవ్వడానికి ప్రయత్నించినా ఆయన పట్టించుకోలేదు. దీంతో తిరుపాల్ నాయక్ స్టేషన్ గదిలోకి వెళ్లి యూనిఫాం వేసుకుని బయటకు వచ్చారు. అప్పటికే ఆ ఉన్నతాధికారి వ్యవహారశైలిపై అనేక విమర్శలు ఉన్నాయి. వెస్ట్‌జోన్‌లో కానిస్టేబుల్ నుంచి అదనపు డీసీపీ వరకు ఆయన పేరు చెప్తే హడలిపోతారు. ఈ పరిణామాలకు తోడు తీవ్ర ఆవేదనలో ఉన్న తిరుపాల్... ‘నువ్వే యూజ్‌లెస్ ఫెలోరా..! ఎన్ని మాటలు అంటావురా నన్ను... బయట పని చేస్తే ఇంత కంటే ఎక్కువ జీతం వస్తుందిరా.. నా భార్యకు డెలివరీ అయితే ఆమెను చూసుకుంటున్నారా. ఆమెను నేను కాకుంటే ఎవరు చూసుకుంటార్రా..? చెప్తే అర్థం చేసుకోకుండా దూషిస్తున్నావు’ అంటూ తిరిగి ఘాటుగా సమాధానం ఇచ్చారు.

మద్యం మత్తులో..

మహిళా కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కేఎల్‌ఆర్‌నగర్‌కు చెందిన బానోతు రాణి కండక్టర్‌గా పని చేస్తోంది. పటాన్‌చెరు నుంచి మేడ్చల్ వెళ్లే బస్సులో సోమవారం విధులు నిర్వహిస్తుండగా కేపీహెచ్‌బీ బస్టాప్ వద్దకు రాగానే ఓ ప్రయాణికుడు ఆమెను దుర్భాషలాడుతూ మెడను గట్టిగా చేతితో నొక్కాడు. దీంతో రాణి భయభ్రాంతులకు గురై బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఘటన జరిగిన ప్రాంతం కేపీహెచ్‌బీ కావడంతో అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేపీహెచ్‌బీకి బదిలీ చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని జీడిమెట్లకు చెందిన విజయేందర్‌రెడ్డిగా గుర్తించారు. మద్యం మత్తులో దాడి చేసినట్లుగా విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండీఎంఏ డ్రగ్ పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు . ఇద్దరి అరెస్టు



అమీర్‌పేట్: బల్కంపేట్ ప్రాంతంలో సోమవారం ఎక్సైజ్ జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ డగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాలో ఇద్దరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రావిశెట్టి సత్యశివ కుమార్, చిక్కుల జ్యోతి కిరణ్ అనే వ్యక్తులు సోమవారం ఎండీఎంఏ డ్రగ్‌ను వినియోగదారులకు అందించేందుకు వెళుతున్నట్లు సమాచారం అందడంతో బల్కంపల్లి ప్రాంతంలో మాటువేసి ఎక్సైజ్ పోలీసులు బైక్‌పై వస్తున్న వారిని అడ్డుకుని తనిఖీ చేయగా వారి వద్ద 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ పట్టుబడింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా కారంశెట్టి వెంకటసాయి దిలీప్ అనే వ్యక్తి తాను చెప్పిన వ్యక్తులకు డ్రగ్ సరఫరా వస్తే కమీషన్ ఇస్తానని చెప్పినట్టు తెలిపారు. ప్రధాన నిందితుడు దిలీప్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. డ్రగ్స్ పట్టుకున్న సీఐ శిరీష, టీమ్ సభ్యులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య



రంజిత(ఫైల్)

సనత్‌నగర్: భవనంపై నుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ జయచందర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేరళకు చెందిన హరీష్ జి ప్రభు ఎస్‌బీఐలో ఏజీఎంగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య రంజిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెన్నై నుంచి జులైలో హైదరాబాద్‌కు బదిలీపై వచ్చిన ఆయన బేగంపేట ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలోని కోరల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా గత ఏప్రిల్‌లో రంజిత తల్లి మృతి చెందడంతో అప్పటి నుంచి మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆమె భర్త హరీష్ పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. మానసిక సమస్యలతో తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మియాపూర్: కరెంట్ షాక్ తగిలి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దుర్గరామలింగ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా, తొండూరు మండలం సంతకోవూరు గ్రామానికి చెందిన కాంత్‌రెడ్డి (18) ఏడాది క్రితం నగరానికి వచ్చి మదీనాగూడలోని కల్కి గార్డెన్‌లో ఉంటున్న పెద్దనాన్న గంగిరెడ్డి ఇంట్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం అతను స్నానానికి బాత్రూంలో నీళ్లు వేడి చేసేందుకు కరెంట్ హీటర్ ఆన్ చేశాడు. హీటర్ బయటికి తీసేందుకు యత్నించగా కరెంట్ షాక్ తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



శ్రీనివాసులు మృతదేహం



గచ్చిబౌలి: ఈతకు వెళ్లిన ఓ బాలుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బైండ్ల వెంకటేష్, కవిత దంపతులు వట్టినాగులపల్లికి వలస వచ్చి కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు శ్రీనివాసులు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆడుకునేందుకు బయటికి వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చేపట్టినా ఆచూకీ తెలియలేదు. వట్టినాగులపల్లిలో నీళ్ల వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు ఏర్పాటు చేసిన వాటర్ స్టాక్ పాయింట్‌లో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కేసు పెట్టిందని...

- పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం
- కౌన్సెలింగ్ కోసం వచ్చి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- అప్రమత్తమై మంటలు ఆర్పిన పోలీసులు



అఖిల్ (ఫైల్)

సనత్‌నగర్: కౌన్సెలింగ్ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారం గేట్‌కు చెందిన అఖిల్, సరిత ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె. అయితే గత కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్త తనను వేధిస్తున్నాడని సరిత మే 29న తుకారంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసును బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం భార్యాభర్తలను పోలీసులు కౌన్సెలింగ్ నిమిత్తం పీఎస్‌కు పిలిపించారు. అయితే పథకం ప్రకారం అఖిల్ జర్కిన్ జేబులో రహస్యంగా పెట్రోల్ సీసా తీసుకుని వచ్చాడు. కౌన్సెలింగ్‌లో భాగంగా పోలీసులు అఖిల్‌ను మందలించడంతో అతను పెట్రోల్‌ను ఒంటిపై చల్లుకుని నిప్పంటించుకున్నాడు. ఒంటిపై జర్కిన్ ఉండడంతో మెడ భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పి బాధితుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పేకాట దందాలో కొత్త పంథా

- వ్యవస్థీకృతంగా నిర్వహిస్తున్న మహ్మద్ ఖదీర్
- విదేశాలకు పంటర్ల సరఫరా
- కాలాపత్తర్‌లోని శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి
- 22 మంది అరెస్టు, రూ.46 లక్షలు స్వాధీనం





మహ్మద్ ఖదీర్

సాక్షి, సిటీబ్యూరో: రాజధాని కేంద్రంగా వ్యవస్థీకృతంగా జరుగుతున్న పేకాట దందా గుట్టును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. పాతబస్తీలోని కాలాపత్తర్‌లో పేకాట శిబిరంపై సోమవారం దాడి చేసిన అధికారులు ప్రధాన నిందితుడిగా ఉన్న కీలక సూత్రధారితో సహా 22 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.46,55,810 నగదు, సెల్‌ఫోన్లు తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వెల్లడించారు. కాలాపత్తర్‌కు చెందిన మహ్మద్ ఖదీర్ ఇంటర్ చదివి రియల్టర్‌గా మారాడు. పేకాట వ్యసనంతో దాన్నే దందాగా చేసుకోవాలని భావించాడు. నగరంలో పేకాట ఆడే పంటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఇక్కడ పేకాట క్లబ్బులకు అనుమతి లేకపోవడాన్ని క్యాష్ చేసుకోవాలని పథకం వేశాడు. గోవా, నేపాల్, శ్రీలంకలోని క్యాసినోల నిర్వాహకులతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న అతను నగరంలోని పంటర్లను వాటికి పంపడం మొదలెట్టారు. ఈ రకంగా క్యాసినో నిర్వాహకుల నుంచి భారీ మొత్తం కమీషన్ తీసుకునేవాడు. ఇలా విదేశాలకు వెళ్లి పేకాట ఆడే శక్తి లేని వారి కోసం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో అనేక చోట్ల తాత్కాలిక పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నాడు. ఇలా వ్యవస్థీకృతంగా చేస్తున్న ఈ దందాలో తనకు సహకరించడానికి వట్టేపల్లి, హుస్సేనినగర్‌లకు చెందిన మహ్మద్ నయీమ్, షేక్ పాషా, మహ్మద్ మజీద్‌లను సహాయకులుగా ఏర్పాటు చేసుకున్నాడు. వీరు కూడా తమకు పరిచయం ఉన్న పంటర్లను ఈ శిబిరాలకు వచ్చేలా చేస్తున్నారు. వీరు కొన్ని రోజులుగా కాలాపత్తర్‌లోని నర్సారెడ్డి కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు కె.నర్సింహ్మ, జి.ఆంజనేయులు, ఎన్.నవీన్ తమ బృందాలతో ఈ శిబిరంపై దాడి చేశారు. ఖదీర్, నయీమ్, పాషా, మజీద్‌లతో పాటు 18 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.46.55 లక్షల నగదు, పేకలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఓ వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఖదీర్ తన పంటర్ల నుంచి తీసుకునే, వారికి తిరిగి ఇచ్చే డబ్బు లెక్కించడానికి ఏకంగా క్యాష్ కౌంటింగ్ మిషన్ వాడుతుండటం గమనార్హం. ఈ కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాలాపత్తర్ ఠాణాకు అప్పగించారు.

పరువు పోతుందని...

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- చోరీ కేసులో కీలక పాత్ర
- నిందితులు తప్పించుకోవడంలో సహాయం
- డబ్బులు చెల్లించాలని యజమాని ఒత్తిడి



జీడిమెట్ల: దొంగతనంలో కీలక పాత్ర పోషించాడు.. ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.. ఇంటి యజమానితో మంచిగా ఉంటూనే దొంగతనం చేసిన వ్యక్తికి పోలీసుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాడు. తీరా పోలీసులకు అసలు విషయం తెలిసిపోవడంతో పరువు పోయిందని ఓ వైపు, డబ్బులు కట్టాలంటూ యజమాని ఒత్తిడి చేయడంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.. వివరాల్లోకి వెళితే రాజస్థాన్‌కు చెందిన హనుమాన్‌రాం కుత్బుల్లాపూర్ విలేజ్‌లో స్టీల్ సామాన్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈనెల 3న అతడి ఇంట్లో రూ.14లక్షలు చోరీకి గురయ్యాయి. డూప్లికేట్ కీతో బీరువా తెరిచి చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. దీంతో అతను తన దుకాణంలో పనిచేసే కిషన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా కిషన్, రాంలాల్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గుర్తించారు. దీంతో దొంగలను పట్టుకునేందుకు పోలీసులు బాధితుడు హనుమాన్‌రాంతో పాటు అతడిని పనికి కుదిర్చిన అశోక్‌తో సహా రాజస్థాన్ బయలుదేరారు. ఈ క్రమంలో అశోక్ పోలీసుల కదలికలపై కిషన్, రాంలాల్‌లకు ఎప్పటికప్పుడు వాట్సాప్ కాల్స్, మేసేజ్‌ల ద్వారా సమాచారాన్ని అందించాడు. దీంతో అప్రమత్తమైన వారు అక్కడి నుంచి పరారయ్యారు. కిషన్ తల్లిదండ్రుల ద్వారా కిషన్‌ను ఇంటికి రప్పించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తీసుకువచ్చారు కాగా రాంలాల్ పరారీలో ఉన్నాడు. కిష నుంచి రూ.2.70లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

విషమంగా అశోక్ ఆరోగ్యం...

అశోక్‌కు తెలిసే ఈ చోరీ జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో బాధితుడు హనుమాన్‌రాం కిషన్‌ను పనిలో కుదిర్చినందుకు చోరీకి గురైన సొమ్ము కట్టాలంటూ అశోక్‌పై ఒత్తిడి చేశాడు. దీంతో ఆందోళనకు గురైన అశోక్ ఆదివారం ఉదయం జీకేనగర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు.దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని సమీపంలోని అజూదా అస్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా అశోక్ కుటుంబ సభ్యులు అత్మహత్యాయత్నానికి కారణం హనుమాన్‌రాం అని పేర్కొంటూ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడమేగా గాక తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట బైటాయించారు.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న అశోక్

అశోక్‌ను ఇంటరాగేట్ చేయలేదు

ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా అశోక్‌ను పోలీసులు కొట్టినందునే అతను అత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వచ్చిన కథనాలు పచ్చి అబద్ధమన్నారు. అనుమానం ఉంటే పోలీస్‌స్టేషన్‌లోని సీసీ పుటేజీలు పరిశీలించుకోవచ్చునని తెలిపారు.



పేట్‌బషీరాబాద్ పీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న అశోక్ బంధువులు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ Brand New Flats For Resale. Gated Communities. Near Habsiguda, ECIL, Cherlapally, Yapral. Many Options For Every Budget. Call Now. Call: 9502759933 [HA-598]

■ Live Right Next To New Cherlapally Terminus Ready To Occupy 3 BHK Luxury Duplex Flats / Villas on 15 Acres. Clubhouse, Swimmingpool. Call To Visit Ph: 9866669768 [HA-599]

TO-LET

■ హిమాయత్ నగర్ మెయిన్ రోడ్డు 3rd ఫ్లోర్ 1500 Sft, 2nd ఫ్లోర్ 700 Sft కమర్షియల్ అబిడ్స్ గోపి లాడ్జ్ చిరాగ్గల్లి 2 BHK, 1 BHK, సింగిల్ రూమ్స్ అద్దెకు కలవు. ఫోన్: 8712366000, 7799222384 [H-778949]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800506]

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, పర్సనల్ ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్, DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7988242391 [SCA-24000238]

■ మంచి ప్రాఫిట్ గల బిజినెస్‌కి బిస్కెట్స్ & జనరల్ ఐటమ్స్ హోల్ సేల్ చేయడానికి ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్ కావలెను. ఫోన్: 8106734546 [SCA24000237]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796629]

■ Jio Water Plus వినాయక చవితి శుభాకాంక్షలు. మినీ Alkaline Water ప్యాకెట్స్, తక్కువ ధరకే హోల్ సేల్ సప్లై చేయబడును మీ ఏరియాలో. ఫోన్: 9133330089 [HA-14704]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Nayanala Venkat Reddy S/o Pratap Reddy Nayanala, R/o: 1-2-101/2/2, SRI KRISHNA COLONY, BUDVEL VTC: Rajendranagar, District: K.V. Rangareddy, State: Telangana, 500030, changed my name to Nayanala Venkataa Reddy. For All Records. [HA-611]

Wanted

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 17K. Ph : 8520874499, 8520980099 [H-796274]

■ కార్పొరేట్ రియల్ ఎస్టేట్ కంపెనీలో కమీషన్ పద్ధతిపై ప్లాట్స్ సేల్ చేయుటకు-ఎలాంటి పెట్టుబడి లేకుండా, తెలివి తేటలు, శ్రమతో అద్భుతమైన సంపాదన కొరకు 9949332325, 6302114026 [HA-10864]

■ అఖిల్ హోమ్‌కేర్ సర్వీస్ ఇంటి/వంట పని, వృద్ధులకు, చిన్నపిల్లలకు సేవ చేయుటకు హెల్పర్స్, కేర్‌టేకర్స్, ఆయాలు, ఏజెంట్స్ M/F కావలెను. జీతం : 19000 to 25000 రూం+మీల్స్ ఫ్రీ. Ph no: 9949304436 [HA-32971]

■ రిసెప్షన్, టెలికాలర్స్, టైపింగ్, యాంకర్స్, ITI, డిప్లొమా, BE, BTech, MBA ఆ-బాయ్, డ్రైవర్లు, సూ॥వైజర్స్, ఆయాలు, హెల్పర్స్, గార్డెన్ వర్కర్స్, జీ॥ 10k-18k ఫ్రీ రూం+మీల్స్, Hyd, Uppal 9505288777 [H-796341]

■ విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్దే ఉండి, పేషెంట్‌లని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్ టేకర్స్ M/F నర్సులు, RMPలు కావలెను. ✆ 91608 35559, 98850 25559 [B-240]

■ శ్రీ లక్ష్మీ హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు పేషెంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [G-2162]

■ Wanted Male and Female work for MNC company Qul 10th to Degree Sal: 15k to 25k Cont: 9502712418 (Work from Home available) [G-9028]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

అనిల్‌కుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలియజేస్తున్న సురేందర్ యాదవ్

వెంగళరావునగర్: రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం యూసుఫ్‌గూడ సీనియర్ నాయకులు సురేందర్ యాదవ్ తన అనుచరులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత అనిల్‌కుమార్‌కు ఆయన పూలబొకేను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి నుంచి న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అనిల్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

ఖో-ఖో చాంపియన్‌గా కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ జట్టు



బంజారాహిల్స్: ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన 9వ సీనియర్ జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ జట్టు చాంపియన్‌షిప్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా 15 జట్లతో పోటీపడిన కేఎల్‌హెచ్ అథ్లెట్లు ఢిల్లీ టీమ్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో తమ సత్తాను ప్రదర్శించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. చాంపియన్ టీమ్‌లో బీటెక్ అథ్లెట్లు దీక్షిత్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, లోకేష్, వైష్ణవ్, మోహన్, హసన్, సంతోష్, విష్ణురావు, వరుణ్, సాయి నాగరోహిత్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా కెఎల్‌హెచ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు సాధించిన విజయాలను చూసి గర్విస్తున్నట్లు చెప్పారు. ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ఈ విజయాలు స్ఫూర్తినిస్తాయన్నారు. కేఎల్‌హెచ్ విద్యార్థుల నైపుణ్యం, స్ఫూర్తికి ఈ విజయం నిదర్శనమన్నారు.

రూట్స్ కాలేజీలో చాక్లెట్ గణనాథుడు



పంజగుట్ట: సోమాజీగూడలోని రూట్స్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజమెంట్ అండ్ కల్చరల్ ఆర్ట్స్ విద్యార్థులు చాక్లెట్ గణనాథుడిని తయారుచేసి ప్రతిష్ఠించారు. చెఫ్‌లు వందన, అర్జున్‌ల పర్యవేక్షణలో 20 మంది విద్యార్థులు చాక్లెట్‌ను ఉపయోగించి గణేషున్ని అందంగా తీర్చిదిద్దారు. కళాశాల ప్రిన్సిపాల్ నిఖిల్ మాట్లాడుతూ ఈ చాక్లెట్ గణనాథుడికి మూడు రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఆ తర్వాత పాలతో నిమజ్జనం చేసి ఆ పాలను అందరికీ ప్రసాదంగా పంచుతామని వివరించారు.

మంచినీటి బిల్లులపై

- రెండు, మూడు రోజుల నుంచి లైన్‌మెన్ల బిల్లుల అందజేత
- ఒకేసారి పెద్దఎత్తున బిల్లులు రావడంపై ఆందోళన
- 20వేల లీటర్ల ఉచిత మంచినీటి సరఫరాపై సందిగ్ధత

బస్తీవాసుల గగ్గోలు..!



బంజారాహిల్స్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు 20వేల లీటర్ల వరకు ఉచిత మంచినీటి సరఫరాను ప్రకటించింది. జీహెచ్ఎంసీ ఎన్నికల అనంతరం ఈ పథకాన్ని గత ప్రభుత్వం అమలులో పెట్టింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉచిత మంచినీటి పథకంపై సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో గత నెల వరకు అమలు చేస్తూనే వచ్చారు. అయితే గడిచిన రెండు మూడు రోజుల నుంచి బస్తీల్లో ఇంటింటికీ మంచినీటి బిల్లులు చెల్లించాలంటూ లైన్‌మెన్లు బిల్లులు అందిస్తున్నారు. గేట్లకు బిల్లులు అంటించి వెళ్తున్నారు. దీంతో బస్తీల్లో గగ్గోలు మొదలైంది. తాజాగా సోమవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ బస్తీలో సుమారు 300 ఇళ్లకు బిల్లులు చెల్లించాలంటూ బిల్లులు అందజేశారు. ఇదెక్కడి అన్యాయం అంటూ స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 20వేల లీటర్ల నీరు ఒక్కో ఇంటికి ఉచితమని, ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని తెలుపగా తాను ఆధార్ అను సంధానం చేయించుకున్నానని, అయినా సరే రూ.10,849 వాటర్ బిల్లులు చెల్లించాలంటూ తన ఇంటికి బిల్లు అతికించి వెళ్లారని శ్రీనివాస్ అనే నివాసితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రతినెలా బిల్లులు ఇస్తే ఎప్పటికప్పుడు కట్టుకునే వాళ్లమని, ఇప్పుడు ఒకేసారి రూ.10 వేలకు పైగా కట్టాలంటే తాము ఎక్కడి నుంచి తేవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో తాము ప్రతి నెలా బిల్లులు చెల్లించుకునేవాళ్లమని, అప్పుడు తమకు ఆర్థికభారం పెద్దగా ఉండేది కాదని, ఇప్పుడు ఒకేసారి బిల్లులు చెల్లించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని, ఈ విషయంలో అధికారులు దృష్టి సారించాలన్నారు. జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో గత రెండు మూడు రోజుల నుంచి మంచినీటి బిల్లులు వేలల్లో వస్తుండడంతో 20 వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకం లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



ఇంటికి అంటించిన బిల్లును చూపిస్తున్న ఇందిరానగర్‌వాసి

ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి

హరిశంకర్, జీఎం జలమండలి డివిజన్-6

ప్రభుత్వం గుర్తించిన నోటిఫైడ్ స్లమ్ ఏరియాల్లో 80 గజాలలోపు జీప్లస్ 1 ఇల్లు ఉంటే వారికి 20వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకం వర్తిస్తుంది. జీ ప్లస్ 1 కంటే ఎక్కువ అంతస్తులు ఉంటే తప్పనిసరిగా మీటరు బిగించుకోవాల్సి ఉంటుంది. అలాగే వీరు తమ వాటర్ బిల్లులను మీ-సేవా కేంద్రాల్లో ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలి. అప్పుడు ఈ పథకం వర్తిస్తుంది. మీటరు బిగించుకుని ఆధార్ అనుసంధానం చేయించుకుంటేనే ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. 20 వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకం ప్రస్తుతం కొనసాగుతుంది. మా పరిధిలో 90 వేల వరకు డొమెస్టిక్ మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 42 వేల మంది నివాసితులు మాత్రమే అనుసంధానం చేయించుకున్నారు. మిగతా వారు తప్పనిసరిగా చేయించుకోవాలి.

వైద్య రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

నిమ్స్ లో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న డైరెక్టర్ బీరప్ప, సత్యాగౌడ్ తదితరులు

లక్డీకాపూల్ : వైద్య రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పేదలందరికీ ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. సోమవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రజా కవి, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు (రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ) జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి డైరెక్టర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాళోజీ ఆశించినట్లు స్వయం పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ అని కొనియాడుతూ, ఆయన పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడన్నారు. కాళోజీ జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాళోజీకి నివాళులర్పించిన వారిలో నిమ్స్ ఈఆర్ డా. శాంతివీర్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యాగౌడ్, తెలంగాణ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీనివాస్ రావు, లైజనింగ్ ఆఫీసర్ మార్త రమేష్, రాధికా తదితరులున్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో...

బంజారాహిల్స్: ప్రజాకవి, ప్రఖ్యాత రచయిత కాళోజీ నారాయణరావు 110వ జయంతి కార్యక్రమాన్ని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ప్రొఫెసర్ పల్లవీ కాబ్డే, బానోత్‌ధర్మా, బోజు శ్రీనివాస్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్లు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.


కాళోజీకి నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ వర్సిటీ అధ్యాపకులు

అన్యభాషల ఆవశ్యకత ఉన్నా.. మాతృ భాషను మరవొద్దు


జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల నృత్యాలు

ఫిలింనగర్: ప్రజా కవి కాళోజీ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలు, ఆటలు, నాటకాలు, ఏకపాత్రాభినయం, పొడుపు కథలు తదితర అంశాలను ప్రదర్శించారు. నిత్య వ్యవహారాలకు తెలుగు భాషను ఉపయోగించాలని, భాషపై పట్టు సాధించాలని, అపారమైన సాహిత్యం మనకు ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందనే విషయాన్ని తమ ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. అంతకముందు తెలుగు విభాగం అధ్యక్షురాలు రామలక్ష్మీ మాట్లాడుతూ తెలుగు భాష కమ్మనైనదని, దానిని తరతరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. అన్య భాషల ఆవశ్యకత ఎంతగా ఉన్నా మాతృభాషను మరువకూడదని చెప్పారు. తెలుగు భాషా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన ఉపాధ్యాయులను, విద్యార్థులను ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి, డైరెక్టర్ వరలక్ష్మిలు అభినందించారు.

వ్యాపార సముదాయాల కూల్చివేత


కూల్చివేయిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లో వ్యాపార సముదాయాలను జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం కూల్చి వేయించారు. ఎస్పీఆర్‌హిల్స్ రోడ్డు పక్కన ఉన్న హోటల్ తోపాటు కొన్ని తాత్కాలిక డబ్బాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్-19 టౌన్ ప్లానింగ్ అధికారి తమ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా బోరబండ సెక్టార్ ఎస్ఐ సర్దార్ జమాల్ తమ బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

జీవనాధారం 'కూలి'పోయింది : బాధితులు

నిరుపేదలైన తాము చిన్న వ్యాపారాలతో తమ కుటుంబాలను పోషించుకునే వారమని, తమకు జీవనాధారంగా ఉన్న చిన్న హోటళ్లు, డబ్బాలు తొలగించడంతో రోడ్డున పడ్డామని బాధితులు భాగ్యరాజ్, సతీష్, కిట్టమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు.

నిరంజన్‌కు దానం అభినందనలు

బంజారాహిల్స్: బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషన్ కార్యాలయంలో నిరంజన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నిరంజన్ నాయకత్వంలో బీసీ కమిషన్ సమర్థవంతంగా పనిచేస్తూ బీసీలకు తగిన న్యాయం జరుగుతుందన్న అభిప్రాయపడ్డారు.


నిరంజన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



ఫైనాన్స్ వాహనం విక్రయించి.. ఆపై దాడి

వెంగళరావునగర్ : ఫైనాన్స్‌లో ఉన్న వాహనాన్ని విక్రయించడమే కాకుండా యువకుడిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నక్కా సాయి పంజగుట్టలో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. గతనెల పంజగుట్టకు చెందిన శివ యాక్టివా వాహనాన్ని రూ.15 వేలకు సాయికి విక్రయించాడు. అయితే ఎలాంటి డాక్యుమెంట్స్ ఇవ్వలేదు. సాయి ఆ వాహనాన్ని ఉపయోగిస్తుండగా ఈనెల 5వ తేదీన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది వచ్చి ఆ వాహనాన్ని తీసుకున్నారు. ఈ బండికి రూ.50 వేలు ఫైనాన్స్ ఉందని చెప్పారు. ఇదే విషయాన్ని శివకు ఫోన్ చేసి అడగ్గా సాయిపై దుర్భాషలాడాడు. 7వ తేదీ రాత్రి పంజగుట్టలోని వినాయక విగ్రహం వద్దకు సాయి పూజకు వెళ్ళగా శివ అక్కడకు వచ్చి మాట్లాడాలని మైత్రీవనం వద్దకు తీసుకెళ్ళాడు. అక్కడ సాయిని దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. దీంతో సాయికి గాయాలు కాగా మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

వెంగళరావునగర్: మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వెంగళరావునగర్‌కాలనీలో నివాసం ఉండే 30 ఏళ్ళ మహిళ గత నెల 29వ తేదీన ఆమె తన అమ్మమ్మతో కలిసి సాయి బాబా దేవాలయానికి వెళ్ళింది. ఈ క్రమంలో వీరస్వామి అనే వ్యక్తి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథునికి ఘనమైన పూజలు

గణపతి నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మూడో రోజు కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీ విజయగణపతి స్వామిని పసుపు, కుంకుమతో సుందరంగా అలంకరించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో నిర్వహించిన రుద్రాక్షి గణపతి హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ రామమందిరంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

– బంజారాహిల్స్


ప్రతాప్‌నగర్‌లో..


పసుపు, కుంకుమ అలంకరణలో శ్రీ విజయగణపతి


నిమ్స్‌లో పూజలు నిర్వహించిన డైరెక్టర్ బీరప్ప తదితరులు


సోమాజిగూడలో..


ఫిలింనగర్ దైవసన్నిధానంలో..


హెచ్ఎఫ్‌నగర్‌లో..


వినాయకుడికి పూజలు చేస్తున్న డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి


శ్రీ సాయినాథ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


ఇందిరానగర్‌లో..


పూజలో పాల్గొన్న ఆలే శ్యాంకుమార్..

నిమజ్జనోత్సాహం

బుజ్జి గణపయ్యల నిమజ్జనాలు మొదలయ్యాయి. ఇళ్లలో మూడురోజుల పాటు విశేష పూజలందుకున్న చిట్టి గణనాథులను సోమవారం పెద్దుత్తున నగరవాసులు తీసుకొచ్చి ఎన్టీఆర్ మార్గ్‌లోని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు. నిమజ్జన వ్యర్థాలను ప్రత్యేక సిబ్బంది ఎప్పటికప్పుడు బయటికి తరలించారు.

–బంజారాహిల్స్






సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఇళ్ల కోసం కలెక్టరేట్‌కు క్యూ

– ప్రజావాణికి ఇళ్ల కోసం దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్ ప్రజావాణికి ఇళ్ల కోసం పేదల తాకిడి పెరిగింది. కొద్ది వారాలుగా కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లతో పాటు ఇందిరమ్మ ఇళ్లపై పేదలు ఆశలు పెట్టుకున్నారు. దీంతో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున చేరుకొని దరఖాస్తులు సమర్పించుకుంటున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందిన 172 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 129 అర్జీలు గృహ నిర్మాణ సంస్థకు చెందినవి ఉండటం విశేషం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు సుమారు 65వేలకుపైగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేసింది. ఇంకా సుమారు 35 వేలకు పైగా ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే వాటికోసం పెద్ద ఎత్తున దరఖాస్తుల తాకిడి పెరిగింది.

దేశం గర్వించదగ్గ కవి కాళోజీ

– జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: దేశం గర్వించదగ్గ కవుల్లో కాళోజీ ఒకరని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ కాళోజి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాహితీ రంగంలో కాళోజీ చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. తన రచనలతో సమాజాన్ని చైతన్యపరిచారని కొనియాడారు. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పుడు కాళోజీ.. 90వ దశకంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేవారని తెలిపారు. కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మురళీముకుంద్ సభ్యత్వం పునరుద్ధరణ



బంజారాహిల్స్: ది జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ మాజీ కార్యదర్శి ఏ.మురళీముకుంద్ ప్రాథమిక సభ్యత్వం కోర్టు తీర్పు మేరకు పునరుద్ధరణ జరిగింది. ట్రిబ్యునల్ కేసు నంబర్ 10/2023కు సంబంధించి ఈ ఏడాది జూన్ 20న స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు మురళీముకుంద్ ప్రాథమిక సభ్యత్వం తిరిగి కల్పిస్తున్నట్లు ది జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ పాలకమండలి నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఏప్రిల్ 2న జనరల్ బాడీ సమావేశంలో తీవ్ర ఆరోపణలు చేస్తూ మురళీముకుంద్ సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఆ సమావేశంలో జరిగిన తీర్మానాన్ని సవాల్ చేస్తూ మురళీముకుంద్ కో–ఆపరేటివ్ ట్రిబ్యునల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జనరల్‌బాడీ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతూ కో–ఆపరేటివ్ ట్రిబ్యునల్ ఆయన పిటిషన్‌పై ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తీర్పు అమలు చేసి తన సభ్యత్వం పునరుద్ధరించినందుకు సొసైటీ పాలకమండలికి మురళీముకుంద్ ధన్యవాదాలు తెలిపారు.

హైడ్రా పేదలకు గుదిబండ కాకూడదు

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా పేదలకు గుదిబండ కాకూడదని సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. నగరాన్ని ముంచెత్తుతున్న వరదల కారణాల అడ్డంకులను తొలగించడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే రాజకీయాలకతీతంగా హైడ్రా వ్యవహరించాలని, బడాబాబుల ఆక్రమణలన్నింటినీ తొలగించాలని విజ్ఞప్తి చేశారు. పేద, మధ్యతరగతి వాసులకు ప్రత్యామ్నాయం చూపి, ఆ ఆక్రమణలను తొలగించాలన్నారు. తొలగింపులకు ఐపీఎస్ అధికారినే కాకుండా, ఒక ఐఏఎస్, ఒక ప్రజాస్వామికవాదితో కలిపి ఒక కమిటీ వేసి, ఈ ఆక్రమణల నిగ్గు తేల్చాలన్నారు. బడాబాబులు చెరువులు, కుంటలు, వాగులు ఉన్న ప్రాంతాలను మింగేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలాలు, చెరువులు, కాల్వలను ఆక్రమించి అనేక మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొమ్ము చేసుకున్నారని దుయ్యబట్టారు. కొన్నిచోట్ల పేద ప్రజలు నాలల పక్కన బతుకుదెరువు కోసం గుడిసెలు వేసుకుని బతుకుతున్నారని, వారిపై ప్రతాపం చూపవద్దని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌టీయూలో భారీ చేరికలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షులు గూడూరి షద్రక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మమ్మద్ నజీరుద్దీన్, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ శైలేంద్ర కుమార్, మండల అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మమ్మద్ ఖదిరుద్దీన్ సుమారు 150 మంది టీచర్లతో కలిసి మూకుమ్మడిగా ఆ సంఘానికి రాజీనామా చేసి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ)లో చేరారు. నగరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్టీయూలో చేరి సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇఫ్తాకారుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి హబీబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీజీ సదానంద్‌గౌడ్, రాష్ట్ర సహ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మహమ్మద్ అలీ, చార్మినార్ మండల నాయకులు షాహిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వాయిదా

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా వేసినట్లు ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశాలు జరుగుతున్నందున మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు వారు తెలిపారు. ఈ మార్పును అనుసరించి అర్జిదారులు బుధవారం ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

స్కాన్.. స్కామ్

- యూపీఐ ఫ్రాడ్ కేసులో 13 మంది అరెస్ట్
- బజాజ్ ఎలక్ట్రానిక్స్ షో రూమ్‌లే టార్గెట్
- కొనుగోలు చేసిన వస్తువులకు రాజస్తాన్ నుంచి పేమెంట్స్
- బ్యాంకుకు వెళ్లి ఆ పేమెంట్స్‌తో సంబంధం లేదని ఫిర్యాదు
- పేమెంట్ వాపస్ తీసుకొని బజాజ్ ఎలక్ట్రానిక్‌కు కుచ్చుటోపీ
- రూ.4 కోట్ల వరకు స్కామ్ చేసినట్లు గుర్తించిన సీసీఎస్ పోలీసులు



యూపీఐ ఫ్రాడ్ కేసు వివరాలను వెల్లడిస్తున్న సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహ

గచ్చిబౌలి: తెలంగాణలో ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసి రాజస్తాన్ నుంచి స్కానర్ ద్వారా చెల్లింపులు చేసి మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను శంషాబాద్, బాలానగర్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన ముఠా నగరంలోని తమకు తెలిసిన వారి ఇళ్లలో ఉంటూ యూపీఐ ఫ్రాడ్‌కు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్ పరిధిలో ఉన్న బజాజ్ ఎలక్ట్రానిక్స్ షో రూమ్‌లలో విలువైన ఏసీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేస్తారు. పేమెంట్ కోసం క్యూఆర్ కోడ్ ఉన్న స్కానర్‌ను రాజస్తాన్‌లోని తమ వ్యక్తులకు వాట్సాప్ ద్వారా పంపిస్తారు. వెంటనే అక్కడి వ్యక్తి మొత్తం బిల్లును యూపీఐ ద్వారా చెల్లించడంతో వస్తువులను డెలివరీ ఇస్తారు. తన మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌తో మరుసటి రోజు యూపీఐ ద్వారా నగదు పేమెంట్ చేసిన సదరు వ్యక్తి అక్కడి బ్యాంక్‌కు వెళ్లి తెలంగాణలో వస్తువుల కొనుగోలుతో సంబంధం లేదని ఫిర్యాదు చేస్తారు. పేమెంట్‌ను వాపస్ తెప్పించుకుంటాడు. ఇలా మూడు, నాలుగు నెలల నుంచి మాదాపూర్ పీఎస్ పరిధిలో రెండు, కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో రెండు కేసులు, నార్సింగి పీఎస్ పరిధిలో ఒక కేసు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో రెండు కేసులు, మధురానగర్ పీఎస్ పరిధిలో ఒక కేసు, జడ్చర్ల పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదయ్యాయి. శంషాబాద్, బాలానగర్ సీసీఎస్ పోలీసులు, ఆయా పీఎస్‌ల డీఐలు కేసులను చాలెంజ్‌గా తీసుకున్నారు. యూపీఐ చెల్లింపులతో ఫ్రాడ్ చేస్తున్న 13 మంది నిందితులను నగరంలోని వివిధ ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. బజాజ్ ఎలక్ట్రానిక్స్ షో రూమ్‌లలో దాదాపు రూ.4 కోట్లు కొల్లగొట్టారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, రూ.1.72 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.



యూపీఐ ఫ్రాడ్ కేసులో అరెస్ట్ అయిన రాజస్తాన్‌కు చెందిన యువకులు

అంతా యువకులే..

యూపీఐ ఫ్రాడ్ కేసులో అరెస్ట్ అయిన నిందితులు 20 నుంచి 25 ఏళ్లలోపు వారని డీసీపీ తెలిపారు. వారంతా రాజస్తాన్‌లోని జోద్ పరిసర ప్రాంతాల్లో నివసించే వారుగా గుర్తించామన్నారు. సోమ్‌రాజ్, సునీల్, లక్‌రామ్, శర్వాన్, సోమ్‌రాజ్, శివలాల్, రమేష్, శ్రవణ్, పప్పురాం, రాకేష్, అశోక్ కుమార్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. రాజస్తాన్‌కు ప్రత్యేక బృందాలను పంపించి కేసును లోతుగా దర్యాప్తు చేస్తామని డీసీపీ తెలిపారు. యూపీఐ చెల్లింపుల ఫ్రాడ్ కేసులో వెనుక ఉండి నడిపిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేస్తామని చెప్పారు. యూపీఐ ఫ్రాడ్ కేసులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షో రూమ్‌లలో కొనుగోలుతో మొత్తం 1127 లావాదేవీలు జరిగాయన్నారు. నిందితులపై చీటింగ్, చోరీ, బీఎన్ఎస్ ఐటీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, సీసీఎస్ ఏసీపీలు కళింగ రావు, శశాంక్‌రెడ్డి, సీఐలు పవన్, రాజు, డీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం సాయంత్రం 6.30గంటలకు సైఫాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగుతుంది.
- సీఆర్ రావు ఏఐఎంఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ ప్రొఫెసర్ సీఆర్‌రావు 104 జయంతి వేడుకలు గచ్చిబౌలిలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉదయం 10.30 గంటలకు జరుగుతాయి. వేడుకల్లో భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పాల్గొంటారు.
- హైటెక్ సిటీ సత్వ నాలెడ్జ్ సిటీ ఒర్‌వెల్ బ్లాక్–3లో జియోటిస్ సంస్థ ఏర్పాటు చేసిన ఇండియా క్యాపబులిటీ సెంటర్‌ను ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ఉదయం 9.30గంటలకు ప్రారంభించనున్నారు.
- హైటెక్ సిటీ ఫేజ్–2లోని స్కూటర్ ఆఫీసెస్‌లోని క్రెడిట్ సేఫ్ టెక్నాలజీ సంస్థ మధ్యాహ్నం 2.30గంటలకు క్రెడిట్‌సేఫ్ ఫెసిలిటీ ఇన్ హైదరాబాద్‌పై కార్యక్రమాన్ని నిర్వహించనుంది.
- ఏ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్అండ్‌డీ) గచ్చిబౌలి ఐటీసీ కోహినూర్‌లో న్యూ ఆర్ అండ్ డీ హబ్‌పై ఉదయం 11.30గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

శాస్త్రీయ కళలను కాపాడుకుందాం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ: భారత శాస్త్రీయ సంగీత నాట్య కళలను నేటి యువతరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి సంబరాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చిన్నారులను విద్యతో పాటు శాస్త్రీయ నృత్య కళల్లో ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో మన వారసత్వ సంపద అయిన కళలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సినీ నటి కరాటే కళ్యాణి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణ, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.ఏకవీర, డైరెక్టర్ ఎం.వీరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య గురువులకు అవార్డులను అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కలుకురి రాములును సన్మానిస్తున్న మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కాచిగూడ: హౌసింగ్ సొసైటీలో సభ్యులు కాకపోయినా, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు వస్తాయని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా సీనియర్ జర్నలిస్ట్ కలుకురి రాములు ఎన్నికై న సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ నాయకులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. టీయూడబ్ల్యూజే యూనియన్ పోరాటాల ఫలితంగానే జర్నలిస్టుల మూడు సొసైటీలకు పాలకులు స్థలాలు కేటాయించారని అన్నారు. అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, బస్‌పాసులు రావడం కూడా యూనియన్ ఘనతే అని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కొంతమంది జర్నలిస్ట్ యూనియన్ నాయకుల ముసుగులో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోవచ్చని ఆయన తెలిపారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, వెంకట్‌రెడ్డి, రాజేష్, యాదగిరి, శంకర్, శౌకత్ అలీ, బొమ్మగాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నారు. కాళోజీ కవితలు స్ఫూర్తిదాయకంగా, విప్లవాత్మక ఆలోచనలు రేకెత్తించే విధంగా తెలుగు వారి గుండెల్లో దాగి ఉన్నాయని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో అనురాధ, వెంకట్‌రెడ్డి, గీతావాణి, పద్మావతి, యాస్మిన్, రవి, సుధా, దీప్తి, సమత, మాధవి, లత నాగసాయి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలి

– ఎమ్మెల్సీ కోదండరామ్

పంజగుట్ట: గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేసిందని, ఆ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలంటూ తెలంగాణ బీసీ జన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాహుల్‌గాంధీ కులగణన అనే అంశాన్ని ప్రస్తావించడం సాంఘిక విప్లవానికి నాంది అన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని, అదేవిధంగా రాష్ట్రంలో కూడా అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. కోదండరామ్ చొరవ తీసుకుని కాంగ్రెస్ నాయకులతో మాట్లాడాలన్నారు. తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన ప్రభావంతో బీజేపీ 240 సీట్లకు పడిపోయిందన్నారు. టీజేఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీజేఎస్ ఉపాధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, బైరి రమేష్, నిజ్జన రమేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, మహిళా విభాగం కన్వీనర్ లక్ష్మీ, విద్యార్థి నాయకులు మాసంపల్లి అరుణ్‌కుమార్, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆర్కే సాయికుమార్‌ముదిరాజ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు, బీసీ సంఘం నాయకురాలు దేవిక, విద్యుత్ కార్మిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రాకేష్ సాయి, బీజేఎస్ నాయకులు రాంచందర్, ఇస్మాయిల్, సురేష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు ఘనస్వాగతం

- డెఫ్ షూటింగ్‌లో మూడు స్వర్ణాలు



శంషాబాద్: రెండో ప్రపంచ డెఫ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మూడు స్వర్ణాలు సాధించిన ధనుష్ శ్రీకాంత్‌కు క్రీడాకారులు, కుటుంబసభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. జర్మనీలోని హనోవర్‌లో 2024 ప్రపంచ డెఫ్ షూటింగ్‌లో మిక్స్‌డ్ టీం వరల్డ్ రికార్డ్, ఫైనల్ వరల్డ్ రికార్డ్, క్వాలిఫికేషన్ రికార్డులతో మూడు బంగారు పతకాలు సాధించాడు. శంషాబాద్ విమానాశ్రయంలో శ్రీకాంత్ తల్లి ఆశతో పాటు గన్ ఫర్ గ్లోరి అకాడమీ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వం తరపున, స్పోర్ట్స్ అథారిటీ తరపున మాత్రం శ్రీకాంత్‌కు స్వాగతం పలికేందుకు ఎవరూ ఎయిర్‌పోర్టుకు రాలేదు.

ప్రభుత్వం సహకరించాలి..

ఇప్పటికే పలు రికార్డులు సృష్టించినా ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సాయం అందలేదని ధనుష్ శ్రీకాంత్ తల్లి ఆశ అన్నారు. శ్రీకాంత్ ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. రానున్న వరల్డ్ కప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు శ్రీకాంత్ కృషి చేస్తున్నాడన్నాడు.

మచ్చి మార్కెట్ నిర్మించి ఏం లాభం?

అబిడ్స్: బేగంబజార్ మచ్చి మార్కెట్‌ను రూ.10 కోట్లతో నిర్మిస్తే షాపులను ఇంతవరకు ఎందుకు కేటాయించలేదని బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని ప్రశ్నించారు. ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆనంద్‌కుమార్‌గౌడ్ మచ్చి మార్కెట్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితమే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతులమీదుగా బేగంబజార్ మచ్చి మార్కెట్‌ను ప్రారంభించారని, నేటి వరకు ఏ ఒక్క వ్యాపారుడికి దుకాణాలు కేటాయించకపోవడంతో వారంతా రోడ్లపైనే వ్యాపారం చేస్తున్నారని వివరించారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారులు అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో కమిషనర్ ఆమ్రపాలి స్పందించారు. సమస్య తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని, త్వరలోనే బేగంబజార్ మచ్చి మార్కెట్‌ను సందర్శించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జాంబాగ్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అహ్మద్ పాల్గొన్నారు.



వరద సహాయానికి అపోలో వైద్యుడి విరాళం



మంత్రి పొంగులేటికి రూ.లక్ష రశీదును అందజేస్తున్న డాక్టర్ జయప్రకాష్

లక్డీకాపూల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వరదలు వచ్చాయి. దీంతో ఎన్నో కుటుంబాలు అతలాకుతలమయ్యాయి. దీంతో స్పందించిన అపోలో హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్ జే.జయప్రకాష్ సాయి వరద సహాయానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి డిజిటల్ రశీదును సోమవారం అందజేశారు. అందరం కలిసి కమ్యూనిటీగా వచ్చి ప్రభుత్వ సహాయ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో తనికెళ్ల భరణి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో లేఖిని రచయిత్రుల వేదిక, సరసిజ థియేటర్ ఫర్ ఉమెన్ సంయుక్త ఆధ్వర్యంలో రచయిత్రి కామేశ్వరీ రచించిన చాయ్ విత్ చెంగల్వల పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. కార్యక్రమంలో సినీ నటుడు తనికెళ్ల భరణి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సినీ దర్శకుడు ప్రభాకర్ జైని, లేకిని అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మీ, సరస్వతి, అల్లూరి గౌరిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రజలకు చేరువ చేయాలి

జాతీయ ఆర్‌టీఐ ఉద్యమ నాయకుడు నిఖిల్‌డే



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో ప్రజాపాలనకు దూరంగా ఉన్న ప్రజలను చేరువ చేయాల్సిన అవసరం ఉందని జాతీయ ఆర్‌టీఐ ఉద్యమ నాయకుడు నిఖిల్‌డే అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు స్వరాజ్య వేదిక తెలంగాణ అర్బన్ స్ట్రగుల్స్ ఫోరం, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ దళిత బహుజన ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణలో సమాచార హక్కులు, ఫిర్యాదుల పరిష్కార విధానాలపై పబ్లిక్ హియరింగ్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నిఖిల్‌డే మాట్లాడుతూ రాష్ట్రంలో సమాచార హక్కులను బలోపేతం చేయడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రాజస్థాన్‌లోని జన్ సూచ్నా పోర్టల్ తరహాలో సమాచార పోర్టల్‌ను రూపొందించేందుకు, ప్రస్తుతం ఉన్న ఫిర్యాదుల పరిష్కారానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన వివరించారు. రాజస్థాన్ తరహాలో తెలంగాణలో కూడా జవాబుదారి చట్టం అవసరం ఉందన్నారు. జవాబుదారి తనం, ప్రభుత్వ ప్రతిస్పందన ప్రజాస్వామ్యానికి మూలాధారం అని ఆయన అన్నారు. ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ నిర్ణీత కాలపరిమితితో నెలకొన్న ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులకు పబ్లిక్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా పారదర్శకతను మెరుగుపర్చాలన్నారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డాక్టర్ వి.రుక్మిణిరావు, ప్రజాఉద్యమాల జాతీయ వేదిక నాయకులు మీరా సంఘమిత్ర, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ విస్సా కిరణ్, డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్‌తో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి



భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న కోటం రాజు

కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి కోటం రాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను బీమా కంపెనీలకు అప్పగించవద్దని కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి కోటం రాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అందించాలని ఆయన కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటం రాజు మాట్లాడు తూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక వైకల్యం, సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరారు. బీమా కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 23న ఛలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వంగూరి రాములు, జి.అనురాధ, ఐలయ్య, శివ, నాగయ్య, కుమార్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 10, సెప్టెంబర్, 2024

స్టిచ్ ఆన్‌లైన్.. ఇప్పుడు ఇదే నగరంలో నడుస్తున్న నయా ట్రెండ్.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిదీ ఆన్‌లైన్ మయమైంది. కరోనా తర్వాత ఈ ట్రెండ్ మరింతగా పెరిగిపోయింది. ఫుడ్‌తో పాటు మనకు కావాల్సిన వస్తువు ఏదైనా.. ఒక్క క్లిక్‌తో ఇంటికే డెలివరీ ఇస్తున్నారు. నిత్యావసర సరుకులు మొదలుకుని.. ఎలక్ట్రానిక్స్ వరకూ.. టూవీలర్స్ మొదలుకుని.. ఫోర్ వీలర్స్ వరకూ.. ఆఖరికి మెడికల్ సపోర్ట్ కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చేసింది.. దీంతో బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంట్లోనే అన్ని పనులూ చక్కబెట్టేసుకుంటున్నారు. ఇది బిజీబిజీగా ఉండేవారికి ఎంతో వెసులుబాటుగా మారింది. బట్టలు కూడా దాదాపు ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ పెట్టేసుకుంటున్నారు. అయితే మనకు నచ్చిన, మన శరీరానికి నప్పే బట్టలు, కొలతల విషయంలో ఇబ్బంది తలెత్తుతోంది. దీనికి పరిష్కారంగానే స్టిచ్ ఆన్‌లైన్ ట్రెండ్ అవుతోంది. దీంతో మనం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న సమయానికి ఇంటికి వచ్చి కొలతలు తీసుకుని, నచ్చిన మెటీరియల్‌తో నచ్చిన మోడల్‌తో స్టిచ్చింగ్ చేసి, ఇంటికే డెలివరీ ఇస్తున్నారు. దీని గురించిన మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో



‘ఫ్రీడమ్ అండ్ ఇట్స్ డైవర్స్ పర్స్‌పెక్టివ్’

సాక్షి, సిటీబ్యూరో: ‘ఫ్రీడమ్ అండ్ ఇట్స్ డైవర్స్ పర్స్‌పెక్టివ్’ అనే అంశం పై మెహిదీపట్నంలోని క్రైమోన్ మాంటిస్సోరి లైఫ్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. స్వేచ్ఛ దాని విభిన్న దృక్కోణాలు అనే ఇతివృత్తాన్ని అన్వేషిస్తూ ప్రదర్శించిన విద్యార్థుల సృజనాత్మక వివరణ స్ఫూర్తిని నింపింది. ఇందులో భాగంగా యువ కళాకారులు పెయింటింగ్‌లు, పద్యాలు, ఇన్‌స్టాలేషన్‌లతో సహా విభిన్న కళారూపాలను ఉపయోగించి స్వేచ్ఛపై తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తం చేశారు. మానవ హక్కులపై ప్రత్యేకంగా రూపొందించిన బ్యానర్‌తో పాటు స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహిళలను గౌరవించే వాల్ పెయింటింగ్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా క్రైమోన్ మాంటిస్సోరి డైరెక్టర్ వినయా దేవి మాట్లాడుతూ.. స్వేచ్ఛ అనేది ప్రతి వ్యక్తికీ విభిన్న విషయాలను సూచిస్తుంది. వ్యక్తిగత విషయాలను నిర్ణయించుకోవడం మొదలు, ఒంటరిగా ప్రయాణించడం, ఆక్రమణదారుల బారి నుంచి స్వతంత్ర దేశంగా రూపుదిద్దుకోవడం వరకూ ఈ స్వేచ్ఛ సమ్మిళితమై ఉంటుందని అన్నారు.

టాకింగ్ డిజిటల్ సురక్ష ఫర్ టీన్స్



సాక్షి, సిటీబ్యూరో: ‘యువత శ్రేయస్సు పట్ల తమకు నిబద్ధత ఉందని, తమ యాప్‌ల వినియోగదారులకు సురక్షితమైన అనుభవాన్ని అందించడానికి, ఆన్‌లైన్‌లో ప్రమాదాలను నివారించడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని’ భారత్‌లో ఇన్‌స్టాగ్రామ్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ నటాషా జోగ్ తెలిపారు. సోషల్ మీడియా వేదిక మెటా ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ‘టాకింగ్ డిజిటల్ సురక్ష ఫర్ టీన్స్’ పేరిట రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్‌లో యూజర్ల భద్రత దృష్ట్యా తాము పరిచయం చేసిన తమ భద్రతా సాధనాలు, ఫీచర్ల గురించిన వివరాలను విశదీకరించారు. అదేవిధంగా టీనేజర్లు సోషల్ మీడియా ప్రయాణ అనుభవాలను కూడా పంచుకున్న ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి నగరంలో ఎంపిక చేసిన 10 పాఠశాలల ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

సందేశాత్మకంగా ‘దిక్సూచి’..



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలే ప్రధాన అంశంగా తెరకెక్కుతున్న మైక్రో ఫిల్మ్ ‘దిక్సూచి’ పోస్టర్‌ను చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ., మహిళల పై పెరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహ కల్పించే ఉద్దేశంతో, ఆడవారిని గౌరవించడం పాఠశాల దశనుండే అలవర్చాలన్నదే లక్ష్యమన్నారు. మహిళా వైద్యురాలికి జరిగిన అఘాయిత్యంపై లఘు చిత్రం నిర్మించడం ద్వారా సమాజానికి మంచి మెసేజ్ ఇస్తున్నారన్నారు. సందేశాత్మక చిత్రానికి దర్శకత్వం వహించడం సంతోషంగా ఉందని చిత్ర దర్శకులు శివ నాగరాజ్ అన్నారు. నెలాఖరులోగా ఈ లఘు చిత్రం ప్రేక్షకులకు అందుబాటులోకి వస్తుందని నిర్మాత కొమటి రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ చిత్రంలో యూట్యూబ్ నటులు ఆర్యన్ వర్మ, దినేష్, క్రేజీ బాయ్స్ సాయి నటించగా కేతన్, నవీన్ కుమార్, మణికంఠ, హర్ష భరద్వాజ్ జాఫర్, వంశీకృష్ణ సాంకేతిక సహకారం అందించారు.



- ఇంటి నుంచి కదలకుండా కొలతలు..
- డోర్ డెలివరీ ఆఫ్టర్ స్టిచ్ వెసులుబాటు..
- నగరంలో పెరుగుతున్న ఆన్‌లైన్ టైలరింగ్..
- కరోనా తర్వాత వెల్లువలా నయా ట్రెండ్

స్టిచ్ ఆన్‌లైన్..

ఒక క్లిక్‌తో వండర్‌ఫుల్ స్టిచ్చింగ్!

కొత్త ఒక వింత.. పాత ఒక రోత.. అనే సామెత టైలరింగ్‌కు సరిగ్గా నప్పుతుంది. ఒకప్పుడు బట్టలు కుట్టించుకోవాలంటే.. టైలరింగ్ షాపుకు వెళ్లి కొలతలు ఇచ్చి కుట్టించుకునేవారు. ఆ తర్వాత రెడీమేడ్స్ రాకతో టైలరింగ్ మరుగున పడిపోయింది.. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అయితే సరిగ్గా ఇదే కాన్సెప్ట్‌ని ఉపయోగించి ఆన్‌లైన్ స్టిచ్చింగ్ పేరుతో టైలరింగ్‌కి నూతన హంగులు అద్దారు. అంతేకాదు.. ఇదే ప్రస్తుతం నగరంలో ట్రెండ్‌గా నడుస్తోంది.. అసలేంటీ ఆన్‌లైన్ స్టిచ్చింగ్? అనుకుంటున్నారా.. అదేనండి.. మనకు వెసులుబాటు ఉన్న సమయంలో మనం బుక్ చేసుకున్న ప్రాంతానికే వచ్చి కొలతలు తీసుకుని నచ్చిన మోడల్స్‌లో స్టిచ్ చేసి ఇంటికే డెలివరీ ఇస్తారన్నమాట!

కరోనా తర్వాత..

మన అవసరాలే ఆవిష్కరణలకు మూలం అన్నట్లు.. కరోనా సమయంలో ఎంతోమందికి కొత్త కొత్త ఐడియాలు పుట్టుకొచ్చాయి. ఆ సమయంలో అవసరాల ద్వారా కలిగిన.. అవకాశాలను పలువురు అందిపుచ్చుకున్నారు. ఆ ఆలోచనలను స్టార్టప్స్‌గా మలచి వ్యాపారంలో రాణిస్తున్నారు. చాలామందికి టైలరింగ్ అనగానే ఓ కుట్టు మెషీన్ పెట్టుకుని వచ్చిన వారికి బట్టలు కుట్టడం. కానీ కొందరు మాత్రం ఇందుకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. ఇంటి నుంచి బయటకు రాలేని వారు, గర్భిణులకు బట్టలు కుట్టించుకోవడం కష్టం అవుతుంది. అందుకే వారి కోసం ఆన్‌లైన్ టైలరింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కమాటలో సింపుల్‌గా చెప్పాలంటే క్లౌడ్ టైలరింగ్ అన్నమాట. దీనికే రకరకాల పేర్లు కూడా ఉన్నాయి.. ఆన్‌లైన్ స్టిచ్, కాల్ దర్జీ, మై టైలర్ ఇలా చాలా వరకూ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్స్ వినియోగదారులకు తమ సేవలను అందిస్తున్నాయి.

మోడ్రన్, ట్రెండీ ఫ్యాషన్ డిజైన్స్‌ను ఈ తరం యువత ఎంతగానో ఇష్టపడుతోంది. సోషల్ మీడియాలో నిత్యం వైరల్‌గా మారే వినూత్న డిజైన్లను సైతం వ్యక్తిగతంగా రూపొందించుకోవడానికి ఈ క్లౌడ్ టైలరింగ్ వారధిగా మారింది. తమకు నచ్చిన డిజైన్‌ల ఫొటోలు లేదా సోషల్ మీడియా లింక్స్ ఈ ఆన్‌లైన్ టైలర్లకు షేర్ చేస్తే చాలు.. వారి సైజులకు తగినట్టుగా వారు కోరుకున్న ఫ్యాషన్ వేర్ ఇంటికొచ్చేస్తున్నాయి. అంతేకాకుండా అభిమాన సెలబ్రిటీలు ధరించినటువంటి ఫ్యాషన్ హంగులను అనుకరించాలనుకునే ఔత్సాహికులకు కూడా ఈ ఆన్‌లైన్ వేదిక స్వర్గధామంలా మారింది. ఫ్యామిలీ డాక్టర్, ఫ్యామిలీ లాయర్ మాదిరిగా.. సెలబ్రిటీలకు పర్సనల్ డిజైనర్ మాదిరిగా.. మనకూ ఓ పర్సనల్ టైలర్ అనే చెప్పొచ్చు. అందుకే ఈ ఆన్‌లైన్ టైలరింగ్ ట్రెండ్‌గా మారుతోంది.

అభిరుచికి అనుగుణంగా..



సెలబ్రిటీలకు సౌలభ్యంగా..

సినీతారలు, బుల్లితెర సెలబ్రిటీలు మొదలు ఈ మధ్య ఫేమస్ అవుతున్న సోషల్‌మీడియా సెలబ్రిటీలు ఎందరో. వీరు షాపింగ్ వెళ్లాలన్నా, బొటిక్స్‌లో స్టిచ్చింగ్ కోసం వెళ్లాలన్నా అక్కడి పరిస్థితులు సందడిగా మారతాయి. అంతేకాకుండా వారికి కూడా అభిమానుల నుంచి కాస్త ఇబ్బందికర వాతావరణం ఎదురౌతోంది. ఇలాంటి తరుణంలో ఈ ఆన్‌లైన్ స్టిచ్చింగ్ సెలబ్రిటీలకు సౌలభ్యంగా మారిందని పలువురు తారలు అభిప్రాయపడుతున్నారు. పేజ్ త్రీ పీపుల్ సైతం ఈ ఒరవడికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

డిజైనర్ డ్రెస్సులు సైతం..

సోషల్ మీడియాలోనో లేదా సినిమాలోనో ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫాంలోనో.. లేదా నచ్చిన హీరో, హీరోయిన్ వేసుకున్న డ్రెస్ కావాలనిపిస్తే.. ఆ క్లిప్ తీసి ఆన్‌లైన్ టైలరింగ్‌కి పంపిస్తే.. సరిగ్గా అదే తరహాలో డెలివరీ ఇస్తారు. అయితే.. అలాంటి డ్రెస్ కావాలని దగ్గర్లోని టైలర్ దగ్గరికి వెళ్తే.. వారికి ఆ తరహా స్టిచ్చింగ్ రాకపోవచ్చు.. మరీ పెద్ద పెద్ద బొటిక్‌లకు వెళ్తే కాస్త డబ్బులు ఎక్కువ చెల్లించుకోవాల్సి రావచ్చు.. అసలు అలాంటివి ఎక్కడ ఉంటాయో కూడా తెలియకపోవచ్చు.. తెలిసినా దూరాభారం అవ్వొచ్చు.. అందుకే వీటన్నింటికీ ఒకే ఒక్క పరిష్కారం ఆన్‌లైన్ టైలరింగ్. మనకు నచ్చిన డిజైన్.. మనకు నప్పేలా.. మనకు ఫిట్ అయ్యేలా కుట్టిస్తారు.

ఆన్‌లైన్‌లో ఎలా సాధ్యం?

టైలరింగ్ అంటే మన శరీర కొలతలు తీసుకోవాల్సి ఉంటుంది. మరి ఆన్‌లైన్ ద్వారా ఎలా సాధ్యం అనే కదా డౌటు. ఆన్‌లైన్‌లో మనకు కావాల్సిన డిజైన్ డ్రెస్, జాకెట్, కుర్తా ఇలా ఇంకేదైనా సరే.. ఆర్డర్ పెడితే చాలు. మన ఇంటి దగ్గరలో ఉన్న వాళ్ల స్టోర్ నుంచి ఓ వ్యక్తి వచ్చి కొలతలు తీసుకుంటారు. ఆ తర్వాత అన్ని పనులు చకచకా చేసేస్తారు. మనకు నచ్చిన డ్రెస్.. చెప్పిన టైంలో మన ఇంటికి వచ్చేస్తుంది. ఇందు కోసం కొలతలు తీసుకునేందుకు లోకల్ టైలర్స్‌తో ఒప్పందం చేసుకోవడం.. లేదా సిబ్బందిని నియమించుకోవడం చేస్తారు. లేని పక్షంలో కస్టమర్లు అందించిన సైజులకు అనుగుణంగా వారు కోరుకున్న డిజైన్లను రూపొందించి పంపిస్తారు.



ఒంటరిగా లాంగ్ డ్రైవ్‌కు సిద్ధమే

- ఆటో గేర్ కార్ల కొనుగోలుకు ఆసక్తి
- అంతర్జాతీయ లైసెన్సు కోసం దరఖాస్తుల వెల్లువ

ఆటో గేర్‌పై ఆసక్తి..

సిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. నిత్యం వివిధ పనులకు కారు నడిపించే మహిళలు ఆటో గేర్ సిస్టంతో పనిచేసే కార్లు కొనేందుకు ఇష్టపడుతున్నారు. కారు గేర్లు మార్చే సమయంలో కాస్త ఒత్తిడికి గురవుతున్నామని, ఆటో గేర్ అయితే ఆ సమస్య ఉండదని అభిప్రాయపడుతున్నారు.

వుయ్ కెన్ డ్రైవ్..



సాహస యాత్రికులు నగర మహిళలు



మహిళలు కారులో బయటకు వెళ్లాలంటే వాహనాన్ని నడిపించేందుకు డ్రైవర్, లేదా కుటుంబ సభ్యుల్లో ఒకరు ఉండాలని ఆలోచించే రోజులు పోయాయి. మారుతున్న కాలంతో పాటు మధ్యతరగతి మహిళల ఆలోచనా విధానంలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎక్కువ మంది మహిళల్లో మేము ఇండిపెండెంట్‌గా ఉండాలనే ఆలోచన కనిపిస్తోంది. అందుకు అనుగుణంగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. హైదరాబాద్ వంటి ట్రాఫిక్ ఉండే నగరాల్లో ప్రొఫెషనల్ డ్రైవర్స్, మగవారితో తామేమీ తీసిపోమన్నంత పర్ఫెక్ట్ డ్రైవర్స్‌గా తయారవుతున్నారు. ఇంటి నుంచి కార్యాలయానికి, ఇతర అవసరాలకు స్వతహాగా కార్లు నడిపే మహిళల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో పాటు లాంగ్ డ్రైవింగ్‌కు కూడా తామేమీ తీసిపోమంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు సాహస మహిళల గురించి మరిన్ని విషయాలు.. - సాక్షి, సిటీబ్యూరో

నగరంలో డ్రైవింగ్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో కేవలం పురుషులు మాత్రమే లైసెన్స్ కోసం అధికంగా క్యూ కట్టేవారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా లైసెన్స్ కోసం మహిళలు కూడా క్యూ కడుతున్నారు. గతంలో ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్ తెచ్చుకోవాలన్నా కొంత ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం స్థానిక లైసెన్స్‌తో పాటు అంతర్జాతీయ లైసెన్స్ కోసం దరకాస్తు చేసుకుంటున్న మహిళల సంఖ్య భారీగా పెరుగుతోందని రవాణా శాఖాధికారులు పేర్కొంటున్నారు. నిత్యం ఉద్యోగం, ఇంటి పనుల్లో బిజీగా ఉండే మహిళలు సెలవులు వచ్చాయంటే చాలు ఆధ్యాత్మిక ప్రదేశాలు, విహార యాత్రలకు సిద్ధమైపోతున్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో తాము ఎంచుకున్న గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

కుటుంబ సభ్యులతో కలసి నేను నాకారు డ్రైవ్ చేసేందుకు ఇష్టపడతాను. వివిధ పనులపై బెంగళూరు, తిరుపతి, అరకు, చెన్నై, అమలాపురం తదితర ప్రాంతాలకు వెళ్లాను. సందర్భాను సారం ప్లాన్ చేసుకుంటాం. ఊరు వెళ్లినప్పుడు ట్రాక్టర్‌తో పొలం దున్నుతాను. పాతబస్తీలో తిరగాలంటే సరదాగా అద్దెకు ఆటో తీసుకుని నేనే

ఇండిపెండెంట్‌గా ఉండాలి..

నడిపించుకుంటూ పోతాను. ఇంట్లో ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ బిజీగా ఉంటున్నారు. పిల్లల్ని పాఠశాలకు తీసుకెళ్లి, తీసుకురావడం నుంచి మొదలు నిత్యం సమయంతో పోటీ పడాల్సి వస్తుంది. ఆ సమయంలో వేరొకరికోసం ఎదురుచూస్తే సమయం వృథా అవుతుంది. ఇపుడు మహిళలు ఇండిపెండెంట్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లాలనుకున్నప్పుడు మరొకరిపై ఆధారపడితే ఒత్తిడి ఉంటుంది. అదే స్వతహాగా డ్రైవింగ్ నేర్చుకుంటే సమయంతో పనిలేకుండా సౌలభ్యాన్నిబట్టి ప్లాన్ చేసుకోవచ్చు. తెలంగాణ పరిధిలో షీ టీం సభ్యులు ఆపదలో ఆదుకుంటున్నారన్న భరోసా కల్పిస్తున్నారు.
- అంజలి, హైదరాబాద్



ఇటీవలే మున్నార్ వెళ్లాం..

ఎక్కడకు వెళ్లినా నేనే కారు నడిపించుకుంటాను. ఇటీవల కుటుంబ సభ్యులతో కలసి సెలవుల్లో మున్నార్, చీరాల వెళ్లాం. రోజువారీ విధులకు ఆఫీస్‌కు వెళ్లడం, పిల్లలను పాఠశాలలో దించడం, నిత్యావసరాలు తీసుకురావడం, ఇంట్లో ఇతర పనులకు స్వతహాగా డ్రైవ్ చేసుకోవడం అలవాటు. ఉద్యోగాల్లో బిజీగా ఉంటాం. ఒకరు ఫ్రీగా ఉన్నప్పుడు మరొకరికి ఏదోఒక పని ఉంటుంది. ఇద్దరం ఖాళీ అయినప్పుడు బయటకు వెళ్లాలంటే కొన్నింటిని వదులుకోవాల్సి వస్తోంది.
- మిచెల్, ఎల్‌బీ నగర్



కార్ రేసింగ్ అంటే ఇష్టం..

లాంగ్ డ్రైవ్‌కు వెళ్లడం, కార్ రేసింగ్ అంటే ఇష్టం.. 15 ఏళ్లుగా కారు నడిపిస్తున్నాను. వైజాగ్ వెళ్లడానికి రైల్ టికెట్లు దొరకడం కష్టంగా మారుతోంది. రెండు, మూడు రోజులు సెలవులు వస్తే పిల్లలను తీసుకుని కారులో వైజాగ్ వెళుతుంటాం. కారు నేర్చుకున్న కొత్తలో ఒక సారి యాక్సిడెంట్ అయ్యింది. రెండు నెలలు భయమేసింది. తరువాత ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లా. ఒంటరిగా ఉత్తరప్రదేశ్‌లోని బబీనా మా అత్తగారింటికి వెళ్లాలనుకుంటే ఫ్లైట్‌కి వెళ్లిపోతాను. కుటుంబ సభ్యులంతా కలసి వెళ్లాలనుకుంటే మాత్రం కారు తీసుకెళతాను.
- దీప్తి, వనస్థలిపురం

టయోటా నుంచి టీ కేర్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకేఎం) వినూత్న కార్యక్రమం టీ కేర్ ని ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. వినియోగదారుల కేంద్రీకృత విధానం ద్వారా నడిచే, ‘టీ కేర్’ అనే కార్యక్రమంలో భాగంగా టీ డెలివర్, టీ గ్లాస్, టీ వెబ్, టీ అసిస్ట్, టీ సెక్యూర్, టీ సాథ్, టీ చాయిస్, టీ ఇన్‌స్పెక్ట్.. తదితర సేవలు కార్ల యజమానులకు అందుతాయని, కొనుగోలు–వినియోగదారుల మధ్య దీర్ఘకాలిక అనుబంధానికి మార్గంగా ఇది ఉపకరిస్తుందని వివరించారు.



కేబీఆర్ కూడలికి చేర్యాల సొబగులు

కూడళ్ల సుందరీకరణలో భాగంగా సంస్కృతికి అద్దంపట్టే రీతిలో కళలకు పెద్దపీట వేస్తూ జీహెచ్‌ఎంసీ అధికారులు కళాత్మక ఆకృతులను ఏర్పాటు చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తాలో 400 సంవత్సరాల చరిత్ర కలిగిన చేర్యాల ఆర్ట్ ఉట్టిపడే రీతిలో ఇక్కడ బొమ్మలు కొలువుదీరాయి. చౌరస్తాను శోభాయమానంగా.. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చేర్యాల కళకు గుర్తింపుతో పాటు కూడలికే ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చాయి. - బంజారాహిల్స్



ముంచింది ప్రభుత్వమే

వరద వస్తుందని చెప్పి ఉంటే జాగ్రత్త పడేవాళ్లం • ప్రభుత్వానికి తెలిసినా మాకు సమాచారం ఇవ్వలేదు

- వరద ఇంటిలోకి వచ్చేవరకూ మాకు తెలియదు
- ఇంటిలోని సామాన్లు వరదపాలు
- పుస్తకాలు, సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయి
- ఆటోలు, బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలు దెబ్బ తిన్నాయి
- ఇళ్లు దెబ్బతిన్నాయి... వైరింగ్‌లతోసహా అన్నీ పాడైపోయాయి
- సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం
- చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడుతున్న వరద బాధితులు
- ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో నష్టపోయిన 1.45లక్షల కుటుంబాలు


ఇంకా వరద ముంపులోనే ఉన్న విజయవాడలోని కండ్రిక


విజయవాడ వాంబే కాలనీలోని ఓ స్కూల్‌లో బురదలో పేరుకుపోయిన పుస్తకాలు

సాక్షి, లబ్బీపేట : అజిత్‌సింగ్ నగర్ ఫ్లైఓవర్‌పై రిక్షాలో సామాన్లు తరలిస్తున్న గుండు కృష్ణ ఓ ఆటో డ్రైవర్. మరి ఇంటి సామాన్లు రిక్షాలో ఎందుకు తీసుకువెళుతున్నారనే కదా మీ సందేహం? విజయవాడలోని కండ్రికలో నివసించే కృష్ణ, ఆయన సోదరుడు ఫైనాన్స్‌లో తీసుకున్న రెండు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బుడమేరు వరద ముంచెత్తడంతో రెండు ఆటోలు వరదలో పూర్తిగా మునిగి దెబ్బతిన్నాయి. ఆటోకు నెలకు రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు ఫైనాన్స్ కంపెనీకి కిస్తీ చెల్లించాలి. ఆటోలను బాగు చేయించాలంటే ఆటోకు రూ.లక్ష చొప్పున మొత్తం రెండు లక్షలు అవుతుందంటున్నారు. ఇన్సూరెన్స్ రాదని చెప్పారు. ఇంట్లో వంట సామాన్లు, ఫ్రిజ్, గ్యాస్ స్టౌ, పిల్లల పుస్తకాలు, ఫర్నిచర్ అన్నీ దెబ్బతిన్నాయి. మళ్లీ అవి కొనాలంటే రూ.50 వేల దాకా ఖర్చవుతుంది. వంట దినుసులైతే తడిసి ముద్దయి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ఇంట్లో కరెంటు వైరింగ్ దెబ్బతింది. ఇల్లు కూడా మరమ్మతులకు గురైంది. ఇవన్నీ బాగు చేయించుకోవాలంటే కనీసం మరో రూ.లక్ష అవుతుంది. ఆటో నడిపి రోజూ రూ.వెయ్యి దాకా సంపాదించేవారు.

ఇప్పుడు సంపాదన లేదు. వరద తగ్గాక ఆటోలు బాగు చేయించుకుని రోడ్డెక్కితేనే మళ్లీ ఉపాధి లభించేది! అదెన్ని రోజులు పడుతుందో తెలియదు. కనీసం నెల రోజుల పాటు ఉపాధికి దూరం కానున్నాడు. మరోవైపు ఫైనాన్స్ కంపెనీకి కిస్తీలు కట్టాలి. ఇలా కృష్ణ కుటుంబానికి దాదాపు రూ.నాలుగు లక్షల దాకా నష్టం వాటిల్లింది. కేవలం వరద వస్తుందని ప్రభుత్వం ముందుగా చెప్పకపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా అంత నష్టపోయింది. అదే ప్రభుత్వం అప్రమత్తం చేసి ఉంటే కనీసం ఇంట్లో ముఖ్యమైన సామాన్లు, పిల్లల పుస్తకాలు, మరికొన్ని వస్తువులను రెండు ఆటోల్లో తరలించి ఈ గండం నుంచి గట్టెక్కేవాళ్లమని కృష్ణ ఆక్రోశిస్తున్నాడు.

కనీస బాధ్యత ఉండొద్దా?

సింగ్ నగర్ డాబా కొట్ల జంక్షన్‌లో రెండంతస్తుల ఇల్లు నిర్మించుకున్న వ్యాపారి కె.నాగేశ్వరరావును పలకరించగానే ఆయన ఆవేదన కట్టలు తెంచుకుంది. 'ఆదివారం ఉదయం హఠాత్తుగా వరద నీరు ముంచెత్తడంతో మొదటి అంతస్తుకు చేరి ప్రాణాలు దక్కించుకున్నాం. ఇంటి ముందున్న మూడు కార్లు వరద నీటిలో మునిగిపోయి పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంట్లోకి నీళ్లొచ్చి సామాన్లు అన్నీ తడిసిపోయాయి. మా అల్లుడు రూ.5 వేలు డబ్బులిచ్చి సోమవారం ఉదయం పడవ తేవడంతో ప్రాణాలతో బయటపడ్డాం. ఆరు రోజులుగా ఓ హోటల్‌లో ఉంటున్నాం. మా కుటుంబానికి రూ.25 లక్షలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం మాకు ఏం సాయం చేస్తుంది..? వరద వస్తుందని మాకు ముందుగానే చెప్పి ఉంటే ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునేవాళ్లం. ప్రభుత్వం ప్రజల పట్ల కనీస బాధ్యతతో వ్యవహరించలేదు' అని నిర్వేదం వ్యక్తం చేశాడు.

నిర్లక్ష్యం ఖరీదు.. 60 నిండుప్రాణాలు

విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో దాదాపు 1.45 లక్షల కుటుంబాల దుస్థితికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఏకంగా 7 లక్షల మంది వరద కష్టాలివి! బుడమేరుకు భారీ వరద వస్తోందని తెలిసి కూడా ప్రజలకు సమాచారం ఇవ్వకుండా.. సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా ప్రభుత్వం అత్యంత బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన ఫలితం ఇదీ. ఇందుకు సామాన్యులు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది. సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి దాదాపు 60 నిండు ప్రాణాలు బలయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించిన అధికారిక లెక్కల ప్రకారమే 1.45 లక్షల కుటుంబాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరదలు ముంచెత్తిన వారం రోజుల తరువాత కూడా ఏకంగా 7 లక్షల మంది వరద ముంపులోనే కొట్టుమిట్టాడుతున్నారు. ఇక 1.45 లక్షల కుటుంబాలకు కలిగిన నష్టం ఎంతన్నది అంచనాలకే అందడం లేదన్నది కఠోర వాస్తవం. లక్షల ఇళ్లు వరదకు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేయించుకునేందుకు భారీగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వరదకు ఇళ్లల్లో వంట సామాగ్రి వరదలో కొట్టుకుపోయింది. గ్యాస్ స్టౌ, వంట సామాన్లు, ఫర్నిచర్, ఇతర విలువైన వస్తువులు దెబ్బతిన్నాయి. లక్షలాది ఇళ్లల్లో పిల్లల పుస్తకాలు, సర్టిఫికెట్లు తడిసిపోయాయి. ఎంతోమంది సర్టిఫికెట్లు, బ్యాంకు పుస్తకాలు, దస్తావేజులు వరదల్లో కొట్టుకుపోయాయి. లక్షల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, సరుకు రవాణా వాహనాలు, ఇతర వాహనాలు వారం రోజులుగా వరద ముంపులోనే ఉండటంతో బురద పేరుకుపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి.

ప్రకృతి వైపరీత్యంతో దెబ్బతిన్న ఆ వాహనాలకు బీమా వర్తించదని బీమా కంపెనీలు ఇప్పటికే తేల్చి చెప్పేశాయి. 'మా పెంకుటిల్లు వరదకు మునిగిపోయింది. వరద తగ్గిన తరువాత కరెంట్ వైరింగ్ పూర్తిగా మార్పించుకోవాలి. లేదంటే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. వైరింగ్‌కు కనీసం రూ.50 వేలు అవుతుంది'అని రాజీవ్‌నగర్‌కు చెందిన లక్ష్మీ నారాయణ తన కష్టాలను చెప్పుకొచ్చారు. ఇక రోజు కూలీలు, కార్మికులకు ఇప్పటికే వారం రోజులుగా ఉపాధి లేదు. మరో 15 రోజుల వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దాంతో సంపాదన లేక ...చేతిలో డబ్బులు లేక పేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సగటున ఒక్కో కుటుంబానికి కనీసం రూ.3 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులే వ్యాఖ్యానిస్తుండటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. సగటు అంచనాల ప్రకారం 1.45 లక్షల కుటుంబాలకు రూ.10 వేల కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించిందన్నది ప్రాథమిక అంచనా.

చంద్రబాబుకే పునరావాసం

ఏకంగా 7 లక్షల మందిని వరదకు వదిలేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఒక్కరికి మాత్రం పక్కాగా పునరావాసం కల్పించింది. అదెవరో తెలుసా..? ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబానికి! నది గర్భంలో నిర్మించిన చంద్రబాబు కరకట్ట బంగ్లాను వరద ముంచెత్తనుందనే హెచ్చరికలతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఆ ఇంటిని కాపాడేందుకు కనీసం అప్రమత్తం చేయకుండా వెలగలేరు రెగ్యులేటర్ వద్ద గేట్లు అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా ఎత్తేశారు. అంతకుముందే చంద్రబాబు కుటుంబం హుటాహుటిన కరకట్ట బంగ్లాను ఖాళీ చేసేసింది. చంద్రబాబు స్వయంగా విజయవాడ కలెక్టరేట్‌కు మకాం మార్చారు. అన్ని సౌకర్యాలతో కూడిన తన వాహనాన్ని కలెక్టరేట్ వద్దే పార్క్ చేయించుకున్నారు. వారం రోజులుగా అన్ని సౌకర్యాలతో అక్కడే ఉంటున్నారు. ఇక మంత్రి లోకేశ్ కూడా కరకట్ట బంగ్లాను వీడి విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు షిఫ్ట్ అయ్యారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నివాసానికి తరలి వెళ్లిపోయారు. వరదలతో ఏమాత్రం ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు కుటుంబాన్ని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించిందన్నది స్పష్టమవుతోంది. మరోవైపు 1.45 లక్షల కుటుంబాలను మాత్రం వారి ఖర్మకు వదిలేసింది.

ఫార్మా సిటీలో పరిశోధనలకు ప్రాధాన్యం!

- కాలుష్య రహితంగా ఉండేలా ఏర్పాటు చేస్తాం
- ముచ్చర్ల గ్రీన్ ఫార్మాసిటీపై మంత్రి శ్రీధర్‌బాబుతో కలసి సీఎం రేవంత్ సమీక్ష
- పేరొందిన కంపెనీలు పెట్టుబడుల కోసం వస్తున్నాయి
- త్వరలోనే సంప్రదింపులు జరిపి ఒప్పందాలు చేసుకుంటామని వెల్లడి


సమీక్షలో రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కాలుష్య రహిత ఫార్మాసిటీలో ఔషధాల ఉత్పత్తితోపాటు పరిశోధనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యాంటీ బయాటిక్స్, ఫెర్మెంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మెటిక్స్ సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేలా అందులో కోర్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలసి గ్రీన్ ఫార్మాసిటీపై సీఎం రేవంత్ సమీక్షించారు. గ్రీన్ ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన వారికి దాని అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

వేగంగా సదుపాయాల కల్పన

రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌జిల్లాల పరిధిలోని ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మాసిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని సమీక్షలో సీఎం సూచించారు. ఇందుకోసం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని.. పర్యావరణహితంగా, కాలుష్య రహితంగా ఉండేలా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. గ్రీన్ ఫార్మాసిటీ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగు నీరు, విద్యుత్, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ – లైఫ్ సైన్సెస్ కంపెనీలకు గ్రీన్ ఫార్మాసిటీ సింగిల్ స్టాప్ గా ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇది బాబు క్షుద్ర రాజకీయం

వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే బోట్ల డ్రామా


మంత్రి లోకేశ్‌తో నిందితుడు ఉషాద్రి

- అరెస్టైన ఇద్దరూ వైఎస్సార్‌సీపీ వారేనంటూ అనైతిక ప్రచారం
- అలాగే చెప్పాలని వారికి పోలీసుల వేధింపులు
- వాస్తవానికి వారిద్దరూ టీడీపీ వారే: మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏటూరునాగారంలోనూ నేలకొరిగిన 50 వేల చెట్లు



సాక్షి, హైదరాబాద్ : సుడిగాలులు సృష్టించిన బీభత్సంతో ఏటూరునాగారంలోనూ దాదాపు 50 వేల చెట్లు నెలకొరిగినట్టుగా తాజా వార్తలు స్పష్టం చేస్తున్నాయి. ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ పరిధిలో ఇది జరిగినట్టు గుర్తించారు. కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో ఈ అడవి లోపలికి అటవీ అధికారులు, సిబ్బంది వెళ్లలేకపోయారు. రెండురోజుల క్రితం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అక్కడకు వెళ్లిన సిబ్బందికి జరిగిన నష్టంపై ఓ అంచనాకు వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. ములుగు జిల్లాలోని మేడారం–తాడ్వాయి, ఏటూరునాగారం అడవుల పరిధిలోని 400 హెక్టార్లలో మొత్తంగా 1.20 లక్షల చెట్లు నేలకూలినట్టుగా ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. అయితే సుడిగాలులతో వాటిల్లిన నష్టంపై 'ఎన్యుమరేషన్' పూర్తి చేసేందుకు మళ్లీ ఒకటి, రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు అడ్డంకిగా మారాయి. గత నెల 31 రాత్రి బలమైన గాలులు, వర్షాలతో తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే మార్గంలో వేలాది చెట్లు విరిగి పడి కనిపించాయి. అదేరోజు ఏటూరునాగారంలోనూ సుడిగాలుల ప్రభావంతో ఈ విధ్వంసం చోటు చేసుకున్నట్టు అధికారులు గుర్తించారు. దీనిపై అటవీ అధికారులు విచారణ చేపట్టారు. మేడారం ప్రాంతంలో చెట్లు వలయాకార విస్తీర్ణంలో కూలగా.. దొడ్ల, కొత్తూరు ప్రాంతంలో సరళరేఖ గీసినట్టు వరుసగా చెట్లన్నీ నేలకూలడాన్ని గుర్తించారు. సుడిగాలుల బీభత్సంపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) ఆధ్వర్యంలో 'క్లౌడ్ ఫార్మేషన్'పై ఉపగ్రహ చిత్రాలు, సమాచారం అందాక సాంకేతిక అంశాల ఆధారంగా ఆయా అంశాలపై స్పష్టత వస్తుందని అటవీశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు అస్వస్థత



గచ్చిబౌలి (హైదరాబాద్): మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు అస్వస్థత కలిగింది. ఆయన వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండగా నానక్‌రాంగూడలోని స్టార్ హాస్పిటల్‌లో చేర్పించారు. మిజోరం నుంచి విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. సోమవారం ఉదయం ఎయిర్‌పోర్ట్ నుంచి గ్రీన్ చానెల్ ద్వారా స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. హరిబాబుకు డాక్టర్లు చికిత్స అందిస్తున్నారని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే స్టార్ హాస్పిటల్ ఆయన ఆరోగ్యంపై ఎలాంటి బులెటిన్ విడుదల చేయలేదు.

చాకలి ఐలమ్మ వీరమాత: సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చిట్యాల ఐలమ్మ అని, ఆమె స్ఫూర్తితోనే అనేక మంది మహిళలు ఆనాటి భూ పోరాటానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీఎం ఆమె కనబరిచిన ధైర్య సాహసాలను స్మరించుకున్నారు. తన భూమి కోసం, ఆధిపత్య వర్గాల భూఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలకు ఐలమ్మ మద్దతుగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాలుపంచుకుని మహిళలను ఐక్యం చేసిన స్ఫూర్తి ప్రదాత ఐలమ్మ అని కీర్తించారు. ఐలమ్మ బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీక అని సీఎం కొనియాడారు.

విద్యా సంస్థల్లో కులం పదాన్ని తొలగించాలి

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థల్లో కులం పదాన్ని తొలగించాలని, వివిధ రకాల గురుకులాల పేర్లను తొలగించి ఇంటిగ్రేటెడ్ గురుకులాలుగా మార్చాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ పాపని నాగరాజు డిమాండ్ చేశారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అన్ని ప్రైవేటు రంగాల్లో కూడా వర్తింపచేయాలని కోరారు. అదే విధంగా గ్రంథాలయాల ఆధునీకీకరణకు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండలానికి రెండు మోడల్ స్కూళ్లు నిర్మించాలని వెల్లడించారు. ప్రతి హాస్టల్, గురుకులాలను ఎంపీ, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు విధిగా తనిఖీ చేయాలని, వాటిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యాన్ని ఆపేయాలని, పాఠశాల, గురుకులాలతో పాటు యూనివర్సిటీ స్థాయి విద్యా సంస్థల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు.

స్థానిక సంస్థల నిధులు పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

బృందం సమావేశమైంది. ఈ భేటీలో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నిజామాబాద్ మేయర్ నీతూ కిరణ్, పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ కౌన్సిల్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుతోపాటు 17 మున్సిపాలిటీల సభ్యులు పాల్గొన్నారు. ఈ భేటీకి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సీడీఎంఏ గౌతం హాజరయ్యారు. అనంతరం గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలతో కేంద్ర ఆర్థిక సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులు సంకెపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూ నాయక్, మల్కుడ్ రమేశ్, కార్యదర్శి స్మితా సబర్వాల్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక సాయం పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం వ్యాపార వాణిజ్య సంస్థలైన అలీఫ్, ఫిక్కీ, సీఐఐ ప్రతినిధులతో ఆర్థిక సంఘం భేటీ అయింది.

ఆర్థికంగా తోడ్పడాలన్న పార్టీల ప్రతినిధులు

ఆర్థిక సంఘం బృందంతో వివిధ పార్టీల ప్రతినిధులు సమావేశమయ్యారు. కాంగ్రెస్ నుంచి సిరిసిల్ల రాజయ్య, టి. రామ్మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరఫున టి. హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివేకానంద, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కాసం వెంకటేశ్వర్లు, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ సహా ఇతర పార్టీల నుంచి కూడా పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. రైతు రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలకు ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధుల గురించి సిరిసిల్ల రాజయ్య, టి. రామ్మోహన్‌రెడ్డి ఆర్థిక సంఘం బృందానికి వివరించారు. కేంద్రం గ్రాంట్ల రూపంలో విరివిగా సాయం అందించాలని కోరారు. మరోవైపు హరీశ్‌రావు ఈ భేటీలో స్పందిస్తూ కేంద్రానికి వచ్చే ఆదాయంలో 20 శాతాన్ని సర్‌చార్జీలు, సెస్సుల రూపంలో సమకూర్చుకుంటున్నా ఆ డబ్బును వాటా ప్రకారం రాష్ట్రాలకు పంచట్లేదని పేర్కొన్నారు. పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని అక్బరుద్దీన్ కోరారు.

పన్నుల వాటా పెంచాలని కోరాం: హరీశ్‌రావు



రాష్ట్రాలకు పన్నుల వాటా 41 శాతానికి బదులు 31 శాతమే వస్తోందని.. దీన్ని సవరించి 50 శాతం పన్నుల వాటాను రాష్ట్రాలకు ఇవ్వాలని ఆర్థిక సంఘాన్ని కోరినట్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రజాభవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ పన్నేతర ఆదాయంలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని.. స్థానిక సంస్థల గ్రాంట్‌ను 50 శాతానికి పెంచాలని కోరామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణకు రూ. 40 వేల కోట్లు, పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా కోసం కూడా విజ్ఞప్తి చేశామన్నారు.

పన్ను ఎక్కువగా చెల్లిస్తున్న రాష్ట్రాలకు మద్దతివ్వండి: ఈటల

ఉమ్మడి ఏపీలో తెలంగాణకు 2.9 శాతం పన్నుల వాటా వస్తే.. 15వ ఆర్థిక సంఘం నాటికి 2.43 వాటా వచ్చిందని.. ఇప్పుడది 2.1 శాతంగా మారిందని 16వ ఆర్థిక సంఘానికి తెలియజేసినట్లు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ప్రజాభవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ పన్ను ఎక్కువ చెల్లిస్తున్న రాష్ట్రాలకు మద్దతివ్వాలని కోరినట్లు చెప్పారు. కాగా, పురపాలక పనుల్లో జీఎస్టీని మినహాయించాలని కోరినట్లు రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్స్ చైర్మన్, చౌటుప్పల్ చైర్‌పర్సన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు.

త్యాగమనే మాటే కేసీఆర్‌కు నప్పదు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే.. "తెలంగాణ ఉద్యమంలో భాగంగా కేసీఆర్‌కు నీడనిచ్చిన వ్యక్తి కొండా లక్ష్మణ్. ఆయన సొంత ఇల్లు (జలదృశ్యం)ను కేసీఆర్‌కు ఇస్తే.. కనీసం మర్యాద కూడా ఇవ్వకుండా కేసీఆర్ వ్యవహరించారు. ఉద్యమం పేరుతో రాజకీయ రాజీనామాలు చేశారు. ఎలక్షన్, సెలెక్షన్, కలెక్షన్ అనే మార్గంలో భారీగా లబ్ధి పొందాడు. ఉద్యమం కోసం త్యాగం చేసిన కొండా లక్ష్మణ్‌కు ఎలాంటి ఆస్తులు లేవు. కానీ కేసీఆర్, ఆయన కుటుంబం మాత్రం టీవీ చానళ్లు, పత్రికలు, బిల్డింగులు, ఫాంహౌజ్‌లు, ఇతర ఆస్తులు సంపాదించుకున్నారు.

రాష్ట్రంలోనే చేనేత టెక్నాలజీ చదువు కోసం..

పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఎనాడూ చేనేతల అభివృద్ధి కోసం ఆలోచించలేదు. రాష్ట్ర విద్యార్థులు హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో చేరాలంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వెంకటగిరికో, ఒడిశా రాష్ట్రానికో పోవాల్సిన పరిస్థితి. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగానే ఈ అంశం నా దృష్టికి వచ్చింది. వెంటనే ఉప ముఖ్యమంత్రి భట్టితో కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌లకు వినతిపత్రం ఇచ్చాం. వారు సానుకూలంగా స్పందించి ఐఐహెచ్‌టీని మంజూరు చేశారు. వెంటనే దీనిని అందుబాటులోకి వచ్చేలా అధికారులు చకచకా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం తెలుగు యూనివర్సిటీలో తరగతులు ప్రారంభిస్తున్నా.. త్వరలో స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణంలో దీనిని ఏర్పాటు చేస్తాం.

చేనేతల సంక్షేమం కోసం..

చేనేత ఉత్పత్తులంటే గత ప్రభుత్వంలో సినీతారల తళుకుబెళుకులే ఉండేవి. ఒక్క చేనేత కార్మికుడికి కూడా ప్రయోజనం కలగలేదు. గతంలో బతుకమ్మ చీరల పేరిట చేనేత కార్మికులకు పనికల్పిస్తామంటూ ఆర్భాటం చేశారే తప్ప నిధులు విడుదల చేయలేదు. మా ప్రభుత్వం తక్షణమే రూ.290 కోట్ల బకాయిలు విడుదల చేసింది. బతుకమ్మ చీరల కంటే మెరుగైన నాణ్యతతో కూడిన చీరలను 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ఇవ్వాలని నిర్ణయించాం. ఏటా ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున పంపిణీ చేస్తాం. ఏడాదికి దాదాపు 1.30 కోట్ల ఈ చీరల ఆర్డర్‌ను నేతన్నలకు ఇస్తాం. చేనేత రుణాల భారం రూ.30 కోట్లను తప్పకుండా మాఫీ చేస్తాం. ప్రజా ప్రభుత్వానికి రైతన్న ఎంత ముఖ్యమో నేతన్న కూడా అంతే ముఖ్యం. ఏ సమస్య వచ్చినా పెద్దన్నలా ముందుండి పరిష్కరిస్తా.."అని రేవంత్ చెప్పారు. కార్యక్రమంలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాది మాటలతో మభ్య పెట్టే ప్రభుత్వం కాదు: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం మాటలతో మభ్యపెట్టేది కాదని.. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాలు సమర్థవంతంగా అందేలా చూసేందుకు ముఖ్య కార్యదర్శి స్థాయిలో ఉన్న శైలజా రామయ్యర్‌కు ఆ శాఖ బాధ్యతలను అదనంగా అప్పగించామని తెలిపారు. చేనేత కార్మికులు ఎలాంటి సమస్యలున్నా ఆమెకు నేరుగా వివరించాలన్నారు.

కాళోజీకి సీఎం రేవంత్ నివాళి

ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం ఆయనకు రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. తెలంగాణ భాషా సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలను స్మరించుకున్నారు.

సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ

మంత్రి జూపల్లి కృష్ణారావు


కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి, అందెశ్రీ, మామిడి హరికృష్ణ, వాణిప్రసాద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు నిలువెత్తు నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాకవి కాళోజీ–మానవతా విలువలు అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మా ట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక ఉద్యమకారుడిగా, కవిగా తెలంగాణ సమాజానికి కాళోజీ చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. తెలంగాణ భాషకు, యాసకు, సాహిత్యానికి ఆయన చేసిన కృషికి గుర్తుగా కాళోజీ జయంతిని తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. కాళోజీలో ఉన్న ప్రశ్నించే తత్వాన్ని, ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని జూపల్లి సూచించారు. కాళోజీ కవితా సంకలనం నా గొడవలో పలు పద్యాలను ఉటంకిస్తూ పోరాట ప్రతిభ, తెలంగాణ తపనను గుర్తుచేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, లోక కవి అందెశ్రీ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు, నేటి నిజం సంపాదకుడు బైసా దేవదాస్, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్. బాలచారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో కాళోజీ జయంతి వేడుకలు



తెలంగాణ భవన్‌లో జరిగిన కాళోజీ జయంతి వేడుకల్లో దేవిప్రసాద్, దేశపతి శ్రీనివాస్, వినయ్‌భాస్కర్, పొన్నాల, ఎర్రోళ్ల శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగాయి. కాళోజీ చిత్రపటానికి పలువురు బీఆర్‌ఎస్ నేతలు పుష్పాంజలి ఘటించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివేకానంద నివాళులర్పించారు. కాళోజీ రాసిన కవితలు ప్రస్తుత కాలానికీ వర్తిస్తాయని 'ఎక్స్'వేదికగా హరీశ్ పేర్కొన్నారు. 'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం'అని కాళోజీ చెప్పిన మాటలే తమకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కాళోజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, గ్యాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, దేవీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో కాళోజీకి నివాళి

పద్మభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా అసెంబ్లీ లాంజ్‌లో ఆయన చిత్రపటానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నివాళి అర్పించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాజ్యసభ సభ్యుడు సాంబశివరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన



రాత్రిళ్లు తారలు కనపడటం సహజం.
కాని కోల్‌కతా వీధుల్లో
అగ్ని నక్షత్రాలు దర్శనమిస్తున్నాయి.
'రీక్లయిమ్ ది నైట్' పేరుతో
మహిళలు అనూహ్య సంఖ్యలో రాత్రిళ్లు
దివిటీలతో నిరసనలు చేస్తున్నారు.
అభయ ఘటన జరిగి నెల అయిన సందర్భంగా
సెప్టెంబర్ 8 రాత్రి కోల్‌కతాలోని ఏ కూడలిలో చూసినా
దగ్ధ కాగడాలు చేతబూనిన స్త్రీలే.
కోల్‌కతాలో సాగుతున్న నిరసనలపై కథనం.

నిశీధి వీధుల్లో అగ్ని నక్షత్రాలు

'రాత్రి ఎవరిది?' ఈ ప్రశ్న పిక్కటిల్లుతోంది కోల్‌కతాలో. 'రాత్రి మాది కూడా' అని అక్కడి స్త్రీలు ఎలుగెత్తి నినదిస్తున్నారు. వందల వేల సంఖ్యలో స్త్రీలు రాత్రిళ్లు బయటకు రావడం... కాగడానో, కొవ్వొత్తినో, సెల్‌ఫోన్ లైట్‌నో వెలిగిస్తూ సామూహికంగా నడవడం... ఆ నగరం ఎప్పుడూ ఎరగదు. ఇప్పుడు చూస్తోంది. 'కోల్‌కతాలో దుర్గా పూజ సమయంలో ఇలాంటి వాతావరణం ఉంటుంది. కాని అభయ విషయంలో న్యాయం కోసం స్త్రీలు రోడ్ల మీదకు వస్తున్నారు. పురుషులు కూడా వారికి సపోర్ట్ ఇస్తున్నారు' అంటున్నారు స్త్రీలు.

ఎన్నడూ ఎరగని భయం

కోల్‌కతాలో క్రైమ్ రేటు ఉన్నా ఆగస్టు 8 రాత్రి అభయపై జరిగిన అత్యాచారం, హత్యవల్ల నగరం పూర్తిగా భయపడిపోతోంది. స్త్రీలు బయటకు రావాలంటేనే సంకోచించే స్థితి ఈ ఘటన తర్వాత చోటు చేసుకున్నా మెల్లమెల్లగా ఎందుకు బయటకు రాకూడదనే తెగింపు కూడా మొదలయ్యింది. ఆగస్టు 14 అర్ధరాత్రి (స్వాతంత్ర్యం వచ్చిన సమయం) రాత్రి భారీస్థాయిలో స్త్రీలు రోడ్ల మీదకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అయితే పార్టీలు ఉసికొల్పడం వల్ల ఇలాంటి నిరసనలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఎదురుదాడి చేసింది. కాని ఆ తర్వాత ఏ పార్టీతో సంబంధం లేని రిమ్‌ఝిమ్ శర్మ అనే సామాజిక కార్యకర్త న్యాయం కోసం నిరసన తప్ప వేరే మార్గం లేదనే ఉద్దేశంతో అర్ధరాత్రి నిరసనలకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 4న కోల్‌కతా పట్టపగలులా మారింది. వేలాదిగా మహిళలు బయటకు వచ్చారు. ఈసారి వారందరి చేతుల్లో పార్టీల జండాలు కాకుండా త్రివర్ణ పతాకాలు ఉన్నాయి. ఇది జనం నిరసన. కోల్‌కతా నగరం దిగ్గున వెలిగింది- న్యాయ ఆకాంక్షతో.

నెల రోజుల రాత్రి

ఆగస్టు 8 రాత్రి కోల్‌కతాలోని ఆర్.జి. కార్ ఆస్పత్రిలో 'అభయ' అనే జూనియర్ డాక్టర్‌పై పాశవికంగా అత్యాచారం, హత్య జరిగి నెల రోజులు అవుతుండటంతో 'ఇంకా జరగని న్యాయానికి' నిరసనగా పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా 'నైట్ ఆఫ్ అభయ' పేరుతో నిరసనకు సామాజిక కార్యకర్తలు పిలుపునివ్వడంతో కోల్‌కతాతో పాటు ముఖ్యపట్టణాల్లో స్త్రీలు సెప్టెంబర్ 8 (ఆదివారం) రాత్రి వేలాదిగా రోడ్ల మీదకు వచ్చారు. నినాదాలు, పాటలు, కవితలు... రోడ్ల మీద బొమ్మలు వేయడం ఎక్కడ చూసినా చైతన్య జ్వాలలు. 'ఉయ్ వాంట్ జస్టిస్' నినాదం మార్మోగిపోయింది. సి.బి.ఐ అనునిత్యం ఏవో స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఆస్పత్రిలోని మూడు గదులను త్రీడి మ్యాపింగ్ ద్వారా విశ్లేషిస్తున్నామని చెప్పడం పాలిగ్రాఫ్ పరీక్షలు చేయించడం తప్ప అసలు ఏం జరిగిందో దీని వెనుక ఎవరున్నారో తెలుపడం లేదు. అభయ కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు సెప్టెంబర్ 9న (నిన్న) విచారణ చేసినా అందులో అటాప్సీ రిపోర్టులో కీలకపత్రం లేకపోవడాన్ని గుర్తించి నిలదీసింది. అంటే ఈ కేసు అంతు లేకుండా సాగేలా ఉంది.





గగుర్పాటు క్షణం

'ఘటన జరిగి నెల రోజులైనా నా కూతురు ఆ క్షణంలో ఎంత తల్లడిల్లి ఉంటుందో గుర్తుకొస్తే నేటికీ గగుర్పాటుకు గురవుతూనే ఉన్నాను' అని అభయ తల్లి సెప్టెంబర్ 8 రాత్రి నిరసనలో తెలిపింది. మరోవైపు ఆర్.జి. కార్ ఆస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు ఆస్పత్రిలోని పరిస్థితుల్లో ఏమీ మార్పు లేదని, సీసీ కెమెరాలు బిగించలేదని, భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. రోడ్లపైకి వస్తున్న మహిళలను అడిగితే 'దేశంలో పెరిగిపోయిన రేప్ కల్చర్‌తో విసిగిపోయాం. దీనికి ముగింపు పలకాల్సిందే. అంతవరకూ రోడ్ల మీదకు వస్తూనే ఉంటాం' అంటున్నారు.

ఏ జాగృదావస్థ అయినా ప్రక్షాళనకే దారి తీస్తుంది. ఈ ప్రక్షాళనే ఇప్పుడు కావాల్సింది.

హెల్దీ డైట్ | డేట్స్- డ్రై ఫ్రూట్స్ మోదక్



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ &
వెల్‌నెస్ కోచ్

కావలసినవి: ఖర్జూరాల పలుకులు – కప్పు
బాదం, పిస్తా, వాల్‌నట్ పలుకులు– అరకప్పు
నెయ్యి – టీ స్పూన్

తయారీ:
- ఖర్జూరాల పలుకులను బ్లెండ్ చేయాలి. అందులో బాదం, పిస్తా, వాల్‌నట్ పలుకులు వేసి కలపాలి.
- చేతికి నెయ్యి రాసుకుని పై మిశ్రమాన్ని పది సమభాగాలు చేయాలి. ఒక్కో భాగాన్ని మోదక్ ఆకారంలో చేయాలి. చేత్తో చేయడం కుదరకపోతే మౌల్డ్‌లో పెట్టి చేయాలి.


పోషకాలు(ఒక మోదక్‌లో):
- కేలరీలు : 70–80; ● ఫ్యాట్ : 4 గ్రాములు
- కార్బోహైడ్రేట్‌లు : 10 గ్రాములు
- ప్రోటీన్‌లు: గ్రాము



నేటి 'సాక్షి'
ఈ పేపర్‌లో ప్రత్యేక
'హెల్త్' పేజీ

సొప్టైటీ తెచ్చే
యూరినారీ
ప్రాబ్లెమ్స్!
మరికొన్ని..

ఇంటి దీపాన్ని ఇల్లే ఆర్పుతోందా!



నేడు వరల్డ్ సూయిసైడ్ ప్రివెన్షన్ డే

సాధారణంగా పేదరికం, నిరుద్యోగం, అప్పులు, అవమానాలు, కుంగుబాటు, వైవాహిక సమస్యలు.. వంటివి ఆత్మహత్యలకు పురిగొల్పుతాయి. అయితే వాటిలో గృహహింస కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఆత్మహత్య అనేది వ్యక్తిగత చర్య అయినప్పటికీ అది అనేక సామాజిక కారణాలతో ప్రభావితం అయ్యి ఉంటుంది. వ్యక్తిగత దుర్బలత్వం సామాజిక ఒత్తిళ్ల నుంచి వచ్చేదై ఉంటుంది. దీనిని మానసిక అనారోగ్యంగానూ అర్థం చేసుకోవచ్చు. ఇందులో కుటుంబ కలహాలు, సామాజిక అస్థిరతలు సమాన పాత్ర పోషిస్తాయి.

గృహహింసలో ప్రధానంగా...

గృహహింస కారణంగా 64 శాతం మంది మహిళలు ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్నట్లు 'నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' జరిపిన అధ్యయనంలో గుర్తించారు. ఈ అధ్యయనం విడాకులు, వరకట్నం, ప్రేమ వ్యవహారాలు, వివాహం రద్దు లేదా వివాహం చేసుకోలేకపోవడం (భారతదేశంలో వివాహ విధానాల ప్రకారం), అవాంఛిత గర్భం, వివాహేతర సంబంధాలు, ఈ సమస్యకు సంబంధించిన విభేదాలు.. ఇలాంటివన్నీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. 'పరువు' అనే కారణంతో కుటుంబ ఆత్మహత్య సంఘటనలు తరచు సంభవిస్తుంటాయి.

మానసిక రుగ్మతలు

ఆత్మహత్య కారణంగా మరణించేవారిలో దాదాపు 90 శాతం మంది మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని చాలా అధ్యయనాలు సూచిస్తున్నాయి. చెన్నైలో చేసిన అధ్యయనంలో 80 శాతం, బెంగళూరులో 43 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు తెలిసింది. సమాజంలో/ కుటుంబంలో అణచివేతకు గురైన వారు డిప్రెషన్, ఇతర మానసిక వ్యాధి లక్షణాలను ఉన్నట్టు గుర్తించారు. వీరిలో ఎక్కువశాతం మంది డిప్రెషన్‌వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మద్యపానం వల్ల..

ఆత్మహత్యలలో మద్యపానం కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆత్మహత్య చేసుకునే సమయంలో 30–50 శాతం మంది పురుషులు మద్యం మత్తులో ఉండగా, స్త్రీలను వారి భర్తల మద్యపాన వ్యసనమే ఆత్మహత్యకు పురికొల్పుతున్నట్లు వెల్లడైంది.

ఆత్మహత్య అనేది ఎన్నో అంశాలు కలిసిన అతి పెద్ద సమస్య. అందుకే నివారణ చర్యలు కూడా అన్ని వైపుల నుంచి జరగాలి. ఇక జాతీయ స్థాయిలో ఆత్మహత్య నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అమలు చేయడానికి, సహకారం, సమన్వయం, నిబద్ధత అవసరం. మానసిక ఆరోగ్య రంగంలో సామాజిక, ప్రజారోగ్యమే లక్ష్యంగా ఉండాలి. మానసిక ఆరోగ్య నిపుణులు ఆత్మహత్యల నివారణలో చురుకైన పాత్ర పోషించాలి.

చేయూత అవసరం..

- గృహహింస బాధితులకు వారి చుట్టూ ఉన్న వ్యక్తులు కూడా కారణం అవుతుంటారు. భరించడం అనే స్థాయి నుంచి తమ బతుకు తాము బతకగల ధైర్యం, స్థైర్యం పెంపొందించుకోవాలి.
- టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ నూతన జీవనం వైపుగా అడుగులు వేయాలి. ఇందుకు కుటుంబ సభ్యులు చేయూతను అందించాలి.
- స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలలో అవగాహన తరగతులు నిర్వహించాలి.
- ఉపాధ్యాయులు, పోలీసులు, నాయకులు, నమ్మకమిచ్చే అభ్యాసకులు... ఇలా అందరూ బాధ్యత గా వ్యవహరించాలి.
- ప్రాణాలతో బయటపడిన వారిని సంఘటితం చేసి, వారిని ఈ అవగాహన తరగతులలో పాలుపంచుకునేలా చేయాలి.



– పి.జ్యోతిరాజ,
సైకాలజిస్ట్

'ఐ గ్రో యువర్ ఫుడ్' ఉద్యమం!

అంతర్జాతీయ సేంద్రియ వ్యవసాయ ఉద్యమ సంస్థల సమాఖ్య (ఐ.ఎఫ్.ఓ.ఎ.ఎం. –ఐఫోమ్) పిలుపు మేరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారులు ఈ నెల 10వ తేదీన 'ఐ గ్రో యువర్ ఫుడ్' పేరిట వినూత్న ప్రచారోద్యమాన్ని చేపట్టారు. ప్రజల కోసం రసాయనాల్లేకుండా ఆరోగ్యదాయకంగా చేపట్టిన సేంద్రియ వ్యవసాయం– మార్కెటింగ్ తీరుతెన్నులు.. సమస్యలు ఏమిటి? వాటి పరిష్కారానికి ప్రజలు చేయగల సహాయం ఏమిటి? వంటి అంశాలపై తమ అభిప్రాయాలతో కూడిన వీడియోలను సేంద్రియ రైతులు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారు.

ఐగ్రోయువర్‌ఫుడ్.బయో పేరిట ఏర్పాటైన ప్రత్యేక వెబ్‌సైట్‌లో, ఐఫోమ్ ఆర్గానిక్స్ ఇంటర్నేషనల్‌కు చెందిన వెబ్‌సైట్/ఎక్స్/యూట్యూబ్/ఇన్‌స్టా తదితర సోషల్ మీడియా వేదికల్లో ప్రపంచ దేశాల సేంద్రియ రైతుల షార్ట్ వీడియోలు అందుబాటులో ఉన్నాయి. వీటిని చూసిన ప్రజలు/వినియోగదారులు తమ అభిప్రాయాలను, సూచనలను పంచుకోవడానికి వీలుంది.

GLOBAL ACTION DAY
#IGrowYourFood

ఐఫోమ్ ఆర్గానిక్స్ ఇంటర్నేషనల్ 1972లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. వంద దేశాల్లోని సుమారు 700 సేంద్రియ వ్యవసాయ సంస్థలకు ఇప్పుడు ఐఫోమ్ సభ్యత్వం ఉంది. ఆరోగ్యం, పర్యావరణం, న్యాయం, శ్రద్ధ అనే నాలుగు మూల సూత్రాలపై ఆధారపడి సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరింపజేయటమే ఐఫోమ్ తన లక్ష్యంగా పెట్టుకుంది. సేంద్రియ వ్యవసాయానికి అంతర్జాతీయ ప్రమాణాలను నిర్దేశించటంతో పాటు ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజన్సీలకు అక్రెడిటేషన్ ఇస్తుంది. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఆహారోత్పత్తి చేసి ప్రజలకు అందిస్తున్న రైతుల్లో 80% మంది చిన్న, సన్నకారు రైతులేనని ఐఫోమ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 57 కోట్ల వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి. వీటిలో 90% క్షేత్రాలు ఒంటరి రైతులు లేదా రైతు కుటుంబాలే నడుపుతున్నారు. సంస్థలు/కంపెనీల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ క్షేత్రాలు మిగతా పది శాతం మాత్రమే.
https://igrowyourfood.bio/

కేరళలో కౌలు సేద్యం చేస్తున్నా..!



నా పేరు షమికా మోనే. మహారాష్ట్రలో పుట్టా. పరిశోధనలు వదలి పెట్టి సేంద్రియ రైతుగా మారా. కేరళలో భూమిని కౌలుకు తీసుకొని సేంద్రియ వ్యవసాయం చేస్తున్నా. అనేక రకాల దేశీ వరితో పాటు కూరగాయలు పండిస్తున్నా. పంట విత్తిన దగ్గర నుంచి నూర్పిడి, ప్రాసెసింగ్ వంటి పనులు సాధ్యమైనంత వరకు నేనే చేసుకోవటం అద్భుతమైన అనుభవం. నేను పండించిన ఆహారోత్పత్తుల్ని తింటున్న స్నేహితులు, బంధువులు చాలా సంతోషంగా ఉన్నారు. సీజన్‌కు ముందే డబ్బు పెట్టుబడిగా ఇస్తారు. పంటలు పండించిన తర్వాత.. తమకు అవసరమైన ఆహారోత్పత్తుల్ని తీసుకుంటున్నారు. దేశీ వరి బియ్యం, అటుకులతో చేసిన స్థానిక సంప్రదాయ వంటకాలను పిల్లలు కూడా ఇష్టంగా తింటున్నారు. ఐఫోమ్ ఆర్గానిక్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు 'ఐగ్రోయువర్‌ఫుడ్' ఉద్యమంలో భాగస్వామిని కావటం సంతోషంగా ఉంది.

– షమిక మోనె,
సేంద్రియ యువ మహిళా రైతు, కేరళ



ప్రకృతి సేద్యం బతికించింది!

సాగుబడి
పుబ్బ కార్తె: సెప్టెంబర్ 12 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 13 నుంచి

దేవేంద్ర మాటలు అనంతపురం జిల్లాకు చెందిన లక్షలాది మంది రైతుల కష్టాలను ప్రతిబింబిస్తాయి. ప్రపంచంలోని ఇతర కరువు పీడిత ప్రాంతాల మాదిరిగానే ఇక్కడ వ్యవసాయం ఒక సవాలు. గత ఏడాది కరువుకు అధిక ఉష్ణోగ్రతలు తోడు కావటంతో ఎండుతున్న చీనీ తోటలు.. పంట నష్టాల మధ్య.. ఈ విద్యాధిక యువ రైతుది ఓ ఆశావహమైన కథ.

- ప్రకృతి సేద్య పద్ధతులతో బత్తాయి తోటకు పునరుజ్జీవం
- ఎకరం చీనీ తోట + అంతర పంటల వార్షిక ఆదాయం రూ. నాలుగు లక్షల పైనే!
- అనంతపురం యువ రైతు దేవేంద్ర ప్రకృతి సేద్య అనుభవాలు.. ఆయన మాటల్లోనే..

'నా పేరు పొత్తూరు దేవేంద్ర. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం చిన్నమల్లేపల్లి గ్రామం. గత ఏడాది లోటు వర్షపాతంతో మా ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మాకు 2.5 ఎకరాల సాగు భూమి ఉంది. మా నాన్న చిన్న వెంకట స్వామి 30 ఏళ్ల సంప్రదాయ రసాయన వ్యవసాయం చేశారు. ఆ రోజుల్లో కుటుంబ ఖర్చులకూ కనాకష్టంగా ఉండేది. ఎమ్మే చదివాను. గత 15 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. నాలుగు సంవత్సరాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. విత్తనాలు వేయటం నుంచి పంట నూర్పిడి వరకు ప్రతి పనినీ మనసు పెట్టి చేస్తున్నాను. గతంతో పోలిస్తే ఇప్పుడు మా కుటుంబం ఆర్థికంగా చాలా మెరుగైన స్థితిలో ఉంది. అంతేకాదు, వ్యవసాయ పనులను మరింత నైపుణ్యంతో చేయటం నేర్చుకున్నారు. మాకున్న 2.5 ఎకరాల్లో ఒక ఎకరంలో చీనీ(బత్తాయి) తోట ఉంది. నీటి సౌకర్యం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, గత ఏడాది జూలై 31న అలసంద, పొద చిక్కుడు, సజ్జలు, కందులు, ఆముదం విత్తనాలను గుళికలుగా మార్చి.. వానకు ముందే విత్తే (పిఎండిఎస్) పద్ధతిలో విత్తాను.

అప్పటి నుంచి 13 నెలలుగా చీనీ చెట్ల మధ్యలో భూమిని ఒక్కసారి కూడా దున్నలేదు. కానీ, మట్టిలో బెజ్జాలు చేసి చేతులతో విత్తనాలు వేస్తూ.. ఏడాది పొడవునా కాలానుగుణమైన అంతర పంటలు పండిస్తూనే ఉన్నాం. ఇలా ఏడాది పొడవునా పంటలతో పొలాన్ని ఆకుపచ్చగా కప్పి ఉంచుతున్నాం. పడిన కొద్దిపాటి వర్షంతోనో లేదా కొద్దిపాటి నీటి తడి ద్వారానో మట్టిలో తేమను నిలుపుకుంటున్నాం. చీనీ చెట్లకు, అంతర పంటలకు అవసరమైన విధంగా నిరంతరాయంగా తేమ అందుతున్నట్లు పచ్చని పొలాన్ని చూస్తే నిర్ధారణ అవుతోంది. గత వేసవిలో అతి వేడి పరిస్థితుల్లో కూడా నేలలో తగినంత తేమ ఉంది. గడ్డీ గాదం, పంట అవశేషాలతో నేలను కప్పి ఉంచటం కూడా తోటను పచ్చగా ఉంచడంలో సహాయపడుతోంది. వీటన్నింటితో కరువు పరిస్థితులను అధిగమిస్తున్నా.

నాలుగేళ్లలో ఎంతో మార్పు..

ప్రకృతి వ్యవసాయం చేపట్టిన తర్వాత ఈ నాలుగేళ్లలో మా పొలం మట్టిలో, చీనీ చెట్లలో అనేక మార్పులను గమనించాను. వానపాములు, సూక్ష్మజీవులు పని చేయటం వల్ల మట్టిలో జీవవైవిధ్యం పెరిగింది. అందుకు రుణపడి ఉన్నాం. మొక్కలు నేల నుంచి పోషకాలను తీసుకోవడం మెరుగుపడింది. ఫలితంగా చీనీ చెట్లలో ఎటువంటి సూక్ష్మధాతు లోపాలు లేవు. మంచి నాణ్యమైన పండ్ల దిగుబడి వచ్చింది. మా నాన్న రసాయనిక ఎరువులు, పురుగుమందులు వేస్తూ వ్యవసాయం చేసినప్పుడు పరిస్థితి ఇలా లేదు. గత ఏడాది అధిక ఎండలకు మా పొలానికి దగ్గర్లోని తోటల్లో కూడా చీనీ చెట్లు ఎండిపోయాయి. రైతులు చెయ్యని ప్రయత్నం లేదు. ఎన్నో రసాయనాలను స్ప్రే చేశారు. కానీ చీనీ చెట్లను రక్షించుకోలేకపోయారు.



కాయలతో కళకళలాడుతున్న చీనీ చెట్లు



ప్రూనింగ్ చేసి ఘనజీవామృతం వేస్తున్న రైతు

ఎపిసిఎన్ఎఫ్ చీఫ్ టెక్నాలజీ- ఇన్నోవేషన్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మా నాయక్ చనిపోతున్న చీనీ చెట్లను ఎలా రక్షించుకోవాలో మాకు నేర్పించారు. ఆయన చెప్పినట్లు.. 50 శాతం ఎండిన చెట్ల కొమ్మలను నేల నుంచి 2 అడుగుల ఎత్తులో కత్తిరించి, మోళ్లకు తడి ఘన జీవామృతం పూసి, ద్రవజీవామృతం పిచికారీ చేశాం. ఆ తర్వాత చెట్టు చుట్టూ 2 అడుగుల వెడల్పున పాది చేసి, ఘనజీవామృతాన్ని వేసి, అనేక పంటల విత్తనాలు చల్లి, దానిపైన మట్టి వేశాం.

ఇటువంటి పద్ధతులతో మట్టిలో సూక్ష్మజీవుల కార్యకలాపాల ఫలితంగా చనిపోతున్న చెట్లు కూడా బతికాయి. 20–25 రోజుల్లో కొత్త చిగుర్లు వచ్చాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ చెట్లు పునరుజ్జీవం పొందాయి. మృత్యువాత పడుతున్న చీనీ చెట్లను కాపాడుకోగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వెనుక ఉన్న సైన్స్‌ను అర్థం చేసుకొని ఆశ్చర్యపోయాను. రసాయనిక వ్యవసాయం చేసిన రోజుల్లో అనేక మానసిక సమస్యలు, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నాం. వైద్యం కోసం చాలా డబ్బు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించిన తర్వాత పరిస్థితి మారింది. నా పొలంలో 365 రోజులు కాలానుగుణమైన కూరగాయలు, ఇతర ఆహార పంటలను అంతర పంటలుగా పండించడం ప్రారంభించాను. బయటి నుంచి ఏదైనా ఆహారాన్ని కొనుగోలు చేయడం మానేశాను. మనం ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్నది తినడం వల్ల, హాస్పిటల్ ఖర్చులు, మీరు నమ్ముతారో లేదో గాని, దాదాపు పూర్తిగా తగ్గిపోయాయి.

ఎకరంలో 10 టన్నుల బత్తాయిలు

ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) మోడల్‌తో పాటు ఏ-గ్రేడ్ మోడల్‌లో కూడా పంటలు సాగు చేస్తున్నాం. మా కూరగాయలు, తదితర పంటలను ఇంట్లో వాడుకోగా, అదనంగా వీటి ద్వారా ప్రతి నెలా రూ. 4–5 వేల వరకు ఆదాయం వస్తోంది. కుటుంబం ఖర్చులు తీరుతున్నాయి. ఈ ఒక ఎకరం చీనీ తోట నుండి ప్రతి సంవత్సరం సగటున 10 టన్నుల బత్తాయిలు పండిస్తున్నాం. గత 3 సంవత్సరాలుగా, మేం టన్ను బత్తాయి పండ్లను సగటున రూ. 30–33 వేలకు అమ్ముతున్నాం. ఏటా కనీసం రూ. 3 లక్షల ఆదాయం బత్తాయిల ద్వారా వస్తోంది. ఇక చెట్ల మధ్యలో సాగు చేసే బొబ్బర్లు, పొద అనప, కంది, సజ్జ, ఆముదం పంటలతో పాటు సూపర్ నేపియర్ గడ్డి ద్వారా వచ్చే ఆదాయం కలిపితే మొత్తం రూ. 4 నుంచి 4.5 లక్షల వరకు ఉంటుంది..'



దేవేంద్ర
మొబైల్: 79976 44711



కంటి శుక్లం: హోమియో చికిత్స

గేదెలకూ ఇతర జంతువుల మాదిరిగానే కంటి శుక్లం సమస్య వస్తుంటుంది. కంటి కటకం తెల్లగా మారడం వల్ల దృష్టి లోపానికి లేదా అంధత్వానికి దారితీస్తుంది. గేదె కన్ను తెల్లగా మారినా, వాపు ఉన్నా.. కళ్ళు కనపడక వస్తువుల్ని ఢీ కొట్టడం వంటి లక్షణాలను బట్టి శుక్లం వచ్చినట్లు భావించాలి..

కారణాలు

వయస్సు: ముసలి గేదెలకు కంటిశుక్లం వచ్చే అవకాశం ఎక్కువ.
జన్యువులు: వారసత్వంగా వచ్చిన జన్యు కారణాల వల్ల కొన్ని గేదెల్లో కంటిశుక్లం రావచ్చు.
పోషకాహార లోపం: విటమిన్ ఎ వంటి ముఖ్యమైన పోషకాలు లోపించటం వల్ల కంటిశుక్లం ఏర్పడుతుంది.
అంటువ్యాధులు: కొన్ని అంటువ్యాధులు, ముఖ్యంగా కంటిని ప్రభావితం చేసేవి, కంటిశుక్లాలకు కారణమవుతాయి.
గాయం: గాయం వల్ల కంటి కటకాలు దెబ్బతిని శుక్లాలకు దారితీస్తుంది.
రసాయనాలు: కొన్ని రసాయనాలు/ విషతుల్య పదార్థాలు తగలటం వల్ల కంటిశుక్లం ఏర్పడవచ్చు.

హోమియోపతి చికిత్స

యుఫ్రేసియ– క్యు: కంటిలో 3 చుక్కలు.. రోజుకు 3 సార్లు.. 10 రోజులు వేయాలి.
యుఫ్రేసియ 200: 10 మాత్రలు.. రోజుకు 2 సార్లు.. 10 రోజులు వేయాలి. 5 రోజుల్లోనే పూర్తిగా ఫలితం కనపడుతుంది.

– డా. జి. రాంబాబు
(94945 88885),
పశువైద్యాధికారి, కడప




సూపర్ సినెర్

యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ హస్తగతం

ఫైనల్లో అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్‌పై విజయం

రూ. 30 కోట్ల 23 లక్షల ప్రైజ్‌మనీ సొంతం


విన్నర్స్ ట్రోఫీతో సినెర్

ఈ ఏడాది తన అద్వితీయమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ మరో గొప్ప విజయం సాధించాడు. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో సినెర్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. ఆద్యంతం తన ఆధిపత్యం చలాయిస్తూ వరుస సెట్‌లలో అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్‌పై గెలిచాడు. తన కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు.

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ టోర్నీ ప్రారంభానికి ముందు తెరపైకొచ్చిన డోపింగ్ వివాదం తన ఆట తీరుపై ఎలాంటి ప్రభావం చూపలేదని ఇటలీ స్టార్ యానిక్ సినెర్ నిరూపించాడు. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు, టాప్ సీడ్ హోదాకు న్యాయం చేస్తూ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో సినెర్ విజేతగా నిలిచాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో 23 ఏళ్ల సినెర్ 6–3, 6–4, 7–5తో ప్రపంచ 12వ ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో సినెర్‌కు ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురుకాలేదు. విజేతగా నిలిచిన సినెర్‌కు 36 లక్షల డాలర్లు (రూ. 30 కోట్ల 23 లక్షలు), రన్నరప్ ఫ్రిట్జ్‌కు 18 లక్షల డాలర్లు (రూ. 15 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

బ్రేక్ పాయింట్‌తో మొదలు...

2003లో ఆండీ రాడిక్ యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచాక మరో అమెరికన్ క్రీడాకారుడు గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్ సాధించలేకపోయాడు. 2009లో ఆండీ రాడిక్ వింబుల్డన్ ఫైనల్లో ఫెడరర్ చేతిలో ఓడిపోయాక మరో అమెరికా ప్లేయర్ మరే గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయాడు.


15 ఏళ్ల తర్వాత టేలర్ ఫ్రిట్జ్ రూపంలో అమెరికా ప్లేయర్ ఒకరు గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్ ఆడుతుండటంతో అందరి కళ్లు ఫ్రిట్జ్‌పైనే కేంద్రీకృతమయ్యాయి. అయితే సినెర్ మాత్రం అమెరికా అభిమానుల ఆశలను వమ్ము చేశాడు. తొలి సెట్‌లోని తొలి గేమ్‌లోనే ఫ్రిట్జ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినెర్ ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 2–0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే మూడో గేమ్‌లో సర్వీస్ కాపాడుకొని, నాలుగో గేమ్‌లో సినెర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఫ్రిట్జ్ స్కోరును 2–2తో సమం చేశాడు. కానీ సినెర్ వెంటనే విజృంభించి మరో రెండుసార్లు ఫ్రిట్జ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి తొలి సెట్‌ను గెల్చుకున్నాడు. రెండో సెట్‌లోనూ సినెర్ దూకుడుకు ఫ్రిట్జ్ జవాబు ఇవ్వలేకపోయాడు. మూడో సెట్‌లో కాస్త పోటీ ఎదురైనా 12వ గేమ్‌లో ఫ్రిట్జ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినెర్ విజయాన్ని అందుకున్నాడు.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

సినెర్		టేలర్ ఫ్రిట్జ్
6	ఏస్‌లు	10
5	డబుల్ ఫాల్ట్‌లు	4
8/13	నెట్ పాయింట్లు	13/19
6/12	బ్రేక్ పాయింట్లు	2/7
23	విన్నర్స్	29
21	అనవసర తప్పిదాలు	34
96	మొత్తం పాయింట్లు	79

6 ఈ ఏడాది సినెర్ గెలిచిన టైటిల్స్. ఆస్ట్రేలియన్ ఓపెన్, రోటర్‌డామ్ ఓపెన్, మయామి మాస్టర్స్, హాలె ఓపెన్, సిన్సినాటి మాస్టర్స్, యూఎస్ ఓపెన్ టోర్నీల్లో సినెర్ విజేతగా నిలిచాడు.

55 ఈ సంవత్సరం సినెర్ మొత్తం 60 మ్యాచ్‌లు ఆడాడు. 55 మ్యాచ్‌ల్లో గెలుపొందాడు. ఐదింటిలో ఓడిపోయాడు.

3 తన కెరీర్‌లో ఒకే ఏడాది ఫైనల్ చేరుకున్న తొలి రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ విజేతగా నిలిచిన మూడో ప్లేయర్ సినెర్. గతంలో గిలెర్మో విలాస్ (అర్జెంటీనా: 1977లో ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్), జిమ్మీ కానర్స్ (అమెరికా: 1974లో ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) మాత్రమే ఈ ఘనత సాధించారు.

4 ఒకే ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్ టైటిల్స్ నెగ్గిన నాలుగో ప్లేయర్ సినెర్. ఫెడరర్ (స్విట్జర్లాండ్), జొకోవిచ్ (సెర్బియా) మూడుసార్లు చొప్పున... 1988లో మాట్స్ విలాండర్ (స్వీడన్) ఒకసారి ఈ ఘనత సాధించారు.

భారత్ 'సున్నా'



- సిరియా చేతిలో 0–3తో ఓటమి
- ఒక్క గోల్ కొట్టకుండానే టోర్నీని ముగించిన టీమిండియా
- ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత సిరియా

సాక్షి, హైదరాబాద్: కొత్త కోచ్ మార్కెజ్ ఆధ్వర్యంలో భారత ఫుట్‌బాల్ జట్టు రాత మారుతుందని భావించిన అభిమానులకు తీవ్ర నిరాశే ఎదురైంది. ఇంటర్ కాంటినెంటల్ కప్ తొలి పోరులో తమ కంటే బలహీనమైన మారిషస్‌పై ఒక్క గోల్ కూడా కొట్టకుండా మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న భారత్ ఊహించినట్లుగానే తమకంటే పటిష్టమైన సిరియా చేతిలో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లోనూ గోల్ లేకుండా ఆటను ముగించింది. సోమవారం రాత్రి గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సిరియా 3–0 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించి టోర్నీ విజేతగా నిలిచింది. మూడు జట్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో మారిషస్ జట్టు రెండో స్థానంలో నిలువగా... భారత్ చివరిదైన మూడో స్థానంతో సరిపెట్టుకుంది. తమ తొలి లీగ్ మ్యాచ్‌లో సిరియా 2–0తో మారిషస్‌పై గెలిచింది. భారత్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ నెగ్గిన సిరియా అజేయంగా టైటిల్‌ను సొంతం చేసుకుంది. సిరియా తరఫున 7వ నిమిషంలో మహమూద్ అల్ అస్వాద్...76వ నిమిషంలో మొహసీన్ దలెహో గోల్స్ సాధించారు. ఆట చివర్లో పాబ్లో డేవిడ్ (90+6 నిమిషంలో) మరో గోల్ కొట్టి టోర్నీని ముగించాడు. భారత్ కంటే ఒక గోల్ తక్కువగా ఇచ్చినందుకు మారిషస్ జట్టుకు రెండో స్థానం దక్కింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి సిరియా జట్టుకు విన్నర్స్ ట్రోఫీతోపాటు రూ. 30 లక్షల ప్రైజ్‌మనీ చెక్‌ను అందజేశారు.

సమష్టి వైఫల్యం...

ఆట ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించిన సిరియా వరుసగా దాడులు చేసింది. దానికి 7వ నిమిషంలోనే ఫలితం దక్కింది. మహమూద్ బాక్స్ ఏరియా నుంచి కొట్టిన షాట్‌ను భారత డిఫెండర్లు నిలువరించగలిగినా... రీబౌండ్‌లో అతను దానిని ఛేదించగలిగాడు. గుర్‌ప్రీత్ ఆపలేకపోవడంతో సిరియా ఖాతాలో గోల్ చేరింది. తొలి 25 నిమిషాల్లో భారత పోస్ట్‌పై సిరియా ఐదుసార్లు అటాక్ చేయగా, భారత్ ఒక్కసారి కూడా చేయలేదు. తొలి అర్ధ భాగం ముగియడానికి నాలుగు నిమిషాల ముందు భారత్ పదే పదే దాడులు చేసింది. రాహుల్ భేకే, సమద్, మాన్విర్ గట్టిగా ప్రయత్నించినా ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదించలేకపోయారు.

రెండో అర్ధభాగంలో మూడు నిమిషాల వ్యవధిలో భారత్ గోల్ కొట్టేందుకు చేరువగా వచ్చినా, ప్రత్యర్థి కీపర్ అడ్డుకోగలిగాడు. మరోవైపు బాక్స్ వద్ద తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సిరియా ఆటగాడు తమ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. 87వ నిమిషంలో భారత ప్లేయర్ ఎడ్మండ్ అద్భుతంగా కొట్టిన షాట్‌ను కీపర్ హదయా ఆపాడు. ఇంజ్యూరీ టైమ్‌లో సిరియా మరో దెబ్బ కొట్టి భారత్‌కు వేదనను మిగిల్చింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



భారత్‌కు రెండో గెలుపు

హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. జపాన్ జట్టుతో సోమవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 5–1 గోల్స్ తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ (2వ, 60వ ని.లో) రెండు గోల్స్ చేయగా... అభిషేక్ (3వ ని.లో), సంజయ్ (17వ ని.లో), ఉత్తమ్ సింగ్ (54వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. జపాన్ జట్టుకు కజుమాసా (41వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. భారత జట్టుకు రెండు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఒక దానిని గోల్‌గా మలిచింది. మరోవైపు జపాన్ జట్టు తమకు లభించిన ఐదు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుంది. మంగళవారం విశ్రాంతి దినం తర్వాత బుధవారం మలేసియా జట్టుతో భారత్ ఆడుతుంది. సోమవారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో చైనా 4–2తో మలేసియాను ఓడించగా... దక్షిణ కొరియా, పాకిస్తాన్ మ్యాచ్ 2–2తో 'డ్రా'గా ముగిసింది.

భారత మహిళల టెన్నిస్ నంబర్‌వన్‌గా సహజ

సాక్షి, హైదరాబాద్: కొంతకాలంగా అంతర్జాతీయ సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తున్న తెలంగాణ టెన్నిస్ ప్లేయర్ సహజ యామలపల్లి భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా అవతరించింది. సోమవారం విడుదల చేసిన ప్రపంచ మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 22 ఏళ్ల సహజ ఒక స్థానం మెరుగుపర్చుకొని 302వ ర్యాంక్‌కు చేరుకుంది. చాలా కాలంగా భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్న 31 ఏళ్ల అంకిత రైనా 24 స్థానాలు పడిపోయి 307వ ర్యాంక్‌కు చేరుకుంది. ఈ సీజన్‌లో సహజ 27 మ్యాచ్‌ల్లో గెలిచి, 22 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. గతవారం డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన పుంటా కానా ఓపెన్ ఐటీఎఫ్ టోర్నీలో సహజ సెమీఫైనల్లో నిష్క్రమించింది.



మద్రాస్ నేపథ్యంలో...


రానా, భాగ్యశ్రీ బోర్సే, దుల్కర్ సల్మాన్, వెంకటేష్

దుల్కర్ సల్మాన్ హీరోగా 'కాంత' సినిమా షురూ అయింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో 'మిస్టర్ బచ్చన్' మూవీ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. ముహూర్తపు సన్నివేశానికి హీరో వెంకటేష్ క్లాప్ ఇచ్చారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ– ''సురేశ్ ప్రొడక్షన్స్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, మా స్పిరిట్ మీడియాతో కొత్త శకానికి నాంది పలికేందుకు సరైన చిత్రం 'కాంత'. సోమవారం నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం'' అన్నారు. ''మానవ భావోద్వేగాల లోతులను ఆవిష్కరించే అందమైన కథ 'కాంత''' అని దుల్కర్ సల్మాన్ తెలిపారు. ''1950 మద్రాస్ నేపథ్యంలో సాగే సినిమా ఇది. మానవ బంధాలు, సామాజిక మార్పులతో గొప్ప అనుభూతిని పంచేలా ఈ చిత్రం ఉంటుంది'' అని సెల్వమణి సెల్వరాజ్ పేర్కొన్నారు. తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికృష్ణ గద్వాల్, లైన్ ప్రొడ్యూసర్: శ్రవణ్ పాలపర్తి, కెమెరా: డాని శాంచెజ్ లోపెజ్, సంగీతం: జాను.



దుల్కర్ చేతికి 'క' మలయాళ రిలీజ్ హక్కులు

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ చిత్రం 'క'. దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించిన ఈ మూవీలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో త్వరలో విడుదలకానుంది. కాగా 'క' సినిమా మలయాళ థియేట్రికల్(వరల్డ్ వైడ్) రైట్స్‌ను హీరో దుల్కర్ సల్మాన్ ప్రొడక్షన్ కంపెనీ వేఫేరర్ ఫిలింస్ సొంతం చేసుకుంది.



జీవితం చాలా చిన్నది

– రష్మికా మందన్నా

హీరోయిన్ రష్మికా మందన్నా స్వల్ప ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ సోమవారం ఓ పోస్ట్‌ని షేర్ చేశారు రష్మిక. ''కొన్ని రోజులుగా నేను సోషల్ మీడియాలో చురుగ్గా ఉండటం లేదు. అలాగే పబ్లిక్‌లో కనిపించడం లేదు. కానీ, ఇందుకు ఓ కారణం ఉంది. నాకు చిన్న ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం నుంచి కోలుకునే క్రమంలో వైద్యుల సలహాల మేరకు ఇంట్లోనే ఉంటున్నాను. ప్రస్తుతం నాకు బాగానే ఉంది. అయితే ఎల్లప్పుడూ మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోవడానికి ప్రాధాన్యత కల్పించుకోండి. ఎందుకంటే జీవితం చాలా చిన్నది. అసలు రేపు ఏం జరుగుతుందో మనకు తెలియదు. అందుకే ప్రతిరోజూ సంతోషంగా ఉండండి'' అంటూ పేర్కొన్నారు రష్మికా మందన్నా. ఇక ఆమె సినిమాల విషయానికొస్తే.. అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్', విక్కీ కౌశల్ 'ఛావ', ధనుష్–నాగార్జునల 'కుబేర', సల్మాన్ ఖాన్ 'సికందర్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారు రష్మికా మందన్నా. అలాగే 'ది గాళ్‌ఫ్రెండ్' అనే లేడీ ఓరియంటెడ్ సినిమా కూడా చేస్తున్నారామె.

సినిమా




రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'వేట్టయాన్'. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న రిలీజ్ కానుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'మనసిలాయో' అంటూ సాగే పాటను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. ''మెరుపై వచ్చిండే.. మనసు పెట్టి వచ్చిండే.. మడత పెట్టా వచ్చిండే..' అంటూ ఈ పాట తెలుగు వెర్షన్ సాగుతుంది. శ్రీనివాస మౌళి సాహిత్యం అందించిన ఈ పాటని నకాష్ అజీజ్, అరుణ్ కౌండిన్య, దీప్తి సురేష్ పాడారు.

సారంగపాణి వినోదం

'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' వంటి విజయవంతమైన సినిమాల తర్వాత డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటిస్తున్నారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ సోమవారంతో పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ–''జంధ్యాలగారు మా సంస్థలో 'చిన్నోడు – పెద్దోడు', 'ఆదిత్య 369' వంటి హిట్ సినిమాలకు డైలాగ్స్ రాశారు. కానీ, ఆయన దర్శకత్వంలో ఓ వినోదాత్మక సినిమా చేయించుకోలేకపోయా. ఆ లోటు ఇన్నేళ్లకి 'సారంగపాణి జాతకం'తో భర్తీ అయ్యింది. మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యభరిత చిత్రమిది. ఈ నెల 12 నుంచి డబ్బింగ్ పనులు ప్రారంభిస్తాం'' అని తెలిపారు. ఈ సినిమాకి కెమెరా: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక.


ప్రియదర్శి, రూప, ఇంద్రగంటి, కృష్ణప్రసాద్

వెండితెరకు అంతర్ముఖం


యండమూరి, తుమ్మలపల్లి

ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ నవలల్లో అగ్ర తాంబూలం అందుకునే 'అంతర్ముఖం' వెండి తెరకు రానుంది. శతాధిక చిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ తన 67వ పుట్టినరోజు (సెప్టెంబర్ 10) సందర్భంగా 'అంతర్ముఖం' చిత్రాన్ని ప్రకటించారు. యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ నేపథ్యంలో రామసత్యనారాయణ మాట్లాడుతూ–''మా భీమవరం టాకీస్ పతాకంపై 117వ చిత్రంగా 'అంతర్ముఖం' నిర్మించనుండటం సంతోషంగా ఉంది. మహేష్ (అమెరికా), యు అండ్ ఐ, వర్చ్యువల్ వన్ సంస్థలు ఈ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటున్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మీర్.

మత్తువదలరాని ఫ్రాంచైజీలా కొనసాగిస్తాం

– శ్రీ సింహా

''మత్తువదలరా (2019)' సినిమా తర్వాత నా కెరీర్‌లో సరైన హిట్ చిత్రం లేదు. అయితే ఓ సినిమా సక్సెస్ కావడానికి చాలా కారణాలు ఉన్నాయి. గతంలో నేను డిఫరెంట్ జానర్స్ సినిమాలు చేశాను. ఇప్పుడు క్యారెక్టర్ బేస్డ్ సినిమాలు ఎక్కువగా చేయాలనుకుంటున్నాను'' అని శ్రీ సింహా అన్నారు. రితేష్ రానా దర్శకత్వంలో శ్రీ సింహా, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'మత్తువదలరా 2'. చిరంజీవి, హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీ సింహా మాట్లాడుతూ–''ఈ చిత్రంలో నేను, సత్య, ఫరియా హై ఎమర్జెన్సీ టీమ్ ఏజెంట్స్‌గా కనిపిస్తాం. తొలి భాగంతో పోలిస్తే రెండో భాగంలో యాక్షన్, ఫన్, థ్రిల్, సర్‌ప్రైజ్ అంశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రభాస్, రాజమౌళిగార్లు మా సినిమా ట్రైలర్, టీజర్‌ను చూసి అభినందించారు. 'మత్తువదలరా' సినిమాని ఓ ఫ్రాంచైజీలాగా కొనసాగించే అవకాశం ఉంది'' అన్నారు.

కథే హీరో!


దిలీప్ ప్రకాష్

''కన్నడలో 'క్రేజీ బాయ్' సినిమా చేశాను. తెలుగులో నా తొలి చిత్రం 'ఉత్సవం'. సురభి నాటక సమాజం స్ఫూర్తితో రంగస్థల కళాకారులపై తీసిన సినిమా ఇది. చాలా మంచి కథ. ఈ చిత్రానికి కథే హీరో'' అని దిలీప్ ప్రకాష్ అన్నారు. అర్జున్ సాయి దర్శకత్వంలో దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. హార్న్‌బిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది. దిలీప్ ప్రకాష్ మాట్లాడుతూ– ''సినిమాలు పుట్టిందే నాటకాల నుంచి. ఈ విషయాన్నే 'ఉత్సవం'లో చూపిస్తున్నాం. ఈ మూవీలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు కనిపిస్తాయి. సందేశంలా కాకుండా వినోదాత్మకంగా చెబుతున్నాం. రెజీనాగారు మంచి కోస్టార్. నా తర్వాతి చిత్రం తెలుగులోనే ఉంటుంది'' అన్నారు.

ఆ స్థాయికి చేరుకోవాలి

– గడ్డం ప్రసాద్ కుమార్

''తొలి సినిమాకి హీరోలు అంతగా ఆకట్టుకోరు. కానీ చంద్రహాస్ బాగున్నాడు. అతని కుటుంబ సభ్యులు కోరుకుంటున్న స్థాయికి చంద్రహాస్ చేరుకోవాలి. 'రామ్‌నగర్ బన్నీ' సినిమాని, చంద్రహాస్‌ను తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి'' అని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చంద్రహాస్ హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరులో రిలీజ్ కానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్, గ్లింప్స్ రిలీజ్ కార్యక్రమానికి గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. చంద్రహాస్ మాట్లాడుతూ–''అందరికీ కనెక్ట్ అయ్యేలా 'రామ్ నగర్ బన్నీ' ఉంటుంది. మా సినిమా కలెక్షన్స్‌లో పదిశాతం వరద బాధితులకు సహాయంగా ఇస్తాను'' అన్నారు. కాగా వరద బాధితుల సహాయార్థం తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కి తన వంతు ఆర్థిక సహాయాన్ని గడ్డం ప్రసాద్ కుమార్‌కి అందజేశారు చంద్రహాస్.


ప్రభాకర్, గడ్డం ప్రసాద్ కుమార్, చంద్రహాస్

కఠిన నిర్ణయం తీసుకున్నా!

– 'జయం' రవి


ఆర్తి, 'జయం' రవి

తమిళ చిత్ర పరిశ్రమలో విడిపోయిన జంటల సరసన నటుడు 'జయం' రవి, ఆర్తి దంపతులు చేరనున్నారు. తామిద్దరం విడిపోతున్నట్లు రవి ప్రకటించారు. ప్రముఖ సినీ నిర్మాత ఎడిటర్ మోహన్ రెండవ తనయుడు రవికి నిర్మాత సుజాత కుమార్తె ఆర్తికి 2009లో వివాహం జరిగింది. వీరికి ఆరవ్, అయాన్ అనే ఇద్దరు కొడుకులున్నారు. గత పదిహేనేళ్లుగా 'జయం' రవి, ఆర్తిల దాంపత్య జీవితం సాఫీగా సాగింది. అయితే గత కొద్ది నెలలుగా వీరి మధ్య సఖ్యత కొరవడిందనే ప్రచారం కోలీవుడ్‌లో సాగింది. ఈ విషయంపై ఇద్దరూ మౌనం వహించారు. వీరి మధ్య బంధాన్ని మళ్లీ పెంచడానికి ఇరు కుటుంబ పెద్దలు ప్రయత్నించినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు 'జయం' రవి. ''జీవితం అనేది పలు అధ్యాయాలతో కూడిన పయనం. గుండెలు పిండే ఒక వ్యక్తిగత చేదు విషయాన్ని చెప్పాల్సిన పరిస్థితికి నేను నెట్టబడ్డాను. సుదీర్ఘమైన ఆలోచన, పరిశీలన తర్వాత ఆర్తితో నా వివాహ జీవితం నుంచి వైదొలగాలన్న కఠిన నిర్ణయం తీసుకున్నాను. నాకు చెందిన వారి మంచి కోసం, వారి జీవిత క్షేమం కోసం తీసుకున్న నిర్ణయమిది. ఈ సమయంలో నా వ్యక్తిగత ప్రపంచాన్ని, నా సన్నిహితుల వ్యక్తిగత ప్రపంచాన్ని గౌరవించాలి. నా ప్రాధాన్యత ఎప్పుడూ నటనకే ఇస్తాను. ప్రేక్షకులను సంతోషపరచడానికి మీ 'జయం' రవిగానే ఉండాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారాయన.

– సాక్షి సినిమా ప్రతినిధి, చెన్నై

సాక్షి బిజినెస్
మంగళవారం
10-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
376	84
81,560	24,936

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,838	▲ 148
డోజోన్స్	40,820	▲ 474
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,271	▲ 89
డాక్స్	18,444	▲ 142
షాంఘై	2,736	▽ 29
నికాయ్	36,216	▽ 175

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	71,090
బంగారం (22 క్యారట్)	67,700
వెండి (కిలో)	90,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.25	111.86
€	యూరో	ఎస్‌బీఐ	91.95	94.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.81	59.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.56	57.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.23	66.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.76
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.79







ఐఫోన్ 16 వచ్చేసింది..

- యాపిల్ ఇంటెలిజెన్స్ దన్ను
- ధర 799 డాలర్ల నుంచి ప్రారంభం
- యాపిల్ వాచ్ 10 ఆవిష్కరణ

క్యుపర్టినో, అమెరికా: టెక్ దిగ్గజం యాపిల్ తాజాగా కృత్రిమ మేధ ఆధారిత ఐఫోన్ 16 స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. వీటిలో 4 మోడల్స్ (ఐఫోన్ 16, ప్లస్, ప్రో, ప్రో మ్యాక్స్) ఉన్నాయి. ఐఫోన్ 16 ధర 799 డాలర్ల నుంచి,16 ప్లస్ ధర 899 డాలర్ల నుంచి ప్రారంభమవుతుంది. ఐఫోన్16లో ఐఫోన్ 15 కన్నా 30 శాతం వేగంగా పనిచేసే, 30 శాతం తక్కువ శక్తిని ఉపయోగించే 6–కోర్ ఏ18 ప్రాసెసర్ ఉంటుంది. ఈ ఫోన్ల సైజు 6.1 అంగుళాల నుంచి 6.9 అంగుళాల వరకు ఉంటుంది. భారీ జనరేటివ్ మోడల్స్‌ను ఉపయోగించేందుకు అనువుగా ఐఫోన్ 16 కోసం సరికొత్త ఏ18 చిప్‌ను తయారు చేశారు. గ్లోటైమ్ పేరిట నిర్వహించిన ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న యాపిల్ సీఈవో టిమ్ కుక్, కొత్త తరం ఐఫోన్లను యాపిల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినట్లు చెప్పారు. ప్రత్యేకంగా రూపొందించిన సర్వర్లపై యాపిల్ ఇంటెలిజెన్స్ పని చేస్తుందని పేర్కొన్నారు. కస్టమైజ్ చేసుకోతగిన యాక్షన్ బటన్, కెమెరా కంట్రోల్ తదితర ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఐఫోన్ 16లో 48 ఫ్యూజన్ కెమెరా ఉంటుంది. కొత్తగా యాపిల్ వాచ్ సిరీస్ 10ని కూడా కంపెనీ ఆవిష్కరించింది. వీటి ధర 399 డాలర్ల నుంచి ఉంటుంది. సెప్టెంబర్ 20 నుంచి ఇవి లభ్యమవుతాయి.

ప్రపంచ తొలి ట్రిలియనీర్ ఎలాన్ మస్క్!



- 2027 నాటికి అవతరణ
- ఆ తర్వాత గౌతమ్ అదానీ వంతు
- 2033లో ఈ స్థానానికి ముకేశ్ అంబానీ
- ఇన్‌ఫార్మా కనెక్ట్ అకాడమీ అంచనా

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచ తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్లు)గా 2027 నాటికి రికార్డ్ సృష్టించనున్నారు. మరుసటి ఏడాది (2028లో) అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ సైతం ట్రిలియనీర్ అవుతారని ఇన్‌ఫార్మా కనెక్ట్ అకాడమీ నివేదిక అంచనా వేసింది. ఆసియా కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 2033లో ఈ స్థానానికి చేరుకుంటారని పేర్కొంది. ఎలాన్ మస్క్ 237 బిలియన్ డాలర్లతో ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. 2027 నాటికి ట్రిలియనీర్ స్థానానికి చేరుకోవాలంటే మస్క్ నికర సంపద ఏటా 110 శాతం చొప్పున పెరగాల్సి ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. అదానీ 100 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 13వ స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం మాదిరే అదానీ సంపద ఏటా 123 శాతం చొప్పున పెరుగుతూ పోతే, ఎలాన్ మస్క్ తర్వాత 2028లో ప్రపంచ రెండో ట్రిలియనీర్ అవుతారని ఈ నివేదిక అంచనా వేసింది. 111 బిలియన్ డాలర్లతో ఆసియా కుబేరుడిగా ఉన్న ముకేశ్ అంబానీ 2033 నాటికి ట్రిలియనీర్ అవుతారని తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2035లో లక్ష కోట్ల డాలర్ల మార్క్‌ను చేరుకుంటుందని అంచనా వేసింది.

2025లో టీఎస్ఎంసీ: తైవాన్‌కు చెందిన సెమీ కండక్టర్ తయారీ సంస్థ టీఎస్ఎంసీ మార్కెట్ విలువ 893.7 బిలియన్ డాలర్లుగా ఉంటే, వచ్చే ఏడాది ట్రిలియన్ డాలర్లకు చేరుకోనుంది. ఎలాన్ మస్క్, గౌతమ్ అదానీ, ఎన్‌వీడియా వ్యవస్థాపకుడు జెన్సెన్ హువాంగ్, ఇండోనేసియాకు చెందిన ప్రజోగో పాంగెట్సు, ఫ్రెంచ్ వ్యాపారవేత్త బెర్నార్డ్ ఆర్నాల్ట్, ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ట్రిలియనీర్లుగా అవతరించే అవకాశాలున్నట్టు వివరించింది. ప్రస్తుతం ప్రపంచంలో ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీల జాబితాలో మైక్రోసాఫ్ట్, ఎన్‌వీడియా, యాపిల్, ఆల్ఫాబెట్, అమెజాన్, సౌదీ ఆరామ్‌కో, మెటా, బెర్క్‌షైర్ హాత్‌వే ఉన్నాయి.

వాహన పరిశ్రమ
@ రూ. 20 లక్షల కోట్లు

- మొత్తం జీఎస్‌టీలో 15 శాతం వాటా
- సియామ్ ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమ టర్నోవర్ 2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 20 లక్షల కోట్ల మార్కును దాటిందని వాహన తయారీదారుల సమాఖ్య సియామ్ ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ వెల్లడించారు. మొత్తం వస్తు, సేవల పన్నుల్లో (జీఎస్‌టీ) 14–15 శాతం వాటా ఆటో పరిశ్రమదే ఉంటోందని ఆయన చెప్పారు. అలాగే దేశీయంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా గణనీయంగా ఉపాధి కల్పిస్తోందని ఆటో విడిభాగాల సంస్థల సమాఖ్య ఏసీఎంఏ 64వ వార్షిక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అగర్వాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తిలో పరిశ్రమ వాటా 6.8 శాతంగా ఉండగా ఇది మరింత పెరగగలదని వివరించారు. అంతర్జాతీయంగా భారతీయ ఆటో రంగం పరపతి పెరిగిందని అగర్వాల్ చెప్పారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే దిశగా దేశీయంగా ఉత్పత్తి చేయగలిగే 50 క్రిటికల్ విడిభాగాలను పరిశ్రమ గుర్తించిందని ఆయన వివరించారు.

100 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యం: కేంద్ర మంత్రి గోయల్

భారతీయ వాహన సంస్థలు 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకోవాలని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఏసీఎంఏ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సూచించారు. ఇందులో భాగంగా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, స్థానికంగా ఉత్పత్తిని మరింతగా పెంచాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వాహన ఎగుమతులు 21.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. పరిశ్రమలకు ఉపయోగపడేలా ప్రభుత్వం 20 స్మార్ట్ ఇండస్ట్రియల్ నగరాలను అభివృద్ధి చేస్తోందని, వాహనాల విడిభాగాల పరిశ్రమ ఈ టౌన్‌షిప్‌ల రూపంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రి చెప్పారు. మరోవైపు, లోకలైజేషన్‌ను పెంచేందుకు సియామ్, ఏసీఎంఏ స్వచ్ఛందంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు అగర్వాల్ పేర్కొన్నారు.

బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్

సెన్సెక్స్ లాభం 376 పాయింట్లు



ముంబై: బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. సోమవారం సెన్సెక్స్ 376 పాయింట్లు పెరిగి 81,560 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 84 పాయింట్లు లాభపడి 24,936 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ(0.60%), ఐసీఐసీఐ బ్యాంకు(2.50%), హెచ్‌యూఎల్(3%) షేర్లు రాణించి సూచీల రికవరీకి దన్నుగా నిలిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 469 పాయింట్లు బలపడి 81,653 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు ఎగసి 81,653 వద్ద గరిష్టాలను తాకాయి. ఆసియా మార్కెట్లు నష్టపోగా, యూరప్ మార్కెట్లు రికవరీ బాట పట్టాయి. అమెరికా సూచీలు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

→ గాలా ప్రెసిషన్ ఇంజనీరింగ్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.529)తో పోలిస్తే 42% ప్రీమియంతో రూ.750 వద్ద లిస్టయ్యింది. ఈక్విటీ మార్కెట్‌లోని సానుకూల సంకేతాల ప్రభావంతో ఆరంభ లాభాలు నిలుపుకోగలిగింది. చివరికి 49% లాభంతో ఇంట్రాడే గరిష్టం రూ.787 వద్ద ముగిసింది.

బీమాపై జీఎస్‌టీ కోతకు ఓకే!

- జీఎస్‌టీ మండలి భేటీలో ఏకాభిప్రాయం
- తదుపరి సమావేశంలో దీనిపై నిర్ణయం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: ఆరోగ్య, జీవిత బీమా పాలసీల ప్రీమియంపై జీఎస్‌టీ తగ్గించాలన్న డిమాండ్ పట్ల జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో విస్తృత ఏకాభిప్రాయం వచ్చింది. దీనిపై వచ్చే నెల చివర్లోగా నివేదిక సమర్పించాలని బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి అధ్యక్షతన గల మంత్రుల బృందాన్ని (జీవోఎం) కోరినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ నివేదిక అందిన తర్వాత దీనిపై జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. ప్రస్తుతం టర్మ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ల ప్రీమియంపై 18 శాతం జీఎస్‌టీ అమలవుతోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 54వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఇందులో బీమా పాలసీలపై ప్రీమియం తగ్గింపు ప్రధానంగా చర్చకు వచ్చింది. నెలవారీ జీఎస్‌టీ వసూళ్లు పెరుగుతుండడంతో పన్ను రేటు తగ్గింపు పట్ల చాలా రాష్ట్రాలు సానుకూలంగా ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. జీఎస్‌టీ తగ్గిస్తే ఆ మేరకు ప్రీమియం రేట్లు దిగొస్తాయి. ఇది కోట్లాది మంది పాలసీదారులకు ఉపశమనాన్ని కల్పించనుంది. జీఎస్‌టీకి ముందు బీమా పాలసీల ప్రీమియంపై 12% సర్వీస్ ట్యాక్స్ వసూలు చేసేవారు.

కేన్సర్ ఔషధాలపై జీఎస్‌టీ తగ్గింపు: కొన్ని రకాల కేన్సర్ ఔషధాలపై జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి.. కేదార్‌నాథ్ తదితర పర్యటనల కోసం వినియోగించుకునే హెలికాప్టర్ సేవలపై జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించింది. చార్టర్ హెలీకాప్టర్లపై ఎప్పటి మాదిరే 18 శాతం జీఎస్‌టీ అమలు కానుంది. ఆన్‌లైన్ గేమింగ్‌పై 2023 అక్టోబర్ 1 నుంచి 28 శాతం జీఎస్‌టీని అమలు చేయడం వల్ల ఆదాయం 412 శాతం పెరిగి రూ.6,909 కోట్లకు చేరుకున్నట్టు మంత్రి సీతారామన్ తెలిపారు. విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలు దిగుమతి చేసుకునే సేవలపై జీఎస్‌టీని మినహాయించాలని కౌన్సిల్ నిర్ణయించింది.

ఫిట్‌డేలో మహేశ్‌బాబు పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: న్యూట్రాస్యూటికల్ రంగంలో ఉన్న ఫిట్‌డేలో సినీ నటుడు మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ పెట్టుబడి పెట్టింది. ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేసిందీ కంపెనీ వెల్లడించలేదు. పోషకాహారం, ఆరోగ్యకర చిరుతిళ్ల పరిశ్రమలో విప్లవాత్మక మార్పు కోసం కంపెనీ చేస్తున్న ప్రయత్నంలో ఈ వ్యూహాత్మక పెట్టుబడి మైలురాయిగా నిలుస్తుందని ఫిట్‌డే సోమవారం తెలిపింది.



ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో జీఎంఆర్ వాటా పెంపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో (డీఐఏఎల్) మరో 10 శాతం వాటాను జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (జీఐఎల్) దక్కించుకుంది. డీఐఏఎల్‌లో తనకున్న 10 శాతం వాటాను ఫ్రాపోర్ట్ ఏజీ ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ వరల్డ్‌వైడ్ విక్రయించింది. డీల్ విలువ 126 మిలియన్ డాలర్లు. డీల్ తదనంతరం డీఐఏఎల్‌లో జీఐఎల్ వాటా 74 శాతానికి చేరింది. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు 26 శాతం వాటా ఉంది. వాటా కొనుగోలు ప్రక్రియ 180 రోజుల్లో పూర్తి అవుతుందని జీఎంఆర్ గ్రూప్ సోమవారం తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
దేశీ స్టార్టప్ పిక్సెల్‌కు నాసా కాంట్రాక్టు
ఐపీవో బాటలో ఎథర్ ఎనర్జీ

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఐటీబీపీలో కానిస్టేబుల్ కొలువులు

కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో 330 హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనుంది. పదోతరగతితో పాటు ఐటీఐ పూర్తిచేసిన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళా అభ్యర్థులు కూడా అర్హులే. ఐటీబీపీ కానిస్టేబుల్ జాబ్స్ వివరాలు..

» 330 ఉద్యోగాలకు ప్రకటన విడుదల



మొత్తం పోస్టులు: 330

- **పురుషులకు:** కానిస్టేబుల్ (కార్పెంటర్)–61, కానిస్టేబుల్(ప్లంబర్)–44, కానిస్టేబుల్(మేసన్)–54, కానిస్టేబుల్ (ఎలక్ట్రీషియన్)–14, కానిస్టేబుల్ (డ్రెస్సర్ వెటర్నరీ)–8, కానిస్టేబుల్ (యానిమల్ ట్రాన్స్‌పోర్ట్)–97, కానిస్టేబుల్ (కెన్నెల్ మ్యాన్)–4 ఖాళీలు ఉన్నాయి.
- **మహిళలకు:** కానిస్టేబుల్ (కార్పెంటర్)–10, కానిస్టేబుల్(ప్లంబర్)–8, కానిస్టేబుల్ (మేసన్)–10, కానిస్టేబుల్ (ఎలక్ట్రీషియన్)–1, కానిస్టేబుల్ (యానిమల్ ట్రాన్స్‌పోర్ట్)–18, హెడ్‌కానిస్టేబుల్ (డ్రెస్సర్ వెటర్నరీ)–1 ఖాళీలున్నాయి.

అర్హతలు

- మెట్రిక్యులేషన్/పదోతరగతితో పాటు ఏడాది వ్యవధి ఉన్న ఐటీఐ(కార్పెంటర్/ప్లంబర్/మేసన్/ఎలక్ట్రీషియన్ ట్రేడ్)సర్టిఫికెట్ కోర్సు ఉండాలి.
- హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ) పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై.. ఏడాది వ్యవధి ఉన్న వెటర్నరీ కోర్సు/డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి.
- కానిస్టేబుల్(యానిమల్ ట్రాన్స్‌పోర్ట్), కానిస్టేబుల్ (కెన్నల్‌మ్యాన్) పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

10.09.2024 నాటికి 18–23 ఏళ్ల మధ్య ఉండాలి. కానిస్టేబుల్ (యానిమల్ ట్రాన్స్‌పోర్ట్) పోస్టుకు 18–25 ఏళ్లు ఉండాలి. హెడ్ కానిస్టేబుల్ (డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్ (కెన్నల్ మ్యాన్) పోస్టుకు 18–27 ఏళ్లు ఉండాలి. గరిష్ట వయసులో.. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, మాజీ సైనికోద్యోగులకు కేటగిరీని బట్టి మూడు నుంచి ఎనిమిదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ

- ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్,రాతపరీక్ష,ట్రేడ్ టెస్ట్,ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- మొదటి దశలో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, నాలుగో దశలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది.
- ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ): పురుషులు 1.6 కి.మీ. రేసును 7.5 నిమిషాల్లో పూర్తిచేయాలి. 11 అడుగుల లాంగ్‌జంప్, మూడున్నర అడుగుల హైజంప్ లక్ష్యాన్ని చేరుకోవడానికి మూడు అవకాశాలు ఇస్తారు.

మహిళలు

800 మీటర్ల రేస్‌ను 4.45 నిమిషాల్లో పూర్తిచేయాలి. 9 అడుగుల లాంగ్ జంప్, 3 అడుగుల హైజంప్ లక్ష్య సాధనకు మూడు అవకాశాలు ఇస్తారు. అర్హత సాధించిన వారికి ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. మాజీ సైనికోద్యోగులకు ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉండదు.

రాత పరీక్ష

ఈ పరీక్షను ఆబ్జెక్టివ్ తరహాలో ఓఎంఆర్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అవి.. జనరల్ ఇంగ్లిష్ 20 ప్రశ్నలకు–20 మార్కులు, జనరల్ హిందీ 20 ప్రశ్నలకు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలకు–20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 20 ప్రశ్నలు–20 మార్కులు, సింపుల్ రీజనింగ్ 20ప్రశ్నలు–20 మార్కులు.ఇలా.. మొత్తం 100ప్రశ్నలకు–100 మార్కులుంటాయి. ప్రశ్నపత్రం పదోతరగతి స్థాయిలో ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు. నెగిటివ్ మార్కులు లేవు.

వేర్వేరుగా పరీక్షలు

- పోస్టులను అనుసరించి హెడ్‌కానిస్టేబుల్ (డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్ (యానిమల్ ట్రాన్స్‌పోర్ట్), కానిస్టేబుల్ (కెన్నల్‌మ్యాన్) పోస్టులకు వేర్వేరుగా రాతపరీక్ష నిర్వహిస్తారు. వీటికి పరీక్ష సమయం రెండు గంటలు.
- ఈ పరీక్షల్లో అర్హత సాధించినవారికి కార్పెంటర్, మేసన్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ ట్రేడుల్లో 50 మార్కులకు ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు. అన్ని కేటగిరీల వారు కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. విభాగాల వారీగా మెరిట్ లిస్ట్‌ను తయారు చేసి ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ టెస్టుల ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక చేస్తారు.

ప్రిపరేషన్ ఇలా

- రోజువారీ టైమ్‌టేబుల్ వేసుకుని పరీక్షకు ఇప్పటినుంచే సన్నద్ధతను మొదలుపెట్టాలి. బ్యాంకు, రైల్వే, ఎస్ఎస్‌సీల పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాల సాధనతో ఫలితం ఉంటుంది. ఏయే అంశాల్లో తక్కువ మార్కులు వస్తున్నాయో తెలుసుకుని.. వాటికి ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. ఐటీఐలో చదివిన ట్రేడ్‌కు సంబంధించిన ప్రశ్నలే ట్రేడ్ టెస్టులో ఇస్తారు. కాబట్టి ఆయా అంశాలపై పట్టు సాధించాలి. నెగిటివ్ మార్కులు లేవు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముందుగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాసి, తర్వాత తెలియని వాటినీ ప్రయత్నించొచ్చు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేదీ: 10.09.2024
- వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in/rect/index.php

త్రివిధ దళాలకు మార్గం.. మిలిటరీ స్కూల్స్

రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌లో చేరితే సీబీఎస్ఈ సిలబస్ బోధనతోపాటు.. భవిష్యత్తులో త్రివిధ దళాల్లోని కమిషన్డ్ ర్యాంకు పోస్టులకు పోటీ పడే సంసిద్ధత లభిస్తుంది!! వీటిలో ప్రవేశించాలంటే.. అయిదు మిలిటరీ స్కూల్స్ కలిపి ఉమ్మడిగా నిర్వహించే రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఆర్ఎంఎస్ సెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది!! తాజాగా.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరు, తొమ్మిది తరగతులకు ఆర్ఎంఎస్ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. మిలిటరీ స్కూల్స్‌లో ప్రవేశ విధానం, బోధన ప్రత్యేకత తదితర వివరాలు..

» రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌లో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు
» ఆర్ఎంఎస్ సెట్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్స్
» మహిళా విద్యార్థులకు కూడా అవకాశం

రక్షణ శాఖ ఆధ్వర్యం

రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌ను రక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటిని 1952లో ఏర్పాటు చేశారు. వీటి ప్రధాన ఉద్దేశం పాఠశాల స్థాయి నుంచే త్రివిధ దళాలుగా పిలిచే ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలపై విద్యార్థుల్లో ఆసక్తి కల్పించి.. వాటిల్లో చేరేలా తీర్చిదిద్దడం. ఈ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధన అందిస్తున్నారు.

మొత్తం 5 పాఠశాలలు

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5 రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ ఉన్నాయి. అవి.. ఆర్ఎంఎస్–చెయిల్ (హిమాచల్ ప్రదేశ్), ఆర్ఎంఎస్–అజ్మీర్ (రాజస్థాన్), ఆర్ఎంఎస్–బెల్గాం(కర్ణాటక), ఆర్ఎంఎస్–బెంగళూరు (కర్ణాటక), ఆర్ఎంఎస్–ధోల్‌పూర్ (న్యూఢిల్లీ). ప్రతి క్యాంపస్‌లో 300 సీట్లు చొప్పున అందుబాటులో ఉంటాయి. ఒక్కో తరగతిలో కనిష్టంగా 30 మంది, గరిష్టంగా 50 మందికి ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌లో అమ్మాయిలకు కూడా ప్రవేశాలు కల్పిస్తారు.

విద్యార్హతలు

- **ఆరో తరగతి:** ప్రస్తుత విద్యా సంవత్సరంలో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.
- **తొమ్మిదో తరగతి:** ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

వయసు

- **ఆరో తరగతి:** మార్చి 31, 2025 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **తొమ్మిదో తరగతి:** మార్చి 31, 2025 నాటికి 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉండాలి.

జాతీయ స్థాయిలో ఆర్ఎంఎస్ సెట్

దేశ వ్యాప్తంగా ఉన్న అయిదు రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం కల్పించేందుకు జాతీయ స్థాయిలో ఆర్ఎంఎస్–సెట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేస్తారు. ప్రవేశ పరీక్ష ఆరు, తొమ్మిది తరగతులకు వేర్వేరుగా ఉంటుంది.

మొత్తం 200 మార్కులకు పరీక్ష

ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, ఇంటెలిజెన్స్ టెస్ట్ 50 ప్రశ్నలు–50 మార్కులకు, మ్యాథమెటిక్స్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 50 ప్రశ్నలు–50 మార్కులకు.. ఇలా మొత్తం 140 ప్రశ్నలు–200మార్కులకు పరీక్ష జరుగుతుంది.

తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష

- తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష రెండు పేపర్లుగా 200 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్–1లో ఇంగ్లిష్ (50 ప్రశ్నలు–50 మార్కులు), హిందీ (20 ప్రశ్నలు–20 మార్కులు), సోషల్ సైన్స్ (30 ప్రశ్నలు–30 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్–2లో మ్యాథమెటిక్స్ (50 ప్రశ్నలు–50 మార్కులు), సైన్స్ (50 ప్రశ్నలు–50 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పెన్/పెన్సిల్ విధానంలో జరుగుతుంది. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ప్రశ్న పత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాలలో ఉంటుంది.

ఇంటర్వ్యూ కూడా

రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌లో ప్రవేశానికి రాత పరీక్షతో పాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా తదుపరి దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. ఆరో తరగతి అభ్యర్థులకు 20 మార్కులు, తొమ్మిదో తరగతి అభ్యర్థులకు 50 మార్కులు కేటాయించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని తుది జాబితా రూపొందిస్తారు.

మంచి మార్కులకు మార్గమిదే

- దరఖాస్తు చేసుకుంటున్న తరగతి ఆధారంగా అంతకుముందు తరగతులకు సంబంధించి అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలి.
- ఆరో తరగతి అభ్యర్థులు నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- తొమ్మిదో తరగతి అభ్యర్థులు అయిదు నుంచి ఎనిమిది తరగతుల పుస్తకాలను ముఖ్యంగా మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఆర్టికల్స్, ప్రిపొజిషన్స్, వెర్బ్స్‌పై దృష్టి పెట్టాలి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి సైన్స్‌లోని ప్రాథమిక అంశాలు, మొక్కలు, బ్యాక్టీరియాలు, వ్యాధులు–కారకాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- సోషల్ సైన్స్‌కు సంబంధించి పర్యావరణం, హిస్టరీ, జాగ్రఫీ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా సివిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక భావనలు తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌లో జనాభా, జన గణన గణాంకాలు, పంటలు –ఉత్పత్తులు, అవి ఎక్కువగా పండే ప్రదేశాల గురించి తెలుసుకోవాలి.
- జనరల్ నాలెడ్జ్ కోసం ముఖ్యమైన వ్యక్తులు, అవార్డులు–విజేతలు, ప్రదేశాలు, క్రీడలు–విజేతలు, ప్రధాన మంత్రులు, రాష్ట్రపతి వంటి పదవులు చేపట్టిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలి.



సీబీఎస్ఈ సిలబస్

మిలిటరీ స్కూల్స్‌లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు ప్రాక్టికల్ అప్రోచ్ సొంతమవుతోంది. అకడెమిక్స్‌తోపాటు ఫిజికల్ ట్రైనింగ్, గేమ్స్, ఇతర యాక్టివిటీస్‌లో కూడా శిక్షణ ఉంటుంది. ఫలితంగా విద్యార్థులు సీబీఎస్ఈ +2 పూర్తి చేసుకునే సమయానికి సాయుధ దళాల్లో ఉద్యోగాలకు అవసరమైన సంసిద్ధత లభిస్తోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024,సెప్టెంబర్ 19
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://applydelhi.nielit.gov.in/, https://www.rashtriyamilitaryschools.edu.in/index.html

నీటిపారుదల శాఖకు 4 ఈఎన్‌సీ పోస్టులు

త్వరలో జనరల్, ఓఅండ్‌ఎం, రామగుండం ఈఎన్‌సీ పోస్టుల భర్తీ

పదోన్నతులపై వేసిన కమిటీతో సమావేశమైన మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఇంజనీర్ల పదోన్నతుల ప్రక్రియను కొలిక్కి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మూడు ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టులు ఖాళీగా ఉండటంతో తక్షణమే పదోన్నతుల ద్వారా వాటిని భర్తీ చేయాలని, మరో సూపర్ న్యూమరీ ఈఎన్‌సీ పోస్టును సృష్టించాలని నిర్ణయించింది. ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేందర్‌రావు మే 31న రిటైరవగా మరో 6 నెలలపాటు ఆయనను కాంట్రాక్టు విధానంలో ప్రభుత్వం పునర్నియమించింది. ఇక మేడిగడ్డ బరాజ్ కుంగడంతో ఫిబ్రవరి 7న ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్, ఈఎన్‌సీ (రామగుండం) నల్లా వెంకటేశ్వర్లుకు సర్కార్ ఉద్వాసన పలికింది. ఈ నేపథ్యంలో శాఖ పనితీరును మెరుగుపరచడానికి ఈఎన్‌సీ (జనరల్), ఈఎన్‌సీ(రామగుండం) పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతర్రాష్ట్ర వ్యవహారాల పర్యవేక్షణ కోసం కొత్తగా ఈఎన్‌సీ సూపర్‌న్యూమరీ పోస్టును సృష్టించాలని ప్రభుత్వం భావిస్తోంది. నీటిపారుదల శాఖలో 22 చీఫ్ ఇంజనీర్ పోస్టులుండగా 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతుల ద్వారా ఈ పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతోంది. ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, ఏఈలకు సైతం పదోన్నతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం జలసౌధలో ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ నేతృత్వంలో వేసిన కమిటీతో సమావేశమై చర్చించారు. 2-3 రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

అమ్రాబాద్ గడ్డ.. 34 పులుల అడ్డా!

ఏటీఆర్ పరిధిలో స్థిర నివాసం



11 మగ, 15 ఆడ, 8 పులి పిల్లలు ఉన్నట్లు గుర్తింపు

'స్టేటస్ ఆఫ్ టైగర్స్ అండ్ ప్రే ఇన్ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ 2023-24' నివేదికలో వెల్లడి



అమ్రాబాద్ అడవిలో..

సాక్షి, హైదరాబాద్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పరిధిలో 34 పులులు స్థిర నివాసం (11 మగ, 15 ఆడ, 8 పులి పిల్లలు) ఏర్పాటు చేసుకున్నట్టుగా అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. సోమవారం 'స్టేటస్ ఆఫ్ టైగర్స్ అండ్ ప్రే ఇన్ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ 2023-24' పేరిట విడుదల చేసిన నివేదికలో ఇది వెల్లడైంది. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్-2022 ప్రకారం చూస్తే.. అమ్రాబాద్‌లో 21 పులులు (7 మగ, 6 ఆడ, 8 పులిపిల్లలు) ఉండగా... తాజా నివేదికను బట్టి చూస్తే పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణ అటవీశాఖ-హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరిశీలన జరిగింది. 'ఫేజ్-4 మానిటరింగ్'లో భాగంగా 34 పులుల కదలికలను గుర్తించారు. వీటిలో ఇప్పటికే ఉన్న డేటాబేస్‌తో 22 పులులు మ్యాచ్ కాగా (పులిచారలు, ఇతర గుర్తుల ఆధారంగా గతంలోనే గుర్తించినవి), 4 పెద్ద పులులను మొదటిసారిగా గుర్తించారు. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2,611 కి.మీ. పరిధిలో విస్తరించి ఉంది. ఏటీఆర్‌లోని పది రేంజ్‌లను నాలుగు బ్లాక్‌లుగా విభజించారు. పరిశీలన అనంతరం రూపొందించిన ఈ రిపోర్ట్‌లో పులుల ఆహారానికి అవసరమైన సాంబార్, స్పాటెడ్ డీర్, నీల్గాయి, అడవి పందులు ఇతర జంతువులు ఉన్నట్టుగా గుర్తించారు. 2023 డిసెంబర్ 12 నుంచి 2024 మే 2వ తేదీల్లో 1,806 కెమెరా ట్రాప్‌ల ద్వారా రికార్డ్ చేసిన పులులకు సంబంధించిన డేటాను విశ్లేషించారు. ఏటీఆర్‌లో పెరుగుతున్న పులుల సంతతిలో ఆడ పులుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, రాబోయే 3, 4 ఏళ్లలో వీటి సంఖ్య ఇంకా హెచ్చుస్థాయిలో పెరుగుతుందని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా పులులు వేటాడి తమ ఆహారాన్ని సులభంగా సాధించుకునేలా జింకలు, దుప్పులు, ఇతర జంతువులను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరముంది.

ఏటీఆర్‌లో ఎన్నో సవాళ్లు

ఏటీఆర్‌లో 165 బీట్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పులులు, వన్యప్రాణుల సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న వాచర్లకు సకాలంలో జీతాలు అందడం లేదు. ఆరునెలలుగా వారి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అటవీశాఖకు అందాల్సిన నిధులు కూడా సకాలంలో అందడం లేదు. ఏటీఆర్ పులుల రక్షిత ప్రాంతంలోని శార్లపల్లి, కుడిచింతలవాయి, కొల్లంపెంట, తాటిగుండాల గ్రామాల్లోని ప్రజలను ఇతర చోట్లకు తరలించి వారికి పునరావాస కల్పనకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



పులుల గుర్తింపు ఇలా...

పెద్ద పులులను ఇప్పటికే అందుబాటులో ఉన్న ఫొటోగ్రాఫ్‌ల డేటాబేస్‌తోపాటు పులుల చారలు, తదితరాల ఆధారంగా మ్యాచ్ చేస్తారు.

పులులను మగ, ఆడగా వాటి శరీర భాగాలను బట్టి గుర్తిస్తారు.	పులులను గుర్తించాక వాటికి ప్రత్యేక ఐడీ కేటాయిస్తారు.	ఏ రెండు పులుల చారలు ఒకే విధంగా ఉండవు	మనుషుల వేలిముద్రల మాదిరిగా వాటి 'స్ట్రైప్ ప్యాటర్న్' ప్రతీ పులికి ప్రత్యేకంగా ఉంటుంది.

అనుకూల వాతావరణంతోనే పులుల వృద్ధి

ఏటీఆర్‌లో జీవవైవిధ్యంతోపాటు అనుకూల వాతావరణం ఉండటంతో పులుల సంఖ్య పెరుగుతోంది. పులుల వేటకు వీలుగా 'ప్రే బేస్'ను పెంచే ఏర్పాట్లు చేస్తున్నాం. 'ప్రీ అగ్యుమెంటేషన్ చాంబర్'ను ఏర్పాటు చేసి చుక్కల జింకలతో బ్రీడింగ్ ఎన్‌క్లోజర్ నిర్వహించాలని అనుకుంటున్నాం. వీటిలో పెంచిన జింకలను ఆ తర్వాత అడవిలోకి వదిలేసేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. పులుల వేట చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

– రోహిత్ గొప్పిడి, డీఎఫ్‌వో, నాగర్‌కర్నూల్ జిల్లా

ఉరుకులు పరుగుల జీవితాలు.. సమయం సరిపోక రాత్రీపగలూ కష్టపడి, సరిగా నిద్రకూడా పోకుండా పనిచేసుకునే పరిస్థితులు.. దీనితో పెరిగే ఒత్తిడి.. ఇవన్నీ గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయి. చిన్న వయసులోనే గుండెపోటు, ఇతర సమస్యలు వస్తున్నాయి. అయితే.. వారంలో ఆరు రోజులు సరిగా నిద్రపోలేనివారు.. వీకెండ్ రోజున ఎక్కువ సేపు నిద్రపోతే లోటును పూడ్చుకోవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. దీనిద్వారా కొంతైన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరిస్తున్నారు.

- సాక్షి సెంట్రల్ డెస్క్



వీకెండ్‌లో నిద్రను కవర్ చేస్తే.. గుండె భద్రమే!

బ్రిటన్‌కు చెందిన ది యూకే బయోబ్యాంక్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు నిద్రలేమి, గుండె సమస్యలకు కారణాలపై సుదీర్ఘ పరిశోధన చేశారు. వేర్వేరు వయసులకు చెందిన 90,903 మందిని వివిధ గ్రూపులుగా వర్గీకరించి.. వారు నిద్రపోయే సమయం, తీరు, గుండె ఆరోగ్యం తదితర అంశాలను సుమారు 14 సంవత్సరాలపాటు పరిశీలించారు. ఈ క్రమంలో కొందరు గుండె జబ్బుల బారినపడటం, కొందరు మృతిచెందడం వంటివీ నోట్ చేశారు. నిద్ర లేమి కారణంగా గుండె జబ్బుల సమస్యలు పెరుగుతున్నాయని గుర్తించినట్టు పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త జెచెన్ ల్యూ తెలిపారు. అయితే వారాంతాల్లో ఎక్కువ సేపు నిద్రపోయే అలవాటున్న వారిలో మాత్రం మిగతా వారితో పోల్చితే 20 శాతం వరకు గుండె జబ్బుల సమస్య తక్కువగా ఉంటోందని గుర్తించినట్టు వెల్లడించారు. నిద్ర సరిపోక ఇబ్బందిపడుతున్న వారు.. వారాంతాల్లో దాన్ని కాస్త కవర్ చేస్తే మేలని పేర్కొన్నారు. అయితే ఈ ఉపశమనం కొంతేనని.. ప్రతిరోజూ తగినంత సమయం నిద్ర ఉండేలా చూసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి లండన్‌లో జరిగిన ఈఎస్‌సీ కాంగ్రెస్-2024 సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు.

90,000 మందిపై పరిశోధన చేసి..

నేడు మరో రూ.1,500 కోట్ల అప్పు

- బాండ్ల వేలం ద్వారా సమీకరించనున్న సర్కారు
- 3న రూ.1,000 కోట్ల రుణం తీసుకున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీఐ నుంచి మంగళవారం మరో రూ.1,500 కోట్లు అప్పుల రూపంలో సమీకరించుకోనుంది. ఆర్‌బీఐ షెడ్యూల్ మేరకు బాండ్ల వేలం ద్వారా ఈ మొత్తాన్ని తీసుకోనుంది. ఈ నెల 3వ తేదీన రూ.1,000 కోట్లు రుణంగా తీసుకున్న ప్రభుత్వం, ఈనెలలోనే మరోమారు బహిరంగ మార్కెట్‌లో రుణానికి వెళుతోంది. ఆగస్టు నెలలో ప్రభుత్వం రూ.6 వేల కోట్లను రుణంగా తెచ్చుకుంది. ఆగస్టు 6న రూ.3 వేల కోట్లు, 13న మరో రూ.3 వేల కోట్లు సమీకరించింది. జూలైలో రూ.7 వేల కోట్లను సమకూర్చుకుంది. దీంతో రెండో త్రైమాసికంలో ఇప్పటివరకు రూ. 15 వేల కోట్లకు పైగా అప్పు తీసుకున్నట్టవుతోంది. తొలి త్రైమాసికంలోనూ ప్రభుత్వం రూ.13 వేల కోట్లకు పైగా అప్పులు తెచ్చింది. సర్కార్ ఈ నెలలో మళ్లీ రుణానికి వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అదే జరిగితే రెండు త్రైమాసికాల్లో కలిపి మార్కెట్ రుణ పద్దు రూ. 30 వేల కోట్లు దాటొచ్చని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి.

పల్లెల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పరిస్థితి ఘోరం

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అంతంతే

హెల్త్ డైనమిక్ ఆఫ్ ఇండియా 2022-23 నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యులు, వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని తేలింది. దేశవ్యాప్తంగా పల్లె ప్రాంతాల్లోని ఆరోగ్య గణాంకాలపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 'హెల్త్ డైనమిక్ ఆఫ్ ఇండియా 2022-23' వార్షిక నివేదికను సోమవారం విడుదల చేసింది.. వీటినే రూరల్ హెల్త్ స్టాటస్టిక్స్‌గా పిలుస్తారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) 63 శాతం మందే వైద్యులు పనిచేస్తున్నారని ఆ గణాంకాల్లో వెల్లడైంది. 37 శాతం ఖాళీలున్నాయని స్పష్టం చేసింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) స్పెషాలిస్ట్ డాక్టర్లు 52 శాతమే ఉన్నారని, మిగతా 48 శాతం ఖాళీలేనని వెల్లడించింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని 594 గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 1,188 మంది వైద్యులుండాలి. కానీ కేవలం 757 మందే ఉన్నారు.
- సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. సర్జన్స్, గైనకాలజిస్టులు, ఫిజిషియన్స్, చిన్నపిల్లల వైద్యుల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయి. ఉన్న 29 సీహెచ్‌సీల్లో 116 మంది స్పెషలిస్టు డాక్టర్ల అవసరం ఉండగా, కేవలం 61 పోస్టులనే మంజూరు చేశారు.
- స్టాఫ్‌నర్స్ పోస్టులు 1,739కి గాను ప్రస్తుతం 1,377 మందే ఉన్నారు.
- రాష్ట్రంలో 2022లో 578 పీహెచ్‌సీలుండగా... 2023 నాటికి అవి కాస్త 594కు పెరిగాయి. డాక్టర్ల విషయానికొస్తే 2022లో 802 మంది పనిచేస్తుండగా, గతేడాది నాటికి ఆ సంఖ్య కాస్త 757కు తగ్గింది. ఇక సీహెచ్‌సీలలో స్పెషలిస్టుల సంఖ్య 98 నుంచి 37కు పడిపోయింది.
- జనాభాకు తగ్గట్టుగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు లేవు.
- సామాజిక ఆరోగ్య కేంద్రాలు జనాభాకు తగ్గట్టుగా 177 అవసరం కాగా, కేవలం 29 మాత్రమే ఉన్నాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ వైద్యుల సంఖ్య 871 అవసరం కాగా, ప్రస్తుతం 659 మందే ఉన్నారు.
- జిల్లా ఆస్పత్రుల్లో డాక్టర్లు, స్పెషలిస్టులు 711 మంది అవసరం కాగా, ప్రస్తుతం 414 మందే పనిచేస్తున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 365 పీహెచ్‌సీలకుగాను 275 మాత్రమే ఉన్నాయి. అర్బన్ పీహెచ్‌సీల్లో 427 మంది వైద్యులవసరం కాగా 299 మందే పనిచేస్తున్నారు. 340 స్పెషలిస్టులకుగాను 192 మందే సేవలందిస్తున్నారు. 103 అనస్థీషియా పోస్టులకుగాను 52 మందే ఉన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



సాధారణంగా పురుషులతో పోలిస్తే మహిళల్లో మూత్రసంబంధమైన సమస్యలు, యూరినరీ ఇన్ఫెక్షన్లు ఎక్కువ. దీనికి తోడు బయటకు వెళ్లి పనిచేసే మహిళల్లో అంటే వర్కింగ్ ఉమెన్‌లో ఈ సమస్యలు మరింత ఎక్కువ. అంతేకాదు... ఈ సమస్యలు కేవలం వర్కింగ్ ఉమెన్‌లోనే కాకుండా స్కూళ్లు కాలేజీలకు వెళ్లే బాలికలు, యువతుల్లోనూ అలాగే ఎక్కువగా ప్రయాణాలు చేయాల్సిన వృత్తుల్లో ఉన్న మహిళల్లోనూ కనిపించవచ్చు. అలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుందాం.

సాఫ్టీ తెచ్చే యూరినారీ ప్రాబ్లెమ్స్!

గృహిణుల (హోమ్ మేకర్స్)తో పోలిస్తే బయటికి వెళ్లి పని చేసే మహిళలు (వర్కింగ్ ఉమెన్) తమకు ఉన్న కొన్ని రకాల పరిమితుల కారణంగా నీళ్లు తక్కువగా తాగుతుండటంతోపాటు మూత్రానికి వెళ్లాల్సి వచ్చినా బయట వాళ్లకు వసతిలేని కారణంగా ఎక్కువసేపు ఆపుకుంటుంటారు. దాంతో వారిలో కొన్ని సమస్యలు వస్తుంటాయి. అవి...

1. మూత్రంలో ఇన్ఫెక్షన్ (యూరినరీ ఇన్ఫెక్షన్స్), 2. మూత్ర విసర్జనలో సమస్యలు.... మళ్లీ ఈ మూత్ర విసర్జన సమస్యలు రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది బ్లాడర్ సామర్థ్యం తగ్గి త్వరత్వరగా మూత్రానికి వెళ్లాల్సి రావడం. రెండోది మూత్రం వస్తున్నట్లు అనిపిస్తున్నా విసర్జన సాఫీగా జరగక తీవ్రమైన నొప్పి రావడం. ఇవిగాక తక్కువగా నీళ్లు తాగడం వల్ల మూడో సమస్యగా కిడ్నీల్లో రాళ్లు వచ్చే ముప్పు కూడా ఉంటుంది.

ఎందుకీ సమస్యలు

● సాధారణంగా వర్కింగ్ ఉమెన్ మూత్రవిసర్జన చేసే పరిస్థితి రాకుండా ఉండటం కోసం నీళ్లు చాలా తక్కువగా తాగుతుంటారు. సౌకర్యాలు బాగుండే కొన్ని పెద్ద / కార్పొరేట్ ఆఫీసులు మినహాయిస్తే చాలా చోట్ల రెస్ట్‌రూమ్స్ అపరిశుభ్రంగా ఉండటం, శుభ్రం చేసుకోడానికి నీళ్లు అందుబాటులోకి లేకపోవడం, ఉన్నా అవి పరిశుభ్రంగా లేకపోవడం వంటి అనేక కారణాలతో నీళ్లు తక్కువగా తాగుతుంటారు

● ఇక మూత్రవిసర్జన చేయాల్సివచ్చినప్పుడు బయటి రెస్ట్‌రూమ్/బాత్‌రూమ్‌లు బాగుండవనే అభిప్రాయంతో మూత్రవిసర్జనకు వెళ్లకుండా ఆపుకుంటారు. ఇలా ఎక్కువ సేపు బిగబట్టడం వల్ల బ్లాడర్ సామర్థ్యం తగ్గుతుంది. ఇలా బిగబట్టడం చాలాకాలం పాటు కొనసాగితే మహిళల్లో మూత్ర సంబంధమైన సమస్యలొస్తాయి. ఆ సమస్యలేమిటో చూద్దాం.

● **మూత్ర సంబంధమైన ఇన్ఫెక్షన్లు (యూటీఐ) :** మూత్రమార్గంలో వచ్చే ఇన్ఫెక్షన్‌ను 'యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్' అంటారు. ఈ సమస్య ఎందుకు వస్తుందంటే... మూత్రపిండాలు దేహంలోని వ్యర్థాలను వడపోశాక, వ్యర్థాలను మూత్రం రూపంలో ఓ కండరనిర్మితమైన బెలూన్ లాంటి బ్లాడర్‌లో నిల్వ ఉంచుతాయి. ఈ బ్లాడర్ చివర స్పింక్టర్ అనే కండరాలు ఎప్పుడు బిడితే అప్పుడు మూత్రస్రావం కాకుండా ఆపుతుంటాయి. మూత్రాన్ని చాలాసేపటి వరకు (దాదాపు నాలుగ్గంటలకు పైబడి) ఆపుతుంటే అక్కడ బ్యాక్టీరియా వృద్ధిచెందుతుంది. ఆ బ్యాక్టీరియా కారణంగానే మూత్రంలో ఇన్ఫెక్షన్లు (యూటీఐ) వస్తుంటాయి. కొన్నిసార్లు ఈ ఇన్ఫెక్షన్లు మూత్రపిండాలకీ పాకవచ్చు. ఇది కాస్త ప్రమాదకరమైన పరిణామం. మొదటిసారి ఇన్ఫెక్షన్ రావడాన్ని 'ప్రైమరీ ఇన్ఫెక్షన్' అంటారు. అవే ఇన్ఫెక్షన్లు మళ్లీ మళ్లీ వస్తుంటే వాటిని 'రికరెంట్ యూరినరీ ఇన్ఫెక్షన్స్' అని అంటారు. మూత్రపిండాల్లో వచ్చే ఇన్ఫెక్షన్‌ను పైలోనెఫ్రైటిస్ అని అంటారు. ఇది కొంచెం సీరియస్ సమస్య.

లక్షణాలు : మూత్ర విసర్జన సమయంలో మంట, తరచూ మూత్రవిసర్జనకు వెళ్లాలని అనిపిస్తుండటం, చలిజ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నిర్ధారణ పరీక్షలు...

సాధారణ మూత్ర సమస్యలకు పెద్దగా పరీక్షలేమీ అవసరం ఉండవు. కానీ సమస్య మాటిమాటికీ వస్తుంటే అందుకు కారణాలు తెలుసుకునేందుకు కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షలు అవసరమవుతాయి. సాధారణంగా ● సీయూఈ ● యూరిన్ కల్చర్ ● అల్ట్రాసౌండ్ స్కానింగ్ ● సీటీ, ఎమ్మారై, ఎక్స్‌రే (ఐవీయూ, ఎంజీయూజీ లాంటివి) ● సిస్టోస్కోప్ (యూటీఐ) ● అవసరాన్ని బట్టి కొన్ని రక్తపరీక్షలు చేస్తుంటారు.

చికిత్స: యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లకు డాక్టర్లు సాధారణంగా నోటి ద్వారా తీసుకునే యాంటీబయాటిక్ మందులతో చికిత్స చేస్తుంటారు. అవసరాన్ని బట్టి ఒక్కోసారి అడ్వాన్స్‌డ్ యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి రావచ్చు. సమస్య ఇంకా ముదిరితే ఆసుపత్రిలో అడ్మిట్ చేసి, సమస్యకు అనుగుణంగా చికిత్స ఇస్తుంటారు.

బ్లాడర్ సంబంధమైన సమస్యలు

యూరినరీ బ్లాడర్ దాదాపు 500 ఎమ్ఎల్ మూత్రం నిల్వ ఉండే సామర్థ్యంతో ఉంటుంది. మూత్రం చాలాసేపు ఆపుకునేవారికి రెండు రకాల సమస్యలొస్తుంటాయి. మొదటిది... అదేపనిగా ఆపుకుంటూ ఉంటే బ్లాడర్ కండరాలు క్రమంగా నిల్వ చేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి. అలాంటప్పుడు 200 ఎమ్ఎల్ మూత్రం నిల్వకాగానే మూత్రవిసర్జన ఫీలింగ్ వచ్చేస్తుంది. ఎంతగా ఆపుకుందామన్నా ఆగక... మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంటుంది. ఇక రెండో రకం సమస్యలో... తరచూ మూత్రాన్ని ఆపుకోవడం అలవాటైపోవడంతో మూత్రాన్ని ఆపేందుకు ఉపయోగపడే స్పింక్టర్ కండరాలు గట్టిగా బిగుసుకుపోతాయి. ఈ రెండు రకాల సమస్యల్లో బ్లాడర్ పనితీరు (బ్లాడర్ ఫంక్షన్) తగ్గుతుంది. కొన్నాళ్ల తర్వాత అర్జెంట్‌గా వెళ్లాల్సి రావడం... లేదా కొంతమందిలో పాస్ చేసిన తర్వాత కూడా బ్లాడర్‌లో కొంత మిగిలిపోయుంటుంది. ఈ రకమైన సమస్యను 'డిస్‌ఫంక్షనల్ వాయిడింగ్' అంటారు.

లక్షణాలు : మూత్రం వస్తున్న ఫీలింగ్ కలిగినప్పుడు మూత్రానికి వెళ్తే... స్పింక్టర్ కండరాలు బిగుసుకుపోయి, ఎంతకీ రిలాక్స్ కాకపోవడంతో మూత్ర విసర్జన ఓ సమస్యగా మారుతుంది. మూత్రం సాఫీగా తేలిగ్గా రాదు, మూత్రవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి, బాధ కలుగుతుంది.

నిర్ధారణ / చికిత్స : బ్లాడర్ ఫంక్షన్ పరీక్షలతో దీన్ని నిర్ధారణ చేసి, దానికి అనుగుణంగా నొప్పిని నివారించే మందులతోనూ, కండరాలను రిలాక్స్ చేసే ఔషధాలతో చికిత్స అందిస్తారు.

● **మూత్రపిండాల్లో రాళ్లు :** ఇవి అనేక కారణాలతో వచ్చినప్పటికీ వర్కింగ్ ఉమన్‌లో మాత్రం నీళ్లు తక్కువగా తాగడం వల్ల ఇవి వస్తుంటాయి. ఎక్కువగా నీరు తాగని వారిలో వ్యర్థాలు స్ఫటికంలా మారడంతో ఇవి వస్తుంటాయి. ఇవి చాలా బాధాకరంగా పరిణమిస్తాయి. ఏర్పడ్డ స్ఫటికం సైజును బట్టి రకరకాల చికిత్సలు అవసరమవుతాయి.

నివారణ / పరిష్కారాలు : ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు యాంటీబయాటిక్స్ వంటి చికిత్సలు తీసుకోవడం కంటే ఈ సమస్యల నివారణ కోసం జాగ్రత్తలు అవసరం. బయటకు వెళ్లిన మహిళల మూత్రవిసర్జనకు మన దగ్గర పెద్దగా వసతులు ఉండవు. కాబట్టి ఇది ఒక సామాజిక సమస్య కూడా. ఈ సమస్యతో వచ్చే మహిళలకు డాక్టర్లు కొంత కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా నివారణ చర్యలను తెలుపుతారు. అవి...



● మహిళలకు బయటి బాత్‌రూమ్‌లకు వెళ్లాల్సి వస్తుందన్న బెరుకువీడి దేహ జీవక్రియలను అవసరమైనన్ని నీళ్లు తాగుతుండాలి.

● మరీ తప్పనప్పుడు ఎప్పుడో ఒకసారి మినహా... వస్తున్నట్లు అనిపించగానే మూత్రవిసర్జనకు వెళ్లాలి. ● మూత్ర పిండాల్లో రాళ్లను నివారించడానికి కొన్ని రకాల ఫాస్ట్‌ఫుడ్, యానిమల్ ప్రోటీన్, చీజ్, చాక్లెట్ల వంటివి వీలైనంత తక్కువగా తీసుకోవాలి. కొన్ని ఆహారాల కారణంగా కొందరిలో స్ఫటికాలు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. అలాంటివారు తమకు సరిపడనివాటిని వాటికి దూరంగా ఉండాలి.



● క్రానిక్... పానిక్

వేడివేడిగా బాడీ రిపేర్

దేహంలోకి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్ ప్రవేశించడం గానీ లేదా ఏవైనా గాయాలైనప్పుడుగానీ ఆ హానికారక సూక్ష్మజీవులతో పోరాడి, శరీరాన్ని రక్షించుకునేందుకు రోగ నిరోధక వ్యవస్థ... ఇన్‌ఫ్లమేషన్ అనే స్వాభావికమైన చర్య జరిగేలా చూస్తుంది. తెల్లరక్త కణాలపై. దేహాన్ని రక్షించేందుకు అవసరమైన కొన్ని రసాయనాలను పంపుతుంది.

గాయమైనప్పుడు ఆ ప్రదేశం ఎర్రబారడం, వాపురావడం, మంట అనిపించడం గమనించవచ్చు. అంటే వ్యాధి నిరోధక వ్యవస్థ... ఆ గాయాన్ని మాన్పే పని మొదలుపెట్టిందనేందుకు నిదర్శనాలే ఆ గుర్తులు. ఉదాహరణకు ఒకరి వేలు తెగిందనుకుందాం. వెంటనే వ్యాధి నిరోధక వ్యవస్థ రంగంలోకి దూకుతుంది. తెగిన ప్రాంతం చుట్టూ ఎర్రబడి, వాపు వస్తుంది. తెగడంతో గాయమైన కణజాలాన్ని రిపేరు చేసేందుకు ఉపక్రమించాయన్నమాట.

అలాగే జలుబు చేసినా లేదా దేహంలోకి జలుబు కలగజేసే వైరస్‌లాంటిది ఇంకోటి ఏదో ప్రవేశించిందంటే... దాన్ని తుదముట్టించేందుకు జ్వరం వస్తుంది. అంటే దేహం ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా ఆ వేడిమి సహాయంతో శత్రు వైరస్‌ను కాల్చేటందుకే దేహపు ఉష్ణోగ్రత పెరుగుతుంది. అంటే జ్వరం అనేది దేహం తాలూకు ఓ 'ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్' అన్నమాట.

కొద్దికాలం పాటు మాత్రమే ఉండే ఇన్‌ఫ్లమేషన్‌ను 'అక్యూట్ ఇన్‌ఫ్లమేషన్' అనీ, అదే దీర్ఘకాలం పాటు కొనసాగితే దాన్ని 'క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్' అని వ్యవహరిస్తారు. అక్యూట్ ఇన్‌ఫ్లమేషన్‌తో పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చుగానీ... చాలాకాలం పాటు ఉండే 'క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్' మాత్రం ఒక్కోసారి చాలా ప్రమాదకరం.

ఒక ఇన్‌ఫ్లమేషన్ చాలాకాలం పాటు కొనసాగుతోందంటే... శత్రువును ఎదుర్కొనేందుకు దేహం, దాని తాలూకు వ్యాధి నిరోధక వ్యవస్థ చాలా చురుగ్గా, సుదీర్ఘకాలం పాటు అలర్ట్‌గా ఉన్నాయని అర్థం.

ఓ వ్యక్తి అనారోగ్యకరమైన జీవనశైలితో జీవిస్తున్నా, అతడు చాలాకాలంగా చాలా ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నా, అతడు తీసుకుంటున్న ఆహారం అంతగా ఆరోగ్యకరంగా లేకపోయినా... ఈ అంశాలన్నీ అతడిలోకి వ్యాధి నిరోధక వ్యవస్థపై ఒత్తిడి కలగజేస్తూ, దాన్ని ఎప్పుడూ అలర్ట్‌గా ఉంచుతాయి. దాంతో ఇన్‌ఫ్లమేషన్ సుదీర్ఘకాలం పాటు (క్రానిక్‌గా) కొనసాగుతుంది. అప్పుడా పోరాటం శత్రుకణాల మీద కాకుండా సొంత కణాల మీదే జరుగుతుండటం వల్ల... ఈ పోరులో ఆరోగ్యకరమైన కణాలూ దెబ్బతింటుంటాయి.

ఉదాహరణకు ఓ వ్యక్తి తీసుకునే ఆహారంలో ప్రాసెస్‌డ్ ఐటమ్స్ ఎక్కువగా ఉన్నా లేదా చక్కెరలను ఎక్కువగా తీసుకుంటున్నా అతడిలో క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్ వచ్చేందుకు అవకాశాలెక్కువ. అది సుదీర్ఘకాలం కొనసాగుతున్నందు ఆరోగ్యవంతమైన కణాలనూ నాశనం చేసే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి సుదీర్ఘ ఇన్‌ఫ్లమేషన్స్‌తో ఆరోగ్యవంతమైన కణజాల వ్యవస్థలు దెబ్బతినడంతో అక్రమంగా గుండెజబ్బులు, డయాబెటిస్‌తో పాటు కొన్ని రకాల క్యాన్సర్లకు దారితీయవచ్చు. ఇక ఆ ఇన్‌ఫ్లమేషన్ జీర్ణవ్యవస్థలో వస్తే అది ఆరోగ్యంపై రకరకాల దుష్ప్రభావాలను కలగజేయవచ్చు.

ఓ వ్యక్తిలో అతడి జీర్ణవ్యవస్థ చాలా కీలకమైనది. ఆహారాన్ని జీర్ణం చేయడం ద్వారా అది దేహంలోని కోటానుకోట్ల (ట్రిలియన్ల కొద్దీ) కణాలకు జీవశక్తిని అందజేయడం, అక్కడ వ్యర్థాలను తొలగించడం వంటి పనులు చేస్తుంది. ఈ జీర్ణవ్యవస్థే దేహానికి మేలు చేసే ట్రిలియన్లకొద్దీ సూక్ష్మజీవుల (మైక్రోబ్స్)కు ఆవాసం. వీటినే గట్ మైక్రోబియమ్ అంటారు. ఒక వ్యక్తి తాలూకు మూడ్స్ (భావోద్వేగాల)కూ ఇవే కారణం. అతడి వ్యాధి నిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడంలోనూ ఇవే కీలకం. అన్నట్టు వ్యాధి నిరోధక వ్యవస్థకు చెందిన కణజాలంలో 70 – 80 శాతం వరకు జీర్ణవ్యవస్థలోనే ఉండటమనే అంశం కూడా ఓ వ్యక్తి తాలూకు వ్యాధి నిరోధక వ్యవస్థకు అతడి జీర్ణవ్యవస్థ ఎంతగా ఊతం ఇస్తుందో ఈ అంశం తెలియజేస్తుంది.

ఇంతటి కీలకమైన జీర్ణవ్యవస్థలో క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్ వచ్చిందంటే అది 'లీకీ గట్ సిండ్రోమ్' లాంటి ఎన్నో అనర్థాలకు దారి తీయవచ్చు. మానసికాందోళనలు మాటిమాటికీ తలెత్తే వాళ్లలో కొందరిలో పేగుల్లోని గోడలు చిట్లుతాయి. ఈ పరిస్థితినే 'లీకీ గట్' అంటారు. ఇలా పేగుల్లోని గోడలు చిట్లడం జరిగితే దేహంలోని ప్రమాదకరమైన విషపదార్థాలూ, జీర్ణం కాని వ్యర్థాలూ, బ్యాక్టీరియా.. ఇవన్నీ రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తాయి. ఈ ప్రక్రియ మరింత ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రేరేపిస్తుంది. దాంతో సొంత వ్యాధినిరోధక వ్యవస్థే తన కణజాలంపై ప్రతికూలంగా పనిచేసే ఆటో ఇమ్యూన్ డిసీజెస్ వంటి వ్యాధులూ, చర్మరోగాలు, కీళ్లనొప్పులు వస్తాయి. ఇక మానసిక సమస్యలైన డిప్రెషన్ వంటివీ రావచ్చు.

జీర్ణవ్యవస్థలో వచ్చే ఇన్‌ఫ్లమేషన్ పేగుల్లోని మంచి బ్యాక్టీరియా అయిన గట్ మైక్రోబియమ్ సమతౌల్యతను దెబ్బతీయవచ్చు. దాంతో కడుపుబ్బరం, మలబద్ధకం, నీళ్ల విరేచనాలు వంటి జీర్ణవ్యవస్థకు సంబంధించిన అనేక అనారోగ్యాలు కనిపించవచ్చు. గట్ మైక్రోబియమ్ దెబ్బతినడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడేందుకూ అవకాశముంది. గట్ మైక్రోబియమ్ దెబ్బతినడం వల్ల ఇన్‌ఫ్లమేషన్... మళ్లీ ఈ ఇన్‌ఫ్లమేషన్ వల్ల మైక్రోబియమ్ సమతౌల్యత మరింత దెబ్బతినడం... ఈ విషవలయం ఇలా కొనసాగుతూ జీర్ణవ్యవస్థ మరింతగా దెబ్బతింటుంది. దాంతో జీర్ణవ్యవస్థ పనితీరూ దెబ్బతింటుంది.

అందుకే జీర్ణవ్యవస్థ బాగుంటేనే వ్యాధి నిరోధక వ్యవస్థ మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. సంతోషకరమైన భావోద్వేగలతో మూడ్స్ బాగుంటాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే దీర్ఘకాలిక (క్రానిక్) ఇన్‌ఫ్లమేషన్స్ సైతం తగ్గుతాయి. ఇతర దీర్ఘకాలిక జబ్బులు... అంటే గుండెజబ్బులు, ఊబకాయం, డయాబెటిస్ వంటివి నివారితమవుతాయి. అందుకే ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ ఉందంటే... దేహమంతా ఆరోగ్యంగా ఉందనీ, వ్యాధి నిరోధక వ్యవస్థ కూడా చురుగ్గా ఉందని అర్థం.



వైట్... రైటే!

తెలుపు రంగులో ఉండే ఆహారాలు ఎప్పుడూ ప్రమాదం తెచ్చిపెడుతుంటాయని పలువురు అభిప్రాయపడుతుంటారు. అందుకే ఆహారంలో తెల్లగా కనిపించే వాటిని పక్కన పెట్టాలంటూ కొందరు నిపుణులు సైతం చెబుతుంటారు. అయితే తెల్లనివన్నీ కీడు చేసేవి కాదు.

తెలుపు రంగులో ఉండే ఆహార పదార్థాల్లో బాగా పాలిష్ చేసిన బియ్యం (అయితే దంపుడు బియ్యం (బ్రౌన్ రైస్) దీనికి మినహాయింపు), చక్కెర, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం... ఈ మూడూ ఆరోగ్యానికి కొంత చేటు చేసేవే.

అవి మినహాయిస్తే తెల్లటి రంగులో ఉండే అనేక ఆహార పదార్థాలైన ఉల్లి, వెల్లుల్లి, కాలీఫ్లవర్, వైట్ క్యాబేజీ, తెల్లవంకాయ, వైట్ మష్రూమ్స్ అనేవి ఆరోగ్యానికి ఎప్పుడూ మేలు చేసేవే.

మేలు చేసే తెల్లటి ఆహారాలివి...

ఉల్లి, వెల్లుల్లి : తెల్లటివే అయినా తమ ఘాటుదనంతో క్యాన్సర్‌ను అవి తరిమి కొడతాయి. వాటిల్లోని అలిసిన్ అనే పోషకం (ఫైటో కెమికల్) అనేక రకాల క్యాన్సర్లను నివారించడమే కాదు... రక్తంలోని హానికరమైన కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గిస్తుంది. పొట్ట, పెద్దపేగు మలద్వార క్యాన్సర్లతో పాటు అనేక రకాల క్యాన్సర్లతో పాటు గుండెజబ్బులను వెల్లుల్లి, ఉల్లి నివారిస్తాయి.

కాలీఫ్లవర్ / వైట్ క్యాబేజీ : వీటిల్లో సమృద్ధిగా ఉండే ఐసోథయనేట్స్, ఐసోఫ్లేవోన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ అనేక రకాల క్యాన్సర్లను సమర్థంగా నివారిస్తాయి. మెదడుకు చురుకుదనాన్నీ ఇస్తాయి.

తెల్లముల్లంగి : ఈ దుంప ఎరుపుతో పాటు తెల్లరంగులోనూ లభ్యమవుతుంది. దీన్ని చాలా శక్తిమంతమైన డీ–టాక్సిఫైయర్‌గా చెబుతారు. అంటే దేహంలో పేరుకున్న విషాలను బయటికి పంపి, కాలేయానికి చాలా మేలు చేస్తుందది. కామెర్లు వచ్చిన వాళ్లలో నాశమయ్యే ఎర్రరక్తకణాలను కాపాడటం ద్వారా కణాలన్నింటికీ పోషకాలూ, ఆక్సిజన్ సాఫీగా అందేలా తోడ్పడుతుంది. సాధారణంగా డయాబెటిస్ ఉన్నవారు తీసుకోకూడదని చెప్పే దుంపకూరల్లో ముల్లంగికి మినహాయింపు ఉంటుంది. దానిలో ఉండే ఫైబర్ కారణంగా అది దేహంలోకి చక్కెర చాలా మెల్లగా విడుదలయ్యేలా చేయడం ద్వారా రక్తంలోని చక్కెర మోతాదులను అదుపులో ఉంచుతుంది. ముల్లంగిలోనూ క్యాన్సర్‌ను ఎదుర్కొనే యాంటీ–క్యాన్సరస్ గుణాలున్నాయి. వీటిలోని యాంటీఫంగల్ ప్రోటీన్ 'ఆర్ఎస్ఏఎఫ్‌పీ2' ఫంగల్ వ్యాధులను నివారిస్తుంది.

అలాగే తెల్లవంకాయ, తెల్ల మష్రూమ్స్ వ్యాధినిరోధక శక్తిని మరింత బలోపేతం చేస్తాయి. వాటిల్లోని బీటా–గ్లూకాన్స్ అని పిలిచే పాలీసాకరైడ్స్ తెల్లరక్తకణాల ఉత్పత్తికి తోడ్పడతాయి. తద్వారా వ్యాధి నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేస్తాయి. ఇక వాటిల్లో ఉండే ఎపిగల్లొకాటెచిన్ గ్యాలేట్ (ఈజీసీజీ) అనే పోషకం క్యాన్సర్‌తో పాటు ఎన్నెన్నో వ్యాధుల నుంచి కాపాడుతుంది.





రక్తహీనత పురుషులూ, మహిళలూ, చిన్నారులూ ఇలా అందరిలోనూ కనిపించే సమస్యే అయినా మహిళల్లో మరింత ఎక్కువ. భారతీయ మహిళల్లో రక్తహీనతతో బాధపడేవారు చాలా ఎక్కువని అనేక అధ్యయనాలూ, కేస్ స్టడీస్ చెబుతున్నాయి. నెలసరి వంటి సమస్యలు మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉండేందుకు కారణమవుతున్నాయి. రక్తహీనత అంటే ఏమిటి, సమస్య పరిష్కారం కోసం మహిళలు అనుసరించాల్సిందేమిటి అనే విషయాలను చూద్దాం...

అనీమియా వద్దు... 'ఐరన్' లేడీలా ఉందాం!

ఎర్రరక్తకణాలు మన శరీరంలోని అన్ని అవయవాలకూ రక్తాన్ని మోసుకుని వెళ్తుంటాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల అన్ని అవయవాలకూ తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో అది ప్రమాదకరంగా పరిణమిస్తుంది. రక్తహీనతల్లోనూ ఐరన్‌లోపం వల్ల కలిగేది చాలా సాధారణమైనది. మన శరీరంలోని రక్తం ఎర్రగా ఉండటానికి అందులోని హీమోగ్లోబిన్ అనే పదార్థం కారణం. మన శరీరంలో 100 గ్రాముల రక్తంలో... హీమోగ్లోబిన్ పరిమాణం మగవారిలోనైతే 13 గ్రాములు, మహిళల్లోనైతే 12 గ్రాములు, ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లల్లో 12 గ్రాములు ఉండాలి. ఒకవేళ ఈ హీమోగ్లోబిన్ పరిమాణం ఇంతకంటే తక్కువగా ఉంటే వారు రక్తహీనతతో బాధపడుతున్నట్లు చెప్పవచ్చు.

జాగ్రత్తలు / చికిత్స

ఐరన్ పుష్కలంగా లభించే ఆహారం అయిన కాలేయం, ఆకుపచ్చటి ఆకుకూరలు, నువ్వులు, ఖర్జూరం, అటుకులు, బెల్లం వంటివి ఎక్కువగా తీసుకోవాలి. అవసరమైనవారు డాక్టర్ సలహా మీద ఐరన్ ట్యాబ్లెట్లు వాడాలి. ఇలాంటి టాబ్లెట్లు వాడే సమయంలో కొందరికి మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఇవి డాక్టర్ల సలహా మేరకు వాడాలి. అప్పుడు డాక్టర్లు వారికి సరిపడే అనీమియా మందుల్ని సూచిస్తారు. మరీ రక్తహీనత ఎక్కువగా ఉంటే అవసరాన్ని బట్టి రక్తం ఎక్కించాలి.

కారణాలు

మహిళలు తమ నెలసరి వల్ల ప్రతి నెలా రక్తాన్ని కోల్పోతుంటారు. కాబట్టి వాళ్లలో రక్తహీనతకు అది ప్రధాన కారణం. మరి కొందరిలో ఎర్రరక్తకణాల తయారీ ప్రక్రియ దెబ్బతినడం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. ఇక కొత్త ఎర్రరక్తకణాలు తయారయ్యే లోపే కొందరిలో పాతవి వేగంగా చనిపోవడం వల్ల కూడా రక్తహీనత వస్తుంది. మహిళల్లో రుతుస్రావంతో పాటు బిడ్డకు జన్మనిచ్చే సమయంలో అతిగా రక్తంపోవడం, యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ ఉండటం వంటి అంశాలు కూడా రక్తహీనతకు కారణమవుతాయి.

లక్షణాలు

అనీమియా లక్షణాలు కొందరు మహిళల్లో కాస్త తక్కువగానూ, మరి కొందరిలో తీవ్రంగా ఉంటాయి.

రక్తహీనత వచ్చిన వారిలో ఎర్రరక్తకణాల (రెడ్ బ్లడ్ సెల్స్ / ఎరిథ్రోసైట్స్) సంఖ్య తగ్గిపోవడం వల్ల చర్మం పాలిపోయినట్లు కనిపించడం, గోర్ల కింద రక్తం లేనట్టుగా తెల్లగా కనిపించడాన్ని అనీమియాకు సూచనగా పరిగణించవచ్చు. అనీమియా తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు... ● శ్వాస కష్టంగా ఉండటం ● కొద్దిపాటి నడకకే ఆయాసం ● అలసట ● చికాకు / చిరాకు / కోపం ● మగత ● తలనొప్పి ● నిద్ర పట్టకపోవడం ● పాదాలలో నీరు చేరడం ● ఆకలి తగ్గడం ● కాళ్లచేతుల్లో తిమ్మిర్లు, చల్లగా మారడం ● ఛాతీనొప్పి ● త్వరగా భావోద్వేగాలకు గురికావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

రక్తహీనత ఉన్న మహిళలు తప్పనిసరిగా డాక్టర్ చేత పరీక్షలు చేయించుకుని తమ అనీమియాకు నిర్దిష్టంగా కారణమేమిటో తెలుసుకోవాలి. అసలు కారణాన్ని తెలుసుకుని దానికి సరైన చికిత్స ఇస్తే అనీమియా తగ్గుతుంది. ఆ తర్వాత మాత్రమే అవసరాన్ని బట్టి అనంతర చికిత్స తీసుకోవాలి.

మోకాలి నొప్పికి మెయిడ్ పేరు!



ఆ వైద్యసమస్య పేరే 'హౌజ్ మెయిడ్ నీ పెయిన్'! వైద్య పరిభాషలో ''ప్రెపటెల్లార్ బర్సయిటిస్'' అనే ఓ జబ్బుకు పనిమనిషి పేరు పెట్టడం విశేషం. వాడుక పేరుగా పనిమనిషి (మెయిడ్) పేరు పెట్టిన ఆ జబ్బును ''హౌజ్ మెయిడ్స్ నీ'' అంటారు. ఇంటిని తుడిచే వారు రెండు మోకాళ్లనూ గచ్చు మీద ఆనించి, మరో చేతిని నేలకు ఆనించి ఇంకో చేత్తో గుడ్డతో తుడుస్తూ ఉండటంతో మోకాళ్లు ఒరుసుకుపోయి నొప్పి వస్తుంది. అందుకే ఆ జబ్బుకు ఆ పేరు.

అలాగని అది కేవలం పనిమనుషులకు వచ్చే సమస్య అనుకుంటే పొరబాటే. మోకాళ్లను నేలకు ఆనించి పనిచేసే వృత్తుల్లోని వారందరిలో (ఉదాహరణకు ప్లంబర్లు, గార్డెనర్లూ)నూ ఆ జబ్బు కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆటల్లో నేల మీదికి దూకే సమయంలో మోకాళ్లు నేల మీద దోక్కుపోయే క్రీడాకారులకు కూడా ఈ నొప్పి వస్తుంటుంది. ఇలా ఎంతో మందిలో ఆ జబ్బు కనిపిస్తున్నప్పటికీ దానికి ''హౌజ్ మెయిడ్స్ నీ'' అనే పేరు స్థిరపడింది.

చికిత్స... నొప్పి తొలిదశల్లో మోకాలికి ఐస్ పెట్టడం, పడుకునే/నిద్రపోయే సమయంలో ఆ భాగం కాస్త ఎత్తుగా ఉండేలా మోకాలి కింద దిండు పెట్టడం, విశ్రాంతి ఇవ్వడం వంటివి చేయాలి. ఆటగాళ్లకు లేదా ఇతరత్రా వృత్తుల్లోని వారికి నొప్పి మరీ ఎక్కువగా ఉంటే డాక్టర్లు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ నొప్పి నివారణ మందులను ఇస్తారు. సూచిస్తారు. ఇక క్రీడాకారుల్లో ఈ సమస్య రాకుండా నివారించేందుకు 'నీ–ప్యాడ్స్' స్ట్రెచ్చింగ్ వ్యాయామాలతో పాటు... మోకాళ్లకు దెబ్బతగిలినప్పుడు క్రీడలకూ, ప్రాక్టీస్‌కూ విశ్రాంతి ఇవ్వడం వంటి పెయిన్ మేనేజ్‌మెంట్ ప్రక్రియలను డాక్టర్లు సూచిస్తుంటారు.

ఇన్ఫీ ఇన్‌సైడర్ కేసులో ఉపశమనం

16 సంస్థలపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేర్ల ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసులో కంపెనీ మాజీ ఉద్యోగిసహా 16 సంస్థలు, వ్యక్తులకు ఉపశమనం లభించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా వీటిపై నిషేధాన్ని ఎత్తివేసింది. ఇన్ఫోసిస్ కేసులో అమిత్ భూత్రా, భరత్ సి.జైన్, క్యాపిటల్ వన్ పార్ట్‌నర్స్, టిసోరా క్యాపిటల్, మనీష్ సి.జైన్, అంకుశ్ భూత్రాపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు సెబీ పేర్కొంది. గతంలో జారీ చేసిన మధ్యంతర ఆదేశాలను తొలగిస్తున్నట్లు తెలియజేసింది. వీటిని ఇప్పటికే శాట్ కొట్టివేసిన నేపథ్యంలో గత ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు సెబీ హోల్‌టైమ్ డైరెక్టర్ అశ్వనీ భాటియా 57 పేజీల తుది ఆదేశాలలో పేర్కొన్నారు. 2019 డిసెంబర్- 202 సెప్టెంబర్ మధ్య కాలంలో కంపెనీ ఆర్థిక ఫలితాల సందర్భంగా ఇన్ఫోసిస్ షేర్లలో అనుమానాస్పద లావాదేవీలు నమోదైనట్లు సెబీ ప్రాథమికంగా అభిప్రాయపడింది. దీంతో కొన్ని సంస్థలపై 2021 మే నెలలో నిషేధాన్ని విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

స్పైస్‌జెట్ నిధుల సమీకరణ

రూ. 3,200 కోట్లపై కన్ను

ముంబై: చౌక ధరల ఎయిర్‌లైన్స్ సంస్థ స్పైస్‌జెట్ నిధుల సమీకరణ ప్రణాళికలకు తెరతీసింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్), వారంట్లు, ప్రమోటర్ల మూలధన పెట్టుబడుల ద్వారా మొత్తం రూ. 3,200 కోట్లు సమకరించనున్నట్లు కంపెనీ తెలియజేసింది. నిధులను సర్వీసులు నిలిచిపోయిన విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించేందుకు వినియోగించనున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా బకాయిల సెటిల్‌మెంట్, కొత్త విమానాలను ప్రవేశపెట్టడం తదితర అవసరాలకు వెచ్చించనున్నట్లు వివరించింది. క్విప్ ద్వారా రూ. 2,500 కోట్లు, గత వారంట్లు, ప్రమోటర్ పెట్టుబడుల ద్వారా రూ. 736 కోట్లు సమీకరించనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రతిపాదనలకు వాటాదారుల అనుమతి కోరనుంది. ఈ ఏడాది జనవరిలో అజయ్ సింగ్ ప్రమోట్ చేసిన కంపెనీ ప్రిఫరెన్షియల్ ఇష్యూల ద్వారా కేవలం రూ. 1,060 కోట్లు సమకూర్చుకుంది. నిజానికి గతేడాది డిసెంబర్‌లో రూ. 2,250 కోట్లు సమీకరించే ప్రణాళికలు ప్రకటించింది. విమానాల సంఖ్య తగ్గిపోవడం, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, స్థిరవ్యయాలు, ఎయిర్‌పోర్ట్స్‌లో అద్దెలు పెరిగిపోవడం తదితరాలు ప్రస్తుత సమస్యలకు కారణమని స్పైస్‌జెట్ వివరించింది. కంపెనీ నిర్వహణలోని విమానాల సంఖ్య 2019లో నమోదైన 74 నుంచి 28కు పడిపోగా.. నిధుల సమస్యతో 36 విమానాలు నిలిచిపోయినట్లు ప్రస్తావించింది. అయితే ప్లేన్‌స్పాటర్.నెట్ వెబ్‌సైట్ ప్రకారం సెప్టెంబర్‌లో 20 విమానాలు మాత్రమే సర్వీసులను అందిస్తుండగా.. 38 నిలిచిపోయాయి. చెల్లింపుల వైఫల్యం నేపథ్యంలో కంపెనీ రుణదాతలు, వెండార్లు కోర్టుకు వెళ్లడం ప్రభావం చూపినట్లు తెలుస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-9-2024	
విశాఖ	525-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,920.00	2.85
SHRIRAMFIN	3,310.15	2.3
ICICIBANK	1,233.45	2.09
ITC	511.5	1.95
BRITANNIA	5,945.00	1.74

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	299.8	-2.91
TECHM	1,583.00	-2.48
BPCL	347.95	-1.19
TATASTEEL	149.5	-1.14
HINDALCO	660	-1.06

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,540
ఎన్ఎస్ఈ	1,06,252
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,84,799
ఎఫ్ఐఐ	+ 1,177
డీఐఐ	+ 1,757

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.69	$ 67.67
బ్రెంట్	71.79	$ 71.06

వ్యవసాయ రసాయనాల ఎగుమతులు... నాలుగేళ్లలో రెట్టింపు

రూ. 80,000 కోట్లకు అప్!

ఏసీఎఫ్ఐ-ఈవై నివేదిక అంచనా ● ప్రస్తుత విలువ రూ. 43,223 కోట్లు



న్యూఢిల్లీ: పరిశ్రమకు అనుకూలమైన పరిస్థితులు, అవకాశాలు కల్పిస్తే భారత్ వ్యవసాయ రసాయన ఎగుమతులు రాబోయే నాలుగేళ్లలో రూ. 80,000 కోట్లకు పెరిగే అవకాశం ఉందని ఏఎఫ్‌సీఐ-ఈవై నివేదిక ఒకటి పేర్కొంది. ఇండస్ట్రీ ప్రతినిధ్య సంస్థ అగ్రో కెమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏసీఎఫ్ఐ)-ఈవై సంయుక్తంగా ''భారత వ్యవసాయ రసాయన పరిశ్రమ: ప్రస్థానం, సవాళ్లు, ఆకాంక్షలు' అన్న శీర్షికన ఈ నివేదిక రూపొందింది. ఏసీఎఫ్ఐ ఏడవ సార్వత్రిక సమావేశం నేపథ్యంలో విడుదలైన ఈ నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...

- 2022-23 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రసాయనాల ఎగుమతుల విలువ రూ.43,223 కోట్లు.
- భారత్ వ్యవసాయ రసాయన ఎగుమతులు దేశీయ వినియోగం కంటే ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ రసాయన పరిశ్రమల దన్నుతో భారత్ ఎగుమతులు ఇటీవలి కాలంలో ప్రశంసనీయమైన వృద్ధిని నమోదు చేసుకున్నాయి.

నివేదిక ప్రకారం... భారత మార్కెట్‌లో వ్యవసాయ రసాయన వినియోగం (కేజీ/హెక్టార్‌కు) తక్కువగా ఉంది. నివేదికల ప్రకారం భారతదేశం హెక్టారుకు 400 గ్రాముల వ్యవసాయ రసాయనాలను మాత్రమే వినియోగిస్తోంది. ఇది ప్రపంచ సగటు 2.6 కేజీ/హెక్టార్ కంటే తక్కువగా ఉంది.

- లైసెన్సింగ్ నిబంధనలను క్రమబద్ధీకరించడం, నిల్వ, విక్రయాల కోసం మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, బయోపెస్టిసైడ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహించడం, కొత్త మాలిక్యులస్‌లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడం, సడలించిన ఎంఆర్‌ఎల్ నిబంధనలతో దేశాలతో వాణిజ్య ఒప్పందాలను చేసుకోవడం, అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుండి పెట్టుబడులను ఆకర్షించడానికి పీఎల్ఐ తరహాలో ఒక పథకాన్ని ఆవిష్కరించడం వంటి పలు చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి.
- వస్తు సేవల పన్నును (జీఎస్‌టీ) 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమల సంఘం కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేస్తుండడం గమనార్హం.
- 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించగల దేశంగా భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా రూపొందాలి. ఇందుకు సంబంధించి వృద్ధి అవకాశాల అన్వేషణలో వ్యవసాయ రసాయన పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. వ్యవసాయ ఉత్పాదకత, ఆహార భద్రత, ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించడంలో అగ్రోకెమికల్ పరిశ్రమ పాత్ర ఎంతో కీలకం కానుంది.
- ప్రపంచవ్యాప్తంగా నాల్గవ అతిపెద్ద వ్యవసాయ రసాయనాల ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, భారతదేశం ఒక వైరుధ్య పరిస్థితిని ఎదుర్కొంటోంది. దేశం గణనీయమైన ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటికీ గణనీయమైన స్థాయిలో వ్యవసాయ రసాయనాలను దిగుమతి చేసుకుంటుంది. ప్రత్యేకించి చైనా నుంచి ఈ దిగుమతులు జరుగుతున్నాయి.
- ''మేక్ ఇన్ ఇండియా' చొరవతో పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాల్సి ఉంది. అవకాశాలుగా మార్చడానికి సకాలంలో తగిన ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుకావాలి. ఆయా చర్యలు దేశాన్ని వ్యవసాయ రసాయనాల కోసం ప్రపంచ తయారీ ఎగుమతి కేంద్రంగా మారడానికి వీలు కల్పిస్తుంది.

బజాజ్ హౌసింగ్ ఐపీవోకు ఇన్వెస్టర్ల క్యూ

తొలిరోజే భారీగా దరఖాస్తులు



న్యూఢిల్లీ: అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ.. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ చేపట్టిన పబ్లిక్ ఇష్యూకి తొలి రోజే(9న) భారీ స్పందన కనిపించింది. ప్రారంభమైన కొద్ది గంటల్లోనే పూర్తిస్థాయిలో సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 72,75,75,756 షేర్లను విక్రయానికి ఉంచగా.. 146,58,24,030 షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి ఇష్యూకి రెట్టింపునకుపైగా స్పందన లభించింది. రూ. 66-70 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 6,560 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఇష్యూ ఈ నెల 11న ముగియనుంది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం క్విబ్ విభాగంలో 1.07 రెట్లు, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి 4.35 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైలర్లు సైతం 1.5 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. వారాంతాన యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 1,758 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే. ఇష్యూలో భాగంగా రూ. 3,560 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 3,000 కోట్ల విలువైన షేర్లను మాతృ సంస్థ బజాజ్ ఫైనాన్స్ ఆఫర్ చేస్తోంది.

ఒకసారి చార్జింగ్‌తో 949 కిలోమీటర్లు

గిన్నిస్ రికార్డుల్లోకి బెంజ్ కారు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఒకసారి చార్జింగ్‌తో 949 కిలోమీటర్ల ప్రయాణం. ఇంకేముంది గతంలో ఉన్న రికార్డును తిరగరాసి గిన్నిస్ రికార్డు సొంతం చేసుకుంది మెర్సిడెస్ బెంజ్ ఇండియా. ఆటోకార్ ఇండియా సహకారంతో మెర్సిడెస్ బెంజ్ బ్యాటరీ ఎలక్ట్రిక్ లగ్జరీ సెడాన్ వెహికిల్ అయిన ఈక్యూఎస్ 580 4మేటిక్ బెంగళూరు నుంచి నవీ ముంబై వరకు ప్రయాణించి ఈ ఘనతను సాధించింది. ఒక వైపు భారీ వర్షాలు, రోడ్డు విస్తరణ పనులు.. మరో వైపు నగరాలు, పట్టణాల ట్రాఫిక్‌ను ఛేదించుకుంటూ ఏకధాటిగా ప్రయాణం సాగిందని మెర్సిడెస్ బెంజ్ తెలిపింది. మెర్సిడెస్ బెంజ్ ఈక్యూఎస్ 580 4మేటిక్ కారు 107.8 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో రూపుదిద్దుకుంది. ఏఆర్ఏఐ ప్రకారం ఒకసారి చార్జింగ్‌తో గరిష్ఠంగా 857 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. కాగా, ఇప్పటి వరకు యూకేలో 'ఫోర్డ్ మస్టాంగ్ మ్యాక్ ఈ' కారు పేరిట ఈ గిన్నిస్ రికార్డు ఉంది. ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 916.74 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది.

హ్యుందాయ్ కొత్త అల్కజార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా ఆధునీకరించిన ఎస్‌యూవీ అల్కజార్ విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.14.99 లక్షల నుంచి ప్రారంభం. నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. 1.5 లీటర్ టర్బోచార్జ్‌డ్ పెట్రోల్ ఇంజన్, 1.5 లీటర్ యూ2 సీఆర్‌డీఐ డీజిల్ ఇంజన్‌తో తయారైంది. 6 స్పీడ్ మాన్యువల్ లేదా 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌ను ఎంచుకోవచ్చు. సీట్ల సామర్థ్యం 6 లేదా 7. మైలేజీ 20.4 కిలోమీటర్ల వరకు ఇస్తుందని కంపెనీ తెలిపింది. 6 ఎయిర్‌బ్యాగ్స్, పెడల్ షిఫ్టర్, ట్రాక్షన్ మోడ్స్, హిల్ డీసెంట్ కంట్రోల్, డిజిటల్ కీ, ఎంబెడెడ్ వాయిస్ రికగ్నిషన్ కమాండ్స్, ట్విన్ టీఎఫ్‌టీ యూనిట్స్, డిజిటల్ డ్యాష్‌బోర్డ్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, కనెక్టెడ్ కార్ టెక్, వెంటిలేటెడ్ సీట్స్, నావిగేషన్, వైర్‌లెస్ చార్జింగ్, 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్‌రూఫ్, అడాస్ లెవెల్-2 వంటి హంగులు జోడించింది. కియా కరెన్స్, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, టాటా సఫారీ, ఎంజీ హెక్టర్ ప్లస్‌కు అల్కజార్ పోటీనిస్తుంది.



దేశీ స్టార్టప్ పిక్సెల్‌కు నాసా కాంట్రాక్టు

న్యూఢిల్లీ: దేశీ ప్రైవేట్ స్పేస్‌క్రాఫ్ట్ స్టార్టప్ సంస్థ పిక్సెల్ తాజాగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు భూగోళ పరిశీలన డేటా సంబంధ సర్వీసులను అందించే కాంట్రాక్టు దక్కించుకుంది. 476 మిలియన్ డాలర్ల విలువ చేసే కాంట్రాక్టుకు సంబంధించి మొత్తం ఎనిమిది కంపెనీలు ఎంపికవగా, వాటిలో పిక్సెల్ కూడా ఒకటి. భూమిపై జీవనాన్ని మెరుగుపర్చేందుకు నాసా సాగిస్తున్న పరిశోధన కార్యకలాపాలకు ఉపయోగపడేలా ఈ కంపెనీలు ఎర్త్-అబ్జర్వేషన్ డేటాను అందిస్తాయి. కాంతి తరంగదైర్ఘ్యాలవ్యాప్తంగా ఉండే డేటాను హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజ్‌ల రూపంలో సేకరించి, వాతావరణ మార్పులు, వ్యవసాయం, జీవ వైవిధ్యం, వనరుల నిర్వహణ మొదలైన వాటి సూక్ష్మ వివరాలను పిక్సెల్ టెక్నాలజీ అందిస్తుంది. నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) కాంట్రాక్టు దక్కడంపై పిక్సెల్ సహ-వ్యవస్థాపకుడు అవైస్ అహ్మద్ సంతోషం వ్యక్తం చేశారు. అంతరిక్ష ఆధారిత భూ పరిశోధనల్లో హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ కీలకంగా మారబోతోందనడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మరింత అధిక రిజల్యూషన్‌తో ఇమేజ్‌లు ఇచ్చే ఫైర్‌ఫ్లైస్ ఉపగ్రహాలను కూడా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు పిక్సెల్ తెలిపింది. భూగోళ అధ్యయనానికి అవసరమయ్యే వివరాలను తక్కువ వ్యయాలతో సేకరించేందుకు తాజా కాంట్రాక్టు ఉపయోగపడగలదని నాసా పేర్కొంది.

భారత్‌లో ట్యాబ్లెట్ పీసీల జోరు

- జూన్ త్రైమాసికంలో రెండింతల వృద్ధి
- 18.4 లక్షల యూనిట్ల ట్యాబ్స్ విక్రయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్యాబ్లెట్ పీసీల అమ్మకాలు భారత్‌లో జోరుగా సాగుతున్నాయి. 2024 ఏప్రిల్-జూన్‌లో దేశవ్యాప్తంగా 18.4 లక్షల యూనిట్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. గతేడాది 2023 ఏప్రిల్-జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో అమ్మకాలు రెండింతలకుపైగా పెరిగి 129 శాతం వృద్ధి నమోదు చేయడం విశేషం. మార్కెట్ రిసర్చ్ కంపెనీ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ ప్రకారం.. క్యూ2లో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ట్యాబ్లెట్ పీసీలను కొనుగోలు చేయడం, అలాగే గతేడాది ఏప్రిల్-జూన్‌లో అమ్మకాలు తక్కువగా ఉండడం 2024 జూన్ త్రైమాసికంలో అధిక వృద్ధి రేటుకు కారణం అయింది. 2023 ఏప్రిల్-జూన్‌లో 8 లక్షల ట్యాబ్లెట్ పీసీలు అమ్ముడయ్యాయి.

ముందంజలో సామ్‌సంగ్..

ట్యాబ్లెట్ పీసీల విపణిలో జూన్ క్వార్టర్‌లో 48.7 శాతం వాటాతో సామ్‌సంగ్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. కమర్షియల్ సెగ్మెంట్‌లో 54.1, కంజ్యూమర్ విభాగంలో 38 శాతం వాటాను సామ్‌సంగ్ సాధించింది. ఈ కంపెనీ విక్రయాలు ఏకంగా మూడింతలై 9,01,000 యూనిట్లకు చేరుకున్నాయి. ఏసర్ 23.6 శాతం, యాపిల్ 9.5, లెనోవో 6.9, షావొమీ 4.7 శాతం వాటాతో ఆ తర్వాతి స్థానాల్లో పోటీపడుతున్నాయి. ఏసర్ అమ్మకాలు 27,000 నుంచి 4,37,000 యూనిట్లకు ఎగశాయి. యాపిల్ 12.3 శాతం వృద్ధితో 1,76,000 యూనిట్ల సేల్స్ సాధించింది. లెనోవో విక్రయాలు 2.8 శాతం క్షీణించగా, షావొమీ 85.8 శాతం దూసుకెళ్లింది. స్లేట్ ట్యాబ్లెట్ విభాగం గతేడాదితో పోలిస్తే 178.1 శాతం పెరిగింది. డిటాచేబుల్ ట్యాబ్లెట్స్ సెగ్మెంట్ 23.6 శాతం వార్షిక వృద్ధి నమోదు చేసింది.

ఈ ఏడాది 20 శాతం వృద్ధి..

భారత ట్యాబ్లెట్స్ మార్కెట్ 2023తో పోలిస్తే ప్రస్తుత సంవత్సరం 20 శాతం వృద్ధితో 50,76,000 యూనిట్లు నమోదు చేస్తుందని గ్లోబల్ టెక్నాలజీ మార్కెట్ అనలిస్ట్ కంపెనీ కెనాలిస్ అంచనా వేస్తోంది. 2025లో వృద్ధి 8 శాతానికి పరిమితం అవుతుందని జోస్యం చెబుతోంది. వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా ట్యాబ్లెట్స్ విక్రయాలు 54,79,000 యూనిట్లను తాకుతుందని ధీమాగా ఉంది. 2024 జనవరి-మార్చిలో 13,47,000 యూనిట్ల ట్యాబ్లెట్స్ అమ్ముడయ్యాయని కెనాలిస్ వెల్లడించింది. 2023 మార్చి త్రైమాసికంతో పోలిస్తే 37 శాతం వృద్ధి నమోదైంది. పర్సనల్ కంప్యూటర్స్, ట్యాబ్లెట్ పీసీ మార్కెట్ ఈ ఏడాది భారత్‌లో 11 శాతం, 2025లో 15 శాతం దూసుకెళుతుందని కెనాలిస్ అంచనా వేస్తోంది. డెస్క్‌టాప్స్, నోట్‌బుక్స్, ట్యాబ్లెట్ పీసీలు దేశవ్యాప్తంగా ఈ ఏడాది జనవరి-మార్చిలో 43 లక్షల యూనిట్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి.

పునరుత్పాదక ఇంధనాలతో ఆర్థిక వ్యవస్థకు బూస్ట్

అందుబాటు ధరలకే సోలార్ విద్యుత్ ● కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



న్యూఢిల్లీ: శరవేగంగా వృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన రంగం రానున్న రోజుల్లో ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఢిల్లీలో బీఎన్ఈఎఫ్ సదస్సును ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహానికి మోదీ సర్కారు తీసుకున్న చర్యలను పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రి ప్రస్తావించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పోటీతత్వంతో కూడిన పరిశ్రమను ఏర్పడేలా చేసినట్టు చెప్పారు. సోలార్ విద్యుత్ ధర ప్రపంచంలోనే తక్కువగా ఉన్నట్టు, సూర్యరశ్మి ఎక్కువ రోజుల్లో సమృద్ధిగా లభించడమే దీనికి కారణమన్నారు. దేశ విద్యుత్ రంగం కర్బనరహితంగా మారడం అన్నది శిలాజేతర ఇంధనాలకు ఉన్న డిమాండ్‌ను చేరుకోవడం ద్వారానే సాధ్యపడుతుందన్నారు. ఇందుకు గాను భారీ స్థాయిలో గ్రిడ్ స్టోరేజ్ ఏర్పాటు తప్పనసరిగా పేర్కొన్నారు. అదనపు విద్యుత్‌ను నిల్వ చేసే లక్ష్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహానికి విధానాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు. అధిక సామర్థ్యం కలిగిన సోలార్ పీవీ మాడ్యూళ్లకు రూ.24,000 కోట్లతో పీఎల్ఐ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ప్రహ్లాద్ జోషి చెప్పారు. దీని కింద 48,337 మెగావాట్ల సోలార్ పీవీ మాడ్యూళ్ల తయారీ సామర్థ్యానికి అవార్డులు జారీ చేసినట్టు వెల్లడించారు. హరిత ఆర్థిక వ్యవస్థ వైపు నిదానంగా అడుగులు వేస్తున్నామని, ఈ దిశగా భాగస్వాములు అందరి సహకారం అవసరమన్నారు. ఈ రంగాన్ని మరింత పోటీతత్వంగా, మరింత ప్రయోజకరంగా మార్చే విషయంలో ఏవైనా సూచనలు, సలహాలు ఉంటే ప్రభుత్వానికి అందించాలని కోరారు.

పదేళ్లలో 165 శాతం వృద్ధి..

గడిచిన పదేళ్లలో దేశంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 165 శాతం పెరిగిందని.. 75.52 గిగావాట్ల నుంచి 203 గిగావాట్లకు చేరుకున్నట్టు మంత్రి జోషి తెలిపారు. పునరుత్పాదక ఇంధన విద్యుత్ 193.50 బిలియన్ యూనిట్ల నుంచి 2023-24లో 360 బిలియన్ యూనిట్లకు చేరిందని, ఇది 86 శాతం వృద్ధికి సమానంగా పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చౌక విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా, గ్రిడ్ అనుసంధానిత సోలార్ ప్లాంట్ల టారిఫ్‌ను 76 శాతం కిందకు తీసుకొచ్చినట్టు చెప్పారు. ''నేను మంత్రి అయిన తర్వాత పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజ్లి యోజన' పథకం కింద 2.5 లక్షలకు పైగా రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటయ్యాయి. మొత్తం 3.28 లక్షల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లలో 75 శాతం గడిచిన మూడు నెలల్లోనే ఏర్పాటయ్యాయి'' అని మంత్రి జోషి వివరించారు. ఈ కాలంలోనే నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద 1,500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఎలక్ట్రోలైజర్ల తయారీకి 11 కంపెనీలకు అవార్డులు మంజూరు చేసినట్టు తెలిపారు. 5 ఎంఎంటీ వార్షిక ఎలక్ట్రోలైజర్ల తయారీ సామర్థ్యం లక్ష్యానికి ఇది సాయపడుతుందన్నారు. 4.5 లక్షల ఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ తయారీకి వీలు కల్పిస్తుందని చెప్పారు.

ఐపీవో బాటలో ఎథర్ ఎనర్జీ

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఎథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2.2 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను మహారాష్ట్రలో ఈవీ ద్విచక్ర వాహన తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు(పెట్టుబడి వ్యయాలు)కు, పరిశోధన, అభివృద్ధికి, రుణ చెల్లింపులు తదితరాలకు వెచ్చించనుంది. ఈ ఏడాది ఆగస్ట్‌లో ద్విచక్ర ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ఐపీవో ద్వారా రూ. 6,145 కోట్లు అందుకున్న సంగతి తెలిసిందే. రెండు దశాబ్దాల తదుపరి ఓలా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకాగా.. 2013లో ప్రారంభమైన ఎథర్ ఎనర్జీ రెండో ఈవీ సంస్థగా ఐపీవోకు వస్తోంది. పూర్తిస్థాయి ఈవీ కంపెనీ ఎథర్ ఎనర్జీ దేశీయంగానే టెక్నాలజీ అభివృద్ధి, ప్రాడక్టుల తయారీని చేపడుతోంది.

భారత్‌కు భారీ ఎఫ్‌డీఐలు

మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: రానున్న కాలంలో సింగపూర్ నుంచి భారత్‌కు భారీస్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) తరలిరానున్నట్లు పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తాజాగా పేర్కొన్నారు. ఇప్పటికే దేశీయంగా 150 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 12 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేసిన సింగపూర్ భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులకు ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. అయితే రానున్న కాలంలో ఇంతకు ఐదురెట్లు అధికంగా ఎఫ్‌డీఐలకు వీలున్నట్లు తెలియజేశారు. నాలుగు యూరోపియన్ దేశాల సమాఖ్య ఈఎఫ్‌టీఏతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గోయల్ ప్రస్తావించారు. దీంతో రానున్న 15 ఏళ్ల కాలంలో భారత్‌కు 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లభించనున్నట్లు తెలియజేశారు. ఈ పెట్టుబడులు వివిధ రాష్ట్రాలకు ప్రవహించనున్నాయని, ఈ అవకాశాన్ని రాష్ట్రాలు వినియోగించుకోవాలని పరిశ్రమల మంత్రులు, సీనియర్ అధికారులకు సూచించారు. పెట్టుబడులను ఆకట్టుకునేందుకు రాష్ట్రాలు నిబంధనలు, చట్టాలను సరళతరం చేయడంతోపాటు.. ఎర్ర తివాచీతో స్వాగతించవలసి ఉంటుందని వివరించారు. భారత్‌వైపు పెట్టుబడిదారులు చూస్తున్నారని, ఇందుకు మద్దతిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. రాష్ట్రాల మధ్య పక్షపాతం చూపబోమని, 12 ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌లో భాగస్వామ్య ఏర్పాటుసహా.. పరస్పరం సహకరించుకునేందుకు భారత్‌తో అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు సింగపూర్ ప్రభుత్వం తాజాగా పేర్కొంది. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు వెల్లడించింది.









లాస్ ఏంజెలిస్‌లో కలుద్దాం

అట్టహాసంగా ముగిసిన పారిస్ పారాలింపిక్స్ క్రీడలు

పారిస్: వైకల్యాన్ని జయించి పతకాల భరతం పట్టిన పారా అథ్లెట్లు ఈ విశ్వక్రీడలను చిరస్మరణీయం చేసుకున్నారు. రెగ్యులర్ ఒలింపిక్స్‌లా సాగిన పారాలింపిక్స్‌కు ఆదివారం అర్ధరాత్రి తర్వాత తెరపడింది. అట్టహాసంగా నిర్వహించిన ముగింపు వేడుకలు మళ్లీ పారిస్‌ను మిలమిల మెరిపించింది. రంగురంగుల ఎల్‌ఈడీ లైటింగ్ నడిరాతిరిని వర్ణమయం చేస్తే... నిషిధిని చీల్చిన బాణాసంచా వెలుగులు పారిస్ నగరం నెత్తిన కిరీటాన్ని తలపించేలా చేశాయి. ప్రత్యేకంగా తయారు చేసిన అతిపెద్ద బెలూన్ బాగా ఆకట్టుకుంది. ఇది చూసిన వారికి మండుతున్న కుండలా కనిపించింది. అయితే ఇదేమీ బాణాసంచాతోనూ, అగ్గితోనూ చేసింది కాదు! పూర్తిగా అగ్గిమంటను తలపించే రంగు లైట్లతో అలా కనువిందు చేశారు. ప్రముఖ ఫ్రెంచ్ సింగర్ శాంటా హుషారెక్కించే పాటతో స్టేడియాన్ని ఉర్రూతలూగించింది. పోటీల ఆఖరి రోజు రెండు ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి. మొరాకో అథ్లెట్ ఫాతిమా ఎజార ఎల్ ఇద్రిస్సి మహిళల మారథాన్ పరుగులో, నైజీరియన్ లిఫ్టర్ ఒలువాఫెమియో రికార్డులు నెలకొల్పారు. 42.195 కిలోమీటర్ల దూరాన్ని ఎల్ ఎద్రిస్సి 2 గంటల 48 నిమిషాల 36 సెకన్లలో పూర్తి చేసింది. తద్వారా జపాన్‌కు చెందిన మిసాటో మిచిషిత 2020లో నెలకొల్పిన 2 గంటల 54 నిమిషాల 13 సెకన్ల రికార్డును బద్దలు కొట్టింది. మహిళల పవర్‌లిఫ్టింగ్‌లో డిఫెండింగ్ చాంపియన్, 39 ఏళ్ల ఒలువాఫెమియో తన రికార్డును తానే చెరిపింది. 86 కేజీల ఈవెంట్‌లో ఆమె 167 కిలోల బరువెత్తి జార్జియాలో ఈ ఏడాది జూన్‌లో ఎత్తిన 166 కిలోల రికార్డును తిరగ రాసింది.

అమెరికాకు మూడో స్థానం

సాధారణంగా విశ్వక్రీడల్లో అమెరికా అథ్లెట్లు పతకాల పందెంలో ముందుంటారు. ఈసారి ఒలింపిక్స్‌లో అమెరికాకు గట్టి పోటీనిచ్చిన చైనా అథ్లెట్లు చివరకు రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. కానీ పారాలింపిక్స్‌లో చైనా క్రీడాకారులు అగ్రస్థానం చేజిక్కించుకున్నారు. 94 స్వర్ణాలు, 76 రజతాలు, 50 కాంస్యాలతో చైనా మొత్తం 220 పతకాలు సాధించింది. అమెరికా 105 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. ఇందులో 36 పసిడి, 42 రజతాలు, 27 కాంస్యాలున్నాయి. రెండోస్థానం బ్రిటన్ (124 పతకాలు)కు దక్కింది. 49 బంగారు పతకాలు, 44 రజతాలు, 31 కాంస్యాలు గెలుచుకుంది.



లాస్ ఏంజెలిస్ అధిగమిస్తుందా?
పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్ ఆదరణలోనూ, అథ్లెట్లతోనూ విజయవంతమైంది. ఏకంగా 4000 పైచిలుకు అథ్లెట్లు పోటీపడిన ఈ విశ్వక్రీడలను చూసేందుకు లక్షల మంది ప్రేక్షకులు ఎగబడ్డారు. దీంతో 2.4 మిలియన్ టికెట్లు (24 లక్షలు) అమ్ముడైనట్లు నిర్వాహకులు తెలిపారు. లండన్–2012 ఒలింపిక్స్ తర్వాత ఆ స్థాయిలో టికెట్ల విక్రయం జరిగిన ఈవెంట్ ఇదేనని వెల్లడించారు. ఇక ఇప్పుడు అందరి దృష్టి లాస్ ఏంజిలిస్–2028 ఒలింపిక్స్‌పై పడింది. ఈ ఆదరణను మించే విధంగా తదుపరి విశ్వక్రీడలు జరగాలని ఆశిస్తున్నట్లు అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ ప్రతినిధి క్రెయిగ్ స్పెన్స్ తెలిపారు.

హ్యారీ కేన్‌కు అరుదైన బహుమతి

100వ అంతర్జాతీయ మ్యాచ్‌లో బంగారు టోపీ ఇవ్వాలని నిర్ణయం



లండన్: ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ అరుదైన జాబితాలో చేరనున్నాడు. నేషన్స్ లీగ్‌లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక ఫిన్‌లాండ్‌తో ఇంగ్లండ్ తలపడనుండగా... ఇది హ్యారీ కేన్‌కు 100వ అంతర్జాతీయ మ్యాచ్ కానుంది. దీంతో మ్యాచ్ ఆరంభానికి ముందు కేన్‌కు బంగారు టోపీని బహూకరించనున్నారు. ఇంగ్లండ్ తరఫున ఇప్పటి వరకు తొమ్మిది మంది ఫుట్‌బాల్ ప్లేయర్లు 100 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడగా... ఇప్పుడు హ్యారీ కేన్ ఆ ఘనత సాధించిన పదో ప్లేయర్ కానున్నాడు. చివరిసారిగా ఇంగ్లండ్ తరఫున వేన్ రూనీ 2014లో 100వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడగా... పదేళ్ల తర్వాత కేన్ ఆ క్లబ్‌లో అడుగు పెట్టనున్నాడు. ఇప్పటి వరకు 72 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ జట్టుకు సారథ్యం వహించిన 31 ఏళ్ల కేన్.. జాతీయ జట్టు తరఫున 66 గోల్స్ కొట్టాడు. సోమవారం ప్రాక్టీస్ సందర్భంగా గోల్డెన్ బూట్‌లు ధరించిన కేన్... ఇంగ్లండ్ తరఫున అత్యధిక మేజర్ ఫైనల్స్ (28) ఆడిన ప్లేయర్‌గానూ నిలిచాడు.

చిత్తడిగా మైదానం

న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్ తొలి టెస్టు తొలి రోజు ఆట రద్దు



గ్రేటర్ నోయిడా: భారత్‌లో అఫ్గానిస్తాన్ పర్యటనకు సంబంధించిన న్యూజిలాండ్ టెస్టు మ్యాచ్‌కు ప్రతికూల పరిస్థితులు అడ్డుపడ్డాయి. దీంతో ఇరుజట్ల మధ్య సోమవారం మొదలుకావాల్సిన ఏకైక టెస్టు తొలి రోజు ఆట పూర్తిగా రద్దయ్యింది. నిజానికి సోమవారం ఏమాత్రం వర్షం కురవనేలేదు. కానీ కొన్నిరోజుల పాటు కురిసిన కుండపోత వర్షాల వల్ల ఇక్కడి గ్రేటర్ నోయిడా స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానం చిత్తడిగా మారింది. మ్యాచ్ ఆడేందుకు గ్రౌండ్ ఏమాత్రం అనుకూలంగా లేదు. దీంతో ఆటగాళ్లు మైదానంలో దిగే అవకాశమే లేకపోవడంతో పలుమార్లు స్టేడియాన్ని పరిశీలించిన ఫీల్డు అంపైర్లు కుమార ధర్మసేన, షర్ఫుద్దౌలా చేసేదేమి లేక తొలిరోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఏదీ లేకపోవడంతో మైదానం తడారిపోయేందుకు ఎండకాయాల్సిందే! దీంతో ఎన్నిరోజులు మ్యాచ్‌పై ప్రభావం పడుతుందో స్పష్టంగా చెప్పడం కష్టం. 2017లో టెస్టు హోదా పొందిన అఫ్గానిస్తాన్... న్యూజిలాండ్‌తో ఆడుతున్న తొలి టెస్టు ఇదే! క్రికెట్ ఆడేందుకు స్వదేశంలో అనుకూల పరిస్థితులు లేకపోవడంతో అఫ్గానిస్తాన్ తాము ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికలపై ఆడుతోంది.

క్రీడా గ్రామం లేకుండానే 2026 ఏషియాడ్



న్యూఢిల్లీ: జపాన్‌లో ఇంకో రెండేళ్లలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఐచి–నగోయా నగరంలో 2026లో జరిగే ఈ క్రీడల కోసం ఇంత వరకు క్రీడాగ్రామం ఊసేలేదు. తాజాగా ఆతిథ్య దేశం క్రీడాగ్రామం లేకుండానే ఆసియా క్రీడలను నిర్వహిస్తామని తెలిపింది. ఖరీదైన హోటల్స్, విలాసవంతమైన క్రూయిజ్ షిప్‌లలో అథ్లెట్లకు బస ఏర్పాట్లు చేస్తామని ఆసియా గేమ్స్ నిర్వాహక కమిటీ ఉపాధ్యక్షుడు, జపాన్ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు అయిన సునెకజు టకెడా తెలిపారు. సుమారు 4000 మంది అథ్లెట్లు, సహాయ సిబ్బంది, అధికారుల కోసం బస ఏర్పాట్లు చేస్తామని అన్నారు. దీనిపై ఆసియా ఒలింపిక్ కమిటీ (ఓసీఏ)లోని కువైట్, పాలస్తీనా తదితర దేశాలు విముఖత వ్యక్తం చేశాయి. ఓసీఏ కొత్త అధ్యక్షుడు రణ్‌ధీర్ సింగ్ ఈ పోకడపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఒక నగరంలో జరిగే మెగా ఈవెంట్‌కు ఒక క్రీడాగ్రామం తప్పనిసరి. అంతా ఒకేచోట కలిసి ఉండి... అందులో భాగమవుతారు. కానీ అలాంటి క్రీడాగ్రామమే లేకపోతే ఎలా' అని ఆయన విస్మయం వ్యక్తం చేశారు.



పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన భారత మహిళా షూటర్ మనూ భాకర్‌ను టాటా మోటార్స్ సంస్థ సన్మానించింది. గురుగ్రామ్‌లో జరిగిన కార్యక్రమంలో మనూ భాకర్‌కు టాటా కర్వ్ ఎలక్ట్రిక్ కారును బహుమానంగా అందజేశారు.

పదేళ్ల తర్వాత...

ఇంగ్లండ్ గడ్డపై టెస్టులో గెలిచిన శ్రీలంక ● మూడో టెస్టులో ఇంగ్లండ్ ఓటమి



నిసాంక

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో శ్రీలంక క్రికెట్ జట్టుకు ఓదార్పు విజయం దక్కింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు టెస్టులు ఓడి సిరీస్ కోల్పోయిన శ్రీలంక జట్టు... ఆఖరి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇంగ్లండ్ గడ్డపై ఓవరాల్‌గా శ్రీలంక జట్టుకు ఇది నాలుగో విజయం కాగా... 2014 తర్వాత ఇదే తొలి గెలుపు. మూడో టెస్టులో ఓడినప్పటికీ ఇంగ్లండ్ సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. 219 పరుగుల విజయ లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 94/1తో సోమవారం నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 40.3 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఓపెనర్ నిసాంక (124 బంతుల్లో 127 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. కుశాల్ మెండిస్ (39 నాటౌట్; 7 ఫోర్లు), ఏంజెలో మాథ్యూస్ (32;3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్, ,అట్కిన్‌సన్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 324 పరుగులు చేయగా... శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే ఆలౌట్ అయిన ఇంగ్లండ్.. లంక ముందు ఓ మోస్తరు లక్ష్యాన్ని ఉంచింది. వన్డే తరహా ఆట తీరుతో విజృంభించిన శ్రీలంక ఓపెనర్ నిసాంక చూస్తుండగానే ఇంగ్లండ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. సొంతగడ్డపై ఇటీవల వెస్టిండీస్‌పై మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకున్న ఇంగ్లండ్.. వరసగా రెండో సిరీస్ క్లీన్‌స్వీప్ చేయాలని భావించినా అది సాధ్యంకాలేదు. నిసాంకకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', జో రూట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

4 ఇంగ్లండ్ గడ్డపై శ్రీలంక జట్టుకు ఇది నాలుగో టెస్టు విజయం. 1998 ఓవల్‌లో, 2006లో ట్రెంట్‌బ్రిడ్జ్‌లో, 2014 హెడింగ్లేలోనూ లంక జట్టు టెస్టు విజయాలు సాధించింది.



తొలి పోరులో బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ 'ఢీ'

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆరంభ దశ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే నెల 18 నుంచి పీకేఎల్ ప్రారంభం కానుండగా... గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరగనున్న తొలి పోరులో బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ జట్టు తలపడనుంది. అదే రోజు జరగనున్న రెండో మ్యాచ్‌లో యు ముంబాతో దబంగ్ ఢిల్లీ పోటీపడుతుంది. మూడు వేదికల్లో పీకేఎల్ మ్యాచ్‌లు నిర్వహించాలని నిర్ణయించగా... అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 వరకు హైదరాబాద్‌లో పీకేఎల్ తొలి దశ సాగనుంది. ఆ తర్వాత నవంబర్ 10 నుంచి డిసెంబర్ 1 వరకు నోయిడాలోని ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. అనంతరం డిసెంబర్ 3 నుంచి 24 వరకు పుణేలో లీగ్ సాగనుంది. ప్లే ఆఫ్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను తర్వాత ప్రకటించనున్నారు. గత నెలలో జరిగిన పీకేఎల్ వేలంలో మొత్తం 12 జట్లు తమ అస్త్రశస్త్రాలకు పదును పెంచుకోగా... లీగ్ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది మంది ప్లేయర్లు కోటి రూపాయలకు పైగా ధర పలికారు.

ఇంటర్ కాంటినెంటల్ కప్ విన్నర్స్ ట్రోఫీతో సిరియా జట్టు సంబరం. హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో సిరియా జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి విజేతగా నిలిచింది



70 ఏళ్ల వయసులో మెడికల్ గ్రాడ్యుయేట్‌గా


స్నాతకోత్సవంలో తోహ్ హొంగ్‌కెంగ్


వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే. అనుకున్న లక్ష్యం సాధించేందుకు వయసు ఏమాత్రం అడ్డురాదని మలేసియాకు చెందిన 70 ఏళ్ల తోహ్ హొంగ్‌కెంగ్ నిరూపించారు. ఇప్పటికే రిటైర్డ్ అయిన తోహ్ ఇటీవల మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఔరా అనిపించారు. 70 ఏళ్ల వయసులో మెడిసిన్ చేసి ప్రపంచంలో అత్యంత ఎక్కువ వయసులో మెడిసిన్ చేసిన వారిలో ఒకరిగా తోహ్ రికార్డ్ సృష్టించారు. శంకర్ దాదా ఎంబీబీఎస్ గుర్తుందా..! చిరంజీవి స్టైల్‌గా క్లాస్‌లోకి వస్తుంటే అందరూ ఆయనను ప్రొఫెసర్ అని పొరబడతారు. ఫిలిప్పీన్స్‌లోని సెబులో ఉన్న సౌత్ వెస్ట్రన్ యూనివర్సిటీ పీహెచ్ ఎంఏ విద్యార్థులు సైతం తోహ్ మొదటిసారి క్లాసులో అడుగుపెట్టినప్పుడు అలాగే అనుకున్నారు. కానీ తోటి విద్యార్థి అని తర్వాత తెల్సుకుని ఆశ్చర్యపోయారు. ఇప్పుడు ఆయనను 'సర్ తోహ్'అంటూ గౌరవంగా పిలుచుకుంటున్నారు.

రికార్డు సృష్టించిన మలేసియా వ్యక్తి తోహ్ హొంగ్‌కెంగ్

అయితే ఆయన చిన్నతనం నుంచే డాక్టర్ కావాలనేమీ కలలు కనలేదు. అప్పటికే ఆర్థికశాస్త్రం, రసాయన శాస్త్రం, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ చదివేశారు. తర్వాత ఆయన మనసు మెడిసిన్ వైపు మళ్లింది. 2018లో కిర్గిజిస్తాన్ విహారయాత్రలో ఉండగా ఇద్దరు యువ భారతీయ వైద్య విద్యార్థులను కలిశారు. ఆ పరిచయం ఆయనను వైద్య విద్య పట్ల అమితాసక్తిని పెంచిందని తోహ్ చెప్పారు. 2019లో కార్పొరేట్ ప్రపంచం నుంచి పదవీ విరమణ పొందాక మెడిసిన్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యారు. కానీ అన్నిచోట్లా వైద్యవిద్య చదవడానికి వయోపరిమితి అడ్డుగా ఉందని తర్వాత అర్థమైంది. ఈ వయసులోనూ తనను మెడిసిన్ చదివేందుకు అనుమతించే కాలేజీ కోసం తెగ తిరిగారు. అయితే తమ పని మనిషి కూతురు చదివిన ఫిలిప్పీన్స్‌లోని వైద్య పాఠశాలలో వయోపరిమితి లేదని తెలుసుకుని ఎగిరి గంతేశారు. వెంటనే దరఖాస్తు చేసుకోవడం, ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ, తర్వాత సెలక్షన చకచకా జరిగిపోయాయి. పెట్టే బేడా సర్దుకుని అక్కడికి వెళ్లిపోయి స్కూల్లో చేరారు. 2020లో కరోనా విజృంభించడంతో హాంకాంగ్‌కు మకాం మార్చేసి తన క్లాసులన్నీ ఆన్‌లైన్‌లో విన్నారు. కుటుంబం, సహోధ్యాయిల సహకారంతో గత జూలైలో మెడిసిన్ పట్టా అందుకున్నారు. రెసిడెన్సీ అనుభవంతో పూర్తిస్థాయి లైసెన్స్‌డ్ డాక్టర్‌గా మారడానికి ఆయనకు మరో పదేళ్లు పట్టొచ్చు.

విదేశీ విద్యార్థుల ట్యూషన్ ఫీజుల కోసం..
మెడికల్ బోర్డు పరీక్ష కోసం ఏడాది పాటు ఇంటర్న్‌షిప్, మరింత అధ్యయనం అవసరం. దానికి బదులుగా అతను హాంకాంగ్‌లో స్నేహితుడి సంస్థ అలెర్జీ అండ్ ఇమ్యునాలజీ డయాగ్నస్టిక్స్‌లో కన్సల్టెంట్‌గా పని చేయాలని యోచిస్తున్నారు. త నలాగా మెడిసిన్ చేస్తున్న పేద పిల్లలకు సాయం చేద్దామని భావించారు. ట్యూషన్ ఫీ చెల్లించడానికి కష్టపడే విదేశీ వైద్య విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్ ఫండ్‌ను ఏర్పాటుచేశారు. అసోసియేషన్ ఆఫ్ అమెరికన్ మెడికల్ కాలేజెస్ ప్రకారం అమెరికాలో ప్రభుత్వ వైద్య పాఠశాలలలో స్థానిక విద్యార్థులకు సంవత్సరానికి సగటు ట్యూషన్ ఫీజు సుమారు 60,000 డాలర్లు. విదేశీ విద్యార్థు లకు 95,000 డాలర్లు ఖర్చు అవుతుంది. ప్రైవేటు వైద్య పాఠశాలల్లో విదేశీయులకు ట్యూషన్, ఫీజులు 70 వేల డాలర్ల వరకు ఖర్చవుతోంది. అంతర్జాతీయ విద్యార్థుల విషయానికొస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ. ఫిలిప్పీన్స్‌లో ట్యూషన్ ఫీజులు అంత ఎక్కువగా లేవు. తోహ్ సౌత్ వెస్ట్రన్ వర్సిటీ ఏడాదికి దాదాపు 5,000 డాలర్లు ఖర్చు చేశారు. ఆసియాలో అభివృద్ధి చెందుతున్న దేశాల విద్యార్థులకు ఇది పెద్దమొత్తమే. ఇలాంటివారికి ఆ నిధిని ఖర్చు చేయనున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



వైద్య విద్యార్థిగా హొంగ్‌కెంగ్

ఢిల్లీలో టపాకాయలపై నిషేధం

న్యూఢిల్లీ: శీతాకాలంలో దేశ రాజధానిలో వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి టపాకాయలపై ఢిల్లీ ప్రభుత్వం పూర్తి నిషేధం విధించింది. టపాకాయల తయారీ, అమ్మకం, వినియోగంపై జనవరి 1వ తేదీ దాకా నిషేధం విధిస్తున్నట్లు ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం తెలిపారు. 'శీతాకాలంలో ఢిల్లీలో వాయుకాలుష్యం ఎక్కువవుతుంది. బాణాసంచా కాలిస్తే కాలుష్యం మితి మీరుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని గతేడాది లాగే అన్ని టపాకాయలపై నిషేధం విధిస్తున్నాం. బాణాసంచా తయారీ, నిలువ, అమ్మకం, వినియోగంపై పూర్తి నిషేధం ఉంటుంది. ఆన్‌లైన్‌లో కూడా టపాకాయల అమ్మకాలను నిషేధిస్తున్నాం' అని గోపాల్ రాయ్ చెప్పారు.

అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు సబబే: సుప్రీం

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లను సవాల్ చేసిన టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీకి సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన ప్రదేశాల్లో అక్రమ బొగ్గు తవ్వకాలు, బొగ్గు చోరీకి సంబంధించిన కేసులో అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య రుజిరా బెనర్జీలపై ఈడీ మనీలాండర్ కేసు నమోదు చేసింది. న్యూఢిల్లీలోని ఈడీ ఆఫీసులో విచారణకు హాజరు కావాలని అభిషేక్, రుజిరాలకు 2021 సెప్టెంబరు 10న సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను కలకత్తా హైకోర్టులో సవాల్ చేయగా.. న్యాయస్థానం అభిషేక్ దంపతుల పిటిషన్లను కొట్టివేసింది. దాంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పీఎంఎల్‌ఏ సెక్షన్ 50 కింద జారీచేసిన సమన్లు సక్రమమే. పిటిషనర్ల వాదనలో పస లేదని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మల ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది.

జమ్మూకశ్మీర్‌లో బీజేపీ కీలక నియామకాలు

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చీఫ్ జేపీ నడ్డా కీలక నియామకాలు చేపట్టారు. జమ్మూకశ్మీర్ ప్రదేశ్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్ శర్మను నియమించారు. డాక్టర్ నిర్మల్ సింగ్‌ను ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా, చౌదరి సుఖ్ నందన్‌ను ఎన్నికల ప్రచార కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా కవీందర్ గుప్తాకు అవకాశం కల్పించారు. ఈ మేరకు బీజేపీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్ర మంత్రి బూట్లు తొలగించిన బీసీసీఎల్ అధికారి

రాంచీ: కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ ఇండియా లిమిటెడ్(బీసీసీఎల్) జనరల్ మేనేజర్ అరిందమ్ ముస్తాఫీ కేంద్ర మంత్రి సతీశ్‌చంద్ర దూబే బూట్లను తన చేతులతో తొలగించడం, పైజామాను సరి చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. కేంద్ర మంత్రి తీరుపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీశ్‌చంద్ర దూబే ఇటీవల జార్ఖండ్‌లోని ధన్‌బాద్ బొగ్గు గనిని సందర్శించారు. ఈ సందర్భంగా సోఫాలో విలాసంగా కూర్చున్న కేంద్ర మంత్రి బూట్లను అరిందమ్ ముస్తాఫీ తన చేతులతో స్వయంగా తొలగించారు. ఆ బూట్లను పక్కనే ఉన్న అధికారుల చేతికి అందించారు. చిందరవందరగా ఉన్న మంత్రి పైజామాను సరిచేశారు.

చొరబాటుకు యత్నించిన ఇద్దరు ముష్కరులు హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో వాస్తవాధీన రేఖ వెంబడి(ఎల్‌వోసీ)వెంబడి ఉగ్రమూకల చొరబాటుయత్నాన్ని ఆర్మీ తిప్పికొట్టింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. నౌషెరాలోని లామ్ సెక్టార్‌లో ఉగ్రమూకలు దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నట్లు పసిగట్టిన బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.

సిరియాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

డమాస్కస్: సిరియాలోని పలు ప్రాంతాలపై ఆదివారం అర్ధరాత్రి ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో 18 మంది చనిపోగా మరో 40 మంది గాయపడ్డారు. తమ సైనిక, పౌర మౌలిక వసతులపై ఇజ్రాయెల్ చేసిన దాడులను దురాక్రమణగా సిరియా ప్రభుత్వం పేర్కొంది. మసీఫ్-వడిఅల్- ఒయూన్ హైవే దెబ్బతిందని, సమీపంలోని హయిర్ అబ్బాస్ అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయని సిరియా ఆర్మీ పేర్కొంది.

పావురాల నుంచి డాల్ఫిన్ల దాకా..

బెలుగా జాతికి చెందిన అరుదైన పెద్ద గూఢచారి తిమింగలం 'హవాల్డిమీర్'దక్షిణ నార్వే తీరంలో బుల్లెట్ గాయాలతో విగతజీవిగా కనిపించడం ఇటీవల అంతర్జాతీయ వార్తాంశంగా నిలిచింది. దీంతో అసలు మనిషి ఇంతవరకు ఏ జాతుల జీవులను నిఘా కోసం గూఢచారులుగా వినియోగించుకున్నాడన్న చర్చ మొదలైంది. గూఢచారులుగా ఈ జంతువులు నిర్వర్తించిన విధుల్లేంటి. వాటిల్లో అత్యుత్తమ గూఢచారి ఏది? వంటి ఆసక్తికర అంశాలపై ఇప్పుడు ఓ లుక్కేద్దాం..

– సాక్షి, నేషనల్ డెస్క్


రెక్కలకు కెమెరాతో గూఢచారి కపోతం (ప్రతీకాత్మక చిత్రం)

గూఢచారులుగా జంతువులు, పక్షులు

గూఢచార జీవులు...

అత్యాధునిక పరికరాలు, చిన్న నిఘా కెమెరాలు రాకముందు సుదూర ప్రాంతాలకు రహస్య సమాచారాన్ని సురక్షితంగా చేరవేయడం ఓ సవాలుగా ఉండేది. దీంతో సందేశాలు పంపడానికి పావురాలను ఉపయోగించేవారు. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో నిఘా కోసం జర్మన్ సైన్యం ప్రత్యేకంగా బుల్లి కెమెరాలు రూపొందించి వాటిని పావురాలకు కట్టింది. వాటిల్లో రికార్డయ్యే సమాచారంతో శత్రు జాడ తెల్సుకునేది. రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రరాజ్యాలూ గూఢచర్యానికి పావురాలనే నమ్ముకున్నాయి. 1970లలో అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) తన ప్రత్యేక నిగా ఆపరేషన్ 'టకానా'లో భాగంగా బుల్లి కెమెరాలు అమర్చిన పావురాలను సోవియట్ రష్యాలోకి పంపింది. ఇలా పావురాలు మాత్రమే కాదు.. పిల్లులు, తిమింగలాలు, డాల్ఫిన్లు, ఇంకొన్ని రకాల పక్షులు, చనిపోయిన జంతువులు కూడా కోవర్ట్ ఆపరేటర్లుగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాయి.

డాల్ఫిన్లతో ప్రత్యేకంగా..

ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో సోవియట్ నావికాదళం సముద్ర క్షీరదాలతో వివిధ కార్యక్రమాలను చేపట్టింది. వీటిలో ఒకటి డాల్ఫిన్లకు శిక్షణ ఇవ్వడం. అమెరికా నావికాదళం సముద్ర క్షీరదాల కార్యక్రమం(ఎంఎంపీ) కింద సముద్ర జలాల్లో నిఘా కోసం డాల్ఫిన్లను ఉపయోగించింది. 1960లలో ప్రాజెక్ట్ ఆక్సిగాస్‌లో భాగంగా శత్రు నౌకలకు పేలుడు పరికరాలను అమర్చేందుకు సీఐఏ డాల్ఫిన్లకు శిక్షణ ఇచ్చింది. ఈ కార్యక్రమానికి సముద్రాల్లో స్వేచ్ఛగా తిరిగే రెండు 'బాటిల్‌నోస్'డాల్ఫిన్లను ఉపయోగించారు. ప్రపంచంలోని అత్యంత తెలివైన జంతువులుగా డాల్ఫిన్లు ప్రసిద్ధి చెందాయి. క్రిమియాలోని సెవాస్టోపోల్ నల్లసముద్రంలోని నౌకాదళ స్థావరంలో శత్రు డైవర్లను గుర్తించడానికి, ఎదుర్కోవడానికి డాల్ఫిన్లకు శిక్షణ ఇచ్చేందుకు రష్యా గత సంవత్సరం ఒక క్షీరద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని బ్రిటిష్ ఇంటెలిజెన్స్ నివేదిక బహిర్గతంచేసింది. 2023 ఏప్రిల్ నుంచి జూన్ వరకు సెవాస్టోపోల్ నౌకాశ్రయంలో తేలియాడే క్షీరదాల బోనుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు బ్రిటిష్ సైనిక నిఘా ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది.

పిల్లుల చెవులకు మైక్రో ఫోన్లు

పిల్లులను తెలివైన జంతువులుగా భావిస్తారు. సీఐఏ 1960వ దశకంలో పిల్లులను ఉపయోగించి 'ఆపరేషన్ అకౌస్టిక్ కిట్టీ'అనే ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. దీని కోసం 2 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ప్రాజెక్టులో భాగంగా పిల్లుల చెవుల్లో మైక్రోఫోన్లను ఏర్పాటు చేసింది. ఇవి సోవియట్ దౌత్యవేత్తలు, ఏజెంట్ల సంభాషణలను రహస్యంగా రికార్డ్ చేస్తాయి. పిల్లి పెంపుడు జంతువు. అది బహిరంగ ప్రదేశాలు, కొన్ని రహస్య ప్రదేశాల్లో అవి ప్రత్యక్షమవడం శత్రు దేశాలకు అనుమానాలు పెంచే అవకాశం ఉంటుంది. అదీగాక పిల్లులను నియంత్రించడం అంత సులభం కాదు. శిక్షణాసమయంలో వాటిని శిక్షకులు నియంత్రించలేక చేతులెత్తేశారు. పిల్లులు వాటికి సూచించిన ప్రాంతాలకు కాకుండా తమకిష్టమైన ప్రదేశాల్లో చక్కర్లు కొట్టాయి. దీంతో చేసేదిలేక చివరికి 1967లో ఈ కార్యక్రమానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

టాప్ ఏజెంట్.. పావురం

పిల్లులు, చనిపోయిన ఎలుకల వంటివాటిని రంగంలోకి దింపి పని కానిచ్చినప్పటికీ వివిధ దేశాల నిఘా సంస్థలు శతాబ్దాలుగా ఎక్కువ నమ్మకం పెట్టుకున్నది పావురం మీదనే. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ ఇంటెలిజెన్స్ నిర్వహించిన అత్యంత విజయవంతమైన గూఢచారి కార్యక్రమం 'ఆపరేషన్ కొలంబా' పావురాలతోనే విజయవంతమైంది. జర్మన్ సైనిక కార్యకలాపాలను, సున్నితమైన సైనిక స్థానాలపై నిఘాను హోమింగ్ జాతి పావురాలు సేకరించాయి. పేపర్‌పై రాసిన సందేశాలను సూక్ష్మ డబ్బాల్లో పెట్టి పక్షి కాలికి కట్టేశారు. ఈ రహస్య సందేశాలలో నాజీ దళాల కదలికలు, నాజీల కొత్త ఆయుధాలపై నివేదికలు, ప్రణాళికాబద్ధమైన రాకెట్ దాడుల వివరాలను వేగులు సేకరించి పావురాల ద్వారా ప్రధాన కేంద్రానికి రహస్యాన్ని పంపేవారు. రచయిత గోర్డాన్ కోరేరా 'ఆపరేషన్ కొలంబా: ది సీక్రెట్ పీజియన్ సర్వీస్'పుస్తకంలో ఇలాంటి ఎన్నో వివరాలు ఉన్నాయి. బ్రిటిష్ ఇంటెలిజెన్స్ 1941 నుంచి 1944 మధ్య నాజీ ఆక్రమిత ఐరోపాపై 16,000 హోమింగ్ జాతి పావురాలను వాడారు. అన్నింటికన్నా ముఖ్యంగా పక్షుల ద్వారా గూఢచర్యం విజయవంతంకావడంతో నూతన టెక్నాలజీలకూ కపోతమే స్ఫూర్తిగా నిలిచింది. గత నెలలో చైనా అచ్చం పావురంలాగా ఉండే చిన్నపాటి నిఘా డ్రోన్‌ను ఆవిష్కరించడం తెల్సిందే.

గూఢచార పావురాలని...



భారత ఉపఖండంలో సందేశాలను పంపించడానికి పావురాలను ఉపయోగించినట్టుగా చరిత్ర చెబుతోంది. 2020 మేలో కశ్మీర్‌లోని ఓ గ్రామంలో నంబర్ల సెట్ ఉంగరం కలిగిన పావురం కనిపించింది. దానిని పట్టుకున్న గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. పాకిస్తాన్‌కు చెందిన గూఢచారి పావురమై ఉంటుందని, దానిపై ఉన్నది కోడ్ అని అనుమానించిన పోలీసులు.. డీ క్రిప్ట్ చేయడానికి ప్రయత్నించారు. చివరికది గూఢచారి పావురం కాదని తేలడంతో విడిచిపెట్టారు. 2016 అక్టోబర్‌లో భారత ప్రధానిని బెదిరిస్తూ మరో పావురం కనిపించింది. పంజాబ్‌లోని పఠాన్ కోట్‌లో ఈ పావురాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. 2023 మేలో ముంబైలో దొరికిన పావురాన్ని చైనా గూఢచారిగా అనుమానిస్తూ ఎనిమిది నెలల పాటు బోనులో ఉంచి దాని ఆనుపానాలు సేకరించారు. ఆ పావురం కాలుకు ఉంగరాలు కట్టి, దాని రెక్కల కింది భాగంలో చైనీస్ భాషలో ఏదో రాశారు. అయితే అది తైవాన్‌లో రేసింగ్ పోటీలో పాల్గొన్న పక్షి అని ఫిబ్రవరిలో తేలడంతో ఎట్టకేలకు దానిని అధికారులు వదిలేశారు.

కవలలకు జన్మనిచ్చిన బ్లడ్ క్యాన్సర్ బాధితురాలు

ప్రపంచంలోనే అరుదైన కేసుల్లో ఒకటిగా పేర్కొంటున్న వైద్యులు

ఇండోర్(మధ్యప్రదేశ్): ప్రాణాంతక బ్లడ్ క్యాన్సర్ బాధితురాలు కవలలకు జన్మనిచ్చారు. ప్రపంచంలోనే ఈ అరుదైన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. మైయెలాయిడ్ లుకేమియా అనే ప్రాణాంతక రక్త క్యాన్సర్‌తో బాధ పడుతున్న మహిళకు సురక్షిత ప్రసవం జరిగేలా చూడటం సవాల్‌తో కూడుతున్న వ్యవహారమని ఆస్పత్రిలోని క్లినికల్ హెమటాలజీ విభాగం ప్రొఫెసర్ అక్షయ్ లహోటీ తెలిపారు. 'ఈ గర్భవతిని మా ఆస్పత్రిలో చేర్పించిన సమయంలో ఆమె శరీరంలో తెల్ల రక్త కణాల(డబ్ల్యూబీసీ)సంఖ్య సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. దీంతో, కీమో థెరపీతోపాటు సాధారణ క్యాన్సర్ మందులు ఇవ్వలేకపోయాం'అని ఆయన చెప్పారు. 'దేశ, విదేశాల్లోని నిపుణులను సంప్రదించాక ఆమె ఆరోగ్యంతోపాటు గర్భంలోని ఇద్దరు శిశువులకు ఎటువంటి హాని వాటిల్లకుండా ప్రత్యేకంగా మందులు ఇచ్చాం'అని లహోటీ తెలిపారు. 'మొదటిసారి గర్భం దాల్చిన బాధితురాలికి బ్లడ్ క్యాన్సర్ ఉన్న విషయం చెప్పలేదు. గర్భవతిగా ఉండగా ఆమె మానసిక ఆరోగ్యం దెబ్బతినకుండా చూడాలన్నదే మా ఉద్దేశం. ఆమెకు సాధారణ ప్రసవం చేశాము. బాబు, పాప జన్మించారు. వారు ఆరోగ్యంగా ఉన్నారు' అని గైనకాలజిస్ట్ డాక్టర్ సుమిత్రా యాదవ్ వివరించారు. మైయెలాయిడ్ లుకేమియా ఉన్న మహిళలకు సురక్షిత ప్రసవం ప్రపంచంలోనే అరుదైన కేసుల్లో ఒకటని వైద్యులు చెబుతున్నారు.

104 రోజుల డ్యూటీ.. ఒక్క రోజే లీవు!

అనారోగ్యం బారినపడి చైనా వాసి మృతి

బీజింగ్: ఏకంగా 104 రోజులపాటు డ్యూటీ చేసిన చైనా వాసి, మధ్యలో ఒక్కటంటే ఒక్క రోజే సెలవు తీసుకున్నాడు. ఆపై, తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పరిహారంగా రూ.48 లక్షలు చెల్లించాలంటూ సంస్థ యజమానిని కోర్టు ఆదేశించింది. జెఝియాంగ్ ప్రావిన్స్‌లోని జౌషాన్ ప్రాంతానికి చెందిన ఎబావో (30) వృత్తిరీత్యా పెయింటర్. గతేడాది ఓ కంపెనీతో ఆయన కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. ఆ మేరకు ఫిబ్రవరి నుంచి మే వరకు ఎక్కడా విరామం లేకుండా పనిచేశాడు. మధ్యలో ఏప్రిల్ 6వ తేదీన మాత్రమే సెలవు తీసుకున్నాడు. మే 25వ తేదీ నుంచి ఎబావో ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. మే 28వ తేదీ నుంచి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ జూన్ ఒకటో తేదీన మృతి చెందాడు. కుటుంబసభ్యులు పరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. రోజుకు గరిష్టంగా 8 గంటల చొప్పున వారానికి 44 గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉండగా అంతకంటే ఎక్కువ పనిచేయించడం నిబంధనలకు విరుద్ధమని కోర్టు పేర్కొంది. ఇందుకుగాను రూ.47.46 లక్షలు, ఎబావో కుటుంబానికి మానసిక వేదన కలిగించినందుకు అదనంగా మరో రూ.1.17 లక్షలివ్వాలని కంపెనీని ఆదేశించింది.

దళిత బాలికపై గ్యాంగ్ రేప్.. ఒకరి అరెస్ట్

లక్నో: యూపీలోని లక్నోలో 14 ఏళ్ల దళిత బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. దుండగులు బాలిక తలపై ఇటుకతో మోదారు. నగరంలోని బక్షీ కా తలాబ్ ఏరియాకు చెందిన బాలిక హోటల్‌కు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆమెను బలవంతంగా నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. ప్రతిఘటించిన ఆమె తలపై ఇటుకతో మోదారు. అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఇంటికి చేరుకున్న బాధితురాలు కుటుంబసభ్యులకు ఈ విషయం తెలిపింది. వారి ఫిర్యాదుమేరకు పోలీసులు ఎస్సీ/ఎస్టీ చట్టం, పోక్సోలతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరిని పట్టుకున్నారు. పరారీలో ఉన్న మరొకరి కోసం గాలింపు చేపట్టారు. కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు డీసీపీ అభిజిత్ ఆర్.శంకర్ చెప్పారు.

కదులుతున్న కారులో మైనర్‌పై అత్యాచారం

గోండా: కదులుతున్న కారులో దళిత బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. అదుపుతప్పిన కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. యూపీలోని గోండా జిల్లాలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధిత బాలిక(17)తల్లి ఆదివారం గోండా పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహ్మద్ ఆరిఫ్, మహ్మద్ రిజ్వాన్ అనే వారు మాయమాటలు చెప్పి తన కుమార్తెను కారులో బలవంతంగా ఎక్కించుకున్నారని ఆమె పేర్కొంది. కారు కదులుతుండగానే ఆ ఇద్దరూ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారని, పెనుగులాటలో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టిందని ఆమె తెలిపింది. అనంతరం వారు పరారయ్యారని, తన కుమార్తె ఎలాగోలా ఇంటికి చేరుకుని, విషయం తెలిపిందని వివరించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు.

బీజేపీ ఆఫీసే తొలి టార్గెట్

రామేశ్వరం కేఫ్ పేలుడుపై ఎన్‌ఐఏ చార్జిషీటు

న్యూఢిల్లీ: బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనలో నలుగురిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం చార్జిషీటు దాఖలు చేసింది. నిందితుల తొలి టార్గెట్ బెంగళూరులోని బీజేపీ రాష్ట్ర కార్యాలయమని పేర్కొంది. అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ రోజు బీజేపీ ఆఫీసు వద్ద ఐఈడీ బాంబు పేల్చడానికి విఫలయత్నం చేశారని తెలిపింది. ఈ నలుగురిలో ఇద్దరు నిషిద్ధ ఐసిస్ తీవ్రవాదులని.. తప్పుడు పత్రాలతో భారత్‌లో సిమ్ కార్డులు పొందారని, బ్యాంకు ఖాతాలు తెరిచారని పేర్కొంది. డార్క్‌వెబ్ నుంచి భారత్, బంగ్లాదేశీ పౌరుల ధృవీకరణ పత్రాలు డౌన్‌లోడ్ చేసుకున్నారని వెల్లడించింది. ముసావిర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహా, మాజ్ మునీర్ అహ్మద్, ముజామిల్ షరీఫ్‌లను నిందితులుగా పేర్కొంది. వీరందరినీ ఇదివరకే అరెస్టు చేశామని, ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని బెంగళూరులోని కోర్టులో దాఖలు చేసిన చార్జిషీటులో వివరించింది.

కాళిందీ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం

విద్రోహ చర్యగా పేర్కొంటున్న పోలీసులు

కాన్పూర్: ప్రయాగ్‌రాజ్-భివానీ కాళిందీ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. రైలు పట్టాలపై దుండగులు ఎల్పీజీ సిలిండర్, సుమారు ఐదు గ్రాముల పేలుడు పదార్థం, వత్తితో కూడిన పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టెలను ఉంచారు. డ్రైవర్ ఎల్పీజీ సిలిండర్‌ను ముందుగానే గుర్తించి ఎమర్జెన్సీ బ్రేక్‌ను వాడటంతో రైలు సిలిండర్‌ను మాత్రమే తాకి ఆగిపోయింది. దీంతో, పెను ప్రమాదం తప్పినట్లయింది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. కాళిందీ ఎక్స్‌ప్రెస్‌ను పట్టాలు తప్పేందుకు జరిగిన కుట్రగా పేర్కొన్నారు. ఈ ఘటన ఆదివారం రాత్రి 8.20 గంటల సమయంలో కాన్పూర్ సమీపంలో ఘటన చోటుచేసుకుంది. రైలు గరిష్ఠ వేగంతో వెళుతోన్న సమయంలో పట్టాలపైనున్న గ్యాస్ సిలిండర్‌ను లోకో పైలట్ గమనించి అప్రమత్తమయ్యారని అదనపు పోలీస్ కమిషనర్(శాంతి భద్రతలు) హరీశ్ చంద్ర చెప్పారు. 'ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో రైలు ఆగటానికి ముందు సిలిండర్‌ను ఢీకొట్టింది. దెబ్బతిన్న సిలిండర్‌తోపాటు, అగ్గిపెట్టెలు, పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నాం'అని ఆయన చెప్పారు. ఘటనపై రైల్వే, పోలీసు విభాగాలతోపాటు యూపీ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) వేరుగా దర్యాప్తు జరుపుతుందని డీసీపీ(వెస్ట్) రాజేశ్ కుమార్ సింగ్ చెప్పారు. ఘటన నేపథ్యంలో రైలు అక్కడే 20 నిమిషాల పాటు నిలిచిపోయిందని, అనంతరం తనిఖీల నిమిత్తం బిల్హార్ స్టేషన్‌లో ఆగి, భివానీ వైపు వెళ్లిపోయిందని ఏసీపీ చెప్పారు. ఈ ఘటన కాళిందీ ఎక్స్‌ప్రెస్‌ను పట్టాలు తప్పేలా చేసేందుకు జరిగిన విద్రోహ చర్యగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై శివరాజ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత, పేలుడు పదార్థాల చట్టం, రైల్వే చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఇద్దరు స్థానిక రౌడీ షీటర్లతోపాటు ఆరుగురిని అరెస్ట్ చేసి, ప్రశ్నిస్తున్నామన్నారు.

వియత్నాంలో 'యాగి' బీభత్సం..


రెడ్ నదిపై వంతెన కొట్టుకుపోయిన దృశ్యం

- వంతెన ధ్వంసం, కొట్టుకుపోయిన బస్సు..
- భీకర తుపానులో 60 మందికి పైగా మృతి

హనోయి: వియత్నాంను 'యాగి'తుపాను వణికిస్తోంది. నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. వరదల తీవ్రతకు ఒక వంతెన ధ్వంసం కాగా, ప్రయాణికుల బస్సు కొట్టుకుపోయింది. కనీసం 10 కార్లు, ట్రక్కులతోపాటు 2 బైకులు రెడ్ నది వరదల్లో కొట్టుకుపోయాయి. దేశ పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు కీలకమైన ఉత్తరప్రాంతంలో కార్యకలాపాలు స్తంభించాయి. శనివారం యాగి తుపాను తీరాన్ని దాటిన సమయంలో భారీ వర్షాలు, వరదల్లో 10 మంది చనిపోయారు. వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో శనివారం నుంచి 60 మందికి పైగా చనిపోగా మరో 300 మందికి పైగా గాయపడ్డారు. పదుల సంఖ్యలో జనం గల్లంతయ్యారు. కావో బంగ్ ప్రావిన్స్‌లో సోమవారం ఉదయం కొండచరియలు విరిగిపడి 20 మందితో వెళ్తున్న బస్సు కొట్టుకుపోయింది. బురద, మట్టి కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. ఫు థొ ప్రావిన్స్‌లో రెడ్ నదిపై ఉన్న ఇనుప వంతెన కొట్టుకుపోయింది. కార్లు, బైకులు కొట్టుకుపోయిన ఘటనలో ముగ్గురిని సిబ్బంది కాపాడారు. మరో 13 మంది గల్లంతయ్యారు.

ఈ నెల 20 నాటికి స్టాండింగ్ కమిటీలు!

- 16 లోక్‌సభ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పోస్టుల్లో కాంగ్రెస్‌కు మూడు
- డీఎంకే, ఎస్పీ, తృణమూల్‌లకు ఒక్కొక్కటి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత లోక్‌సభకు సంబంధించి వివిధ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల ఏర్పాటు ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం వేగం పెంచింది. లోక్‌సభ పరిధిలోని 16 విభాగాల స్టాండింగ్ కమిటీలను ఫైనల్ చేసేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విపక్ష పార్టీల ఎంపీలతో సంప్రదింపులు మొదలుపెట్టారు. ఈ నెల 20 నాటికి వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు. వాస్తవానికి 24 స్టాండింగ్ కమిటీలకు చైర్మన్‌లతో పాటు, ప్యానల్ సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇందులో 16 లోక్‌సభ పరిధిలోవి కాగా, 8 రాజ్యసభ సభ్యుల నేతృత్వంలో కొనసాగుతాయి. లోక్‌సభ స్టాండింగ్ కమిటీల్లో సంఖ్యాబలాన్ని బట్టి కనీసం 6 కమిటీలకు విపక్ష ఎంపీలను చైర్మన్‌లుగా నియమించే అవకాశాలున్నాయి. ఇందులో మూడు కాంగ్రెస్, మిగతా మూడింటిని ఎస్పీ, డీఎంకే, టీఎంసీ పంచుకోనున్నాయి.


కండ్రిక ప్రాంతంలో ఆహారం కోసం క్యూలైన్‌లో ఉన్న వరద బాధితులు


జక్కంపూడి కాలనీలో కారు వెంట పరుగులు పెడుతున్న వరద బాధితులు

పట్టెడన్నం కోసం పరితపిస్తూ..

ఆహారం, తిండి, తాగునీటి కోసం ఎదురు చూస్తున్న వరద బాధితులు

- ట్రాక్టర్, కారు ఏదొచ్చినా ఆహారం పొట్లాలు ఇచ్చేందుకేననే ఆత్రుతతో వాటిచుట్టూ పరుగులు
- జక్కంపూడి, ఆంధ్రప్రభ కాలనీల్లో దయనీయ పరిస్థితులు
- ముంపు నుంచి కోలుకునే వరకు ప్రభుత్వమే ఆహారం అందించాలని వేడుకోలు

పటమట/చిట్టినగర్ (విజయవాడ): బుడమేరు వరద ముంచెత్తడంతో కట్టుబట్టలతో బయటపడి ప్రాణాలను కాపాడుకున్న జక్కంపూడి కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ ప్రజలు ఆహారం అందక అలమటిస్తున్నారు. సర్వం కోల్పోయిన వారంతా తిండి, తాగునీరు, పాల కోసం అర్రులు చాస్తున్నారు. ట్రాక్టర్, కారు వంటి వాహనం ఏది వచ్చిన ఆహారం పొట్లాలు ఇచ్చేందుకు వచ్చాయని భావించి వాటివెంట పరుగులు పెడుతున్నారు. జక్కంపూడి కాలనీలో సోమవారం ఉదయానికి కాలనీలో వరద నీరు అడుగు మేర తగ్గింది. బాధితులు తమ ఇళ్లు, దుకాణాలు శుభ్రం చేసుకుంటూ భోజనం కోసం ఆత్రుతగా ఎదురు చూశారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం కూడా అందకపోవడంతో కాలనీ వాసులు రోడ్డెక్కారు. కాలనీలోకి ట్రాక్టర్, కారు వచ్చినా అందులో తమ కోసం భోజనం తీసుకొచ్చారేమోనని భావిస్తూ ఆత్రుతతో ఆ వాహనాలను చుట్టుముడుతున్నారు. దాతలు ఇచ్చే ఆహారం కోసం సంచులు పట్టుకుని పిల్లలతో కలిసి రోడ్లపై పడిగాపులు కాస్తున్నారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినా అవి తాగేందుకు ఉపయోగించవద్దని ముందుగానే కార్పొరేషన్ అధికారులు మైక్‌లో ప్రచారం చేయడంతో వాటర్ బాటిళ్ల కోసం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం నుంచి స్వచ్ఛంద సంస్థలు సైతం తమ సేవలను నిలిపివేశాయి. ఒకటి, రెండు స్వచ్ఛంద సంస్థలు కాలనీ వాసులకు భోజనం అందించేందుకు రాగా మహిళలు, యువకులు ఆహార పదార్థాలు తీసుకొచ్చిన వాహనాలను చుట్టుముట్టి కదలనివ్వడం లేదు. సోమవారం కాలనీ మెయిన్ రోడ్డులో నివాసం ఉండే వారికే ఆహారం అందింది. శివారు ప్రాంతాలతో పాటు బుడమేరు కాలువకు అవతలి వైపున ఉన్న వారికి ఎలాంటి ఆహారం అందలేదు. ముంపు నుంచి పూర్తిగా తేరుకునే వరకు కాలనీలో నివాసం ఉండే కుటుంబాలకు ఆహారం అందించాలని అక్కడి వారంతా వేడుకుంటున్నారు.

ఆంధ్రప్రభ కాలనీలోనూ ఇదే పరిస్థితి

ఆంధ్రప్రభ కాలనీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూలి పనులు, ఆటోలు నడుపుకుంటేనే కానీ పొట్టగడవని కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సర్వం కోల్పోయిన తామంతా యాచకుల మాదిరిగా తాగునీరు, ఆహారం కోసం అవస్థలు పడాల్సి వస్తోందని ఈ ప్రాంత పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రభ కాలనీలో పేద, మధ్య తరగతికి చెందిన 600 కుటుంబాల్లో కనీసం రెండు వేల మంది నివాసం ఉంటున్నారు. వరద కారణంగా ఉండే వంట సామాగ్రితో, వస్త్రాలు, జీవనోపాధి కల్పించే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వరదలో కొట్టుకుపోగా.. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. మహిళల స్వయం ఉపాధి ఆసరాగా నిలిచే కుట్టు మెషిన్లు, టిఫిన్ బండ్లతో పాటు ఇళ్లల్లోని గ్రైండర్లు, మిక్సీలు, గ్యాస్ పొయ్యిలు మరమ్మతులకు గురయ్యాయి. ఏ ఒక్కరూ ఇంట్లో వంట చేసుకునే పరిస్థితి లేకపోవడంతో వారంతా దాతలిచ్చే ఆహార పొట్లాలపైనే ఆధారపడ్డారు. పరిస్థితులు చక్కబడ్డాయని భావించి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆహారం సరఫరాను చాలా వరకు తగ్గించేశాయి. దీంతో ఆహారం, పాలు, తాగునీరు దొరక్క ఇక్కడి పేదలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముంపు నుంచి పూర్తిగా తేరుకునే వరకు ఈ రెండు కాలనీల్లోని కుటుంబాలకు ప్రభుత్వమే ఆహారం అందించాలని ముంపు బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

అన్నీ కోల్పోయాం



ఇదేం వరదో. కనీసం ఇంట్లో సామాన్లు సర్దుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. మా కాలనీలోని ప్రతి ఇంట్లో అన్నీ కొట్టుకుపోయాయి. ఆహారం దొరక్క చాలామంది అవస్థలు పడుతున్నారు. పేదలు పూర్తిగా తేరుకునే వరకు ప్రభుత్వమే ఆహారం, పాలు, నీళ్లు అందించాలి. ఇంటి సామగ్రి నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం కనీసం రూ.2 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి.

– వసంత, ఆంధ్రప్రభ కాలనీ

జగనన్న ఇళ్లపట్టా కూడా కొట్టుకుపోయింది



మాది చిన్న కుటుంబం. గృహోపకరణాలన్నీ వరదలో కొట్టుకుపోయాయి. కట్టుబట్టలతో మిగిలాం. ఆధార్, రేషన్, పాన్ కార్డులు, పిల్లల బర్త్ సర్టిఫికెట్లు, పుస్తకాలతోపాటు జగనన్న ఇచ్చిన ఇంటిపట్టా కూడా కొట్టుకుపోయింది. మా వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఇప్పుడు వరద బాధితులకు ప్రభుత్వం ఇచ్చే రేషన్ తీసుకోవాలన్నా కార్డులు అడుగుతున్నారు. మా పరిస్థితి ఏమిటో అర్థం కావటం లేదు. అన్నీ కోల్పోయిన వారి గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలి.

– వెంకటదుర్గా సూర్యకుమారి, ఆంధ్రప్రభ కాలనీ

అర్థగంటలో అంతా నాశనమయ్యింది.



అర్థగంటలో మా జీవితాలన్నీ తారుమారయ్యాయి. ఊహించలేనంత ముప్పు మా ఇంటిలోకి వచ్చింది. మా కష్టం అంతా బుడమేరులో కొట్టుకుపోయింది. మమ్మల్ని ప్రభుత్వమే రక్షించాలి.

– లక్ష్మి సరోజ, ఆంధ్రప్రభ కాలనీ

విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కొత్త చార్జీలు

- పాత పవర్ ప్లాంట్ల పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులకు ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన 'ఏపీఈఆర్సీ'
- ఏపీజెన్‌కోకి సహకరించాలని ప్రభుత్వానికి సూచన



సాక్షి, అమరావతి: 2024–25 నుంచి 2028–29 వరకూ 5వ నియంత్రణ వ్యవధి కాలానికి విద్యుత్ ఉత్పత్తి సంస్థలు డిస్కంల నుంచి వసూలు చేయాల్సిన చార్జీలను నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు గానూ ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో) ఉత్పాదక సంస్థలు సమర్పించిన టారిఫ్ నివేదికల్లో అన్ని అంశాలను, వివిధ వాటాదారుల నుంచి పబ్లిక్ అభ్యంతరాలు, సూచనలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఏపీ జెన్‌కో పాత పవర్ ప్లాంట్ల పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులకు మండలి ఆమోదం లభించింది. పారదర్శకంగా, పోటీ బిడ్డింగ్ నిర్వహించడం ద్వారా పనులను చేపట్టాలని కమిషన్ ఆదేశించింది. ఏపీ జెన్‌కో ఆడిట్ చేసిన నివేదికలను సంస్థ వెబ్‌సైట్‌లో ఉంచాలని నిర్దేశించింది. పవర్ ప్లాంట్ల ఖర్చులను ఆమోదించడంలో వేతన సవరణ ప్రభావాన్ని కమిషన్ పరిగణించలేదు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, ఉద్యోగుల పెన్షన్ చట్టప్రకారం ఇవ్వాలని సూచించింది. బొగ్గు కొరతను అధిగమించడానికి, అన్ని సమస్యలను పరిష్కరించడానికి, జెన్‌కో పనితీరును మెరుగుపరచడానికి, వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాను అందించడానికి, నిర్వహించడానికి డిస్కంలు బహిరంగ మార్కెట్‌లపై ఆధారపడటాన్ని తగ్గించడానికి జోక్యం చేసుకోవాలని, ఏపీజెన్‌కోకి మద్దతిచ్చి సహకరించాలని ప్రభుత్వానికి ఏపీఈఆర్సీ సూచించింది. నిబంధనల ప్రకారం తమ సంబంధిత స్టేషన్లలో అవసరమైన బొగ్గు నిల్వలను ఉంచడం ఏపీ జెన్‌కో బాధ్యతగా కమిషన్ పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో కమిషన్ ఆమోదించిన పీపీఏ ప్రకారం ఏపీజెన్‌కోకు విద్యుత్ కొనుగోలు ఖర్చుకు సంబంధించిన చెల్లింపులు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను ఆదేశించింది. బొగ్గు ఆధారిత థర్మల్ జనరేటింగ్ యూనిట్ల ఫ్లెక్సిబుల్ ఆపరేషన్ నిబంధనలు, 2023కి అనుగుణంగా రెండు నెలల్లోగా తన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించబడింది. విద్యుత్ బిల్లింగ్‌లో పారదర్శకత కోసం నెలవారీ బిల్లులలో బొగ్గు ఖర్చులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని డిస్కంలకు అందించాలని చెప్పింది.అలాగే ఏపీ జెన్‌కో ఇకపై తన వార్షిక పనితీరు సమీక్ష పిటిషన్‌ను కమిషన్‌కు సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

కమిషన్ నిర్ణయించిన చార్జీల వివరాలు (యూనిట్/రూపాయల్లో):

ధర్మల్ కేంద్రం	చార్జీ
డాక్టర్ ఎన్టీటీపీఎస్‌స్టేజ్1,2,3	4.26
డాక్టర్ ఎన్టీటీపీఎస్‌స్టేజ్4	4.01
ఆర్టీపీపీ స్టేజ్1,2,3	4.40
ఆర్టీపీపీ స్టేజ్ 4	4.10
వార్షిక ఫిక్స్‌డ్ చార్జీలు(రూ.కోట్లల్లో):	
ఆర్థిక సంవత్సరం	చార్జీ
2024–25	4593.96
2025–26	4709.49
2026–27	4838.47
2027–28	5017.72
2028–29	5179.66
మొత్తం	24339.3



జగనన్న పిలుపుతో వరద బాధితులకు సాయం

- కళ్ల ముందే ఓ వ్యక్తి వరద నీటిలో కొట్టుకుపోతుంటే కాపాడా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


వరదలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వరదలు ప్రారంభమైన రోజు నుంచి వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నానని తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాడేరు మండలంలోని రాయగడ్డ కాజ్‌వే మీద బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి వరద ఉధృతిలో కొట్టుకుపోతుండగా కాపాడానని చెప్పారు. ఈ కొత్తూరు, బొక్కెల ప్రజలు సహకారం అందించారని తెలిపారు. 'నా కళ్ల ముందే ఓ వ్యక్తి కొట్టుకుపోతుంటే చూడలేకపోయాను. ధైర్యంగా ముందుకెళ్లి కాపాడాను. ఆ వీడియో వైరల్‌గా మారి రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది ఫోన్ చేసి అభినందనలు తెలియజేస్తున్నారు' అని చెప్పారు. 'మాజీ సీఎం జగన్ ప్రజల మనిషి. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఇలా జరిగితే, వెంటనే రైతులను ఆదుకున్నాం' అని గుర్తు చేశారు. ప్రతి ప్రెస్‌మీట్‌లోనూ చంద్రబాబు రెండు గంటల సేపు మాట్లాడటం, చివర్లో తన అనుకూల జర్నలిస్టు చేత ప్రశ్నలను అడిగించుకుని వాటికి సమాధానంగా జగన్‌ను నిందించడం పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ మాని, వరద ప్రాంతాల్లో పరిస్థితులను చక్కదిద్దాలని, బాధితులను, పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు.

రఘురామ పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. పోలీసు ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఫరూఖ్‌బాషాపై దాడి ఘటనలో నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలంటూ రఘురామ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. తొలుత, రఘురామ పిటిషన్‌పై కౌంటరు ఎందుకు దాఖలు చేయలేదని తెలంగాణ ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. తెలంగాణలో ప్రభుత్వం మారిందని, కౌంటరు దాఖలు చేయడానికి సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీంతో, విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసిన ధర్మాసనం, ఈలోగా కౌంటరు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,178 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,463 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శించుకోగలగుతున్నారు.

నూకాలమ్మ హుండీ ఆదాయం రూ.7.65 లక్షలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాకినాడ జిల్లా కాండ్రకోట నూకాలమ్మ వారి ఆలయానికి హుండీల ద్వారా రూ.7,65,921 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్ కుమార్‌బాబు నాయుడు సమక్షంలో సోమవారం ఆలయ హుండీలను లెక్కించారు. 93 రోజుల కాల వ్యవధిలో అమ్మవారి ఆలయానికి రూ.7,65,921ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: పవిత్ర అరుణాచల గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు గుంటూరు ఆర్టీసీ డిపో– 2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న బస్సు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, ఆ రోజు రాత్రి అక్కడే ఉండి, 18న గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి గుంటూరుకు బయలుదేరి 19న ఉదయానికి చేరుకుంటుందని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకుని అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో టికెట్ ధర రూ 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7382894613కు సంప్రదించాలని సూచించారు.

విభూతి ధారణ పునఃప్రారంభం

శ్రీశైలంటెంపుల్: కోవిడ్ సమయంలో నిలుపుదల చేసిన విభూతి ధారణ చేయించే సంప్రదాయాన్ని సోమవారం ఆలయ క్యూకాంప్లెక్స్ వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పునఃప్రారంభించారు. ఆలయ సంస్కృతి సంప్రదాయాలపై భక్తులకు మరింత అవగాహన కల్పించాలనే సంకల్పంతో విభూతి ధారణ కార్యక్రమాన్ని పునఃప్రారంభించినట్లు ఈఓ తెలిపారు. భక్తులకు విభూతిధారణ చేయించేందుకు శివసేవకుల సహకారాన్ని తీసుకోనున్నట్లు తెలిపారు. నుదుట ఒట్టు పెట్టుకోవడం సనాతన సంప్రదాయమన్నారు. విభూతి పవిత్రతను కలిగిస్తుందని, అరిష్టాలను తొలగించి సకల శుభాలను కలిగిస్తుందని చెప్పారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం శ్రీరంగనాథుడు సింహ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు కృష్ణరాజేశ్‌శర్మ ఉభయదారులచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 9 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తరించారు.

11న పారామెడికల్ డిప్లొమా మిగులు సీట్లకు కౌన్సిలింగ్

తిరుపతి తుడా: ఎస్వీ వైద్యకళాశాలలో పారా మెడికల్ డిప్లొమోలో మిగిలిన సీట్ల కొరకు ఈ నెల 11న కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా డిప్లొమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీలో 9సీట్లు, డిప్లొమో ఇన్ అనస్తీషియా టెక్నీషియన్‌లో 3సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థుల రూ.7700ల ఫీజు అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 9440879943 నంబరు నందు సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


తిరుపతి సిటీ: ఎస్వీయూ బయోటెక్నాలజీ, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ హెమటాలజీ అండ్ అంకాలజీ, యూనివర్సిటీ ఆఫ్ అలబామా బర్మింగ్‌హోమ్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 27 నుంచి మూడు రోజుల పాటు క్యాన్సర్‌పై జరిగే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ సీహెచ్ అప్పారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బయోటెక్నాలజీ, మెడిసన్, క్యాన్సర్ థెరప్యూటిక్స్ అనే అంశంపై వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మంచి ఆలోచనలతో సాగుదాం

నెల్లూరు(అర్బన్) : ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా మంచి ఆలోచనలతో ధైర్యంగా ముందుకు సాగితే విజయాలు తథ్యమని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ కామేశ్వరి అన్నారు. ప్రపంచ సూసైడ్ ప్రివెన్షన్ డేను పురస్కరించుకుని నగరంలోని యలమవారిదిన్నె అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కామేశ్వరి మాట్లాడుతూ యువతీ, యువకులు సత్ప్రవర్తన అలవరుచుకోవాలన్నారు.

పీజీసెట్ రిపోర్టింగ్ తేదీ పొడిగించాలి

విశాఖ సిటీ: ఏపీ పీజీసెట్-2024లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామాల నుంచి విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని, అందుకే తేదీ పొడిగింపుపై ఆలోచించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



పర్యాటక దినోత్సవం సందర్భంగా పోటీలు

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీడియో, రీల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక నిమిషం నిడివి గల వీడియోలు లేదా 15 నుంచి 30 సెకన్ల నిడివి గల రీల్స్ పంపాలన్నారు. ఉదయగిరి దుర్గం, మైపాడు బీచ్, లైట్‌హౌస్, జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారి ఆలయం, నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, పెంచలకోన నరసింహస్వామి, నెల్లూరులోని రంగనాథస్వామి ఆలయాలు, కండలేరు డ్యామ్, సోమశిల జలాశయం తదితర వాటి ఔన్నత్యం తెలిపేలా ఈనెల 22లోగా ఆన్‌లైన్‌లో వీడియోలు, రీల్స్ పంపాలన్నారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, ఐదుగురికి రూ.1,000 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 98480 07024 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నీటి వనరులను పరిరక్షించాలి

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రజల ఆలోచనా ధోరణి మారాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం బయో ఈ3 పాలసీపై జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే.. చెట్ల నరికివేత నిలిపివేయాలని, నీటి వనరుల ప్రాంతాల్లో నిర్మాణాలను నిరోధించాలన్నారు.

నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం



ఆలోచనల నుంచి డైవర్ట్ చేస్తే ఆత్మహత్యలు తగ్గిపోతాయి...

'క్షణంలో వెయ్యోవంతు కాలంలో జీవితం పట్ల దృక్పథం మారిస్తే చాలు ఓ జీవితాన్ని నిలబెట్టగలుగుతాం'అంటున్నారు వన్‌లైఫ్ వలంటీర్లు. మానసిక ఒత్తిడి, ఇతరత్రా సమస్యలతో ఆత్మహత్య లాంటి ఆలోచనల నుంచి విముక్తి కల్పించడానికి జాతీయస్థాయిలో 24/7 సేవలు అందిస్తోంది వన్‌లైఫ్ సంస్థ. దీని ఆధ్వర్యంలో గత కొంత కాలంగా పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన వలంటీర్లు సాక్షితో తమ అనుభవాలు పంచుకున్నారు.

-సాక్షి, హైదరాబాద్

ఫోన్ కాల్స్ ద్వారా మమ్మల్ని సంప్రదించిన వారికి సంబంధించిన సమస్యల విషయంలో మేం పూర్తిగా గోప్యత పాటిస్తాం. కాల్స్ కోసం 24/7 అందుబాటులో ఉంటాం అంటున్న వలంటీర్లు చెప్పిన విశేషాలు వారి మాటల్లోనే...

సమస్యల్ని పంచుకుంటున్నాం..
అవగాహన పెంచుకుంటున్నాం..

వన్‌లైఫ్‌లో చేరాక మూమెంటరీ థింకింగ్ గురించి అర్థమైంది. ఫోన్ చేసినప్పుడు వారిని కాసేపు డైవర్ట్ చేస్తే చాలు. చాలా వరకూ ఆత్మహత్య ఆలోచనలు సమసిపోతాయి. కొన్ని విషయాలు షేర్ చేసుకోవడం వల్లనే చాలా వరకూ భారం తగ్గుతుంది. జీవితం చాలా గొప్పదనే విషయం తెలిసేలా చేస్తా తప్ప సలహాలు, సూచనలు ఇవ్వను. తొలుత ఫ్రీగా మాట్లాడలేరు కానీ కాసేపు గడిచాక చాలా ఫ్రీగా మాట్లాడతారు. ఎవరికీ చెప్పలేని తీవ్రమైన ర్యాగింగ్ సంఘటనల నుంచి, భార్య వెళ్లిపోయింది పిల్లలు లేరు దాకా ఎన్నో.. నేను 15 ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేశాను కాబట్టి నాకు ఈ పని కొంచెం సులభంగా మారింది. చేసేవారిలో 90 శాతం మంది కేవలం బాధలను చెప్పుకోవడం కోసమే చేస్తారు. మాట్లాడుతుండగానే వారి స్కిల్స్ గుర్తించి వాటిని వారికి గుర్తు చేస్తా. -వెంకటరమణి

ఒత్తిడికి మూలం అనుబంధాల విచ్ఛిన్నమే ● అసలు సమస్య పంచుకునేవారు లేకపోవడమే

క్షణికావేశాలను మళ్లిస్తే...ఆత్మహత్యలు తగ్గించొచ్చు.. తమ అనుభవాలను వెల్లడించిన వన్‌లైఫ్ వలంటీర్లు..

ఒత్తిడిని చిత్తు చేస్తూ..

ట్రిపుల్ ఐటీ పూర్తి చేశా..చదువుకునే సమయం నుంచీ ఒత్తిడి బాగా ఉండేది. అయితే లోకువగా చూస్తారేమోనని ఎవరికీ చెప్పలేకపోయేవాడ్ని. అదే సమయంలో వన్‌లైఫ్ సంస్థ గురించి తెలిసింది..వీరిని అప్రోచ్ అయ్యి నా ఒత్తిడి పోగొట్టుకోగలిగాను. మరెంతో మందికి పరిష్కారంగా మారాలని వన్‌లైఫ్‌లో వలంటీర్‌గా జాయినయ్యా. మూడేళ్ల నుం,ఇ ప్రతీ శనివారం 4గంటల పాటు వలంటీర్‌గా ఇంటి నుంచే చేస్తున్నా. తొలుత చాలా నెగిటివిటీ వస్తుంటుంది జాగ్రత్త అని ఫ్యామిలీ మెంబర్స్ హెచ్చరించారు. అయితే ట్రైనింగ్ తీసుకోవడం వల్ల నాకేమీ సమస్య అనిపించలేదు. స్టూడెంట్స్ పరీక్షల టైమ్‌లో ఎక్కువ కాల్స్ రిసీవ్ చేసుకున్నా. అది నేను అనుభవించి వచ్చాను కాబట్టి బాగా కనెక్ట్ అయ్యాను. లవ్ ప్రాబ్లెమ్స్‌తో కూడా వస్తున్నాయి.. ఇతరుల సమస్యలు వినడం వల్ల మన సమస్యలు చిన్నగా అనిపిస్తూంటాయి. అలా ఈ పని నాకు వ్యక్తిగత జీవితంలో సమస్యల పరిష్కారానికి కూడా చాలా హెల్ప్ అయింది.

-సూర్య, మాదాపూర్

నాలో ఉన్న ఖాళీని భర్తీ చేసుకుంటూ...

రిటైర్‌మెంట్ తర్వాత కొంత ఎంప్టీనెస్ అనిపించి ఈ సేవలోకి వచ్చాను. నాకు విభిన్న భాషల్లో పట్టు ఉండడం వల్ల దేశవ్యాప్తంగా కాల్స్ వస్తుంటాయి. రిలేషన్‌షిప్స్‌కు సంబంధించినవే ఎక్కువగా వస్తున్నాయి. 'నేను అమ్మాయిని కాను నాకు పెళ్లి చేయాలని అనుకుంటున్నారు... నాది అబ్బాయి మనస్తత్వం అని చెప్పలేకపోతున్నా'అంటూ ఓ అమ్మాయి చేసిన కాల్, అలాగే ఓ అమ్మాయి తనను ప్రేమ పేరుతో డబ్బులు ఖర్చుపెట్టించి వదిలేసిందని, నేనెంతో తెలివిగల వాడ్ని అనుకునేవాడ్ని ఎలా ఇలా మోసపోయానో'అంటూ మరో అబ్బాయి కాల్... ఇలాంటివి కొన్ని గుర్తుండిపోయే సమస్యలు వస్తుంటాయి. వారితో మాట్లాడడం ద్వారా వారిలో కొత్త ఆలోచనలు వచ్చేలా చేయడమే ముఖ్యం తప్ప సలహాలు, సూచనలు ఇవ్వడం చేయం. -రుక్మిణి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్

అవగాహన పెంచుతున్న సమస్యలు...

హైటెక్ సిటీలో ఐటీ ఉద్యోగినిగా చేస్తున్నా. ఏడాది నుంచి వన్‌లైఫ్‌లో వలంటీర్‌గా రాత్రి 9 నుంచి 11 గంటల సమయంలో కాల్స్ అటెండ్ అవుతుంటా. ఇష్టం వచ్చినట్టు లోన్స్ తీసుకున్నాం కట్టలేకపోతున్నాం లాంటి సమస్యల నుంచివిడాకుల తర్వాత లోన్లీనెస్ ఫేస్ చేయలేకపోతున్నాం దాకా ఎన్నో రకాల సమస్యలతో కాల్స్ వస్తున్నాయి. నాకు అర్థం అయిందేమిటంటే...ప్రాబ్లెమ్‌ని ఇతరులతో షేర్ చేసుకుంటే మమ్మల్ని ఎలా జడ్జ్ చేస్తారో అని భయంతో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఈ వలంటరీ విధుల వల్ల అనేక రకాల సమస్యలపై యుక్త వయసులోనే అవగాహన కలుగుతోంది.

-అనూష, బోయినపల్లి

జీవితం మీద ఆశ చిగురించేలా చేయొచ్చు

విద్యార్థుల్లో అధిక గ్రేడ్స్‌కు సంబంధించిన ఒత్తిడి అంచనాలు, ఇతరులతో పోల్చడం, ర్యాగింగ్. మిగిలిన వారిలో అనుబంధాలు, అంచనాలు, తీర్చలేని డిమాండ్లు, సందేహాలు పరస్పరం నిందించుకోవడం తగాదాలు, వాదనలు, కోపం, ఆందోళన,.ఆర్థిక సంక్షోభాలు, వంటివి ప్రతికూలతకు దారి తీసిన ఫలితంగానే ఆత్మహత్యకు ఆలోచనలు చేస్తారు. అలాంటివారిలో జీవితం పట్ల ఆసక్తి పెంచే ఆలోచనల్ని ప్రోత్సహించడం, సానుకూలతను అందించడం, జీవితం అప్పుడే అయిపోలేదని నొక్కిచెప్పడం తమ కోసం మేం ఒక స్టాండ్ తీసుకోవడానికి ప్రోత్సహించడం చేస్తాం. ఒక్కో కాల్ అత్యధికంగా 45 నిమిషాల పాటు వింటాం. మా దగ్గర సీనియర్ కౌన్సెలర్లు ప్రొఫెషనల్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ఉన్నారు. కాలర్స్ మాటల్ని బట్టి ప్రమాదస్థాయిని అర్థం చేసుకొని, వెంటనే జోక్యం చేసుకొని, 3 నుంచి 4 ఫాలో అప్‌లు, కౌన్సెలింగ్ సెషన్స్ కొనసాగిస్తాం. పదేళ్లుగా మా వన్‌లైఫ్ ద్వారా ఏడాదికి 30 మంది వరకూ ఆత్మహత్య ఆలోచనల నుంచి దారి మళ్లించామని చెప్పగలను. మరింత మందిని వలంటీర్లుగా చేరమని ఆహ్వానిస్తున్నాం. ఈ వలంటీర్ వర్క్ మన ద్వారా మరికొందరికి జీవితం మీద ఆశ చిగురించేలా చేయడంతో పాటు మన జీవితంలోనూ ఎన్నో మంచి మార్పులకు దోహదం చేస్తుందని రచ్చితంగా చెప్పగలను.

-రెబెకామరియా, వన్‌లైఫ్ నిర్వాహకులు

పేదలపై బుల్డోజర్ రాజకీయం

- మురళీమోహన్, రేవంత్‌రెడ్డి సోదరుడికి నోటీసులు ఇస్తారు.. పేదలకు ఇవ్వరా?
- మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్



సాక్షి, హైదరాబాద్: ప్రజల వ్యతిరేకతతో 'హైడ్రా' హైడ్రాప్ అయిందని మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలసి మీడియాతో మాట్లాడుతూ, హైడ్రాపై ఇప్పటివరకు విధి విధానాలు ప్రకటించకుండా పేదలపై బుల్డోజర్ రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మురళీమోహన్, సీఎం రేవంత్‌రెడ్డి సోదరునికి నోటీసులు ఇచ్చి.. పేదలకు మాత్రం ఎలాంటి నోటీసులు లేకుండా ఇళ్లు కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇళ్లను కూల్చాలంటే వారికి పునరావాసం కల్పించాలని హైకోర్టు చెప్పిందన్నారు. వాటిని పట్టించుకోకుండా హైడ్రా చేస్తున్న చర్యలన్నీ కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయన్నారు. చెరువుల పరిధి నిర్ధారణ కాకుండా నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపులకు హైడ్రాను వాడుకుంటున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేయాలని ధర్నా చేస్తే తమపై దాడులు చేశారని, తెలంగాణలో రేవంత్‌రెడ్డి బుల్డోజర్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజులుగా బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. విద్యార్థులకు కనీసం వైఫై సౌకర్యం కల్పించడంలేదని ధ్వజమెత్తారు. ట్రిపుల్ ఐటీకి రాజీవ్‌గాంధీ పేరు పెట్టారని, ఆయన పేరుపై కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం ఉన్నా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

6 గ్యారంటీల నుంచి దృష్టి మళ్లించేందుకే హైడ్రా

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, హామీల అమలు విషయంలో వైఫల్యాల నుంచి పక్కదారి పట్టించడానికి హైడ్రా పేరుతో రోజుకో చర్చతో ప్రజలను భ్రమింపజేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ప్రతీరోజు వార్తల్లో నిలవాలని హైడ్రా పేరిట హడావుడి చేస్తూ డైవర్ట్ పాలిటిక్స్‌కు తెరదీశారన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేస్తున్న హైడ్రా అధికారాలు, విధులు, పరిధికి సంబంధించి చట్టబద్ధత కల్పించకుండా.. కేవలం జీఓ-99కు అనుగుణంగా ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఢిల్లీ నాయకులకు గులాములుగా మారి, ఢిల్లీకి పరుగులు పెట్టడం తప్పితే ప్రజలకు చేసిందేమీ లేదని లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా కాంగ్రెస్ నేతలకు చీమ కుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు. డెంగీ జ్వరాలతో ఆస్పత్రులు నిండిపోయినా వైద్య చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. జైనూరులో ఆదివాసీ మహిళపై లైంగిక దాడి, ఇటీవల నాగర్‌కర్నూల్‌లో జరిగిన సంఘటన వంటి అనేక ఘటనలు జరుగుతున్నా.. ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని ధ్వజమెత్తారు.



గండి దాటితేనే బడి

భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురం శివారు అన్నస్వామి కుంటకు గండి పడింది. దీంతో బక్కతండా, పోట్యాతండా, బండమీదితండాకు చెందిన విద్యార్థులు గండి దాటి 5 కిలోమీటర్ల దూరంలోని నర్సింహులపేట, 2 కిలోమీటర్ల దూరంలోని జయపురం పాఠశాలలకు రావాలి. దాదాపు 40 మంది విద్యార్థులు పాఠశాలలకు వచ్చి వెళ్తున్నారు. ఇందులో బాలికలు ఎక్కువగా ఉన్నారు. కాగా, గండి లోతుగా పడటంతో వరద నీటిలో సైకిళ్లను ఎత్తుకొని దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి గండి దాటిస్తున్నారు. గండిని త్వరగా పూడ్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. - నర్సింహులపేట

'వరద సహాయాన్ని కేంద్రం వెంటనే విడుదల చేయాలి'

సాక్షి, హైదరాబాద్: వరద సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు బాధ్యతగా వ్యవహరించడం లేదని ఆరోపించారు.

'పెండింగ్ సమస్యలు పరిష్కరించండి'

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఆర్‌ఎస్ బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే ఏజెన్సీ విధానం రద్దు చేసి పే స్కేల్ ద్వారా ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షుడు పులి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు దోయిపడి శ్రీధర్, కోశాధికారి కోటాల సంతోష్, సచివాలయ అధ్యక్షుడు కట్ట రమేశ్, నేతలు వేణు, అనిత, సునీత, అనురాధ తదితరులున్నారు.

కరెంట్ కనెక్షన్‌కు రూ. 62 కోట్ల డిపాజిట్!

- 'పాలమూరు'లోని వట్టెం పంప్‌హౌస్, సొరంగాన్ని ముంచెత్తిన వరద
- నీటిని బయటకు తోడేందుకు అత్యవసరమైన 11 కేవీ కొత్త విద్యుత్ కనెక్షన్
- పంప్‌హౌస్‌ను ఖాళీ చేసి నీటిని వెంకటాద్రి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన వట్టెం పంప్‌హౌస్‌లో చేరిన వరద నీటిని బయటకు తోడేందుకు కొత్తగా 725 మెగావాట్ల భారీ కాంట్రాక్టెడ్ లోడ్‌తో 11 కేవీ కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం తక్షణమే రూ. 62 కోట్లను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ విజ్ఞప్తి చేసింది. కొత్త కనెక్షన్ కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో ఈ మేరకు డిపాజిట్‌ను నీటిపారుదల శాఖ చెల్లించాల్సి ఉంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన అనంతగిరి రిజర్వాయర్ నుంచి 21 కి.మీ. సొరంగ మార్గంలో తరలించిన నీటిని వట్టెం వద్ద నిర్మించిన పంప్‌హౌస్ ద్వారా వెంకటాద్రి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయాల్సి ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల్లోని చెరువులు తెగిపోవడంతో వరదనీరంతా సొరంగాన్ని, వట్టెం పంప్‌హౌస్‌ను ముంచెత్తింది. దాదాపుగా 16 కి.మీ. మేర సొరంగం వరదనీటితో నిండిపోయింది. పంప్‌హౌస్‌లోని 145 మెగావాట్ల సామర్థ్యంగల ఐదు మోటార్లు సైతం నీటమునిగాయి. తొలుత 4,000 హెచ్‌పీ సామర్థ్యంగల 16 పంపుల ద్వారా నీటిని బయటకు తోడాలని భావించారు. దీనికి కనీసం 45 రోజుల సమయం పట్టనుందని అంచనా వేశారు. తాజాగా కేవలం వట్టెం పంప్‌హౌస్‌లోని నీళ్లనే పంపింగ్ చేయాలని నిర్ణయించారు.

సొరంగంలోని నీళ్లు వెంకటాద్రిలోకి ఎత్తిపోత..

సొరంగంలోని నీళ్లు సర్జ్‌పూల్ మీదుగా పంప్‌హౌస్‌లోకి చేరకుండా తొలుత ఏర్పాట్లు చేయనున్నారు. అనంతరం పంప్‌హౌస్‌లోని నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపింగ్ చేసి ఖాళీ చేయనున్నారు. అనంతరం 145 మెగావాట్లు సామర్థ్యంగల ఐదు పంప్‌లకు సంబంధించిన మోటార్లను కడిగి ఆరబెట్టి వినియోగంలోకి తీసుకురానున్నారు. అనంతరం ఆ పంప్‌ల ద్వారానే సొరంగంలో చేరిన వరదనీటిని వెంకటాద్రి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయాలని నిర్ణయం తీసుకున్నారు. ఎత్తిపోతల పథకాల సలహాదారులు పెంటారెడ్డి ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ సంస్థే సొంత ఖర్చుతో పునరుద్ధరణ పనులను నిర్వహించనుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

వీసీల కోసం 'సెర్చ్'

ఈ వారంలో కమిటీ సమావేశమయ్యే అవకాశం

పోటీలో 312 మంది.. దరఖాస్తులు 1,382

పలు వర్సిటీలకు దరఖాస్తు చేసిన ప్రొఫెసర్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్ల నియామకంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వారం రోజుల్లోగా సెర్చ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముందే వీసీ నియామకాలకు సంబంధించి విధివిధానాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది. దీనికి అనుగుణంగానే వీలైనంత త్వరగా వీసీలను ప్రకటించొచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఆయా వర్సిటీలకు దరఖాస్తులు ఇలా...

రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల వీసీ పోస్టులకు 1,382 దరఖాస్తులు వచ్చాయి. 312 మంది పోటీ పడుతుండగా, ఒక్కొక్కరు చాలా వర్సిటీలకు దరఖాస్తు చేయడంతో ఈ సంఖ్య పెరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ పోస్టుకు 193, కాకతీయకు 149, పాలమూరుకు 159, మహాత్మాగాంధీకి 157, తెలంగాణ వర్సిటీకి 135, తెలుగు యూనివర్సిటీకి 66 దరఖాస్తులొచ్చాయి. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీకి అత్యధికంగా 208 దరఖాస్తులు అందాయి. జేఎన్‌టీయూహెచ్‌కు కూడా 106 దరఖాస్తులు వచ్చాయి.

పైరవీలతో పరేషాన్

వీసీల పదవీకాలం ఈ ఏడాది మే 21తో ముగిసింది. అప్పటినుంచి ఐఏఎస్ అధికారులే వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలుగా కొనసాగుతున్నారు. కొత్త వీసీల నియామకానికి మే నెలలోనే సెర్చ్ కమిటీలు వేశారు. అయితే, ఇవి ఇంతవరకూ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. వీసీ పోస్టుల కోసం పెద్ద ఎత్తున సిఫార్సులు వస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వంలోని మంత్రులు, సీనియర్ రాజకీయ నాయకుల చేత ప్రొఫెసర్లు ఒత్తిడి తెస్తున్నారు. కొంతమంది ఏకంగా కేంద్ర స్థాయిలో పార్టీ పెద్దలతోనూ సిఫార్సు లేఖలు తెచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీసీలుగా ఎవరిని ఎంపిక చేయాలనేది ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారింది. ఈ కారణంగానే సెర్చ్ కమిటీకి విధివిధానాలు ఇవ్వలేకపోయినట్టు తెలుస్తోంది. కూడికలు, తీసివేతల తర్వాత కొంతమంది పేర్లను వీసీలుగా ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ప్రతీ పోస్టుకు ముగ్గురి పేర్లను సెర్చ్ కమిటీ సూచించడం నామమాత్రం. దీనిపై వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని ఉన్నతస్థాయి వర్గాలు చెబుతున్నాయి.

13న పొన్నం సత్తయ్యగౌడ్ మెమోరియల్ అవార్డుల ప్రదానం

జ్యూరీ కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ మూడో మెమోరియల్ అవార్డులు ఈనెల 13న రవీంద్ర భారతిలో ప్రదానం చేస్తారని జ్యూరీ కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర తెలిపారు. అవార్డులకు ప్రముఖ సినీగేయ రచయిత చంద్రబోస్, బలగం ఫేం కొమురయ్య, మొగిలయ్య ఎంపికయ్యారని వెల్లడించారు. అవార్డు గ్రహీతలు ఒక్కొక్కరికి రూ.51 వేల నగదు, మెమెంటోతో సత్కరిస్తారని తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, విశిష్ట అతిథులుగా ఎక్సైజ్ అండ్ సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నారని తెలిపారు. సోమవారం రవిచంద్ర అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు సీనియర్ పాత్రికేయుడు, మాజీ కేంద్ర సమాచారశాఖ కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వియత్నాంలో కార్పొరేట్ల నుంచే పన్ను వసూలు: చాడ



సాక్షి, హైదరాబాద్: అగ్రరాజ్యమైన అమెరికాను వణికించిన వియత్నాం పోరాట స్ఫూర్తి ప్రపంచానికే ఆదర్శమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వియత్నాం 50 ఏళ్ల సంబరాల్లో భాగంగా ఆ దేశ పర్యటనకు వెళ్లొచ్చిన నేపథ్యంలో సోమవారం ఆయన మఖ్దూంభవన్‌లో మీడియాతో మాట్లాడారు. చిన్న దేశమైనప్పటికీ ఎంతో అద్భుతమైన పాలన సాగిస్తోందని, అక్కడ కేవలం కార్పొరేట్ల నుంచే పన్నులు వసూలు చేస్తారని, సామాన్యులకు రాయితీలు ఇస్తారని తెలిపారు. కానీ మోదీ నాయకత్వంలో ఉన్న భారత్‌లో మాత్రం సామాన్యులపై పన్నులు విధిస్తూ కార్పొరేట్లకు రాయితీలు ఇస్తారని విమర్శించారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, నిత్యావసర వస్తువుల ధరలు ప్రజల జీవన విధానాలపై అక్కడ సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు.

అన్ని పోటీపరీక్షలకు ఉపయోగపడే
ముఖ్యమైన కరెంట్ అఫైర్స్ కోసం..
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి...
మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి

రెండో పరశురాముడిగా పేరొందిన భారతీయ రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

షోడశ మహాజనపదాలు

క్రీ.పూ. 6 శతాబ్దానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆనాటి రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితుల ప్రభావం భారతదేశ చరిత్ర మీద ప్రబలంగా ఉంది. ఈ కాలాన్ని మహాజన పదాల యుగం, బుద్ధ యుగం, రెండో నగరీకరణ యుగం, మౌర్యుల పూర్వ యుగం అనే పలు పేర్లతో పిలుస్తారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా, వేదకాలపు తెగ ఆధారిత జన పదాలకు భిన్నంగా ప్రాంతం ఆధారిత మహాజనపదాలు (ప్రాదేశిక రాజ్యాలు) ఈ యుగంలోనే ఏర్పడ్డాయి. ఈ కాలంలోనే బుద్ధుడు జీవించాడు. సింధూ నాగరికత పట్టణాల తర్వాత మళ్లీ నగరాల ఆవిర్భావం జరిగింది. ఈ యుగం అంతం కాగానే క్రీ.పూ. 325లో మౌర్య సామ్రాజ్యం ఏర్పడినందున దీన్ని మౌర్యుల పూర్వ యుగం అంటారు.

మహాజనపదాల ఆవిర్భావం:

క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రపంచంలోని అత్యంత సారవంతమైన మైదానాల్లో ఒకటైన గంగా మైదానం సాగులోకి వచ్చింది. ఈ కాలంలో విస్తృత స్థాయిలో ఇనుమును ఉపయోగించారు. కొత్త వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి వచ్చి వ్యవసాయంలో మిగులు ఏర్పడింది. దీనివల్ల వ్యాపార వాణిజ్యాలు, నగరాలు అభివృద్ధి చెందాయి. పన్నుల వ్యవస్థకు అవకాశం కలిగింది. ఈ పరిణామాలన్నీ కలిసి ఈ యుగంలో 16 పెద్ద ప్రాదేశిక రాజ్యాల ఏర్పాటుకు దారితీశాయి. బౌద్ధ గ్రంథం అంగుత్తర నికాయలో ఈ 16 రాజ్యాల ప్రస్తావన ఉంది.

1. **అంగ:** దీని రాజధాని చంపా. బ్రహ్మదత్తుడిని అంతం చేసి బింబిసారుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
2. **కాశీ:** రాజధాని వారణాసి. ఇది వరుణ, ఆసి నదుల సంగమ ప్రాంతం.
3. **కోసల:** దీని తొలి రాజధాని అయోధ్య. మలి రాజధాని శ్రావస్తి. ఈ రాజులు కాశీని ఆక్రమించారు. రాజ్యం చివరికి మగధలో విలీనమైంది.
4. **వజ్జీ:** రాజధాని వైశాలి. ఇది 8 గణ రాజ్యాలతో కూడిన సమాఖ్య. వైశాలి రాజు చేతకుని కుమార్తె చెల్లనను బింబిసారుడు వివాహం చేసుకున్నాడు. ఈ రాజ్యాన్ని చివరికి అజాతశత్రువు అంతం చేశాడు.
5. **మల్ల:**
   దీని రాజధానులు కుశినార, పావ. కుశినారలో బుద్ధుడు నిర్యాణం చెందాడు. పావలో మహావీరుడు మరణించాడు. ఈ గణ రాజ్యం బుద్ధున్ని బాగా ఆదరించింది. బుద్ధుని శిష్యులు ఆనందుడు, ఉపాలి మొదలైన వారు ఈ రాజ్యానికి చెందినవారే. పావలో సాంతాగార అనే శాసన సభ ఉండేది.
6. **చేది:** రాజధాని సుక్తిమతి, ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో ఉంది.
7. **వత్స:** దీని రాజధాని కౌశాంబి, దీని రాజు ఉదయనుడు బౌద్ధ మతాన్ని ఆదరించాడు. హర్షుని ప్రియదర్శిక, రత్నావళితోపాటు అనేక కథల్లో ఇతడు నాయకుడు. అవంతిరాజు పలాక ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
8. **పాంచాల:** దీని రాజధానులు అహిచ్ఛత్ర, కంపిల్య.
9. **శౌరసేన:** దీని రాజధాని మధుర. గ్రీకు రచనల్లో ఈ రాజ్యాన్ని శౌరసేనాయ్‌గా, రాజధాని మేథోరాగా ప్రస్తావించారు.
10. **మత్స్య:** దీని రాజధాని విరాటనగరం. ఈ రాజ్యమూ మగధలో కలిసిపోయింది.
11. **కురు:** రాజధాని ఇంద్రప్రస్థ. ఆధునిక ఢిల్లీ పరిసరాల్లోని నగరం. రెండో రాజధాని హస్తినాపూర్
12. **అస్సక/అస్మక:**
    రాజధాని పొదన లేదా పాటన. ఇదే నేటి బోధన్. ఇది షోడష మహాజనపదాల్లోని ఏకైక దక్షిణాది రాజ్యం. ఇది ఆంధ్ర, మహారాష్ట్రలకు విస్తరించింది.
13. **అవంతి:**
    రాజధానులు ఉజ్జయినీ, మహిష్మతి. నందివర్ధనుడిని ఓడించి మగధ రాజు శిశు నాగుడు ఈ రాజ్యాన్ని ఆక్రమించాడు.
14. **గాంధార:** రాజధాని తక్షశిల. ఈ రాజ్యాన్ని పర్షియన్లు ఆక్రమించుకున్నారు.
15. **కాంభోజ:** రాజధాని రాజాపుర.
16. **మగధ:** రాజగృహ (గిరివ్రజ), పాటలీ పుత్ర రాజధానులు.

బుద్ధుని కాలానికి పైన పేర్కొన్న 16 జనపదాల్లో కేవలం నాలుగు రాజ్యాలు మాత్రమే ఉండేవి. అవి.. వత్స, అవంతి, కోసల, మగధ. మిగిలిన రాజ్యాలన్నీ ఈ నాలుగు రాజ్యాల్లో విలీనమైపోయాయి. అయితే క్రీ.పూ. 4వ శతాబ్దాల్లో ఈ నాలుగు రాజ్యాలూ విలీనమై మగధ సామ్రాజ్యం అవతరించింది.

మగధను పాలించిన రాజవంశాలు

క్రీ.పూ. 6వ శతాబ్దం నుంచి క్రీ.పూ. 4వ శతాబ్దం (మౌర్య సామ్రాజ్యం ఏర్పడే) వరకు మగధను మూడు రాజవంశాలు పాలించాయి.

హర్యాంక వంశం (544-413)

బింబిసారుడు: ఇతనితో ప్రారంభమైన మగధ సామ్రాజ్య వాదం అశోకుడి కళింగ యుద్ధం వరకు కొనసాగింది. ఇతడు అంగను జయించి తన కుమారుడు అజాతశత్రువును రాజ ప్రతినిధిగా నియమించాడు. కోసల రాజు ప్రసేనజిత్ చెల్లెలు కోసలదేవిని వివాహం చేసుకుని కాశీని పొందాడు. వైశాలీ లిచ్ఛవీ రాజు చేతకుని కుమార్తె చెల్లనను, పంజాబ్‌ను పాలించే మాద్రా రాకుమార్తె ఖేమాను వివాహం చేసుకోవడం ద్వారా పశ్చిమ, ఉత్తర దిశలో తన రాజ్య విస్తరణ మార్గాన్ని సుగమం చేసుకున్నాడు. తన ప్రధాన శత్రువు చండ ప్రద్యోత మహాసేనుడి వద్దకు తన ఆస్థాన వైద్యుడు జీవకుడిని పంపి కామెర్ల వ్యాధి నుంచి విముక్తున్ని చేసి తన మిత్రునిగా చేసుకున్నాడు. గాంధార రాజు పుష్కర సరీన్ కూడా తన రాయబారిని పంపి బింబిసారుడితో స్నేహం చేసుకున్నాడు. ఇతడు బుద్ధుని సమకాలికుడైనా ఇతడు ఏ మతాన్ని ఆదరించాడనే దానిపై స్పష్టత లేదు. బౌద్ధ, జైన మతాలు రెండూ ఇతన్ని తమ మతానికి చెందినవాడేనని పేర్కొన్నాయి.

అజాతశత్రువు: తండ్రిని హత్య చేసి సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. తీవ్రమైన సామ్రాజ్య వాద విధానాన్ని అవలంబించాడు. కోసలరాజు, తన మేనమామ ప్రసేనజిత్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేశాడు. విజయం సాధించి కోసల రాకుమార్తెను వివాహం చేసుకోవడంతో పాటు కాశీని తిరిగి పొందాడు. వైశాలీ లిచ్ఛవుల నాయకత్వంలోని 36 రాజ్యాల కూటమికి వ్యతిరేకంగా 16 ఏళ్లు యుద్ధం చేసి విజయం సాధించాడు. ఇతడు మొదట జైనాన్ని, తర్వాత బౌద్ధాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది. అందుకే బుద్ధున్ని కలిసి తన తండ్రిని చంపిన నేరాన్ని అంగీకరించాడు. వీరి సమావేశానికి సంబంధించిన ఆధారాలు బార్హుత్ శిల్పాల్లో ఉన్నాయి. ఇతని కాలంలో మొదటి బౌద్ధ సంగీతి జరిగింది. అతనికి కునిక అనే బిరుదు ఉంది.

ఉదయనుడు: ఇతడు పాటలీ గ్రామంలోని గంగ, సోన్ నది సంగమ స్థానంలో కోటను నిర్మించాడు. కాబట్టి ఇతడిని పాటలీ పుత్ర నగర నిర్మాతగా భావిస్తారు.

శిశునాగ వంశం (413-364)

శిశునాగుడు: ఉదయనుడి తర్వాత నలుగురు పితృహంతకులు రాజులుగా వచ్చారు. వీరితో విసిగిపోయిన ప్రజలు కాశీలో రాజప్రతినిధిగా ఉన్న శిశునాగున్ని రాజుగా చేసినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రాజధానిని వైశాలికి మార్చాడు. అవంతి రాజు ప్రద్యోతను ఓడించి అవంతి రాజ్యాన్ని మగధలో కలిపేయడం ఇతని గొప్ప విజయంగా పేర్కొంటారు. దీంతో ఈ రాజ్యాల మధ్య వంద సంవత్సరాలుగా సాగిన వైరం అంతమైంది.

కాలాశోకుడు: ఇతడు రాజధానిని పాటలీపుత్రానికి తిరిగి మార్చాడు. ఇతని కాలంలో రెండో బౌద్ధ సంగీతి జరిగింది. ఇతడిని సేనాపతి మహా పద్మనందుడు హత్య చేసి నంద వంశాన్ని స్థాపించాడు.

నందవంశం (364-321)

మగధను పాలించిన అత్యంత బలమైన వంశం నందవంశం.

మహాపద్మనందుడు: ఇతడు శూద్ర మహిళకు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. అనేక క్షత్రియ రాజు కుటుంబాలను రూపుమాపి రెండో పరశురాముడిగా ప్రసిద్ధి చెందాడు. ఖారవేలుని హాథిగుంఫ శిలాశాసనం ప్రకారం ఇతడు కళింగను జయించి విజయ చిహ్నంగా అక్కడి నుంచి జైన తీర్థంకరుని విగ్రహం తెచ్చినట్లు తెలుస్తుంది. ఇతడు ఏకరాట్ అనే బిరుదును ధరించాడు.

ధననందుడు: మహా పద్మనందుడి తర్వాత అతని ఎనిమిది మంది కుమారులు పాలించారు. వారిలో చివరివాడు ధననందుడు. ఇతనికి రెండు లక్షల పదాతి దళం, 20 వేల అశ్విక దళం, 3వేల గజ దళం, 2వేల రథబలం ఉండేది. అలెగ్జాండర్ సేనలు బియాస్‌ను దాటి భారత్‌పై దండెత్తకపోవడానికి వీరి బలసంపత్తి కూడా ఒక కారణం. అయితే ఇతనికి మితిమీరిన ధనకాంక్ష ఉండేదని దానివల్ల ప్రజలను పీడించి వారి మద్దతు కోల్పోవడం వల్ల, ఈ పరిస్థితులను అనువుగా చేసుకొని చంద్రగుప్త మౌర్యుడు ఇతన్ని అంతమొందించి మౌర్య వంశ స్థాపన చేశాడు.

బుద్ధయుగంలోని గణతంత్ర రాజ్యాలు

ఈ కాలం నాటి పాలి గ్రంథాల్లో ఆనాడు మనుగడలో ఉన్న కొన్ని గణతంత్ర రాజ్యాల ప్రస్తావన ఉంది. ఈ రాజ్యాల్లో కొన్ని షోడష మహాజనపదాల్లోనూ కనిపిస్తాయి.

- నాటి గణరాజ్యాల్లో ప్రధానమైనవి కపిలవస్తు, కుశినార, పావ, వైశాలి మొదలైనవి.
- కపిలవస్తును శాక్యవంశం పాలించేది. ఇది భారత్–నేపాల్ సరిహద్దు రాజ్యం. బుద్ధుడు ఈ వంశానికి చెందినవాడు. కోసల రాజు విరుధకుడు ఈ రాజ్యాన్ని అంతం చేసి శాక్యలను ఊచకోత కోశాడు.
- కుశినార, పావ రాజధానులుగా మల్ల వంశం పాలించేది. అజాతశత్రువు ఈ రాజ్యాన్ని అంతం చేశాడు.
- వైశాలి రాజధానిగా లిచ్ఛవీలు పరిపాలించారు. వీరు స్వేచ్ఛా పిపాసులు, యుద్ధ పిపాసులు. అందుకే అజాతశత్రువుకు ఈ రాజ్యాన్ని ఆక్రమించేందుకు 15 సంవత్సరాలు పట్టింది. అజాతశత్రువు ఈ యుద్ధం లో విజయం సాధించినా లిచ్ఛవీలు తీవ్రనష్టాన్ని కలిగించారు. వీరి సమావేశ మందిరం పేరు సాంతాగార, ఇందులో 7707 మంది ప్రతినిధులు పాల్గొనేవారు.

భారతదేశంపై విదేశీ దండయాత్రలు

- షోడష మహా జనపదాల్లోని 16 రాజ్యాల్లో అత్యధిక రాజ్యాలు భారత్‌లోని ప్రధాన భూభాగంలో ఉన్నాయి. వాయవ్య భారతదేశంలో కాంభోజ, గాంధార, మాద్రా రాజ్యాలుండేవి. వీరి మధ్య ఉన్న రాజకీయ అనైక్యత.. పర్షియాను పాలించే ఆకియేనియన్ రాజులు భారత్‌ను ఆక్రమించేందుకు పురిగొల్పింది.

పర్షియన్ దండయాత్రలు

సైరస్: క్రీ.పూ. 6వ శతాబ్దంలో పర్షియారాజు సైరస్ భారత్‌పై దండెత్తి సింధూ నదికి పశ్చిమంలోని కాబూల్ వరకు ఉన్న ప్రాంతాన్నంతా ఆక్రమించాడు. భారత దేశంపై దండయాత్ర చేసిన తొలి విదేశీ పాలకుడు సైరస్. ఇతడు కపీసా అనే నగరాన్ని ధ్వంసం చేసినట్లు కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది.

డేరియస్- 1: సైరస్ మనవడు. ఇతడు సింధూ ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఈ దండయాత్రలో పాల్గొన్న ఇతని సేనాని స్కైలస్. హిరోడోటస్ అనే గ్రీకు చరిత్రకారుడు పర్షియన్ సామ్రాజ్యంలోని 28 సాత్రపిల్లో(రాష్ట్రాల్లో) సింధూ రాష్ట్రం 20వ సాత్రపిగా ఉందని తెలిపాడు.

జెర్క్సెస్: ఇతని కాలంలో భారత సేనలను గ్రీసులోని తన ప్రత్యర్థులతో పోరాడేందుకు నియమించారు.

డేరియస్-3: అలెగ్జాండర్‌తో పోరాడేందుకు భారతీయ సైనికుల్ని తన సైన్యంలో చేర్చుకున్నాడు.

భారత్‌పై పర్షియన్ దండయాత్రల వల్ల భారత్‌కు పర్షియాకు మధ్య వ్యాపార వాణిజ్యాలకు గొప్ప ఊపు లభించింది. పర్షియన్ ప్రభావం వల్లనే భారతీయులు ఖరోష్టి అనే ఒక నూతన లిపిని నేర్చుకున్నారు. మౌర్యుల శిల్పకళ మీద కూడా ఆకియేనియన్ శిల్పకళ ప్రభావం ప్రబలంగా ఉంది. ఇరానియన్ల ద్వారా భారత సంపద గురించి తెలుసుకున్న గ్రీకులు చివరికి అలెగ్జాండర్ నాయత్వంలో భారత్‌పై దాడి చేశారు.

మాసిడోనియన్ దండయాత్రలు

పర్షియన్ల తర్వాత భారత్‌పై దండెత్తిన రెండో విదేశీయులు గ్రీకులు. అలెగ్జాండర్ 20 ఏళ్ల వయసులో క్రీ.పూ. 334లో మాసిడోనియాకు రాజయ్యాడు. 329 నాటికి 3వ డేరియస్‌ను అంతంచేసి పర్షియా సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. 328లో కాబూల్‌ను ఆక్రమించాక 327లో కైబర్ కనుమల ద్వారా హిందూకుష్ పర్వతాలను దాటి భారత్‌లోకి ప్రవేశించాడు. అలెగ్జాండర్ బాక్ట్రియాలో ఉండగా తక్షశిల రాజకుమారుడు అంభి ఆహ్వానం లభించింది. జీలం, చినాబ్ ప్రాంతాల్లోని రాజైన పోరస్‌కు తక్షశిల రాజులకు మధ్య ఉన్న వైరం ఈ ఆహ్వానానికి కారణం. అలెగ్జాండర్ ఓహింద్ వద్ద సిందూ నదిని దాటాడు. క్రీ.పూ. 326కు జీలం నదిని (హైడాస్పస్) చేరాడు. అప్పటికీ తక్షశిలకు రాజుగా ఉన్న అంభి తన మద్దతును అందించాడు. ఇరు సేనలకు కార్లీ మైదాన ప్రాంతంలో భీకర యుద్ధం జరిగింది. పోరస్ ఓడినా అతని ధైర్య సాహసాలు మెచ్చిన అలెగ్జాండర్ అతని రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు. ఈ విజయానికి గుర్తుగా యుద్ధం జరిగిన ప్రదేశంలో బుకెఫాలా, నికేయా నగరాలు నిర్మించాడు. ఈ విజయం తర్వాత అలెగ్జాండర్ బియాస్ నది ఒడ్డుకు చేరుకున్నాడు. బియాస్‌ను దాటి మగధపై దాడి చేయాలని భావించాడు. అప్పటికే సుదీర్ఘ కాలం మాతృభూమికి దూరంగా ఉన్న సేనలు అలెగ్జాండర్ ఆదేశాలను నిరాకరించాయి. దాంతో అలెగ్జాండర్ తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని నియార్కస్ నాయకత్వంలో సముద్ర మార్గం ద్వారా, మరో భాగాన్ని తన స్వీయనాయకత్వంలో భూమార్గం ద్వారా వెనుతిరిగాడు. మార్గమధ్యమంలో బాబిలోనియా వద్ద క్రీ.పూ. 323 జూన్‌లో 33 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్యంతో మరణించాడు.

భారతదేశాన్ని జయించాలనే అలెగ్జాండర్ కోరిక పూర్తిగా నెరవేరకపోయినా అనేక అంశాల్లో ఈ దండయాత్ర ప్రభావం ఉంది. ఈ దండయాత్ర వల్ల పంజాబ్, దాని పరిసర ప్రాంతాల్లోని ఆటవిక తెగలు బలహీన పడ్డాయి. దాంతో చంద్రగుప్త మౌర్యుడు సులువుగా ఆ తెగలను జయించి తన సామ్రాజ్య విస్తరణ చేయగలిగాడు. ఈ దండయాత్ర వల్లనే భారతదేశానికి ఐరోపా దేశాలకు మధ్య భూ, సముద్ర మార్గాలకు అవకాశం కలిగింది. భారత దేశ చరిత్ర రచనలోనూ అలెగ్జాండర్ చరిత్రకారుల రచనలు ఎంతో ఉపయోగపడ్డాయి.


మాదిరి ప్రశ్నలు

1. షోడష మహాజనపదాల్లోని ఏకైక దక్షిణ భారత రాజ్యం ఏది?
   1) అవంతీ రాజ్యం 2) అస్మక
   3) కాంభోజ 4) శౌరసేన
2. కింది వాటిలో గణతంత్ర రాజ్యం కానిది?
   1) కపిలవస్తు 2) కుశినార
   3) వైశాలి 4) అవంతి
3. కింది వారిలో అజాతశత్రువుకు సమకాలీనులు కానివారు?
   1) బుద్ధుడు 2) మస్కరి గోషల పుత్రుడు
   3) మహావీరుడు 4) నాగసేనుడు
4. అలెగ్జాండర్ ఇండియాపై దండయాత్ర చేసిన సంవత్సరం?
   1) 327 బి.సి. 2) 303 బి.సి.
   3) 302 బి.సి. 4) 298 బి.సి.
5. భారతదేశంపై దండెత్తిన తొలి విదేశీ పాలకుడు?
   1) సైరస్ 2) డేరియస్–1
   3) జెర్క్సెస్ 4) డేరియస్–3
6. కింది వాటిలో సరికానిది?
   1) బింబి సారుడు – శ్రేణిక
   2) అజాతశత్రువు – కూనిక
   3) కాలాశోకుడు – కాకవరిన్
   4) మహా పద్మనందుడు – అగ్రామ్స్
7. అలెగ్జాండర్‌కు భారతీయ రాజు పౌరవునికి (పోరస్) ఏ నది ఒడ్డున యుద్ధం జరిగింది?
   1) జీలం 2) చినాబ్
   3) రావి 4) బియాస్
8. భారతదేశ చరిత్రలో తొలి పితృ హంతకుడిగా పేరున్న రాజు?
   1) బింబిసారుడు 2) అజాతశత్రువు
   3) ధననందుడు 4) అశోకుడు
9. రెండో పరశురాముడిగా పేరొందిన భారతీయ రాజు?
   1) బిందుసారుడు 2) అశోకుడు
   3) మహాపద్మనందుడు 4) అజాతశత్రువు
10. రెండో బౌద్ధ సంగీతి ఏ రాజు పాలనా కాలంలో జరిగింది?
    1) శిశునాగుడు 2) అజాతశత్రువు
    3) కాలాశోకుడు 4) అశోకుడు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 4; 4) 1;
5) 1; 6) 4; 7) 1; 8) 2;
9) 3; 10) 3.

When Padma stood first in class..



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్‌జీటీ/ఎస్ఏ - ఇంగ్లిష్

USES OF PHRASES

1. **Here you are!** [Used when you are offering something to someone]
   "Could you pass the sugar, please?"
   "**Here you are**".
2. **Out of place:** [Used to say where someone/ something is in the wrong place or looks wrong]
   The large desk was **out of place** in such a small room.
   The boy looked uncomfortable and **out of place** among the adults.
3. **Out of order:** [Used when things are no longer arranged in the correct way]
   I can't find the file I need because they're all **out of order**.
4. **In the first instance:** [As the first step in an action]
   If you wish to join the club, you should apply to the secretary **in the first instance.**
5. **By return of post:** [Answering letter immediately; sending reply by the very next post]
   Please reply **by return of post.**
   She answered my letter **by return of post.**
6. **Go in for:** [To do something as a hobby, job, subject for study, etc.]
   My son is **going in for** medicine.
7. **Next door:** [In the next room, house or building]
   The cat is from the house **next door.**
8. **I've no idea:** [Used to show that sth. is hard for somebody else to imagine]
   "What's she saying?"
   "**I have no idea.** I don't even know what language she is speaking".
9. **For that matter:** [Used when referring to some alternative]
   I could go this afternoon, or, **for that matter**, I could go tomorrow.
10. **In view of:** [Taking something into consideration] [because of]
    In view of the committee's criticisms of him, he felt he had to resign.
11. **With a view to:** [With the aim of doing something]
    With a view to increasing its sales, Lalitha Jewellery has given a series of advertisements.
12. **If the worst comes to the worst:** [If the situation develops in the most serious or unpleasant way]
    We should be in when you arrive, but **if the worst comes to the worst**, the neighbours have a spare key and will let you into the house.
13. **I must be off:** [An expression announcing the speaker's intention of leaving]
    Bill: It's late. **I must be off.**
    Bob: Me, too. I'm out of here.
14. **Have nothing to do with:** [To be unrelated or irrelevant to someone]
    This lecture **has nothing to do with** your grades - I'm unhappy with your attitude lately.
15. **By virtue of:** [Because of something]
    By the virtue of the position he held, he was able to move about freely.
    She is allowed to do as she wishes **by virtue of** the fact that she's the manager's daughter.
16. **On the run:** [Escaping]
    He is **on the run** from the police.
17. **In nine cases out of ten:** [Almost every time]
    In nine cases out of ten, he will win the race.
    This system will work well **in nine cases out of ten.**
18. **Take place:** [To happen]
    The wedding **took place** as arranged.
19. **Over and over:** [Continually repeated]
    He sang the same song **over and over.**
20. **Below par:** [Not up to the usual standard] [not well]
    She had a cold and was feeling **below par.**
21. **More or less:** [Almost]
    They have **more or less** finished the job.
    The distance is ten kilometres, **more or less.**
22. **As a rule:** [Usually]
    I don't go out in the evening **as a rule.**
23. **Poke fun at:** [To laugh unkindly at]
    The children often **poked fun at** him because of his stammer.

Previous and Practice Questions

1. When Padma stood first in class, Rekha, out of jealousy ___.
   (TS TET-2017)
   1) ate her heart out
   2) lost her heart
   3) poured out her heart
   4) praised from the bottom of her heart
2. Fitness regime should be **a part and parcel** of every day life.
   (TS TET-2016)
   The underlined phrase means:
   1) Dedicated
   2) Help one another
   3) Livelihood
   4) An integral part
3. **Blow by blow**
   1) Eruptions in quick succession from a great volcano
   2) Continuously raining with thunders
   3) Describe an event as it occurred in every detail.
   4) A rapid decline of business leading to its closure
4. **Caught up with**
   1) Conversed 2) Talked
   3) Arrested 4) Overlook
5. **In the clear**
   1) With out any money
   2) With out any knowledge
   3) Very friendly
   4) No longer in danger
6. He **egged on** his friend to steal the radio.
   1) To criticize 2) To condemn
   3) To discourage
   4) To keep urging
7. They **pigged out** on pizza.
   1) To eat moderately
   2) To eat slowly
   3) To eat too much
   4) To eat slice-wise
8. Persons like Vivekananda are born **few and far between.**
   1) At long intervals
   2) Very frequently
   3) Every now and then
   4) Quite often
9. I thought he would be helpful, but he was **nothing of the kind**
   he was positively rude.
   1) Not helpful, but kind
   2) Not having knowledge
   3) Not at all what was expected
   4) Not at all rude
10. It is **high time** that India did something about population problem.
    1) Right time 2) Already late
    3) Quick time
    4) Appropriate time
11. He had been **dogged by** ill-health all his life.
    1) A problem causing trouble
    2) Bitten by a dog
    3) Suffered from ill-health by dog bite
    4) Feeling very sad
12. She **pulled a long face** as she was not selected for the Republic Day parade at Delhi.
    1) Looked very angry
    2) To look sad and worried
    3) Looked very panic
    4) Became furious
13. As he was _____, it was a tough task for us to convince him.
    (TSPSC Gurukulam-2017)
    1) an acid test
    2) a die-hard critic
    3) a white elephant
    4) a giant personality
14. The company just about **broke even** last year.
    1) Without either losing money or making a profit
    2) Totally ruined
    3) Partially ruined
    4) Broke all records
15. I'm a bit **hard up** at the moment.
    1) Feel tired
    2) Not having money
    3) Looking sick
    4) Facing problems
16. My boss is, infact, **a livewire**; he works for twelve hours a day.
    1) Lively and active
    2) Sincere and efficient
    3) Industrious and brilliant
    4) Sincere and intelligent
17. **Look sharp** if you wish to catch hold of this opportunity.
    1) Be quick
    2) Be intelligent
    3) Be firm 4) Be careful
18. The staff have felt **on edge** ever since they heard the rumour about retrenchment.
    1) Nervous 2) Unhappy
    3) Disheartened
    4) Scared
19. The promotions were granted **across the board.**
    1) To those sitting diagonally opposite
    2) To those working for the other board
    3) Selectively with a few exceptions
    4) To all without exceptions

KEY

1) 1	2) 4	3) 3	4) 3
5) 4	6) 4	7) 3	8) 1
9) 3	10) 2	11) 1	12) 2
13) 2	14) 1	15) 2	16) 1
17) 1	18) 1	19) 4	

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) భారత ప్రజలమైన మేము రాజ్యాంగ పరిషత్‌లో ఈ రాజ్యాంగాన్ని భారతదేశానికి అందజేయాలని నిర్ణయించాం
   2) భారత ప్రజలమైన మేము రాజ్యాంగ పరిషత్‌లో ఈ రాజ్యాంగాన్ని చట్టబద్ధం చేసి మాకు మేము సమర్పించుకుంటున్నాం
   3) భారత ప్రజలమైన మేము రాజ్యాంగ పరిషత్ ప్రతినిధుల ద్వారా ఈ రాజ్యాంగాన్ని చట్టబద్ధం చేసి మాకు మేము సమర్పించుకుంటున్నాం
   4) రాజ్యాంగ పరిషత్ సభ్యులమైన మేము భారత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ రాజ్యాంగాన్ని చట్టబద్ధం చేసి మాకు మేము సమర్పించుకుంటున్నాం
2. 'పీఠిక రాజ్యాంగంలో అంతర్భాగం' అని సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రకటించింది?
   1) కేశవానంద భారతీ కేసు
   2) ఎస్.ఆర్. బొమ్మై కేసు
   3) బెరుబెరి కేసు 4) గోలక్‌నాథ్ కేసు
3. భారత రాజ్యాంగం ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం కావడానికి కారణం కానిది?
   1) దేశ విస్తృత భూ భాగం
   2) 1935లో భారత ప్రభుత్వ చట్టం ప్రభావం
   3) కేంద్ర- రాష్ట్రాలకు వేర్వేరు రాజ్యాంగాలు ఉండటం
   4) రాజ్యాంగ పరిషత్‌లో న్యాయవాదుల ఆధిక్యత ఉండటం
4. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) రాష్ట్ర వార్షిక ఆర్థిక నివేదిక - అధికరణ 202
   2) కేంద్ర వార్షిక ఆర్థిక నివేదిక - అధికరణ 112
   3) కేంద్రం తీసుకునే రుణాలు - అధికరణ 293
   4) ప్రభుత్వంపై దావా వేయడం - అధికరణ 300
5. ప్రస్తుతం ఆస్తిహక్కు రాజ్యాంగంలోని ఏ భాగంలో ఉంది?
   1) 3వ భాగం 2) 10వ భాగం
   3) 12వ భాగం 4) రాజ్యాంగంలో లేదు
6. కింది వాటిలో ప్రాథమిక హక్కుల లక్షణం కానిది ఏది?
   1) ప్రాథమిక హక్కులు నిరపేక్షమైనవి
   2) ప్రాథమిక హక్కులు రాజ్యకార్యకలాపాలకు విరుద్ధం
   3) ఇవి న్యాయ సమ్మతమైనవి
   4) వీటికి న్యాయస్థానాల రక్షణ ఉంటుంది
7. కింది వాటిలో నిబంధన-15 ద్వారా నిషేధించిన విచక్షణలు ఏవి?
   ఎ) మతం బి) జాతి
   సి) కులం డి) లింగం
   ఇ) జన్మస్థానం ఎఫ్) వారసత్వం
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ
   3) ఎ, బి, సి, డి, ఎఫ్ 4) ఎ, బి
8. 1973లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిబంధన 371(డి)ను చేర్చి స్థానిక రిజర్వేషన్లు కల్పించారు?
   1) 31 2) 32 3) 33 4) 34
9. క్రిమి లేయర్ భావనను తొలిసారిగా సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రతిపాదించింది?
   1) ఇందిరా సహానీ కేసు
   2) అశోక్ కుమార్ ఠాకూర్ కేసు
   3) బాలాజీ రాఘవన్ కేసు
   4) ప్రదీప్ టాండన్ కేసు
10. బ్యాక్‌లాగ్ వెకెన్సీలను ఎప్పుడైనా భర్తీ చేసుకోడానికి 50% రిజర్వేషన్ల నిబంధనను ఉల్లంఘించడానికి అవకాశం కల్పిస్తూ 2000 సంవత్సరంలో ఏ సవరణ చేశారు?
    1) 80 2) 81 3) 82 4) 83
11. శిక్ష నుంచి రక్షణ, ద్వంద్వ శిక్షల నిషేధాన్ని ఏ ఆర్టికల్ ద్వారా కల్పించారు?
    1) 14 2) 20 3) 25 4) 30
12. 1993లో సుప్రీంకోర్టు విద్యాహక్కును ఏ నిబంధనలో అంతర్భాగంగా పేర్కొంది?
    1) 20 2) 21 3) 22 4) 23
13. రిట్ జారీ చేసే విధానాన్ని ఏ దేశం నుంచి గ్రహించారు?
    1) ఇంగ్లండ్ 2) అమెరికా
    3) జపాన్ 4) సౌత్ ఆఫ్రికా
14. అనర్హులు ప్రభుత్వ పదవులు చేపట్టకుండా నిరోధించే రిట్ ఏది?
    1) ప్రొహిబిషన్ 2) మాండమస్
    3) కోవారెంట్ 4) ఇంజక్షన్
15. భారతదేశంలో 'సైనిక శాసనం' భావనను ఏ దేశం నుంచి గ్రహించారు?
    1) అమెరికా 2) ఇంగ్లండ్
    3) జపాన్ 4) రష్యా
16. ఆస్తి హక్కు ఏ నిబంధనలో ఉండేది?
    1) 31 2) 23 3) 21 4) 19 (1)
17. భారత పార్లమెంట్ చరిత్రలో కోత తీర్మానాలపై ఏయే సంవత్సరాల్లో ఓటింగ్ నిర్వహించారు?
    ఎ) 1952 బి) 1977 సి) 2010
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, బి, సి 4) ఎ, సి
18. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులకు సంబంధించి తొలి వివాదం ఏది?
    1) చంపకం దొరై రాజన్ కేసు
    2) గోలక్‌నాథ్ కేసు
    3) కేశవానంద భారతీ కేసు
    4) మినర్వామిల్స్ కేసు
19. గోలక్‌నాథ్ కేసుకు స్పందనగా పార్లమెంట్ రూపొందించిన రాజ్యాంగ సవరణ ఏది?
    1) 24 2) 25 3) 28 4) 31
20. రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో కింది వాటిలో అంతర్భాగం ఏది?
    1) సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్రం
    2) లౌకికవాదం
    3) సమాఖ్య స్వభావం 4) పైవన్నీ
21. కింది వాటిలో రాష్ట్రపతి పదవికి అర్హత కానిది ఏది?
    1) భారత పౌరసత్వం
    2) కనీస వయసు 30 ఏళ్లు
    3) పార్లమెంట్ సభ్యత్వం పొందడానికి కావాల్సిన అర్హతలు ఉండాలి
    4) ఏదీకాదు
22. కింది వారిలో రాష్ట్రపతి మహాభియోగ తీర్మానంలో పాల్గొనని వారెవరు?
    1) లోక్‌సభలో ఆంగ్లో ఇండియన్లు
    2) రాజ్యసభలో 12 మంది ప్రముఖులు
    3) వివిధ రాష్ట్రాల శాసనసభ్యులు
    4) పై వారందరూ
23. సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1950 జనవరి 26
    2) 1950 జనవరి 27
    3) 1950 జనవరి 28
    4) 1950 జనవరి 29
24. కింది వాటిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఉండాల్సిన అర్హత కానిది ఏది?
    1) భారత పౌరసత్వం
    2) కనీసం 35 ఏళ్ల వయసు ఉండాలి
    3) ఏదైనా హైకోర్టులో కనీసం 5 ఏళ్లు న్యాయమూర్తిగా అనుభవం
    4) ఏదైనా హైకోర్టులో కనీసం 10 ఏళ్లు న్యాయవాదిగా అనుభవం
25. సుప్రీంకోర్టు/ హైకోర్టు న్యాయమూర్తులను తొలగించే తీర్మానానికి ఎంతమంది మద్దతు ఉండాలి?
    1) లోక్‌సభలో 100 మంది
    2) రాజ్యసభలో 50 మంది



    3) (1) లేదా (2) 4) (1), (2)
26. తాత్కాలిక న్యాయమూర్తిని ఎవరు నియమిస్తారు?
    1) రాష్ట్రపతి 2) ప్రధాన న్యాయమూర్తి
    3) ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి రాష్ట్రపతి
    4) రాష్ట్రపతి అనుమతితో ప్రధాన న్యాయమూర్తి
27. సుప్రీంకోర్టు తన ప్రారంభ అధికార పరిధిలో అంతర్భాగంగా తొలి కేసును ఎప్పుడు స్వీకరించింది?
    1) 1951 2) 1955
    3) 1961 4) 1965
28. సుప్రీంకోర్టు స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడే పద్ధతి ఏది?
    1) నియామక విధానం
    2) పదవీ విరమణ అనంతరం ప్రాక్టీస్‌పై పరిమితులు
    3) కార్య నిర్వాహణ శాఖ నుంచి వేరు చేయడం 4) పైవన్నీ
29. హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ఎవరు నిర్ధారిస్తారు?
    1) గవర్నర్ 2) రాష్ట్రపతి
    3) పార్లమెంట్
    4) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
30. కింది వాటిలో ఏ హైకోర్టుకు ప్రాంతీయ బెంచ్‌లు ఉన్నాయి?
    1) అలహాబాద్, బాంబే
    2) కలకత్తా, గౌహతి
    3) మధ్యప్రదేశ్, రాజస్థాన్ 4) పైవన్నీ
31. లక్షద్వీప్ ఏ హైకోర్టు పరిధిలో ఉంది?
    1) బాంబే 2) కర్ణాటక
    3) కేరళ 4) తమిళనాడు
32. మహిళా కమిషన్ సభ్యులను, చైర్‌పర్సన్‌ను ఎవరు నియమిస్తారు?
    1) రాష్ట్రపతి 2) కేంద్ర ప్రభుత్వం
    3) ప్రధానమంత్రి
    4) మహిళా సంక్షేమ శాఖామంత్రి
33. 1978లో మైనార్టీ కమిషన్‌ను ఏ విధంగా ఏర్పాటు చేశారు?
    1) కార్యనిర్వాహక తీర్మానం ద్వారా
    2) పార్లమెంట్ తీర్మానం ద్వారా
    3) రాజ్యాంగ సవరణ ద్వారా
    4) రాష్ట్రపతి ఆర్డినెన్స్ ద్వారా
34. జాతీయ ఎస్సీ కమిషన్ వార్షిక నివేదికను ఎవరికి ఇవ్వాలి?
    1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
    3) పార్లమెంట్ 4) క్యాబినెట్
35. ఒక క్యాబినెట్ మంత్రిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు..?
    1) క్యాబినెట్ మంత్రులు రాజీనామా చేయాలి
    2) సంబంధిత మంత్రి పదవీచ్యుతుడవు తారు
    3) ప్రభుత్వం పడిపోతుంది
    4) లోక్‌సభ రద్దవుతుంది
36. కేంద్ర ఉన్నత విద్యాలయాల్లో ఓబీసీ రిజర్వేషన్ల కల్పనకు సూచనలు చేయడానికి 2006 లో ఏర్పాటు చేసిన కమిటీకి అధ్యక్షుడెవరు?
    1) ఎస్.ఆర్. పాండ్యన్ 2) వీరప్ప మొయిలీ
    3) భూటా సింగ్ 4) రత్న కుమార్
37. ఎంపీ ల్యాడ్స్ ప్రారంభోత్సవంలో ఒక్కో ఎంపీకి కేటాయించిన మొత్తం ఎంత?
    1) రూ. కోటి 2) రూ. 5 లక్షలు
    3) రూ. 50 లక్షలు 4) రూ. 2 కోట్లు
38. కింది వాటిలో ఎస్సీ, ఓబీసీల సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏది?
    1) సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖ
    2) గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ
    3) మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
    4) స్త్రీ- శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ
39. వివిధ జాతీయ కమిషన్లు, వాటి మొదటి చైర్మన్‌లకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా-1
    i) జాతీయ ఎస్టీ కమిషన్
    ii) జాతీయ మహిళా కమిషన్
    iii) జాతీయ మైనార్టీ కమిషన్
    iv) జాతీయ ఎస్సీ కమిషన్
    v) జాతీయ ఓబీసీ కమిషన్
    జాబితా-2
    ఎ) కున్వర్ సింగ్
    బి) జయంతి పట్నాయక్
    సి) సర్దార్ అలీఖాన్
    డి) సూరజ్ భాన్ ఇ) ఆర్.ఎన్. ప్రసాద్
    1) i-ఎ, ii-బి, iii-సి, iv-డి, v-ఇ
    2) i-బి, ii-సి, iii-డి, iv-ఎ, v-ఇ
    3) i-సి, ii-డి, iii-ఎ, iv-బి, v-ఇ
    4) i-డి, ii-ఎ, iii-బి, iv-సి, v-ఇ
40. పార్లమెంట్ నిర్మాణాన్ని తెలియజేసే నిబంధన ఏది?
    1) 52 2) 76 3) 79 4) 81
41. ప్రస్తుతం లోక్‌సభలో ఎంతమంది సభ్యులు కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు?
    1) 20 2) 13 3) 2 4) 4
42. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఆధారంగా ఒక పార్లమెంట్ సభ్యుణ్ని అనర్హుడిగా ప్రకటించే అధికారం ఎవరికి ఉంది?
    1) సభాధ్యక్షులు 2) రాష్ట్రపతి
    3) ఎన్నికల సంఘం 4) సుప్రీంకోర్టు
43. కింది వాటిలో స్పీకర్‌కు ఉండి రాజ్యసభ చైర్మన్‌కు లేని అధికారం ఏది?
    1) బిల్లును ఆర్థిక బిల్లుగా ప్రకటించడం
    2) ఉమ్మడి సమావేశానికి అధ్యక్షత వహించడం
    3) ఆర్థిక కమిటీ అధ్యక్షులను నామినేట్ చేయడం 4) పైవన్నీ
44. లోక్‌సభ, రాజ్యసభల్లో కనీస కోరం ఎంత?
    1) 55, 25 2) 50, 20
    3) 45, 25 4) 40, 25
45. శూన్యకాలం ఎప్పటి నుంచి అమల్లో ఉంది?
    1) 1952 2) 1962
    3) 1972 4) 1974
46. సాధారణ బిల్లును రెండో సభ ఎంతకాలంలో ఆమోదించకపోతే రాష్ట్రపతి ఉభయసభల ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేయిస్తారు?
    1) 30 రోజులు 2) 14 రోజులు
    3) 6 నెలలు 4) 3 నెలలు
47. రాజ్యాంగంలో బడ్జెట్ అనే పదం ఏ నిబంధనలో ఉంది?
    1) 110 2) 111
    3) 112 4) రాజ్యాంగంలో లేదు
48. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో పాల్గొనే అధికారాన్ని అడ్వకేట్ జనరల్‌కు కల్పించే నిబంధన ఏది?
    1) 76 2) 165 3) 177 4) 187
49. ఎన్నికల సంఘంలో ఎన్నికల అధికారుల సంఖ్యను ఎవరు నిర్ధారిస్తారు?
    1) రాష్ట్రపతి 2) పార్లమెంట్
    3) ప్రధాన ఎన్నికల కమిషనర్
    4) రాజ్యాంగం

సమాధానాలు

1) 2 2) 1 3) 3 4) 3 5) 3
6) 1 7) 2 8) 2 9) 1 10) 3
11) 2 12) 2 13) 1 14) 3 15) 2
16) 4 17) 4 18) 1 19) 1 20) 4
21) 2 22) 3 23) 3 24) 2 25) 3
26) 4 27) 3 28) 4 29) 2 30) 4
31) 3 32) 2 33) 1 34) 1 35) 3
36) 2 37) 2 38) 1 39) 1 40) 3
41) 2 42) 1 43) 4 44) 1 45) 2
46) 3 47) 4 48) 2 49) 1

How many days can 16 men complete that work?

BANK EXAMS

QUANTITATIVE APTITUDE

TIME AND WORK

1. If A can do a piece of work in n days, work done by A in 1 day = 1/n.
2. If A does 1/n work in a day, A can finish the work in n days

   If M_1 men can do W_1 work in D_1 days working H_1 hours per day and M_2 men can do W_2 work in D_2 days working H_2 hours per day (where all men work at the same rate), then

   $M_1 D_1 H_1 W_2 = M_2 D_2 H_2 W_1$

   If A can do a piece of work in p days and B can do the same in q days, A and B together can finish it in pq+(p+q) days

   If A is thrice as good as B in work, then

   Ratio of work done by A and B = 3 : 1

   Ratio of time taken to finish a work by A and B = 1 : 3

PRACTICE QUESTIONS

1. A and B together can complete a particular task in 4 days. If A alone can complete the same task in 12 days, how many days will B take to complete the task if he works alone?
   1) 9 days 2) 7 days 3) 5 days
   4) 3 days 5) None of these
2. A and B together can complete a particular task in 8 days. If B alone can complete the same task in 10 days, how many days will A take to complete the task if he works alone?
   1) 28 2) 36 3) 40
   4) 32 5) None of these
3. A and B together can complete a particular task in 6 days. If A alone can complete the same task in 10 days, how many days will B take to complete the task if he works alone?
   1) 15 2) 16 3) 14
   4) 12 5) None of these
4. A and B together can complete a particular task in 4 days. If A alone can complete the same task in 6 days, how many days will B take to complete the task if he work alone?
   1) 8 2) 17 3) 14
   4) 12 5) None of these
5. Yesterday Priti typed an essay of 5000 words at the speed of 60 words per minute. Today she typed the same essay faster and her speed was 15 % more than yesterday. What is the approximate difference in the time she took to type yesterday and the time she took to type today?
   1) 20 min 2) 30 min 3) 10 min
   4) 40 min 5) 1 hour
6. Yesterday Shweta completed 300 units of work at the rate of 15 units per minute. Today she completed the same units of work but her speed was 40% faster than yesterday. What is the approximate difference in the time she took today?
   1) 16 min 2) 26 min 3) 46 min
   4) 36 min 5) 6 min
7. 12 men can complete one-third of the work in 8 days. In how many days can 16 men complete that work?
   1) 18 2) 12 3) 24
   4) Cannot be determined
   5) None of the above
8. 18 women can complete a work in



12 days and 12 men can complete the same work in 9 days. In how many days will 8 men and 8 women complete that work?
   1) 9 2) 6 3) 12
   4) 8 5) None of these
9. 24 men can complete a piece of work in 15 days. In how many days will 18 men complete that work?
   1) 16 days 2) 20 days
   3) 22 days 4) 25 days
   5) None of these
10. 22 Men can complete a job in 16 days. In how many days will 32 Men complete that job?
    1) 14 2) 12 3) 16
    4) 9 5) None of these
11. 10 Men can complete a piece of work in 8 days. In how many days can 16 men complete that work?
    1) 4 days 2) 5 days 3) 6 days
    4) 3 days 5) None of these
12. 16 Men can complete a piece of work in 7 days. In how many days will 28 men complete the same work?
    1) 6 days 2) 8 days 3) 3 days
    4) 4 days 5) None of these
13. A alone can make 100 baskets in 6 days and B alone can make 100 baskets in 12 days. In how many days can A and B together make 100 baskets?
    1) 3 days 2) 5 days
    3) $2^1/2$ days 4) $3^1/2$ days
    5) None of these
14. A single person takes 8 minutes to type a page. If from 1.00 pm to 2.00 pm, 1710 pages are to be typed, how many persons should be employed on this job?
    1) 207 2) 221 3) 249
    4) 256 5) None of these
15. A single person takes 3 min to write a letter. If from 10 am to 12:00 noon, 1960 letters are to be written, how many persons should be employed on this job?
    1) 53 2) 47 3) 51
    4) 49 5) None of these

Key with Solutions

1. **Ans:** 5
   Sol: Given, A and B can complete a task in 4 days.
   Therefore, work done by (A+B) in 1 day = 1/4
   Work done by A alone in 1 day =1/12
   Therefore, work done by B alone in 1 day = 1/6
   Hence, B alone can complete the work in 6 days.
2. **Ans:** 3
   Sol: Given, A and B can complete a task in 8 days.
   Therefore, work done by (A+B) in 1 day =1/8
   Work done by B alone in 1 day =1/10
   Therefore, work done by A alone in 1 day =1/40
   Hence, A alone can complete the work in 40 days.
3. **Ans:** 1
   Sol: Given, A and B can complete a task in 6 days.
   Therefore, work done by (A+B) in 1 day =1/6
   Work done by A alone in 1 day =1/10
   Therefore, work done by B alone in 1 day = 1/15
   Hence, B alone can complete the work in 15 days.
4. **Ans:** 4
   Sol: Given, A and B can complete a task in 4 days.
   Therefore, work done by (A+B) in 1 day =1/4
   Work done by A alone in 1 day=1/6
   Therefore, work done by A alone in 1 day =1/12
   Hence, B take 12 days to complete the work.
5. **Ans:** 3
   Sol: The time took to type yesterday = 83.33 min
   Priti's speed of typing today = 60 words per min + 15% of 60 words per min
   = 60 + 9 = 69 words per min
   The time took to type today = 72.46 min.
   ∴ Required difference = 83.33 – 72.46 ≈ 10 min
6. **Ans:** 5
   Sol: The time she taken to complete the work yesterday = 300/15 = 20 min.
   The rate of work done by sweta today = rate of yesterday + 40% of rate of yesterday
   = 15 + 6 = 21 units per min
   The time she taken to complete the work today = 300/21 = 14.2 min.
   ∴ The required difference
   = 20 – 14. 2 ≈ 6 min
7. **Ans:** 1
   18 days
8. **Ans:** 1
   Sol: 12 days work of 18 women = 9 days work of 12 men
   18 × 12 women = 9 × 12 men
   2 women = 1 man
   8 men + 8 women = 8 men + 8/2 men= 8men + 4 men= 12men
   So, 8 men + 8 women or 12 men can do the work in 9 days. (according to the question)
9. **Ans:** 2
   Sol: Let 18 men can complete the same work in x days, then
   18 : 24 :: 15 : x
   18 × x = 24 × 15
   x= 20 days
10. **Ans:** 5
    Sol: Let 32 men can complete the same work in x days, then
    32 : 22 :: 16 : x
    32 × x = 22 × 16
    x= 11 days
11. **Ans:** 2
    Sol: Let 16 men can complete the same work in x days, then
    16 : 10 :: 8 : x
    16 × x = 10 × 8
    x= 5 days
12. **Ans:** 4
    Sol: Let 28 men can complete the same work in x days, then
    28 : 16 :: 7 : x
    28 × x = 16 × 7
    x = 4 days
13. **Ans:** 5
    Sol: If A can do a work in x days and B can do the same work in y days, then both of them together complete that work in xy/(x+y) days
    = 4 days
14. **Ans:** 5
    Sol: In 1 hour (60 min)
    60/8 pages written by 1 man
    ∴ 1 page written by 8/60
    1710 pages written by
    = 228 men
15. **Ans:** 4
    Sol: In 2 hours (120 min)
    120/3 = 40 letters written by 1 man
    40 letters written by 1 man
    1 letter written by 1/40
    ∴ 1960 letters written by
    (1/40)×1960 - 49 men

ఉద్యోగాలు

ఎన్ఎస్‌సీఎల్, న్యూఢిల్లీలో ట్రాన్స్‌లేటర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎస్‌సీఎల్) డైరెక్ట్ ప్రాతిపదికన ట్రాన్స్‌లేటర్(అఫీషియల్ లాంగ్వేజ్) గ్రేడ్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, మాస్టర్ డిగ్రీ(ఇంగ్లిష్/హిందీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.22,000 నుంచి రూ.77,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెరిట్ స్కోర్, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
» **వెబ్‌సైట్:** www.indiaseeds.com

టీహెచ్ఎస్‌టీఐ, ఫరీదాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

ఫరీదాబాద్(హర్యానా)లోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ మేనేజర్-01, క్వాలిటీ మేనేజర్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీబీఎస్/బీడీఎస్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రోగ్రామ్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, క్వాలిటీ మేనేజర్, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రోగ్రామ్ మేనేజర్ పోస్టుకు రూ.79,060, క్వాలిటీ మేనేజర్ పోస్టుకు రూ.66,080, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు రూ.33,040.
» **ఎంపిక విధానం:** సర్టిఫికేట్ల పరిశీలన, షార్ట్ లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2024.
» **వెబ్‌సైట్:** https://thsti.res.in